ఈనాడు

విజయవాడ 2-3-2026 సోమవారం సిటీ సంపుటి 52 . సంచిక 201
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

అమెరికా ఇజ్రాయెల్ దాడుల్లో ఖమేనీ మృతి


ఖమేనీ

యుద్ధం తొలి రోజే ఇరాన్ సుప్రీం నేత మరణం

- 40 మంది అత్యున్నత సైనికాధికారులూ..
- ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాల్లో ఇరాన్ భీకర ప్రతీకార దాడులు
- విమానాశ్రయాలు, బుర్జ్ ఖలీఫా సహా పలు భవనాలకు నష్టం
- నిలిచిపోయిన విమానాలు.. చిక్కుకుపోయిన వేల మంది
- ఇరాన్ దాడి చేసిన నౌకలో భారతీయులు
- అమెరికా యుద్ధ నౌకపై క్షిపణులు పేల్చామన్న ఐఆర్‌జీసీ
- హత్యపై ప్రపంచ వ్యాప్తంగా పలుచోట్ల నిరసనలు
- కరాచీలో 10 మంది మృతి

దుబాయ్: అమెరికా, ఇజ్రాయెల్ అనుకున్నంత పనీ చేశాయి. రెండు దేశాలు సంయుక్తంగా జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మరణించారు. యుద్ధం ప్రారంభమైన తొలి రోజే ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని ఆయన కార్యాలయంపై దాడులు చేయడంతో ఖమేనీతోపాటు 40 మంది అత్యున్నత సైనికాధికారులు మృతి చెందారు. ఖమేనీ మృతిని ఆదివారం ఉదయం ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ ఇర్నా అధికారికంగా ప్రకటించింది. ఆ వార్త దావానలంలా వ్యాపించడంతో భారత్‌సహా ప్రపంచ వ్యాప్తంగా షియా ముస్లింలు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. నిరసనల సందర్భంగా పాకిస్థాన్‌లోని కరాచీలో 10 మంది మృతి చెందారు. మరోవైపు ఇరాన్ తీవ్రంగా ప్రతీకార దాడులు చేసింది. దీంతో యుద్ధం మరింత విస్తరించింది. (మిగతా 3లో)

ఇరాన్ భవితవ్యమేంటి..?

వందల విమానాల రద్దు 10లో

ఒకట్రెండు రోజుల్లో కొత్త లీడర్

కొత్త సుప్రీం లీడర్‌ను ఎన్నుకునే ప్రక్రియను కౌన్సిల్ ప్రారంభించిందని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ వెల్లడించారు. ఒకట్రెండు రోజుల్లో కొత్త సుప్రీం లీడర్‌ను ఎన్నుకుంటామని విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తెలిపారు. అమెరికా, ఇజ్రాయెల్ గీత దాటాయని, మూల్యం చెల్లించుకుంటాయని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహమ్మద్ బాఘెర్ ఖలీబా హెచ్చరించారు.

చమురు రవాణాకు ఆటంకం?

హర్మూజ్ జల సంధిద్వారా 20 శాతం చమురు రవాణా అవుతుంది. ఆ ప్రాంతంలో దాడులు జరుగుతుండటంతో రవాణాకు అంతరాయం కలిగే అవకాశముంది.

ఇరాన్ కొత్త నాయకత్వంతో చర్చలకు సిద్ధం: ట్రంప్



వాషింగ్టన్: ఇరాన్ కొత్త నాయకత్వం తనతో చర్చలను కోరుకుంటోందని, దానికి తాను సిద్ధంగా ఉన్నానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. 'వారు చర్చలను కోరుకుంటున్నారు. నేను అంగీకరించా. వారితో మాట్లాడతా. ఈ పనిని వారు త్వరగా చేయాలి' అని ట్రంప్ పేర్కొన్నారు.

ఉప్పొంగిందింది అమెరికా.. దాడి చేసింది ఇజ్రాయెల్

నెలలుగా ఖమేనీ కదలికలపై కన్నేసిన అగ్రరాజ్యం 10లో




అమెరికా, ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించడంతో ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో అలముకున్న పొగ


ఇరాన్ క్షిపణి దాడులతో ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌లో ఎగసిపడుతున్న మంటలు

రాజధానికి న్యాయ సొబగులు..!

- అమరావతిలో పలు నిర్మాణాలకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ శ్రీకారం
- జ్యుడిషియల్ అకాడమీ, హైకోర్టు అతిథిగృహానికి శంకుస్థాపన
- హైకోర్టు న్యాయమూర్తుల నివాస సముదాయానికి ప్రారంభోత్సవం
- పాల్గొన్న సీఎం చంద్రబాబు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు సీజే, న్యాయమూర్తులు


అమరావతిలో ఏపీ జ్యుడిషియల్ అకాడమీ శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్. చిత్రంలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ భానుమతి, జస్టిస్ రవినాథ్ తిల్హరి, జస్టిస్ కృష్ణమోహన్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎస్‌వీఎన్ భట్టి, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకుర్, ఏపీ సీఎం చంద్రబాబు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్ర, జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జోయ్ మల్య బాగ్చి, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ శ్రీనివాసరెడ్డి, జస్టిస్ హరిహరనాథ శర్మ

ఈనాడు, అమరావతి: ఏపీ న్యాయవ్యవస్థలో కీలక ఘట్టాలకు రాజధాని అమరావతి వేదికైంది. అమరావతికి శోభతెచ్చేలా పలు నిర్మాణాలకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ శ్రీకారం చుట్టారు. ఆదివారం మధ్యాహ్నం తిరుపతి నుంచి విజయవాడకు చేరుకున్న సీజేఐ.. గన్నవరం విమానాశ్రయం నుంచి నేరుగా అమరావతికి చేరుకున్నారు. పలు కార్యక్రమాల్లో తీరికలేకుండా గడిపారు. ముఖ్య అతిథిగా హాజరై తుళ్లూరు మండలం పిచ్చుకలపాలెంలో ఏర్పాటుకానున్న 'ఏపీ జ్యుడిషియల్ అకాడమీ' నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌తోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ పీఎస్ నరసంహా, (మిగతా 8లో)

కుంభకోణాలకు పెట్టింది పేరు డీఎంకే

తమిళనాడులో వచ్చేది ఎన్డీయే ప్రభుత్వమే 14లో

మదురై సభలో ప్రధాని నరేంద్ర మోదీ

వేట్లపాలెం ఘటనలో మరో ఇద్దరి మృతి

22కు చేరిన మృతుల సంఖ్య

ఇద్దరు క్షతగాత్రుల పరిస్థితి విషమం 3లో

నాగ్‌పుర్ పరిశ్రమలో పేలుడు; 18 మంది మృతి 10లో

అమ్మభాష అమృతం.. అందులోనే మాధుర్యం

పద్యాలు పాడుతూ.. తెలుగు ఔన్నత్యాన్ని వివరించిన గవర్నర్ అబ్దుల్ నజీర్

తెలుగులో ప్రసంగం ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

తెలుగు పరిరక్షణ ప్రతి తెలుగింటి బాధ్యత.. మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్

అమలాపురంలో వైభవంగా ప్రపంచ తెలుగు మహాసభలు 11లో



తెలుగు మహాసభల్లో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను సత్కరిస్తున్న కిమ్స్ ఛైర్మన్ చైతన్య రాజు. చిత్రంలో ఎమ్మెల్యే ఆనందరావు, మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్, డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ సతీష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బుద్ధప్రసాద్, సత్యానందరావు తదితరులు



సంజు తడాఖా

విండీస్‌పై నెగ్గి సెమీస్‌లో భారత్

కోల్‌కతా: టీ20 క్రికెట్ ప్రపంచకప్‌లో భారత్ సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఆదివారం ఉత్కంఠభరితంగా జరిగిన సూపర్-8 మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 5 వికెట్ల తేడాతో వెస్టిండీస్‌ను ఓడించింది. మొదట విండీస్ 4 వికెట్లకు 195 పరుగులు చేసింది. సంజు శాంసన్ (97 నాటౌట్; 50 బంతుల్లో 12×4, 4×6) చిరస్మరణీయ ఇన్నింగ్స్‌తో భారత్ 19.2 ఓవర్లలో 5 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. – వివరాలు ఛాంపియన్‌లో


Krishna's® HERBAL & AYURVEDA
చక్కెరపై దాడి రోజుకు కేవలం 2 సార్లు
11 ఆయుర్వేద ఔషధ మూలికలతో తయారు చేయబడింది
CLINICALLY PROVEN
क्लिनिकली प्रमाणित
వేప
నేరేడు గింజలు
మెంతులు
తులసి
ఉసిరి
కాకరకాయ
Krishna's HERBAL & AYURVEDA
DIABIC CARE
डायबिक केयर
GOODNESS OF FRESH KARELA & METHI SEEDS
POWERFULL COMBINATION OF 11 HERBS
Juice
No Artificial Flavours
No Extracts Used
GMP Certified
No Added Sugar
Natural Herbs
CHOLESTEROL CARE
కొలెస్ట్రాల్ నియంత్రణకు ఆయుర్వేద పరిష్కారం
SHE CARE
మహిళల సమగ్ర ఆరోగ్యం మరియు శక్తి కోసం టానిక్
SHAPEFIX
బరువు నియంత్రణకు ఆయుర్వేద పరిష్కారం
In Compliance with ICH GCP , ICMR , GCLP International & Research Guideline, a Clinical Study Protocol No (ARL/CT/011/24) Was conducted (Single arm ,multicentre study)In management of Type – II Diabetes Mellitus (Madhumeha) Who consumed Diabic Care Juice to assess the efficacy, safety, and tolerability for 12 Weeks ,the effectiveness observed in reduction with FPG Level upto 23.67 % , PPG level fell by 41.80 % also a significant reduction in HbA1c levels upto 15.88 %
హోమ్ డెలివరీ పొందడానికి QR కోడ్‌ను స్కాన్ చేయండి
అన్ని ఆయుర్వేద మరియు మెడికల్ స్టోర్లలో లభ్యం
కస్టమర్ సపోర్ట్: care@krishnaayurved.com
www.krishnaayurved.com
WhatsApp ద్వారా సంప్రదించడానికి QR కోడ్ స్కాన్ చేయండి
వ్యాపార సంబంధిత విచారణల కోసం సంప్రదించండి : M V Ravi Kumar- 70326 63329



ఇరాన్ దాడి కారణంగా దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫా సమీపంలోని ఓ హోటల్ వద్ద పేలుడు అనంతరం అలుముకున్న పొగ



టెల్ అవీవ్‌లో ఇరాన్ రాకెట్లను అడ్డుకుంటున్న ఇజ్రాయెల్ రక్షణ క్షిపణి నిరోధక వ్యవస్థ



ఇరాన్ దాడితో దుబాయ్‌లోని జబెల్ అలీ ఓడరేవులో ఉవ్వెత్తున ఎగసిన పొగ

అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో ఖమేనీ మృతి

ఇప్పటిదాకా మృతులు, గాయపడినవారు

దేశం	మృతులు	గాయపడినవారు
ఇరాన్	201	747
ఇజ్రాయెల్	10	120
అమెరికా	3	5
ఇరాక్	2	5
కువైట్	1	32
బహ్రెయిన్	–	4
ఖతార్	–	16
యూఏఈ	3	58
ఒమన్	–	5

(మొదటి పేజీ తరువాయి)


ఇజ్రాయెల్‌పై, గల్ఫ్ దేశాలపై క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. విమానాశ్రయాలు, దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫాసహా పలు భవనాలకు నష్టం కలిగింది. ఇజ్రాయెల్‌లో 11 మంది చనిపోగా.. తమ సైనికులు ముగ్గురు మరణించారని అమెరికా ప్రకటించింది. గల్ఫ్‌లోని మరిన్ని చోట్ల మరణాలు సంభవించాయి. చాలా మంది గాయపడ్డారు. గాయపడిన వారిలో భారతీయులూ ఉన్నారు. పశ్చిమాసియాలో ఆదివారమూ వందల విమానాలు రద్దయ్యాయి. భారత్ నుంచి దాదాపు 220 విమానాలు నిలిచిపోయాయి. దీంతో వేల మంది విమానాశ్రయాల్లోనే చిక్కుకుపోయారు. అమెరికా యుద్ధ నౌకపై క్షిపణులు పేల్చామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది. మరోవైపు ఖమేనీ వారసుడి ఎన్నిక ఒకట్రెండు రోజుల్లో జరగనుంది.

● ఇరాన్ సైనిక బలగాల చీఫ్ ఆఫ్ స్టాఫ్.. అబ్దుల్‌రహీం మౌసావి, రక్షణ మంత్రి అజీజ్ నసీర్జాదే, భద్రతా సలహాదారు అలీ శంఖానీ తదితరులు అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన వారిలో ఉన్నారు. ● రెండో రోజైన ఆదివారమూ ఇరాన్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడింది.

● 9 ఇరాన్ చమురు నౌకలను ముంచేశామని, నౌకాదళ ప్రధాన కార్యాలయాన్నీ ధ్వంసం చేశామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు.

టెహ్రాన్‌లోనే అంతం

ఇరాన్ రాజధాని టెహ్రాన్ డౌన్‌టౌన్‌లోని ఖమేనీ కార్యాలయంపై భారీగా బాంబు దాడులు జరిగిన దృశ్యాలు శాటిలైట్ చిత్రాల్లో కనిపించాయి. ఈ దాడుల్లోనే 86 ఏళ్ల ఖమేనీ మరణించినట్లు ఇరాన్ అధికారిక వార్తా సంస్థ ఆదివారం ఉదయం ప్రకటించింది. ఆయనతోపాటు కుమార్తె, అల్లుడు, కోడలు, మనవరాలు మృతి చెందారు. చరిత్రలోనే అత్యంత దుర్మార్గమైన వ్యక్తి మరణించారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఖమేనీతోపాటు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ అత్యున్నతాధికారి, ఖమేనీ భద్రతా సలహాదారు మేజర్ జనరల్ మహమ్మద్ పాక్‌పౌర్ మరణించారు. ఖమేనీ మరణంతో టెహ్రాన్‌లో కొందరు భవనాల పైకి వచ్చి సంతోషం వ్యక్తం చేశారు. మరోవైపు వేల మంది నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. షియా ముస్లింల ప్రధాన ఆధ్యాత్మిక కేంద్రమైన మషాద్‌లో జెండాను అవనతం చేశారు. ఖమేనీ మృతికి సంతాపసూచకంగా 7 రోజుల సెలవుతోపాటు 40 రోజుల సంతాప దినాలను ప్రభుత్వం ప్రకటించింది.





మృతి చెందిన పాక్‌పౌర్, అలీ శంఖానీ, అజీజ్ నసీర్జాదే

● ఖమేనీపై దాడుల వివరాలను ఇజ్రాయెల్ రక్షణ దళం (ఐడీఎఫ్) ఆదివారం వెల్లడించింది. వైమానిక దాడుల్లోనే ఆయన మరణించారని పేర్కొంది. శనివారం ఉదయం.. డజన్ల సంఖ్యలోని సైనిక స్థావరాలపై విస్తృత స్థాయిలో, సమన్వయంతో అమెరికాతో కలిసి దాడులు చేశామని తెలిపింది.

● ఇరాన్‌లోని బాలిస్టిక్ క్షిపణి కేంద్రాలపై అమెరికా బీ-2 స్టెల్త్ బాంబర్లను వేసింది.

● ప్రభుత్వాన్ని ఆధీనంలోకి తీసుకోవాలని ప్రజలకు ట్రంప్ పిలుపునిచ్చినా ఇరాన్‌లో పెద్దగా స్పందన కనిపించలేదు. ఆదివారం టెహ్రాన్‌లో వీధులన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. భారీ దాడుల కారణంగా ప్రజలు షెల్టర్లకే పరిమితమయ్యారు.

ఇరాన్ ప్రతీకారం: ఇజ్రాయెల్, గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై శనివారం రాత్రి ఇరాన్ విరుచుకుపడింది. బహ్రెయిన్, కువైట్, ఖతార్‌లలోని స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. డజన్లకొద్దీ క్షిపణులను, వందలకొద్దీ డ్రోన్లను ఇరాన్ ప్రయోగించిందని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది.

● యూఏఈలోని విమానాశ్రయాలు, పలు ఇతర భవనాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ క్షిపణులను ప్రయోగించింది. దుబాయ్ విమానాశ్రయం, బుర్జ్ ఖలీఫాపైనా దాడులు జరిగాయి. ఇరాన్ దాడుల కారణంగా బుర్జ్ అల్ అరబ్ హోటల్‌వద్ద మంటలు వచ్చాయని, అయితే ఎవరికీ గాయాలు కాలేదని యూఏఈ ప్రభుత్వం వెల్లడించింది. దుబాయ్ జెబెల్ అలీ పోర్ట్‌వద్ద క్షిపణులను రక్షణ వ్యవస్థలు అడ్డుకోవడంతో శిథిలాలు పడ్డాయని, ఎవరికీ గాయాలు కాలేదని ప్రభుత్వం వెల్లడించింది. దుబాయ్ విమానాశ్రయంవద్ద అత్యవసర పరిస్థితి తలెత్తింది. అక్కడ జరిగిన దాడిలో నలుగురు గాయపడ్డారు. మొత్తంగా ఇప్పటిదాకా యూఏఈలో ముగ్గురు మరణించగా.. 58 మంది గాయపడ్డారు. చనిపోయిన వారిలో పాకిస్థాన్, నేపాల్, బంగ్లాదేశ్ జాతీయులున్నారు.

● అబుదాబిలోని జాయెద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై శనివారం రాత్రి ఇరాన్ దాడిచేసింది. ఈ దాడుల్లో ఇద్దరు మృతి చెందారు. ఏడుగురు గాయపడ్డారు.

● ఇప్పటిదాకా 165 క్షిపణులు, 541 డ్రోన్లు తమ దేశం దిశగా దూసుకొచ్చాయని యూఏఈ రక్షణ మంత్రిత్వశాఖ వెల్లడించింది. 152 క్షిపణులను కూల్చేశామని, మిగిలినవి సముద్రంలో కూలిపోయాయని వివరించింది. 506 డ్రోన్లను కూల్చేశామని, మిగిలినవి భూభాగంతోపాటు సముద్రంలో కూలిపోయాయని తెలిపింది.

● దుబాయ్, అబుధాబిల్లోని పాఠశాలల్లో గురువారం వరకూ ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది.

● స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్‌లో చమురు నౌకపై దాడి జరిగింది. ఈ దాడిలో నలుగురు సిబ్బంది గాయపడ్డారు. ఈ నౌకలో భారతీయ సిబ్బంది ఉన్నారు. 3 బ్రిటన్, అమెరికా చమురు నౌకలపై దాడులు చేశామని ఇరాన్ ప్రకటించింది.

● ఇరాన్ క్షిపణులను అడ్డుకున్నామని ఖతార్, బహ్రెయిన్, కువైట్ ప్రకటించాయి. ఖతార్‌లో 16 మంది గాయపడ్డారు.

● మినాబ్‌లో పాఠశాల భవనంపై బాంబులు పడిన ఘటనలో మృతి చెందిన వారి సంఖ్య 165కి చేరుకుంది.

● ఇజ్రాయెల్‌లో భారీ పేలుళ్లు సంభవించాయి. ఇరాన్ జరిపిన ఈ దాడుల్లో 9 మంది మృతి చెందగా.. 28 మంది గాయపడ్డారు. బీట్ షెమెష్‌లోని సినగోగ్‌పై ఈ దాడి జరిగింది. దీంతో ఇప్పటిదాకా ఇజ్రాయెల్‌లో 11 మంది మృతి చెందినట్లయింది. మరో 9 మంది గల్లంతయ్యారు. 120 మంది గాయపడ్డారు.

● ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ మొదలైనప్పటి నుంచి ఇప్పటిదాకా ముగ్గురు సైనికులు మరణించారని, ఐదుగురు గాయపడ్డారని అమెరికా ప్రకటించింది.

● విమాన వాహక యుద్ధ నౌక యూఎస్ఎస్ అబ్రహాం లింకన్‌పై నాలుగు బాలిస్టిక్ క్షిపణులతో ఇరాన్ దాడి చేసింది. అయితే ఈ వార్తలను అమెరికా సైన్యం ఖండించింది.

● 49 డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకున్నామని జోర్డాన్ వెల్లడించింది.

మూగబోయిన మినీ ఇరాన్

ఖమేనీ మృతికి సంతాపంగా కర్ణాటకలోని అలీపుర్‌లో సంతాప ప్రార్థనలు

ఈనాడు, బెంగళూరు: ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన సైనికదాడుల్లో ఆ దేశ సర్వోన్నత నాయకుడు (సుప్రీం లీడర్) అయతొల్లా ఖమేనీ మృతిని ఖండిస్తూ మూడు రోజుల పాటు సంతాపదినాలు పాటించాలని కర్ణాటకలోని చిక్కబళ్లాపుర జిల్లా అలీపుర్ గ్రామం తీర్మానించింది. మినీ ఇరాన్‌గా పిలిచే ఈ గ్రామంతో ఖమేనీకి ఉన్న సంబంధమేంటంటే ఇరాన్‌కు నాయకత్వ బాధ్యతలు స్వీకరించేముందు ఖమేనీ భారత్‌ను సందర్శించారు. ఆ సమయంలో మినీ ఇరాన్‌గా పిలిచే అలీపుర్‌లోనూ పర్యటించారు. ఈ గ్రామంలో దాదాపు 90% షియా ముస్లింలు ఉంటారు. 1981 ఫిబ్రవరిలో ఇక్కడికొచ్చిన ఖమేనీ ఇరాన్ ప్రభుత్వ సహకారంతో ఇక్కడ ఓ ఆసుపత్రిని ప్రారంభించారు. నేటికీ ఈ ఆసుపత్రిలో వైద్యచికిత్సలన్నీ ఇరాన్ ఏజెన్సీ నిధులతోనే చేపడుతుండటం విశేషం. ఒక్క చిక్కబళ్లాపుర నుంచే 150 మంది విద్యార్థులు దుబాయిలో ఉన్నత చదువులు అభ్యసిస్తున్నారు. ఖమేనీని వీరంతా విదేశీ నాయకుడిగా కాకుండా సామాజిక చైతన్యాన్ని నింపిన మార్గదర్శకుడిగా ఆరాధిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఖమేనీ మృతికి సంతాపంగా సామూహిక ప్రార్థనలు, ర్యాలీలు చేపట్టాలని గ్రామస్థులు తీర్మానించారు. ఈ యుద్ధం కారణంగా పశ్చిమాసియా ప్రాంతంలో చిక్కుకున్న కన్నడిగుల రక్షణ కోసం రాష్ట్రప్రభుత్వం హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు సీఎం సిద్ధరామయ్య ప్రకటించారు.



అలీపుర్ పర్యటన సందర్భంగా గ్రామస్థులతో ఖమేనీ

అక్కడ క్షిపణుల మోత... ఇక్కడ గుండెల్లో దడ

● **53 అంతర్జాతీయ విమాన సర్వీసుల రద్దు**

ఈనాడు, హైదరాబాద్: పశ్చిమాసియాలో భీకర యుద్ధం జరుగుతుండటంతో తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఇరాన్‌కు, ఇజ్రాయెల్-అమెరికా కూటమికి మధ్య పోరు కొనసాగుతుండటంతో గల్ఫ్ దేశాలనూ యుద్ధభయం వెంటాడుతోంది. ఈ క్రమంలో అక్కడ చిక్కుకున్న తెలుగు ప్రజల కోసం వారి కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. ముఖ్యంగా ఇరాన్‌లోని పరిస్థితులపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఇరాన్ రాజధాని టెహ్రాన్, కోమ్ నగరాల్లో పలువురు భారతీయ విద్యార్థులు వైద్యవిద్యను అభ్యసిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన పలువురు విద్యార్థులు షాహిద్ బహెస్తి యూనివర్సిటీలో చదువుతున్నారు. యుద్ధం నేపథ్యంలో ఇరాన్‌లో ఇంటర్నెట్ సేవలకు అంతరాయం ఏర్పడి అక్కడ ఏం జరుగుతోందో తెలియడం లేదు. మరోవైపు ఇజ్రాయెల్‌తోపాటు దుబాయ్, కువైట్, సౌదీ అరేబియా, అబుధాబి, ఖతార్ తదితర గల్ఫ్ దేశాల్లోని అమెరికా ఎయిర్‌బేస్‌లను లక్ష్యంగా చేసుకొని ఇరాన్ క్షిపణులను ప్రయోగిస్తుండటంతో ఆ దేశాల్లోని భారతీయులూ భయాందోళనలకు గురవుతున్నారు. ఈ దేశాల్లో వేల సంఖ్యలో తెలుగు ప్రజలు నివసిస్తున్నారు. క్షిపణులు పడే సమయంలో తాము బంకర్లలోకి వెళ్తున్నట్లు ఇజ్రాయెల్‌లోని పలువురు తెలుగు ప్రజలు సామాజిక మాధ్యమాల్లో వీడియోలను అప్‌లోడ్ చేస్తున్నారు. గల్ఫ్ దేశాల్లో విమానాల రాకపోకల్ని నిలిపివేయడంతో పలువురు ప్రయాణికులు అక్కడే చిక్కుకుపోయారు. తాను దుబాయ్‌లోనే ఉన్నట్లు ప్రముఖ క్రీడాకారిణి పీవీసింధు సామాజిక మాధ్యమం ద్వారా వెల్లడించారు. దుబాయ్‌లో క్షిపణుల దాడిపై సినీనటుడు మంచు విష్ణు సైతం తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు.

● యుద్ధం కారణంగా 53 అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఆదివారం కువైట్, అబుధాబీ, మస్కట్, షార్జా, బహ్రెయిన్, రియాద్, దమ్మామ్, మదీనా, దోహా, దుబాయ్ నగరాల నుంచి హైదరాబాద్‌కు రావాల్సిన 26 విమానాలు అక్కడే ఆగిపోయాయి. ఇక్కడి నుంచి వెళ్లాల్సిన 27 అంతర్జాతీయ సర్వీసులు నిలిచిపోయాయి.

ప్రవాసాంధ్రులెవరూ ఆందోళన చెందొద్దు

● **మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

ఈనాడు, అమరావతి: గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్త వాతావరణం నేపథ్యంలో అక్కడి ప్రవాసాంధ్రులు స్థానిక అధికారులకు అందుబాటులో ఉంటూ అధికారిక మీడియా సమాచారాన్ని అనుసరించాలని రాష్ట్ర ఎన్ఆర్ఐ వ్యవహారాలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. ఆయా దేశాల్లో ఉంటున్న విద్యార్థులు, ఉద్యోగులు, పర్యాటకులు సహా రాష్ట్ర ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, త్వరలోనే విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర విదేశాంగ శాఖతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని తెలిపారు. సాధారణ పరిస్థితులు నెలకొనే వరకూ ఉద్రిక్త ప్రాంతాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. 'భారత రాయబార కార్యాలయంలో ఆయా దేశాల్లో ఉన్న ప్రవాసాంధ్రులు నమోదు చేసుకోవాలి. ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల్లో ఉండే భారతీయుల భద్రతపై కేంద్రం, భారత విదేశాంగ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. సరైన సమాచారం తెలుసుకుని ఎప్పటికప్పుడు భారత రాయబార కార్యాలయాలకు అందుబాటులో ఉండాలి. అత్యవసర పరిస్థితుల్లో ఏపీ ఎన్ఆర్‌టీఎస్ హెల్ప్‌లైన్ నంబర్లు +91 85000 27678, +91 08632 340678లో సంప్రదించాలి' అని సూచించారు.



పిల్లలకు షార్ట్ వీడియోలు చూపిస్తే..

పిల్లలకు ఫోన్లో షార్ట్ వీడియోలను అస్సలు చూపించకండి. వాటికి అలవాటుపడితే వారిలో మెదడు చురుకుదనం తగ్గిపోతుంది. ఫలితంగా ఏకాగ్రత శక్తి బలహీనమవుతుంది. దీనివల్ల వారు చదువుతో పాటు ఆటపాటల్లోనూ శ్రద్ధపెట్టలేక జీవితంలో వెనుకబడతారు.

– జెఫ్, పేరెంటింగ్ కోచ్

అనంతపురంలో భానుడి భగభగలు

గరిష్ఠ ఉష్ణోగ్రత 38.4 డిగ్రీలుగా నమోదు

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రంలో ఎండ తీవ్రత కొనసాగుతోంది. ఆదివారం దేశంలోనే అత్యధికంగా అనంతపురంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 38.4 డిగ్రీలుగా నమోదైంది. ఈ సీజన్‌లో ఇదే అత్యధికం. నందిగామ, అమరావతి, కావలి, నంద్యాల, కడప, కర్నూలు, తిరుపతి తదితర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలు దాటాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రాబోయే మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరిగే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది.

గ్రహం అనుగ్రహం

2–3–2026 సోమవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, ఫాల్గుణ మాసం, శుక్ల పక్షం
చతుర్దశి: సా. 5-49 తదుపరి పూర్ణిమ
ఆశ్లేష: ఉ. 7-53 తదుపరి మఖ
వర్జ్యం: రా. 7-43 నుంచి 9-17 వరకు
అమృత ఘడియలు: ఉ. 7-53 వరకు తిరిగి తె. 5-11 నుంచి
దుర్ముహూర్తం: మ. 12-35 నుంచి 1-21 వరకు తిరిగి 2-55 నుంచి 3-41 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.6.22; సూర్యాస్తమయం: సా.6.02

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	17.0	33.0
తాడేపల్లిగూడెం	22.0	33.0
విజయవాడ	22.0	34.3
గుంటూరు	22.0	35.0
రాజమహేంద్రవరం	22.0	37.0
తిరుపతి	22.1	35.7
నరసాపురం	23.0	33.5
కడప	23.0	36.0
విశాఖపట్నం	23.6	33.2
ఒంగోలు	23.6	33.7
నెల్లూరు	23.9	34.6
శ్రీకాకుళం	24.0	31.0
కర్నూలు	24.0	37.0

వేట్లపాలెం ఘటనలో మరో ఇద్దరి మృతి

● **22కు చేరిన మృతుల సంఖ్య**
● **ఇద్దరు క్షతగాత్రుల పరిస్థితి విషమం**




మృతులు పెదలోవరాజు, దర్శిపాటి రాజు



జీజీహెచ్ వద్ద రోదిస్తున్న వేట్లపాలెం క్షతగాత్రుల కుటుంబసభ్యులు

కాకినాడ (మసీదుసెంటర్), న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా వేట్లపాలెంలోని బాణసంచా తయారీకేంద్రంలో జరిగిన భారీ విస్ఫోటంలో గాయపడ్డ బాధితుల్లో సామర్లకోటకు చెందిన దర్శిపాటి పెదలోవరాజు(38) ఆదివారం తెల్లవారుజామున, దర్శిపాటి రాజు ఎలియాస్ రాజేష్(28) రాత్రి మృతిచెందారు. దీంతో ఈ ఘటనలో మృతుల సంఖ్య 22కు చేరింది. కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నవారిలో మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. లోవరాజు అన్న కుమారుడు రాజు. వీరిద్దరూ మూడేళ్ల నుంచి బాణసంచా తయారీ కేంద్రంలో పనిచేస్తున్నారు. లోవరాజుకు భార్య వెంకటలక్ష్మి, కుమార్తె లలిత (17), కుమారుడు ప్రేమ్‌కుమార్(15) ఉన్నారు. పిల్లలిద్దరూ మానసిక దివ్యాంగులు. రాజుకు భార్య రాజేశ్వరి, కుమార్తెలు ఆద్య (3), సింధు (9) నెలలు ఉన్నారు.

● పేలుడు జరిగిన వేట్లపాలెంలోని సూర్య ఫైర్ వర్క్స్ యజమాని అడబాల అర్జున్‌పై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు.

నిబంధనల ఉల్లంఘనతోనే పేలుడు: మంత్రి సుభాష్

పేలుడు ఘటనకు యజమాని నిబంధనలు ఉల్లంఘించడమే ప్రధాన కారణమని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కాకినాడ జీజీహెచ్‌లో చికిత్సపొందుతున్న బాధితులను ఆయన ఆదివారం పరామర్శించారు. గత సంవత్సరం రాయవరంలో జరిగిన ఘటనలో 10 మంది మృతిచెందాక బాణసంచా తయారీ కేంద్రాల నిర్వహణలో నిబంధనలు కఠినతరం చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 488 బాణసంచా తయారీ కేంద్రాలు ఉన్నాయని, వాటి యాజమాన్యాలు కొత్తగా రూపొందించిన నిబంధనలు సడలించాలని కోరారన్నారు. అయినా తాము నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) జారీని కష్టతరం చేశామన్నారు. యాజమాన్యం ఆస్తులను జప్తు చేసి వేట్లపాలెం బాధితులకు అందజేస్తామన్నారు.

పేరు కోసం ఆరాటం.. ప్రాణాలతో చెలగాటం

● **బాణసంచా పోటీల్లో గెలిస్తే ఆర్డర్లు ఎక్కువ వస్తాయని ఆశ**
● **టపాసుల్లో పేలుడు తీవ్రత పెంచేలా రసాయనాల దట్టింపు**
● **ఈ క్రమంలోనే వేట్లపాలెంలో భారీ విస్ఫోటం**

ఈనాడు, కాకినాడ; న్యూస్‌టుడే, సామర్లకోట, గ్రామీణం, పెద్దాపురం: బాణసంచా పోటీల్లో నెగ్గితే పేరుతోపాటు తయారీకి ఆర్డర్లు ఎక్కువగా వచ్చి.. డబ్బులు బాగా సంపాదించవచ్చన్న ఆ వ్యాపారి ఆశ 21 మంది అమాయకుల ప్రాణాలను బలిగొంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉత్సవాలు, తీర్థాల్లో పోటాపోటీగా బాణసంచా కాలుస్తుంటారు. ఎవరు చేసిన మందుగుండు బాగా కాలితే వారికి బహుమతులు లభిస్తాయి. తర్వాత ఆర్డర్లూ పెరుగుతాయి. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో సూర్యశ్రీ ఫైర్‌వర్క్స్ యజమాని అడబాల అర్జున్, అతని సోదరుడు వీరబాబు ఇలాంటి పేరు కోసమే ఆరాటపడి భారీ ప్రమాదానికి కారణమయ్యారు. గతేడాది సొంతూరులో జరిగిన బేతాళస్వామి ఉత్సవాల బాణసంచా పోటీల్లో వీరే నెగ్గారు. అత్తవారి గ్రామం గోకవరం మండలం సింగారమ్మచింత జాతరలోనూ పోటీ పడాలనుకున్నారు. పేలుడు తీవ్రత బాగా పెంచేలా నారబాంబులు తయారుచేశారు. టపాసుల్లో రసాయనాల దట్టింపులో అంచనా తప్పి పేలుడు చోటుచేసుకుంది.

600 కిలోల మందుగుండు నిల్వలు: సూర్యశ్రీ ఫైర్‌వర్క్స్‌కు 15 కిలోల బాణసంచా ముడి పదార్థాలతో తయారీకే అనుమతి ఉంది. కానీ అక్కడ 100 కిలోలు పైగా సామగ్రి, 500 కిలోలకు పైగా రసాయనాలు ఉన్నట్లు ఫోరెన్సిక్ నిపుణులు అంచనాకు వచ్చారు. ఎంత పరిమాణంలో మందుగుండు నిల్వలు ఉంచారన్న విషయం ఫోరెన్సిక్ పరిశోధనలో వెలుగుచూస్తుందని కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ చెప్పారు.

8 మందికి బదులు 50 మంది

ఇక్కడ 8 మందితో పనిచేయడానికే అనుమతి ఉంది. కానీ నిత్యం 30-40 మందితో పని చేయిస్తున్నారు. జాతర ఆర్డర్ ఎక్కువ రావడంతో నాలుగు రోజులుగా 50 మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు.

33 బాణసంచా తయారీ కేంద్రాలకు అగ్నిమాపక ఎన్‌వోసీలు లేవు..

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 87 బాణసంచా తయారీ కేంద్రాలు ఉంటే.. వాటిల్లో 33 కేంద్రాలకు అగ్నిమాపక నిరభ్యంతర పత్రాలు (ఎన్‌వోసీ) లేవని తనిఖీల్లో వెల్లడైంది. ఇవన్నీ కాకినాడ, తూర్పుగోదావరి, డా.అంబేద్కర్ కోనసీమ, అనకాపల్లి జిల్లాల పరిధిలోనే ఉన్నాయి.

● బాణసంచా తయారీ కేంద్రాన్ని ప్రారంభించేముందు ఆయా కేంద్రాల్లో ఎలాంటి అగ్నిమాపక భద్రతా చర్యలు చేపట్టాలి? ఏయే అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచాలి అనే అంశాలను సూచిస్తూ అగ్నిమాపక శాఖ ఎన్‌వోసీలు జారీ చేస్తుంది. రెవెన్యూ శాఖ నుంచి లైసెన్సు పొందిన తర్వాత బాణసంచా తయారీ కేంద్రాల నిర్వాహకులెవరూ అగ్నిమాపక ఎన్‌వోసీలను రెన్యూవల్ చేసుకోవడం లేదు.

● ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు లేదా దీపావళి సమయంలోనే తనిఖీలు ఉంటున్నాయి. రెవెన్యూ, పోలీసు, కార్మిక, అగ్నిమాపక శాఖలు కలిసి సంయుక్తంగా చేపట్టాల్సిన ఉమ్మడి తనిఖీలు కూడా సరిగ్గా జరగట్లేదు. ఈ నిర్లక్ష్యమూ ప్రమాదాలకు కారణమవుతోంది.

నెల్లూరు ఆసుపత్రిలో అగ్నిప్రమాదం

భయంతో పరుగు తీసిన బాలింతలు

ఈనాడు, అమరావతి; న్యూస్‌టుడే, నెల్లూరు (జీజీహెచ్): శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరులోని సర్వజనాసుపత్రి ప్రసూతి విభాగంలో ఆదివారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. వైద్యులు, సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి రోగులు, చిన్నారులను క్షేమంగా తరలించారు. ప్రసూతి కేంద్రంలోని హెచ్‌డీ(హై డిపెండెన్సీ) వార్డులోని రెండు ఏసీలు ఒక్కసారిగా పేలిపోయి, మంటలు ఎగిశాయి. అందులోని రెండు పడకలు పూర్తిగా కాలిపోయాయి. సమయానికి అక్కడే విధుల్లో ఉన్న వైద్యురాలు మాధురి సిబ్బందితో కలిసి గది కిటికీ అద్దాలు పగలగొట్టారు. మిగతా సిబ్బందిని అప్రమత్తం చేసి. . విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. ఆ తర్వాత హెచ్‌డీ వార్డులోని ఇద్దరు మహిళలను, ఆ వార్డుకు ఆనుకొని ఉన్న చిన్నపిల్లల విభాగంలోని చిన్నారులను పక్క వార్డుకు తరలించారు. అగ్నిమాపక సిబ్బంది ఆసుపత్రికి చేరుకునేలోపే సిబ్బందే మంటలను పూర్తిగా అదుపుచేశారు. విద్యుత్తు సరఫరా నిలిపేయడంతో ఆసుపత్రిలో అంధకారం నెలకొంది. దీంతో ఎన్ఐసీయూలో ఉన్నవారిని అధికారులు ట్రామా వార్డులోకి మార్చి వైద్య సేవలకు ఆటంకం లేకుండా చూశారు.

ఒక్కొక్కరిదీ ఒక్కో కన్నీటి గాథ

● **బాణసంచా ప్రమాదంలో బుగ్గయిన బతుకులు**

ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే సామర్లకోట, గ్రామీణం, పెద్దాపురం: బాణసంచా పనికి వెళ్లాలని అనుకోలేదొకరు.. భోజనం చేసి కాసేపు సేదతీరి వెళదామనుకున్నారు ఇంకొకరు. కానీ వారి పాలిట యజమాని తండ్రే మృత్యుదూతగా మారాడు. ఆయన బలవంతం చేయకపోతే ఈ ఇద్దరి ప్రాణాలూ మిగిలేవని బంధువులు విలపించారు. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని సూర్యశ్రీ ఫైర్‌వర్క్స్‌లో శనివారం జరిగిన భారీ విస్ఫోటంలో సజీవదహనమైనవారి కుటుంబాలు తమ కన్నీటి వేదనను ఆదివారం వినిపించాయి. ఈ ప్రమాదంలో యజమాని అడబాల అర్జున్ తండ్రి శ్రీనివాసరావు కూడా ప్రాణాలు కోల్పోయారు.

చివరి చూపూ దక్కలేదు



గొడత నాని భార్య చాందిని, కుటుంబీకులు

'నా భర్త గొడత నానిని చివరి చూపు చూసుకోలేకపోయాం. పని ఎక్కువగా ఉందని, త్వరగా వెళ్లాలని చెప్పిన ఆయన.. సాయంత్రం త్వరగా వచ్చేస్తానన్నారు. ప్రమాదంలో ఆయన ముఖం కూడా కనిపించలేదు.. పాప సుస్మిత, బాబు రాహుల్ తమ తండ్రి ఎక్కడని అడిగితే ఏం సమాధానం చెప్పాలో తెలియడం లేదు' అని మృతుడు నాని భార్య చాందిని ఆవేదన చెందారు.

ఇలా వెళ్లి.. అలా వచ్చేయాలి..



బుజ్జి, వీరవెంకటరమణ భార్య

గొడత వీరవెంకటరమణ బాణసంచా తయారీ పనికి వెళ్లి శనివారం మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చారు. 'ఇలా వెళ్లి అలా 15 నిమిషాల్లో వచ్చేయాలి. లేకపోతే నీకు కూలి డబ్బులు అందవు.. వచ్చే వారం పని చెప్పను' అని యజమాని అడబాల అర్జున్ తండ్రి శ్రీనివాసరావు హెచ్చరించారు. దీంతో వెంకటరమణ త్వరగా భోజనం చేసి బయలుదేరగా.. కాసేపు ఆగి వెళ్లాలని భార్య బుజ్జి నిలువరించింది. అయినా విషయం చెప్పి వెళ్లిపోయాడు. అంతే.. తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడని ఆయన భార్య బుజ్జి వాపోయారు.

అమ్మా, నాన్నా అన్నీ తానై



దుర్గ

వేట్లపాలేనికి చెందిన కడింపల్లి ధనరాజు భార్య గతంలోనే చనిపోయింది. కుమార్తె దుర్గ మానసిక దివ్యాంగురాలు. కుమారుడికి వివాహమైంది. ధనరాజు కూలిపని చేసుకుంటూ కుమార్తె దుర్గను పోషిస్తున్నాడు. 'బాణసంచా పేలుడులో మీ నాన్న చనిపోయాడు' అని చెబితే ఏడ్వటం తప్ప మరేమీ తెలియని పరిస్థితి దుర్గది.

పనికి అప్పుడే రానని చెప్పినా..



భీమిరెడ్డి దేవి

వేట్లపాలేనికి చెందిన చింతల రమణమ్మ చాలాకాలంగా బాణసంచా తయారీ పనికి వెళుతోంది. రెండు నెలల క్రితం ఆమె భర్త అప్పారావు చనిపోయారు. అప్పటినుంచి పనికి వెళ్లడం లేదు. మంచిరోజు చూసుకుని వెళ్దామనుకుంది. యజమాని తండ్రి శ్రీనివాసరావు ఆమె ఇంటికి వచ్చి ఈ రోజు మంచిదేనమ్మా.. పనికి రా.. నీకు నాలుగు డబ్బులు వస్తాయంటూ ఒప్పించి తానే తీసుకెళ్లాడు. మధ్యాహ్నభోజన సమయంలో చిన్న కుమార్తె భీమిరెడ్డి దేవికి రమణమ్మ ఫోన్‌చేసి తాను పనికి వెళ్లానని చెప్పింది. అలా మాట్లాడుతుండగానే పేలుడు సంభవించి రమణమ్మ చనిపోయింది. సుదీర్ఘ విరామం తర్వాత కూలిపనికి వెళ్లిన రోజునే తమ అమ్మ చనిపోయిందని దేవి, ఆమె అక్క అనంతలక్ష్మి విలపించారు.

కుమారులను భోజనానికి పంపించి..

బాణసంచా దుకాణానికి అడబాల అర్జున్ పేరున లైసెన్స్ ఉన్నా అంతా ఆయన తండ్రి శ్రీనివాసరావే చూసుకుంటారు. ప్రమాదం జరిగినరోజు మధ్యాహ్నం వరకు అర్జున్, అతని సోదరుడు వీరబాబు అక్కడే ఉన్నారు. మీరు భోజనాలకు వెళ్లి రండి.. నేను చూసుకుంటానని చెప్పి శ్రీనివాసరావు వారిని పంపించాడు. వారు వెళ్లొచ్చేలోగా దుర్ఘటన జరిగి ఆయన కూడా ప్రాణాలు కోల్పోయారు.

బాణసంచా తయారీకేంద్రాల మూసివేతకు ఆదేశాలు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం బాణసంచా కేంద్రంలో సంభవించిన భారీ విస్ఫోటం, ప్రాణనష్టంతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ముందస్తు చర్యలు చేపట్టింది. లైసెన్సులు పొందిన బాణసంచా తయారీ కేంద్రాల మూసివేతకు నిర్ణయించారు. కాకినాడ, పెద్దాపురం రెవెన్యూ డివిజన్ల పరిధిలో అనుమతులు పొంది నిర్వహిస్తున్న ఈ కేంద్రాలను మూసివేయాలని సంయుక్త కలెక్టర్ అపూర్వభరత్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులు ఈ కేంద్రాలను తనిఖీ చేసి, కార్యకలాపాలు నిలిపివేయాలని సూచించారు. కాకినాడ, పెద్దాపురం రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఇచ్చిన లైసెన్స్‌లను తాత్కాలికంగా రద్దుచేస్తున్నట్లు ప్రకటించారు. వేట్లపాలెం ఘటనతో అనధికారిక బాణసంచా తయారీకేంద్రాలను ముందే మూసేశారు. సరకులను వేరే ప్రాంతాలకు తరలించేశారు.


ఈనాడు

పశ్చిమాసియా నెత్తిన మరో పిడుగు

అణు ఒప్పందం విషయంలో కొన్నాళ్లుగా ఇరాన్‌పై గుడ్లురుముతున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమ అస్త్రశస్త్రాలను ఆ దేశంవైపు ఎప్పుడో మోహరించారు. పోరు అనివార్యమైతే వెనక్కి తగ్గేది లేదని టెహ్రాన్ సైతం తేల్చి చెప్పడంతో ప్రపంచ శాంతికి వినాశకరమైన మరో యుద్ధం తప్పేలా లేదన్న భయాందోళనలు వ్యక్తమయ్యాయి. చివరికి వాటిని నిజం చేస్తూ ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై అగ్రరాజ్యం మొన్న విరుచుకుపడింది. అందుకు ప్రతిగా టెహ్రాన్ సైతం గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలు, ఇజ్రాయెల్‌పై క్షిపణులు, డ్రోన్లతో దాడిచేసి ప్రాంతీయంగా భీతావహ వాతావరణాన్ని సృష్టిస్తోంది. అమెరికా, ఇజ్రాయెల్ గుమ్మరించిన బాంబుల ధాటికి ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ మరణించడం పశ్చిమాసియాను కల్లోలంలోకి నెట్టేసింది. తమ అగ్రనేత హత్యకు ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ హెచ్చరించింది. అదే జరిగితే ఇరాన్‌లో అణ్వస్త్రాల విధ్వంసాన్ని టెహ్రాన్‌కు చవిచూపిస్తామని ట్రంప్ హుంకరిస్తున్నారు. వాస్తవానికి ఇరాన్‌తో అణు ఒడంబడిక నుంచి ఏకపక్షంగా వైదొలిగిన ట్రంప్- ఇప్పుడు కొత్త సంధికోసం పట్టు బడుతున్నారు. ఒకవైపు చర్చల పేరు చెబుతూనే ఇరాన్‌పై దండెత్తి పశ్చిమాసియాలో రావణకాష్ఠాన్ని ఆయన రగిలించారు.

తిరుగుబాటు తంత్రాలతో 1953లో ఇరాన్ ప్రభుత్వాన్ని కూల్చిన అమెరికా- అప్పట్లో ఆ దేశ అధికారాన్ని రెజా షా పహ్లావికి కట్టబెట్టింది. ఆ తరవాత 1979లో ఉవ్వెత్తున ఎగసిన విప్లవం ఫలితంగా రుహోల్లా ఖొమైనీ నేతృత్వంలో ఇస్లామిక్ ప్రభుత్వం ఏర్పడింది. 1989లో ఆయన మరణం తరవాత అయతుల్లా ఖమేనీ ఇరాన్ పగ్గాలు చేపట్టారు. చిన్న వయసులోనే మతగురువైన ఆయన షాను వ్యతిరేకించి జైలు జీవితాన్నీ గడిపారు. కాలక్రమంలో దేశాధ్యక్షుడి స్థాయికి ఎదిగిన ఖమేనీ, ఆ తరవాత మూడున్నర దశాబ్దాల పాటు ఇరాన్‌ను ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలారు. అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికి మతాన్ని ప్రధాన సాధనంగా మార్చుకున్న ఆయన- దేశాన్ని ఛాందసవాదంలోకి నెట్టేశారు. దానివల్ల సామాన్యుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు హరించుకుపోయాయి. అవినీతికి తోడు, పాశ్చాత్య దేశాల ఆంక్షలతో విపరీతమైన ధరాభారాలు ఖమేనీ ఏలుబడిపై జనసామాన్యంలో ఆగ్రహం పెంచి ఇటీవల భారీ నిరసనలకు పురిగొల్పాయి. వాటిని టెహ్రాన్ ఉక్కుపాదంతో అణచివేసింది. ఇంతలోనే, అమెరికా, ఇజ్రాయెల్ ఆరంభించిన యుద్ధం ఇరాన్ భవితవ్యాన్ని ఎలాంటి మలుపు తిప్పుతుందన్నది ప్రస్తుతానికి ప్రశ్నార్థకమవుతోంది.

ఇస్లామిక్ విప్లవానంతరం అమెరికా, ఇజ్రాయెల్‌లు ఇరాన్‌కు ప్రబల శత్రువులయ్యాయి. తనకు వ్యతిరేకంగా హమాస్, హెజ్‌బొల్లా, హౌతీలను టెహ్రాన్ ఉసిగొల్పుతుండటం, పైగా అది అణుబాంబును సిద్ధం చేస్తోందన్న అనుమానాలు టెల్‌అవీవ్‌కు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇంకోపక్క పశ్చిమాసియాలో తన ప్రయోజనాలకు ఇరాన్‌ను ప్రతిబంధకంగా అమెరికా భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా అవి యుద్ధ రక్కసికి ఆవాహన పలికి యావత్ ప్రపంచాన్ని కలవరపాటుకు గురిచేశాయి. తనపై దాడులకు ప్రతిస్పందనగా చమురు రవాణాకు జీవనాడిలాంటి హార్మూజ్ జలసంధిని ఇరాన్ దీర్ఘకాలం మూసివేస్తే భారత్ సహా చాలా దేశాల్లో ద్రవ్యోల్బణం కోరచాచే ప్రమాదం ఉంది. పశ్చిమాసియాను పెను ఉద్రిక్తతల పాల్జేసి ప్రపంచ సౌభాగ్యానికి హానికరంగా పరిణమించే యుద్ధజ్వాలల ప్రకోపాన్ని అడ్డుకునేందుకు అన్ని దేశాలు ముందుకు రావాలి. చర్చల ద్వారా శాంతి స్థాపనకు ప్రయత్నించాలి.




మనం ఉండే ఇల్లు మన తాహతును ప్రతిబింబించాలనుకుంటారు చాలామంది. నిజానికి ఎవరి ఇల్లయినా వారి వ్యక్తిత్వానికి అద్దం పట్టాలి. చూడగానే స్వాగతిస్తున్నట్లు ఉండాలి కానీ అడుగు పెడితే మాసిపోతుందేమోనన్నట్లు భయపెట్టేదిగా ఉండకూడదు.

– లారీ బేకర్, ఆర్కిటెక్ట్

ప్రసాదం

అన్నానికి మరో పేరు 'సాదం'. దైవనివేదనకు యోగ్యమైన సాదం- ప్రసాదం! ప్రసాదమనే సంస్కృత శబ్దానికి ప్రసన్నమైన, అనుగ్రహ రూపమైనదని అర్థం. మనం రోజూ తినే ఆహారం ప్రసాదం కావాలంటే- అది ముందుగా భగవంతుడికి నివేదన కావాలి. ఆ నివేదన భక్తిశ్రద్ధలతో కూడినదై ఉండాలి. ఆహారానికి భక్తి కలిస్తేనే అది ప్రసాదం అవుతుంది. నీటికి భక్తిని జోడిస్తేనే అది తీర్థం అవుతుంది. తీర్థ ప్రసాదాలంటే- దైవానుగ్రహాన్ని, తేజస్సును తమలో నింపుకొన్నవని అర్థం. కాబట్టి వాటిని ఎంతో పవిత్రంగా భావిస్తారు భక్తులు. భక్తితో స్వీకరిస్తారు. అప్పుడే తీర్థ ప్రసాదాల్లోని దేవతాశక్తి మన దేహాల్లోకి ప్రసరిస్తుంది.

మట్టి బొమ్మల్లోకి, రాతి విగ్రహాల్లోకి దైవశక్తిని ఆవాహన చేసేందుకు- ఆహూత, సన్నిహిత, వ్యాపక... అనే మూడు విధానాలను పాటిస్తారు. రాగితీగల్లోకి విద్యుచ్ఛక్తిని ప్రసారం చేసినట్లు వాటి ద్వారా ఈశ్వర శక్తిని ఆ ప్రతిమల్లోకి ప్రవేశపెడతారు. అలా ప్రతిమల్లోకి ప్రవేశించిన ప్రాణశక్తికి పోషణ కోసం నివేదన చేసిన వాటినే ప్రసాదాలంటారు. ప్రతిమల్లోని పరమాత్మశక్తిని బలోపేతం చేసిన పదార్థాన్ని ప్రసాదంగా స్వీకరించిన ప్రాణికి ఆత్మశక్తి బలపడుతుంది. సాధారణమైన రాగితీగ శక్తిమంతమైన విద్యుత్తీగ అవుతుంది. పదార్థాల్లోకి భగవచ్ఛక్తిని ప్రవేశపెట్టేందుకు బలమైన భావనాశక్తి అవసరం. భావన చేసేవారికే- భగవంతుడు. భావనాశక్తి చాలని సందర్భాల్లో మనిషి మంత్రబలాన్ని ఆసరాగా స్వీకరిస్తాడు.



అంతర్యామి

అలా భావనాశక్తి, మంత్రబలం కలగలిసిన ప్రసాదాలకు పవిత్రత ఇనుమడిస్తుంది. ఇళ్లల్లో నిత్యం చేసే సాధారణ నివేదనలకు, దేవాలయాల్లో వేదమంత్రాలతో సమర్పించేవాటికి అదే తేడా. ఇంట్లో లాంఛనంగా దేవుడి ముందుంచే ప్రసాదాల్లోని జీవశక్తి- కుండీల్లో పెరిగే లేత మొక్కల జీవశక్తి వంటిది. దేవాలయాల్లోని తీర్థ ప్రసాదాలది కొండల్ని చీల్చుకుంటూ ఏపుగా ఎదిగి ఆకాశాన్ని ముద్దాడే గిరివృక్షాల జీవశక్తి లాంటిది.

వాస్తవానికి మనకు లభించే ఆహార పదార్థాలన్నీ భూమాత ప్రసాదాలే. గ్రీష్మతాపానికి నెర్రెలు వారిన భూదేవి దాహాన్ని మేఘాలు తీరుస్తాయి. సమృద్ధిగా కురిసిన వర్షాలకు భూగర్భంలోని ఓషధులు జీవం పోసుకుంటాయి. సస్యాలు మొలకెత్తుతాయి. జీవుల ఆకలి తీరుస్తాయి. ఆరోగ్యాన్నిస్తాయి. ఆ విధంగా వానచినుక్కీ అన్నం మెతుక్కీ మధ్య మేఘుడు సంధానకర్తగా వ్యవహరిస్తాడు. అన్నం జీవుల ప్రాణాలు నిలుపుతుంది. ప్రసాదాల్లో మాదిరే అన్నానికీ స్థాయీభేదాలు ఉన్నాయి. పదిమందికి పెట్టగా మిగిలిన అన్నం- విఘసం. యజ్ఞాల్లో ఆహుతి కాగా మిగిలినది అమృతం! మనం హోటళ్లలో తినేదానికీ- వీటికీ చాలా తేడా ఉంది. విఘసామృతాలు ప్రసాదాలు. అందుకే దేవాలయాల్లోనూ, శ్రీరామనవమి, వినాయకచవితి పందిళ్లలోనూ జరిగే సంతర్పణలకు 'అన్నప్రసాదాలు' అని పేరు. ప్రసాదమనే పేరు ప్రాశస్త్యానికి, పవిత్రతకు చిహ్నం.

మనిషి జీవితమూ అంతే! నిర్లక్ష్యంగా బతికేస్తే- అది హోటల్ భోజనం. భగవంతుడికి భక్తితో నివేదిస్తే అది ప్రసాదం.

– ఎర్రాప్రగడ రామకృష్ణ

ఉన్నత చదువులు

పాతాళంలో ప్రమాణాలు!

భారత్ ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో విద్యాసంస్థలు ఉన్న దేశంగా నిలుస్తోంది. కానీ, అంతర్జాతీయ విద్యార్థులను ఆకర్షించడంలో చిన్నబోతోందని నీతి ఆయోగ్ తాజా నివేదిక వెల్లడించింది. దేశదేశాల నుంచి విద్యార్థులు, పరిశోధకులు, ఆలోచనలను ఆకర్షించే దేశాలే నవీకరణను సాధించగలుగుతున్నాయి. తద్వారా ప్రపంచ వేదికపై సమర్థంగా పోటీ పడుతూ అగ్రగాములుగా అవతరిస్తున్నాయి. వాటికి దీటుగా భారత్ కూడా నిలవాలనే లక్ష్యంతో 'వికసిత భారత్'కు ఊపిరి పోస్తోంది. ప్రతిభా నైపుణ్యాలు, విస్తీర్ణం, జనాభాపరంగా పెద్దదైన భారతదేశం విశ్వగురుగా ఆవిర్భవించాలని ఆశించడం బాగానే ఉన్నా, ఆశయాన్ని ఆచరణగా మార్చడానికి చేయాల్సిందెంతో ఉంది.

ఇరవైఒకటో శతాబ్దిలో అభివృద్ధి అంటే రేవులు, రహదారులు, విద్యుత్కేంద్రాలు, జీడీపీ గణాంకాలు మాత్రమే కాదు. శాస్త్రసాంకేతిక సత్తా, నవకల్పనలు, అంతర్జాతీయ ఆలోచనాధారను మలిచే సామర్థ్యం వంటివే నిర్ణయాత్మక శక్తులు. ఇవి ఉన్నత విద్య ద్వారా లభించే గుణాలు. కాబట్టి ఈ శతాబ్దిలో అభివృద్ధికి ఉన్నత విద్యే మూలాధారం. అందువల్ల వికసిత భారత్ సాకారమవ్వాలంటే మన వర్సిటీలు కేవలం డిగ్రీలను పంచే ప్రదేశాలుగా మిగిలిపోకూడదు. నవీకరణ సాధనకు అనువైన వాతావరణాన్ని అవి సృష్టించాలి. అత్యాధునిక పరిశోధన, అభివృద్ధి నిలయాలుగా రాణించాలి. అంతర్జాతీయ భావధారలో మమేకం కావాలి. తమ వర్సిటీలను జాతీయ ఆర్థిక, సాంకేతిక అవసరాలకు తీర్చిదిద్దుకోవడం ద్వారా ఐరోపా, జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్ అధికారదాయ దేశాలుగా ఎదిగాయి. ఆ అనుభవాన్ని భారత్ బాగా అందిపుచ్చుకోవాలి.




నవీన ఆవిష్కరణలకు ఊతం

పూర్వం భారత్ గణితం, వైద్యం, ఖగోళ, తత్త్వ శాస్త్రాల్లో విశ్వగురువుగా వెలిగింది. ఆధునిక ప్రపంచంలో కృత్రిమ మేధ, డిజిటల్ వసతులు, ప్రజారోగ్యం, వాతావరణ మార్పుల నిరోధం, సుస్థిరాభివృద్ధి సాధనలో భారత్ మళ్ళీ ప్రపంచానికి మార్గదర్శిగా ఎదగాలి. దానికి బాటలు వేయగలిగేవి విశ్వవిద్యాలయాలే. ప్రస్తుతం ఎందరో భారతీయులు విదేశీ వర్సిటీల్లో కుసేనీ సీఈఓలుగా, శాస్త్రజ్ఞులుగా రాణిస్తున్నారు. విదేశీ విద్యాలయాల్లో ఆచార్యులుగా, పరిశోధకులుగా ఖ్యాతిని ఆర్జించారు. వారంతా ఇలాంటి విజయాలను సొంతగడ్డపైనే సాధించేలా చేయాలి. స్వదేశంలో కూడా వారికి సృజనాత్మకతను ప్రదర్శించగల వాతావరణాన్ని కల్పించాలి. నవీన ఆవిష్కరణలకు ఊతమివ్వాలి. అంతర్జాతీయ విజ్ఞాన కేంద్రాలుగా మన వర్సిటీలను మలచాలి. విశ్వగురు అంటే మేధావులను, సాంస్కృతికంగా ఆధిపత్యం చలాయించడం కాదు. విద్వత్తు, విశ్వసనీయత, పారదర్శకతలకు నిలయంగా నిలవడం. ఆలోచనలను పరస్పరం స్వేచ్ఛగా పంచుకునే వేసులుబాటు, ఉన్నత బోధన, పరిశోధనా ప్రమాణాలు ఉన్న విశ్వవిద్యాలయాలను అంతర్జాతీయ విద్యార్థులు ఎంచుకుంటారు. మన వర్సిటీలు కూడా అంతర్జాతీయ విద్యార్థులను ఆకర్షించాలంటే మూస పద్ధతులను పక్కనపెట్టి ఉన్నత బోధనా ప్రమాణాలతో ముందడుగు వేయాలి. వాటికి నిజమైన స్వయంనిర్ణయాధికారం ఇవ్వాలి. అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో సహకార ఏర్పరచుకోవాలి.

భారతీయ ఉన్నత విద్యారంగంలో 4.1 కోట్లమందికిపైగా విద్యార్థులు చేస్తున్నారు. 1100కుపైగా విశ్వవిద్యాలయాలు, 43వేలకు పైగా కళాశాలలతో అలరారుతున్న వ్యవస్థ ఇది. అయినా, అంతర్జాతీయ విద్యార్థులను ఆకర్షించలేకపోవడానికి లోపమెక్కడుందో ఆలోచించాలి. అంతర్జాతీయ విద్యార్థుల్లో ఒక్క శాతమే భారత్‌లో విద్యాభ్యాసానికి వస్తున్నట్లు యునెస్కో గణాంకాలు చెబుతున్నాయి. అదే అమెరికా ఏటా లక్షల సంఖ్యలో విదేశీ విద్యార్థులను ఆకర్షించగలుగుతోంది. బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియాలు కూడా మనకన్నా ఎంతో ఎక్కువమందిని ఆకర్షిస్తున్నాయి. భారత్ మాత్రం విద్యార్థుల ఎగుమతిలో అగ్ర స్థానానికి ఎదిగింది. దాదాపు 13 లక్షలమంది భారతీయ విద్యార్థులు ఇతర దేశాల్లో చదువుతున్నారు. వారు బోధనా రుసుములు, జీవన వ్యయం కింద ఏటా వేల కోట్ల డాలర్లను ఖర్చు చేస్తున్నారు. తద్వారా భారత్ మేధా సంపదనూ, ఆర్థిక సంపదనూ కోల్పోతోంది. మరోవైపు భారతీయ వర్సిటీల గురించి విదేశాల్లో ప్రచారం జరగకపోవడం, నాణ్యతా ప్రమాణాల్లోనూ వెనకబడటం, అంతర్జాతీయ విద్యార్థులను, బోధనా సిబ్బందిని ఆకర్షించడానికి తగిన ప్రయత్నలోపం వంటివి ప్రధాన లోపాలు. విద్యను అంతర్జాతీయకరణ చేయాలని 2020నాటి జాతీయ విద్యా విధానం ప్రతిపాదించినా, అది నత్తనడకగా సాగుతోంది. ఈ పరిస్థితిలో ఉన్నత విద్యా రంగంలో అంతర్జాతీయకరణ సాధించాలని నీతి ఆయోగ్ తాజా నివేదిక పిలుపు ఇవ్వడం సకాలంలో జరిగిన చర్యగా చెప్పాలి. ఆశయాలను ఆచరణగా మార్చాలని నీతి ఆయోగ్ స్పష్టం చేస్తోంది. విద్య అంతర్జాతీయకరణ అనేది మన దేశంలో కొద్దిమంది వ్యక్తుల స్థాయిలో జరుగుతోందే తప్ప సంస్థాగతంగా జరగడం లేదు. మన ఉన్నత విద్యాసంస్థలు జాతీయ స్థాయికే పరిమితమవుతున్నాయి. అంతర్జాతీయ స్థాయి పరిశోధనా ఫలితాలను వెలువరించలేకపోతున్నాయి. అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమవుతున్న మన పరిశోధన పత్రాల సంఖ్య తక్కువ. విదేశీ శాస్త్రవేత్తలతో కలిసి మన పరిశోధకులు జరిపే అధ్యయనాలూ తక్కువే. ప్రపంచంలోని పెద్ద దేశాల్లో ఒకటైన భారత్ ఇలా అరకొర పరిశోధనలతో సరిపెట్టుకోవడం సమర్థనీయం కాదు. మేలైన పరిశోధనలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుంది. ఆర్థికంగా, రాజకీయంగా, ఇతరత్రా ఎంతో పలుకుబడి సాధించడానికి అది తోడ్పడుతుంది. సంపన్న దేశాల అనుభవమే ఇందుకు సాక్ష్యం.

సమూలంగా సంస్కరిస్తేనే...

నిరుడు క్యూఎస్ ప్రపంచ విశ్వవిద్యాలయాల సర్వేలో ర్యాంకులు పొందిన 200 అత్యుత్తమ విద్యాసంస్థల్లో భారత్‌కు చెందిన సంస్థలు మూడే ఉన్నాయి. ఒకప్పుడు చైనా పరిస్థితీ ఇంతే. చైనా పట్టుదలగా కృషి చేసి తన వర్సిటీల ప్రమాణాలను గొప్పగా మెరుగు పరచింది. ఫలితంగా నేడు ప్రపంచంలోని 500 అత్యుత్తమ విశ్వవిద్యాలయాల జాబితాలో డజన్ల కొద్దీ చైనా వర్సిటీలు స్థానం సంపాదించుకున్నాయి. భారతీయ వర్సిటీలూ ఆ స్థాయికి చేరడానికి తమను తాము సమూలంగా సంస్కరించుకోవాలి. మన వర్సిటీలు మొదట సొంతగడ్డపై ప్రమాణాలను మెరుగు పరచుకుని విదేశాల్లో క్యాంపస్‌లు ఏర్పాటు చేసే స్థాయికి ఎదగాలి. అంతర్జాతీయ స్థాయిలో విశిష్టులైన అధ్యాపకులను భారత్‌కు రప్పించి విద్యార్థులకు మార్గదర్శకత్వం ఇప్పించాలి. వర్ధమాన దేశాలకు తానే గురువుగా ఎదగాలి. యువతను నిపుణులుగా తీర్చిదిద్దాలి. అందుకు ఉత్తమ ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలి. అంతర్జాతీయ స్థాయిలో ఉత్కృష్ట విద్యాకేంద్రంగా రాణించాలి.



ప్రొఫెసర్ పి.శ్రీనివాస్ సుబ్బారావు
మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి,
నల్సార్ లా యూనివర్సిటీ

మనస్సాక్షి మన తప్పుల్ని ఎప్పుడూ ఎత్తి చూపుతూనే ఉంటుంది. హెచ్చరిస్తూనే ఉంటుంది. ఏం ప్రయోజనం? ఈరోజుల్లో చాలామందికి ఈ మనస్సాక్షి మాట వినే ఓపిక, తీరుబడి లేదనిపిస్తూంటుంది వారి చేతలను, మాటలను చూస్తుంటే! ముఖ్యంగా సామాజిక మాధ్యమాలలో కనిపిస్తున్న వారి పోకడలను గమనిస్తుంటే!

ప్రస్తుత రాజకీయాల గురించో సామాజిక ధర్మాల గురించో ఒక పోస్ట్ పెట్టామనుకోండి. ఎవరో ఒకరు ఖండిస్తారు. అది తప్పు కాదు. ఒక విషయం మీద అనేక అభిప్రాయాలుంటాయి. అలా తమదైన అభిప్రాయం చెప్పకపోగా అనాగరికంగా మాట్లాడతారు. మన అభిప్రాయంతో ఎందుకు విభేదిస్తున్నారో చక్కని భాషలో చెప్పవచ్చు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.

సంస్కార భారతం

మన చేతిలోనే...



లక్షలమంది కార్యకర్తలను నడిపించాల్సిన రాజకీయ నాయకులు మహిళలపట్ల, తోటి నాయకుల పట్ల అసభ్యంగా మాట్లాడతారు. నాయకుడి మాటలనే అనుచరులు తిరిగి వల్లిస్తుంటారు. రాజకీయ పార్టీలకు డిజిటల్ సైన్యాలు ఉండటం వల్ల కర్ణ కఠోరమైన అసభ్య భాష సామాజిక మాధ్యమాల ద్వారా సమాజంలోకి రవాణా అవుతోంది. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన కొద్దీ సామాజిక మాధ్యమాలను విచ్చలవిడిగా తమ స్వార్థ ప్రయోజనాలకు వాడుకోవడం ఎక్కువ అవుతోంది.

నాస్తికులు, ఆస్తికులు పరస్పరం విమర్శించుకోవడం ఎప్పటి నుంచో ఉంది. ఇప్పుడు అది కూడా హద్దుమీరింది. భావనలో కాదు.. భావవ్యక్తీకరణ పరంగా. భావవ్యక్తీకరణ స్వేచ్ఛ ఉన్నంత మాత్రాన ఇతరులను నోటికొచ్చినట్లు తూలనాడతామంటే చట్టం ఒప్పుకోదు. దాదాపుగా అందరూ చదువుకున్నవారే కాబట్టి ఈ సంగతి అందరికీ తెలుసు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో ఉన్న అందరికీ ఇవి తెలుసు.


తప్పు చేస్తున్నామన్న విషయం తెలిసి కూడా అదే తప్పు పదేపదే చేస్తున్నామంటే ఒక రకమైన నిర్లక్ష్య భావన, నిరంకుశ భావన బలపడుతోంది. కొంతమంది దాన్ని నిర్భీతి అనుకుంటారు. కానీ, నిర్భయం వేరు. సామాజిక మర్యాదలు వేరు. అపరిచితులను నోటికి వచ్చినట్టు సంబోధించడం అనాగరికత అవుతుందే తప్ప నిర్భీతి కాదు. ఇటీవల ఈ తరహా వ్యక్తుల నుంచి హీనాతిహీనమైన భాష వెలువడుతోంది. మన నోటి నుంచి వచ్చే మాటలు మన స్థాయిని, సంస్కారాన్ని తెలియజేస్తాయి. అసభ్యకర భాష మాట్లాడేవారిని ప్రత్యక్షంగా ఎవరూ ఏమీ అనకపోయినా పరోక్షంగానైనా ఛీత్కరించుకుంటారు. గౌరవం ఇవ్వరు. భాషతోనే మన సంస్కారం వెల్లడవుతుంది. సంస్కారయుతమైన ప్రవర్తనే గౌరవాన్ని తెస్తుంది. కుటుంబసభ్యులకూ అది లభిస్తుంది. అనుచరులు, స్నేహితులు పెరుగుతారు. అటువంటి కుటుంబాల నుంచి వచ్చిన భావిభారత పౌరులు సంస్కారవంతులవుతారు.

'సంస్కార భారతం' కావాలంటే అది ఇంటి నుంచే ప్రారంభం కావాలి. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఉన్నత ఆశయాలు, ఉత్తమ లక్ష్యాలు ఉండటమే కాదు.. వాటికి మనం అనుసరించే మార్గాలు, పాటించే విలువలు, ఉపయోగించే భాష, సంఘంతో పెట్టుకునే సంపర్కం కూడా ఉన్నతంగా ఉండాలి.

– చంద్రప్రతాప్ కంతేటి

చట్టబద్ధమైన పాలనకు తూట్లు

ఏ దేశంలోనైనా పాలన చట్టబద్ధంగా సాగితే అధికార దుర్వినియోగాన్ని నివారించి మానవ హక్కులకు భరోసాగా నిలుస్తుంది. చట్టబద్ధమైన పాలన సూచీలో చాలా దేశాలు అత్తెసరు మార్కులే తెచ్చుకున్నాయి. ఇందులో సున్నా నుంచి ఒకటి వరకు మార్కులు కేటాయించారు. ఒక మార్కు చట్టబద్ధమైన పాలనకు పటిష్ఠంగా కట్టుబడి ఉండటాన్ని సూచిస్తుంది. రూల్ ఆఫ్ లాకు సంబంధించి ఆ ఇండెక్స్‌లో నిరుడు దక్షిణాసియా దేశాలు సాధించిన స్కోర్లు...




నేపాల్	0.52
శ్రీలంక	0.51
ఇండియా	0.49
బంగ్లాదేశ్	0.39
పాకిస్థాన్	0.37
అఫ్గానిస్థాన్	0.31

(ఆధారం: వరల్డ్ జస్టిస్ ప్రాజెక్ట్ నివేదిక-2025)

వేడి అధికమై... విపత్తులు తీవ్రమై!

దేశంలో నిరుడు వార్షిక సగటు ఉష్ణోగ్రత దీర్ఘకాలిక సగటుకంటే 0.28 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదైనట్లు భారత వాతావరణ విభాగం వెల్లడించింది. 2015-2024 మధ్య ఉష్ణోగ్రత దాదాపు 0.9 డిగ్రీల సెల్సియస్ మేర పెరిగినట్లు పరిశోధనలు చెబుతున్నాయి. ఉత్తరాఖండ్, జమ్మూకశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లోని కొన్ని జిల్లాల్లో అది 2.5 నుంచి నాలుగు డిగ్రీల సెల్సియస్ మేర ఎక్కువైంది. ఇతర ప్రాంతాల్లో ఒకటి నుంచి 1.5 డిగ్రీల సెల్సియస్ దాకా పెరిగింది. దీనివల్ల దేశంలోని 57శాతం జిల్లాల్లో 76 శాతం జనాభా వడగాడ్పులతో తల్లడిల్లే ప్రమాదముంది. తీవ్రమైన ఎండలవల్ల పొలాలు, నిర్మాణ ప్రదేశాల్లో పనిచేసే వ్యక్తుల ఉత్పాదకత సన్నగిల్లుతుంది. ఉష్ణోగ్రత ప్రతి డిగ్రీ పెరిగేకొద్దీ తీవ్రమైన వడగాల్పుల ముప్పు మూడు నుంచి అయిదు రెట్లు అధికమవుతుంది.



నానాటికీ కట్టుతప్పుతున్న ఉష్ణోగ్రతల వల్ల ప్రకృతి విపత్తులు తీవ్రరూపం దాలుస్తున్నాయి. అవి మానవాళికి ఎన్నో రకాల కష్టాలను తెచ్చిపెడుతున్నాయి. జీవజాతుల ఉనికినే ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు వెంటనే మేల్కొని తగిన నివారణ చర్యలు చేపట్టడం అత్యావశ్యకం.

ఆవరణ వ్యవస్థ అతలాకుతలం

ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండటంతో భారత్‌లో వ్యవసాయానికి మూలాధారమైన రుతుపవనాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. 2012-2022 మధ్య దేశంలోని 55శాతం మండలాల్లో నైరుతి రుతుపవనాల కాలంలో వర్షపాతం 11శాతం పెరిగింది. మరోవైపు గంగా పరీవాహకం, ఈశాన్య, హిమాలయ ప్రాంతాల్లో చాలాచోట్ల వర్షపాతంలో లోటు నెలకొంది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో కొన్ని ప్రాంతాల్లో కుంభవృష్టులు, మరికొన్ని ప్రాంతాల్లో దీర్ఘకాలం పొడి వాతావరణం నెలకొని అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు చుట్టుముడతాయి. ఉష్ణోగ్రతలు కట్టుతప్పడం వల్ల ధ్రువప్రాంతాల్లో మంచు కరిగి సముద్ర మట్టాలు పెరుగుతున్నాయి. దానివల్ల ముంబయి, కొచ్చి, చెన్నై తదితర నగరాలకు ముప్పు పొంచి ఉంది. సముద్రపు నీరు ముందుకు రావడం వల్ల పశ్చిమ్ బెంగాల్, కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో తీరం ఎక్కువగా కోతకు గురవుతోంది. ఇంటర్ గవర్నమెంటల్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ చేంజ్ (ఐపీసీసీ) నివేదిక ప్రకారం మన తీరంలో సముద్ర మట్టాలు ఏటా సగటున 3.3 మిల్లీమీటర్ల చొప్పున పెరుగుతున్నాయి. దానివల్ల భూగర్భ జలాలు, వ్యవసాయ భూముల్లోకి ఉప్పు నీరు చొచ్చుకొస్తోంది.

అధిక వేడిమిని ఎక్కువగా సముద్రాలే శోషించుకుంటాయి. ఈ క్రమంలో హిందూ మహాసముద్ర జలాలు 1950-2020 మధ్య సగటున 1.2 డిగ్రీల మేర వేడెక్కినట్లు ఐఐటీఎం అధ్యయనం గతంలో వెల్లడించింది. తత్ఫలితంగా చిన్న చేపలు ఆహారంగా తీసుకునే ఫైటోప్లాంక్టాన్, జూప్లాంక్టాన్లు తగ్గిపోతున్నాయి. దానివల్ల ఆ చేపలు ఇతర ప్రాంతాలకు వలసవెళ్తుండటంతో ఆవరణ వ్యవస్థ మారిపోతోంది. అధిక వేడి వల్ల కొన్ని సందర్భాల్లో గుడ్లు, చిన్న చేపలు చనిపోతున్నాయి. దానివల్ల భవిష్యత్తులో చేపల సంఖ్య తగ్గి వాటి వేటపై ఆధారపడిన వారి జీవితాలు సుడిగుండంలో పడతాయి. ఉష్ణోగ్రత పెరుగుదల వల్ల సముద్రంలోని పగడపు దిబ్బలూ నాశనమవుతున్నాయి. మితిమీరుతున్న ఉష్ణతాపం కారణంగా హిమాలయాల్లో వేసవితోపాటు శీతకాలంలోనూ మంచు తగ్గుతోంది. ప్రతి 1.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత పెరిగేకొద్దీ హిమనీ నదాల్లో మూడింట ఒక వంతు కనుమరుగవుతాయని ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ మౌంటెన్ డెవలప్‌మెంట్ (ఐసీఐఎంవోడీ) హెచ్చరిస్తోంది. ముఖ్యంగా సింధు, గంగ, బ్రహ్మపుత్ర నదీ పరీవాహక ప్రాంతాల్లో నీటి కొరత ముమ్మరిస్తుంది.


ప్రమాదంలో ఆహార భద్రత


నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం 60 కోట్ల మంది భారతీయులు ఇప్పటికే నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. ఒక డిగ్రీ ఉష్ణోగ్రత పెరిగితేనే భూగర్భ జలాలు భారీగా తగ్గిపోతాయి. దాంతో పట్టణాల్లో నీటి ఎద్దడి తాండవిస్తుంది. పశ్చిమ కనుమలు, సుందర్‌బన్స్, హిమాలయాల్లో జీవవైవిధ్యానికి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఉత్తరాఖండ్, ఒడిశా తదితర రాష్ట్రాల్లో కార్చిచ్చులు కోరచాస్తాయి. వాతావరణ మార్పులతో డెంగీ, మలేరియా వంటి వ్యాధులూ పంజా విసురుతున్నాయి. వాతావరణంలో వేడి ఇలాగే పెరిగితే వరి దిగుబడులు 2050 నాటికి 20శాతం, 2080 నాటికి 47శాతం తగ్గిపోతాయి. అదే సమయంలో గోధుమ దిగుబడులు 19.3శాతం, 40శాతం మేర తెగ్గోసుకుపోతాయని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. దానివల్ల కోట్లాదిమందిని ఆహార అభద్రత చుట్టుముడుతుంది. ఈ విపత్తులకు అడ్డుకట్ట పడాలంటే కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు పటిష్ఠమైన చర్యలు చేపట్టాలి. పునరుత్పాదక ఇంధన వనరుల ఉత్పత్తి, వినియోగం పెరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలి. భూతాపం మోసుకొస్తున్న ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు ముందస్తు హెచ్చరికల వ్యవస్థను మరింత మెరుగ్గా తీర్చిదిద్దుకోవడమూ తప్పనిసరి.

– కేతిరెడ్డి రాజ్యలక్ష్మి

కష్టపడితేనే ఫలితం

అనగనగా ఒక అడవిలో రకరకాల జంతువులు జీవించేవి. మృగరాజు అడవిలో వైద్యుడిగా ఎలుగుబంటిని, జంతువుల ఇబ్బందులు తెలుసుకోవడానికి కోతిని, కాపలాకు గుడ్లగూబను నియమించింది. కోతి, గుడ్లగూబ చక్కగా వాటి పని అవి చేసుకునేవి. అడవిలోకి ఎవరైనా వేటగాళ్లు వస్తున్నా, కావాలని చిన్న జీవుల మీద ఏవైనా జంతువులు దాడి చేస్తున్నా వెంటనే విషయాన్ని మృగరాజుకు తెలియజేసేది గుడ్లగూబ. కోతి మృగరాజు ఏ పని చెబితే అది చకచకా చేసి పెట్టేది. కానీ ఎలుగు మాత్రం.. బద్ధకంగా ఉండేది. దాని దగ్గరికి వచ్చిన జంతువులకు సరిగ్గా వైద్యం చేసేదే కాదు. ఏదో ఒక పసరు మందు ఇచ్చి నయమైపోతుందని చెప్పేది. ఒకసారి మృగరాజుకు చాలా జ్వరం వచ్చింది. దాంతో వైద్యం కోసం ఎలుగును పిలిపించింది. అప్పుడు కూడా అది.. ఏవో పిచ్చి ఆకులతో చేసిన పసరును సింహంతో తాగించింది. దానికి జ్వరం తగ్గకపోగా ఇంకా నీరసించింది. దాంతో వెంటనే పక్క అడవి నుంచి వైద్యం చేసే మరో ఎలుగుబంటిని తీసుకొచ్చి వైద్యం చేయించింది కోతి. రెండు రోజుల తరవాత మృగరాజు పూర్తిగా కోలుకుంది. అప్పుడు ఎలుగును పిలిచి.. 'నువ్వు ఇక ఇక్కడ ఉండాల్సిన అవసరం లేదు. ఇచ్చిన పనిని కనీస బాధ్యతతో కూడా చేయలేకపోయావు. ఆరోగ్యం బాగు చేయమని వస్తే చేతికి అందిన మూలికలు ఇచ్చి జంతువుల ప్రాణాలతో ఆడుకుంటున్నావు. ఇప్పుడే ఇక్కడి నుంచి వెళ్లిపో' అంది. దాంతో ఏమీ మాట్లాడకుండా పక్క అడవికి వెళ్లిపోయిందది. కానీ అక్కడ కూడా దాని పద్ధతి మార్చుకోకుండా అలాగే ప్రవర్తించసాగింది. దాంతో అక్కడి నుంచి దాన్ని వెళ్లగొట్టాయి జంతువులు. మనల్ని మనం నిరూపించుకోవాలంటే దాని కోసం కష్టపడాలి. వచ్చిన అవకాశాలను సరైన పద్ధతిలో ఉపయోగించుకోవాలి. లేకపోతే ఆ ఎలుగుబంటిలా మిగిలిపోవాల్సి వస్తుంది.






– పైడిమర్రి రామకృష్ణ

అక్కడా.. ఇక్కడా..!

ఇక్కడ మొదటి గడుల్లో వచ్చిన పదమే తరవాతి వాటిల్లోనూ సరిపోతుంది. ఓసారి ప్రయత్నించండి.

1. ☐☐ దేవగిరి రాజ్యానికి ☐☐ అవ్వాలని కలలు కంటున్నాడు.
2. ☐☐వరం వెళ్లడానికి మా ☐☐య్య టికెట్ బుక్ చేశాడు.
3. గుళ్లో ☐☐ వెలిగించిన ☐☐ ఇంకా వెలుగుతోంది.

[illegible]





ప్రహ్లాద వరద.. పరమాత్మ రూపా

మంగళగిరి శ్రీపానకాల లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు ఆదివారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేతంగా నృసింహుని కల్పవృక్ష వాహనంపై తిరువీధి ఉత్సవం నిర్వహించారు. రాత్రి కీలకమైన పొన్నవాహన సేవ నిర్వహించారు. - మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే

సజావుగా గురుకులాల ప్రవేశ పరీక్ష

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం (జనరల్, ఐఐటీ-నీట్)లో ప్రవేశాల కోసం కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష సజావుగా జరిగినట్లు గురుకులాల సమన్వయ అధికారి ఎ.మురళీకృష్ణ తెలిపారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. సహకరించిన జిల్లా పరిపాలన, పోలీస్, పరీక్షా సిబ్బంది, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అమరావతిలో కీలక అడుగు

★ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ చేతుల మీదుగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

తుళ్లూరు, న్యూస్‌టుడే: భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ రాకతో ఆదివారం అమరావతిలో సందడి వాతావరణం నెలకొంది. ఏపీ జ్యుడిషియల్ అకాడమీ, ఏపీ హైకోర్టు అతిథి గృహ నిర్మాణాలకు శంకుస్థాపన..నూతనంగా నిర్మించిన హైకోర్టు న్యాయమూర్తుల రెసిడెన్షియల్ ఎన్‌క్లేవ్ ప్రారంభోత్సవాన్ని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ చేతుల మీదుగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం వేదపండితులు సీజేఐకు ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, సీఎం చంద్రబాబునాయుడు, పలువురు సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, రాష్ట్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు. సుమారు 2.05 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏపీ జ్యుడిషియల్ అకాడమీ నిర్మాణం చేపడుతుండగా..120 మంది ట్రైనీ జడ్జిలకు శిక్షణ ఇచ్చేలా రూపకల్పన చేశారు.

రైతుల సంతోషం.. రాజధానిలో కీలక నిర్మాణాలకు అడుగులు పడడంతో స్థానిక రైతులు సంతోషం వ్యక్తం చేశారు.



హైకోర్టు న్యాయమూర్తుల బంగళా నమూనా పరిశీలిస్తున్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ నరసింహ, జస్టిస్ భట్టి, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, సీఎం చంద్రబాబు



పటమటలోని ఆంత్రాలక్జ్ కన్వెన్షన్ సెంటర్‌లో మధ్యవర్తిత్వంపై జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సుకు హాజరైన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు

ఆటో.. ఈ తీరేమిటో..!

✪ ఇష్టారీతిన నిబంధనల ఉల్లంఘన
✪ ముంబయి విధానం బెజవాడకు అనుసరణీయం

విజయవాడలో ద్విచక్ర వాహనం లేదా కారుతో రోడ్డెక్కితే పెద్దగా ట్రాఫిక్ ఇబ్బందులు లేని చోట్ల కూడా ఆటోల రూపంలో స్పీడ్ బ్రేకర్లు ఎదురవుతాయి. ఎక్కడపడితే అక్కడ నడిరోడ్డుపై ఆపి ఆటోవాలాలు ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. రోడ్లపై ఇష్టారీతిన ఆపడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకోవడంతో పాటు ట్రాఫిక్ అవాంతరాలు తలెత్తుతున్నాయి. ముంబయి తరహాలో కఠిన నిబంధనలు, ప్రత్యేక ఆటో స్టాండ్లు ఉంటేనే సమస్య పరిష్కారానికి నోచుకుంటుంది.– ఈనాడు, అమరావతి



రహదారి మధ్యలోనే ఆపేసి ప్రయాణికులతో డ్రైవర్ల బేరాలు

రోడ్లే ఆటో స్టాండ్లు..

★ నగర పరిధిలో సుమారు 15వేలకు పైగా ఆటోలు తిరుగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో కార్మిక సంఘాలు ఏర్పాటు చేసుకున్న స్టాండ్లు మినహా ఎక్కువ చోట్ల అసలు నిలిపేందుకూ జాగా లేని పరిస్థితి. దీంతో రోడ్ల మార్జిన్లే ఆటో స్టాండ్లుగా మారిపోయాయి. నగరంలో అత్యంత రద్దీగా ఉండే బందరు, ఏలూరు రోడ్లపై ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంది.

★ బెంజి సర్కిల్ పెట్రోల్ బంక్ వద్ద అనధికారికంగా రోడ్డుపైనే ఆటోలు నిలిపి ప్రయాణికులను ఎక్కిస్తున్నారు. ఫలితంగా పటమట వైపు నుంచి పీఎన్‌బీఎస్ వైపు వెళ్లే వాహనాలు ఆగిపోతున్నాయి. ఆటోనగర్ గేట్ వద్ద ఇదే పరిస్థితి. లిడ్‌క్యాప్ కార్యాలయం మలుపు వద్ద పెద్ద సంఖ్యలో ఆటోలు నిలుపుతున్నారు. దీని వల్ల ఆటోనగర్ వైపు వెళ్లాల్సిన వాహనాలు నిలిచిపోతున్నాయి. రాఘవయ్య పార్క్, బీసెంట్ రోడ్డు ప్రాంతాల్లోనూ రోడ్లపైనే ఆటోలను నిలుపుతున్నారు.

నియంత్రణ లేక ప్రమాదాలు

★ రోడ్లపై ప్రయాణికులు కనపడగానే హఠాత్తుగా ఆటోలు ఆపుతుండడం వల్ల వెనుక వస్తున్న వాహనాలు ఢీకొంటున్నాయి. ప్రయాణికుల్లోనూ పౌర స్పృహ కొరవడడంతో ఆటోల కోసం తమకు అనువుగా ఉన్నచోట నిరీక్షిస్తున్నారు. దీని వల్ల ట్రాఫిక్ ఆగిపోతున్నా పట్టించుకోవడం లేదు. 2025లో నగరంలో ఆటోల కారణంగా 27 పెద్ద ప్రమాదాలు చోటుచేసుకోగా గాయాలపాలైన ఘటనలు 106 ఉన్నాయి.

వీఎంసీ, పోలీసుశాఖ గట్టిగా అనుకుంటే..

ముంబయి నగరంలో ఆటోల కారణంగా తలెత్తిన ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు అక్కడి అధికారులు కఠిన నిబంధనలు అమలు చేస్తున్నారు. ఆటోలు విధిగా నిర్దేశిత ఆటో స్టాండ్లలోనే నిలపాలి. ఆటో ఎక్కాలంటే నేరుగా సమీపంలోని స్టాండ్‌కు వెళ్లి ఎక్కాల్సిందే. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధిస్తున్నారు. ★ ముంబయి తరహాలో బెజవాడలోనూ నిబంధనలు అమలు చేయాలి. ప్రత్యేక ఆటో స్టాండ్లు ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ ఇబ్బందులు తప్పుతాయి. ఈ విషయంలో వీఎంసీ, పోలీసుశాఖ చొరవ చూపాలి.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: (సోమవారం) సాయంత్రం: 6.19
సహర్: (మంగళవారం) ఉదయం: 5.07

మంత్రి నారాయణ పర్యటన నేడు

తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతిలో మంత్రి నారాయణ సోమవారం పర్యటించనున్నారు. నేలపాడు సమీపంలో నిర్మిస్తున్న గెజిటెడ్ ఆఫీసర్ల క్వార్టర్స్, గ్రూప్- డి ఉద్యోగుల భవన సముదాయాలను ఆయన పరిశీలిస్తారు. పనుల పురోగతిపై ఆరా తీస్తారని మంత్రి కార్యాలయ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి.

కాల్వలకు 2,823 క్యూసెక్కుల నీరు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు ఆదివారం 2,823 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ(కేఈబీ)కు 1,005, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వ(కేడబ్ల్యూ)కు 1,818 క్యూసెక్కుల నీటిని ఇస్తున్నారు. బ్యారేజీ వద్ద పూర్తి స్థాయిలో 12 అడుగుల నీటి మట్టం ఉంది.

వెలగని దీపం.. చీకటి శాపం..



జాతీయ రహదారులపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ విధానంపై ఎవరికీ పట్టక చీకట్లు కమ్ముకుంటున్నాయని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. నిర్వహణ విషయంలో సంబంధిత శాఖ, అటు స్థానిక సంస్థలు మీనమేషాలు లెక్కిస్తున్నాయి. తరచూ వస్తున్న ఫిర్యాదులు ప్రజల్లో అసహనాన్ని పెంచుతున్నాయి. మరో వైపు పట్టపగలే వెలుగుతున్న దీపాలను చూసి జనాలు అవాక్కవుతున్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారి- 30పై కొండపల్లి ఐడీఏ నుంచి కట్టుబడిపాలెం దాటే వరకు వెలుగుతున్న దీపాలను చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. రాత్రులు మాత్రం అంధకారం నెలకొంటుందని ఆవేదన చెందుతున్నారు.
- న్యూస్‌టుడే, మైలవరం, జి.కొండూరు

డ్రగ్స్‌పై దండయాత్ర.. ఆరంభం మాత్రమే..!

■ మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలిస్తాం : సీపీ
■ విజయవంతంగా 34 రోజుల సైకిల్ యాత్ర

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణే లక్ష్యంగా 34 రోజులు చేపట్టిన 'డ్రగ్స్‌పై దండయాత్ర' కార్యక్రమం విజయవంతమైందని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు వెల్లడించారు. ఇది ఆరంభం మాత్రమేనని వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 7 నియోజకవర్గాల్లో.. గత 34 రోజులుగా 510 కిలోమీటర్ల మేర సైకిల్ యాత్ర చేపట్టారు. ఈ యాత్ర ముగింపు కార్యక్రమం ఆదివారం పాత పోలీస్ కంట్రోల్‌రూం కూడలిలో నిర్వహించారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ వరకు ప్రదర్శన చేశారు. విజయవంతంగా సైకిల్ యాత్ర పూర్తి చేసిన ఐదుగురు మహిళా పోలీసులకు ఘన స్వాగతం పలికారు. పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు మాట్లాడుతూ.. ఇది ప్రజల ఆకాంక్ష నుంచి, ఒక తల్లి కడుపుకోత నుంచి పుట్టిన యాత్ర అని కొనియాడారు. యువత భవిష్యత్తుపై రాసిన సంతకంగా కలకాలం నిలిచిపోతుందన్నారు. ప్రజల స్పందన అద్భుతంగా ఉందని.. అడుగడుగునా హారతులు పట్టారని తెలిపారు. మాదకద్రవ్యాల మహమ్మారిపై ప్రజల్లో చర్చకు వచ్చేలా చేసిందన్నారు. ఎక్కడ ఏం జరిగినా టోల్‌ఫ్రీ నంబరు 1972కు సమాచారం వస్తోందన్నారు. అందరం కలిసి కట్టుగా పోరాడాల్సిన ఉద్యమం అని అన్నారు.

ఇదొక చరిత్రగా మారుతుంది..

డ్రగ్స్‌పై దండయాత్ర దేశంలోనే ఒక చరిత్రగా మారుతుందని సీపీ పేర్కొన్నారు. ఇందులో భాగంగా 29 రకాల కార్యక్రమాలను నిర్వహించామన్నారు. పోలీసు జాగిలాలు సైతం పాలు పంచుకున్నాయని, పిట్ ఎన్‌డీపీఎస్ యాక్ట్ గురించి ప్రజలకు తెలియజేశామని తెలిపారు. మత్తుకు బానిసైన 2,513 మందిని గుర్తించి, కౌన్సెలింగ్ చేశామని.. 149 హాట్ స్పాట్‌లు గుర్తించి నిఘా ఉంచామని వివరించారు. సీసీ కెమెరాల ఏర్పాటు, డ్రోన్ల వినియోగం, వాహన తనిఖీలు, నాకా బందీ చేశామన్నారు. ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ మాట్లాడుతూ.. 34 రోజుల పాటు మహమ్మారిపై పోరాటం చేసిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో ఎక్కడా ఇలాంటి కార్యక్రమం నిర్వహించలేదని కొనియాడారు. కార్యక్రమ సంధానకర్త అడ్మిన్ డీసీపీ కె.జి.వి.సరిత మాట్లాడుతూ.. పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో ఈ యాత్ర 510 కిలోమీటర్లు పూర్తి చేసుకుందన్నారు. ప్రజలు, పోలీస్ అధికారులు, సిబ్బంది, మహిళలు ఘనంగా స్వాగతం పలికారని తెలిపారు. ర్యాలీగా ఏఆర్ గ్రౌండ్స్‌కు చేరుకున్నారు. డీసీపీలు కృష్ణప్రసన్న, షిరీన్‌బేగం, కృష్ణకాంత్ పటేల్, తిరుమలేశ్వరరెడ్డి, ఉదయరాణి, బి.లక్ష్మీనారాయణ, ఈగల్ ఎస్పీ నగేష్ ఏసీపీలు, సీఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



బెలూన్లను ఎగరేస్తున్న సీపీ రాజశేఖరబాబు, ఈగల్ ఐజీ రవికృష్ణ, డీసీపీలు సరిత, షిరీన్ బేగం, కృష్ణప్రసన్న, తిరుమలేశ్వరరెడ్డి, లక్ష్మీనారాయణ, ఉదయరాణి తదితరులు



హారతులు ఇస్తున్న యువతులు

కోయంబత్తూరు నుంచి ఓఏబీ సీసాలు

☛ ఒక్కో దానికి రూ.1.79 చెల్లించిన జనార్దనరావు
☛ నకిలీ జీఎస్టీ నంబరుతో రవాణా.. కస్టడీలో వెల్లడించిన సెంథిల్

ఈనాడు, అమరావతి

డిజైన్ పరంగా సంక్లిష్టంగా ఉండే ఓల్డ్ అడ్మిరల్ బ్రాండీ (ఓఏబీ) సీసాల తయారీ కోసం అంతర్జాలంలో వెతికి మరీ జనార్దనరావు (ఏ1) తమిళనాడులోని కోయంబత్తూరులో శ్రీవారు ఇండస్ట్రీస్‌ను ఎంపిక చేశాడు. స్థానికంగా ఏ పరిశ్రమలోనూ తయారు చేసేవారు లేకపోవడంతో ఆర్డర్ ఇచ్చేశాడు. ఈ పరిశ్రమ యజమాని సెంథిల్‌ను (ఏ22) సంప్రదించి ఓఏబీ బ్రాండ్‌కు నకిలీ సీసాలను ఏ1 తెప్పించాడు. దీనికి నకిలీ జీఎస్టీ నంబరు ఉపయోగించాడు. నకిలీ మద్యం కేసులో రెండు రోజుల కస్టడీలో భాగంగా ఎక్సైజ్ పోలీసులు సెంథిల్‌ను ఆదివారం విజయవాడ కారాగారం నుంచి అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వాసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించిన అనంతరం ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో కీలక అంశాలను వెల్లడించాడు.

శ్రీనివాసరెడ్డి చేతులెత్తేయడంతో..

ఓఏబీ సీసాల తయారీకి మొదట్లో సూరంపల్లి పారిశ్రామికవాడలో పెట్ బాటిల్స్ కర్మాగారాన్ని నడుపుతున్న శ్రీనివాసరెడ్డి (ఏ11)ని అద్దేపల్లి సోదరులు సంప్రదించారు. తన కంపెనీలో ఆ మోడల్ సీసాలు తయారు చేయడం కుదరదని చెప్పడంతో ప్రణాళికను తాత్కాలికంగా వాయిదా వేశారు. బెంగళూరుకు చెందిన బాలాజీ (ఏ3)ని సంప్రదించిన మీదట అంతర్జాలంలో వెతికి శ్రీవారి ఇండస్ట్రీస్‌లో ఇటువంటి సీసాలను తయారు చేస్తారని తెలుసుకున్నారు. సెంథిల్‌ను బాలాజీ పరిచయం చేసుకున్నాడు.

అనుమతి ఉందని నమ్మించి..

జనార్దనరావుకు మద్యం తయారీ చేసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి ఉందని.. సీసాలను తయారు చేసి సరఫరా చేయాలని నమ్మించారు. దీనికిగాను నకిలీ జీఎస్టీ నంబరును సెంథిల్‌కు పంపించారు. అసలుకు ఏమాత్రం తీసిపోని విధంగా తయారు చేసి అందిస్తానని హామీ ఇవ్వడంతో సెంథిల్‌కు ఆర్డర్ ఇచ్చారు. ఒక్కో సీసాకు రూ. 1.79 వెచ్చించారు. ఒక్కో విడతకు 99,840 సీసాలు చొప్పున రెండు విడతల్లో ఇబ్రహీంపట్నం, ములకలచెరువుకు సెంథిల్ రవాణా చేశాడు. సీసాలను సరఫరా చేసినందుకు ఏ22కు జనార్దనరావు రూ. 3.57లక్షలను నిందితుడు రవికుమార్ ద్వారా చెల్లించాడు. నకిలీ జీఎస్టీ నంబరు నిజమైనదిగా నమ్మి తాను సీసాలు రవాణా చేశానని, దీని వల్ల తాను కేసులో ఇరుక్కున్నానని సెంథిల్ ఆవేదన వ్యక్తం చేశాడు.

నేడు కలెక్టరేట్‌లో రెవెన్యూ క్లినిక్

ఇద్దరే ఆర్డీవోలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే జిల్లా స్థాయి 'రెవెన్యూ క్లినిక్' కార్యక్రమంలో ముగ్గురు ఆర్డీవోలకుగాను, ఈ సారి ఇద్దరు మాత్రమే పాల్గొనే పరిస్థితి ఏర్పడింది. విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్యను బదిలీ చేసి, జీఏడీలో రిపోర్టు చేయాలనే ఆదేశాలతో ఖాళీ అయింది. నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణకు విజయవాడ డివిజను బాధ్యతలను అప్పగించారు. ఈ కారణంగా నందిగామ, విజయవాడ డివిజన్ల తరపున ఆర్డీవో ఒకరే హాజరుకానున్నారు. రెవెన్యూ క్లినిక్‌లో తిరువూరు ఆర్డీవో కె.మాధురి, నందిగామ ఆర్డీవో బాలకృష్ణ ఉంటారు. జేసీ నేతృత్వంలో జరిగే ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు, తహసీల్దార్లు, రెవెన్యూ సంబంధిత అధికారులు పాల్గొంటున్న విషయం తెలిసిందే.

పేద గుండెకు.. పెద్ద భరోసా

ప్రభుత్వాస్పత్రిలో పెరిగిన యాంజియోగ్రామ్‌లు

ఈనాడు, అమరావతి

విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలోని కార్డియో వాస్కులర్ కేర్ విభాగంలో రూ.లక్షల విలువైన గుండె వైద్యం పేదలకు ఉచితంగా అందుతోంది. గుండె సంబంధిత సమస్యలతో ఆస్పత్రి ఓపీకి వచ్చేవారి సంఖ్య నిత్యం 300కు పైగా ఉంటోంది. ఈ నేపథ్యంలోనే కార్పొరేట్ ఆస్పత్రుల తరహాలో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో పీపీపీ విధానంలో కేథ్‌ల్యాబ్ ఏర్పాటు చేశారు. ప్రతి నెలా వందల మందికి యాంజియోగ్రామ్ చేస్తున్నారు. అవసరమైన వారికి స్టంట్‌లను ఉచితంగా వేస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఒక్కో స్టంట్‌కు కనీసం రూ. 1.5లక్షల వరకూ ఖర్చవుతోంది.

✪ ప్రభుత్వ ఆస్పత్రిలోని కార్డియో వాస్కులర్ కేర్ విభాగం ప్రారంభించిన తర్వాత ఇప్పటివరకూ 11వేల యాంజియోగ్రామ్స్, 5 వేలకు పైగా స్టంట్‌లను రోగులకు ఉచితంగా వేశారు. వాస్తవంగా ఇంతకు రెట్టింపు స్థాయిలోనే శస్త్రచికిత్సలు చేయాల్సి ఉన్నా చాలా మంది పేద, మధ్యతరగతి రోగులకు ఈ ఖరీదైన వైద్య సేవలపై అవగాహన లేదు. దీంతో గుండెకు స్టంట్‌లను వేయించుకునేందుకు ప్రైవేటు ఆసుపత్రులపై ఆధారపడుతూ రూ. లక్షలు ఖర్చు చేస్తున్నారు.



శస్త్రచికిత్స జరిగిన మహిళతో మాట్లాడుతున్న డాక్టర్ విజయ్ చైతన్య

క్యాథ్‌ల్యాబ్‌లో అందే సేవలివి..

★ యాంజియోగ్రామ్
★ అత్యాధునిక ఆప్టికల్ కొహెరెన్స్ టెమోగ్రఫీ
★ స్టంట్‌లు, పేజ్ మేకర్లు వేయడం
★ రోటాబ్లేషన్ విధానంలో కరోనరీ ఆర్టరీస్‌లోకి ఓ వైరును పంపి కరోనరి యాంజియోప్లాస్టిని చేసి అడ్డుపడిన కాల్షియంను తొలగించే చికిత్స

ప్రతి నెలా 250కు పైగానే..

కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు సహా చుట్టుపక్కల జిల్లాల నుంచి విజయవాడకు ప్రస్తుతం 250 మందికి పైగా రోగులు యాంజియోగ్రామ్, స్టంట్‌లను వేయించుకునేందుకు వస్తున్నారు. వీటిలో కనీసం 50 నుంచి 70 వరకు స్టంట్‌లు ఉంటున్నాయి. ఒక్కో శస్త్రచికిత్సకు ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తోంది. వైద్య సేవ కార్డు లున్న వారికి కచ్చితమైన ప్రమాణాలు పాటిస్తూ నాణ్యమైన స్టంట్‌లను వేస్తున్నారు. ప్రస్తుతం కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో తక్కువ ధరకే వైద్యం అందిస్తున్నట్లు ప్రచారం చేస్తూ నాణ్యత లేని బేర్ మెటల్ స్టంట్‌లు వేస్తున్నారు. వీటికి కూడా కనీసం రూ.లక్ష వసూలు చేస్తున్నారు. గుండె సమస్యతో ప్రైవేటు ఆస్పత్రులకు వెళితే.. 2డీ ఎకో, ఈసీజీ చేశాక.. ఏ చిన్న ఇబ్బంది ఉన్నట్లు తేలినా యాంజియోగ్రామ్ చేస్తున్నారు. ఈ పరీక్షకు రూ. 15వేల వరకూ తీసుకుంటున్నారు. ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా చేసి బస్సు ఛార్జీలనూ ఇచ్చి పంపిస్తున్నారు.

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో ఈ నెల 2వ తేదీ సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్టు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్/ నగరపాలక సంస్థ, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. విజయవాడ కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌లో వినతి పత్రాలు ఇవ్వొచ్చని చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లా స్థాయి రెవెన్యూ క్లినిక్ అందుబాటులో ఉంటుందని వివరించారు.

మీకోసం వెబ్‌సైట్‌లోనూ..

★ ప్రజలు తమ సమస్యల అర్జీలను మీకోసం వెబ్‌సైట్ meekosam.ap.gov.in లోనూ దాఖలు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ఇందులో అర్జీల స్థితి, సంబంధిత సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నంబరుకు నేరుగా ఫోన్ చేయవచ్చని తెలిపారు.

అత్యవసర సమాచారం.. ఇక సులభతరం

ఇబ్రహీంపట్నం గ్రామీణం (గుంటుపల్లి), న్యూస్‌టుడే

విజయవాడ జాతీయ రహదారుల సంస్థ పరిధిలో విజయవాడ- హైదరాబాద్, ఇబ్రహీంపట్నం- ఛత్తీస్‌గఢ్ జాతీయ రహదారులపై ప్రయాణం చేసేటప్పుడు అత్యవసర సేవల సమాచారానికి ఇకపై ఇబ్బందులు పడక్కర్లేదు. వాహన మరమ్మతులు, టైర్ పంక్చర్ దుకాణాలు, పెట్రోలు బంకులు, ఆసుపత్రులు తదితర వివరాలను ఎవరిని అడగాల్సిన అవసరం లేదు. దీనికోసం జాతీయ రహదారులపై క్యూఆర్ కోడ్ సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.



ఇబ్రహీంపట్నం భీమరాజుగుట్ట వద్ద క్యూఆర్ సైన్‌బోర్డు

ఏమేం తెలుసుకోవచ్చు.. అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లు, హైవే నంబరు, దాని పొడవు, చైనేజ్ (స్థాన గుర్తులు), ఎన్‌హెచ్‌ఏఐ ఫీల్డ్ కార్యాలయం, గస్తీ, టోల్ ప్లాజాలు, పెట్రోలు బంకులు, ఆసుపత్రులు, పోలీసు స్టేషన్లు, రెస్టారెంట్లు, మరుగుదొడ్లు, విశ్రాంతి గదుల వివరాలను తెలుసుకోవచ్చు.

రాత్రి సమయాల్లోనే అధికం... : జాతీయ రహదారులపై రాత్రివేళ ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆ సమయంలో ఎవరికి సమాచారం అందించాలో తెలియక బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తగిన సమాచార వ్యవస్థ లేక తీవ్రజాప్యంతో సకాలంలో సేవలు అందక అవస్థలకు గురవుతున్నారు. ఇటువంటి వారికి జాతీయ రహదారుల సంస్థ ప్రతి కిలో మీటరుకు రోడ్డుకు ఇరువైపులా ఒకటి చొప్పున ఏర్పాటు చేస్తున్న క్యూఆర్ కోడ్ సైన్ బోర్డులు ఎంతో ప్రయోజనకరం. ★ జిల్లా పరిధిలోని ముఖ్య ప్రదేశాలు, బ్లాక్ స్పాట్లు, ముఖ్య కూడళ్లు ఇతర కీలక ప్రదేశాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్‌హెచ్‌ఏఐ సంస్థ అధికారి సుబ్బారావు తెలిపారు.

అగ్నికి ఆజ్యం!

ఈనాడు, అమరావతి

విజయవాడ నగరం, చుట్టుపక్కల ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు పెరుగుతున్నాయి. 2025లో నాలుగు అగ్ని ప్రమాదాలు కలకలం రేపాయి. వేల మంది జనం వచ్చే ప్రైవేటు ఎగ్జిబిషన్లలోనూ నిర్లక్ష్యం కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతూ ఆందోళన రేకెత్తిస్తున్నాయి. సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, అధికారుల పర్యవేక్షణ లోపం, విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ లాంటివి కారణంగా మారుతున్నాయి. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు అక్కడో ఎగ్జిబిషన్, ప్రదర్శన పెట్టేందుకు మున్సిపాలిటీ, పోలీసు, ఫైర్ విభాగాల అనుమతులిచ్చేస్తున్నాయి. విద్యాధరపురం లేబర్‌కాలనీ మైదానం, పున్నమిఘాట్, శాతవాహన కళాశాల సహా నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడో ప్రదర్శన పుట్టుకొస్తోంది. గతేడాది లేబర్‌కాలనీ మైదానంలోని ఎగ్జిబిషన్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఇదే ఎగ్జిబిషన్‌లో అంతకు ముందు ఏడాది కూడా అగ్ని ప్రమాదం జరిగి కృష్ణలంకకు చెందిన ఓ యువకుడు చనిపోయాడు. అయినా నిర్లక్ష్యంతో మళ్లీ అనుమతి ఇచ్చారు. మళ్లీ ప్రమాదం జరిగింది.

అడ్డగోలు అనుమతులతో ప్రమాదాలు

విచ్చలవిడిగా ఉల్లంఘనలు..

★ స్టాళ్ల మధ్య కనీసం ఐదారు అడుగుల దూరం ఉండాలి. ★ అగ్నిమాపక శకటం వెళ్లి వచ్చేలా నాలుగు వైపులా దారులుండాలి. ఈ నిబంధనలు పాటించడం లేదు. ★ అసలు రెండో గేటే ఉండడం లేదు. ఒక ప్రధాన మార్గం ఏర్పాటు చేసి.. దానిలోంచే వెళ్లడం, రావడం. ఒకవేళ ప్రధాన ద్వారం వైపు ప్రమాదం జరిగితే.. అందరూ లోపల ఉండిపోవాల్సిందే.

గతేడాది జరిగిన ప్రమాదాలు..

☛ 12.02.25: విజయవాడ సితార గ్రౌండ్‌లోని కశ్మీరి జలకన్య ఎగ్జిబిషన్‌లోనూ భారీ అగ్నిప్రమాదం జరిగింది. గ్యాస్ సిలిండర్లు పేలిపోయి ఎగ్జిబిషన్‌లోని దుకాణాల పైకప్పులు ఎగిరిపోయాయి. ఇది మధ్యాహ్నం వేళలో జరగడంతో సందర్శకులు లేరు. ☛ 04.09.25: ఇబ్రహీంపట్నం మండలం జూపూడి గ్రామ శివార్లలోని భీమేశ్వరకాలనీ భారీ పేలుడు ధాటికి వణికిపోయింది. పేలుడు ధాటికి భవనం సిమెంట్ గోడలు ముక్కముక్కలైపోయి. ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఇంటిలో ఉన్న దీపావళి మందుగుండు సామగ్రి, అక్కడే ఉన్న వెల్డింగ్ సిలిండర్ కలిపి ఒకేసారి పేలడంతో భారీ ప్రమాదం సంభవించింది. ☛ 06.10.25: ఎనికేపాడులోని ఓ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల గోదాములో భారీ అగ్నిప్రమాదం జరిగింది. రూ. 5కోట్లకు పైగా విలువైన ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు కాలి బూడిదయ్యాయి. ☛ 19.10.25: విజయవాడ రామరాజ్యనగర్‌లోని టిన్నర్ డిపోలో అర్ధరాత్రి సమయంలో పెద్ద అగ్నిప్రమాదం జరిగింది. షణ్ముక శ్రీనివాస్ అనే వ్యక్తి చనిపోగా మరొకరు తీవ్రంగా గాయపడ్డాడు.

విజయవంతంగా సీజేఐ అమరావతి పర్యటన


జస్టిస్ సూర్యకాంత్‌కు వీడ్కోలు పలుకుతున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: అమరావతి పర్యటనలో భాగంగా భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆదివారం మధ్యాహ్నం 1:35 గంటలకు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్నారు. తిరుపతి నుంచి ప్రత్యేక విమానంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్ర, జస్టిస్ నరసింహం, జస్టిస్ ఎస్ వీఎన్ భట్టి, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీతో కలిసి వచ్చిన సీజేఐకు రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో అమరావతి బయలుదేరి వెళ్లారు. తిరిగి రాత్రి 8 గంటలకు విమానాశ్రయం చేరుకున్న సీజేఐ ప్రత్యేక విమానంలో దిల్లీకి తిరుగు ప్రయాణమయ్యారు. విమానాశ్రయంలో సీఎం చంద్రబాబు, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ఇతర న్యాయమూర్తులు సీజేఐకు ఘన వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ దొనాడి రమేష్, జస్టిస్ ఎన్.జయసూర్య, జస్టిస్ మహేశ్వరరావు కుంచెయం, జస్టిస్ టీసీడీ శేఖర్, కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి, కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, జేసీ నవీన్, విమానాశ్రయ డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి, ప్రొటోకాల్ డైరెక్టర్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు అండగా చంద్రబాబు: అనురాధ

పటమట, న్యూస్‌టుడే : రాష్ట్రంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, సూపర్‌వైజర్లకు సీఎం చంద్రబాబు అండగా నిలిచారని తెదేపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్‌వాడీల వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలు, ఒకటో తేదీనే జీతాల చెల్లింపు వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నది గత తెదేపా ప్రభుత్వమేనని గుర్తు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు రెండు సార్లు వేతనాలు పెంచి.. వారి గౌరవాన్ని కాపాడిన చరిత్ర చంద్రబాబుదేనని పేర్కొన్నారు. మినీ అంగన్‌వాడీలను పూర్తి స్థాయి కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయడం, వేలాది మందికి ఉద్యోగోన్నతులు కల్పించడం, స్మార్ట్‌ఫోన్ల పంపిణీ, మౌలిక సదుపాయాల మెరుగుదల.. అంగన్‌వాడీల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు.

నర్సింగ్ కోర్సుకు నీట్ నిబంధనాలు

న్యూస్‌టుడే, ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం


విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం

నర్సింగ్ కోర్సు ప్రవేశాలకు నీట్ యూజీ రాయాలన్న నిబంధన పేద విద్యార్థినులకు శాపంగా మారింది. అదీ మార్చి ఎనిమిదో తేదీలోగా ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించడంతో గ్రామీణ విద్యార్థినులు ఈ కోర్సుకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడింది. దరఖాస్తుకు గడువు దగ్గరపడటం, ఈ నిబంధనలపై ప్రచారం లేకపోవడం ముప్పుగా పరిణమిస్తోంది. సాధారణంగా ఉన్నత చదువులకు వెళ్లలేని పేద కుటుంబాల బాలికలకు బీఎస్సీ నర్సింగ్ కోర్సు ఓ వరం. మారుమూల పల్లెల నుంచి ఎందరో ఈ కోర్సుల్లో చేరుతుంటారు. ఏఎన్ఎం, జీఎన్ఎం డిప్లమోలు చేసిన వారు కూడా ఇందులో చేరవచ్చు. ఇంటర్‌లో బైపీసీ పూర్తి చేసిన తర్వాత బీఎస్సీ నర్సింగ్ నాలుగేళ్ల డిగ్రీ కోర్సు, ఫిజియోథెరపీ (బీపీటీ) అందుబాటులో ఉండేవి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎందరో విద్యార్థినులు ఈ కోర్సుల్లో చేరేవారు. కొన్నేళ్ల తర్వాత ఎంసెట్ నిబంధన తెచ్చి అందులో ర్యాంకుల ఆధారంగా సీట్ల భర్తీ చేపట్టారు. రెండేళ్లనాడు ప్రవేశాలు కల్పించే విశ్వవిద్యాలయమే ప్రత్యేక పరీక్ష నిర్వహించి ప్రవేశాలు చేపట్టాలని నర్సింగ్ కౌన్సిల్ ఆదేశించింది. విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ జారీ చేసి దరఖాస్తులకు ఆహ్వానించగా ఆశించినంతగా అభ్యర్థుల నుంచి స్పందన లేదు. రెండు సార్లు పొడిగించిన తర్వాత దరఖాస్తుదారుల సంఖ్య పెరిగింది. తాజాగా ఈ విద్యా సంవత్సరం నుంచి జాతీయ స్థాయిలో ఎంబీబీఎస్/బీడీఎస్ కోర్సుల నిమిత్తం రాసే నీట్ యూజీ ప్రవేశ పరీక్ష అర్హత ఉండాలనే నిబంధన శాపమవుతోంది. నీట్ అర్హత నిబంధనలు మారుమూల ప్రాంతాల బాలికలకు తెలిసేలా ప్రచారం లేకపోవడంతో చాలా మంది ఈ విద్యా సంవత్సరం చేరే అవకాశాన్ని కోల్పోగలరన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే ప్రచారం చేపట్టాల్సిన ఆరోగ్య విశ్వవిద్యాలయం వెనకడుగు వేస్తోంది. ఫిజియోథెరపీ డిగ్రీకి సంబంధించి కూడా విజయవాడ పాత ఆస్పత్రిలోని ఏ.పి. స్టేట్ ఎలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్ కౌన్సిల్ పట్టించుకోవడం లేదు. వేలల్లో సీట్లు మిగిలిపోయే పరిస్థితి ఉందంటున్నారు.

గత ఐదేళ్లలో సీట్ల భర్తీ ఇలా..

విద్యా సంవత్సరం	కళాశాలలు	మొత్తం సీట్లు	మిగిలినవి
2021-22	179	9315	546
2022-23	195	11869	1980
2023-24	237	12560	2876
2024-25	253	13716	2125
2025-26	266	14765	4739

అంతా గందరగోళమే

రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లోని బాలికలకు ప్రవేశాల ప్రక్రియను తెలియపర్చడంలో విఫలమయ్యారు. ఏటా ఆగస్టులో ప్రవేశాలుంటాయని భావిస్తున్నారు. ఎన్టీపీ అర్థాంతరంగా దేశమంతా ఒకే ప్రక్రియ అన్నట్లు నీట్ యూజీ ప్రవేశ పరీక్ష అర్హత నిబంధన విధించింది. జాతీయ స్థాయిలో ఈ పరీక్షకు దరఖాస్తు ప్రక్రియ ఏవిధంగా ఉంటుందో గ్రామీణ ప్రాంతాల వారికి అవగాహన ఉండదు. దీని దృష్ట్యా గడువును మరింత పెంచితే పేద బాలికలకు వెసులుబాటుగా ఉంటుంది.

- అర్జునరావు, ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ కళాశాలల గౌరవ అధ్యక్షుడు

వైభవంగా వేణుగోపాలుని శేషవాహన మహోత్సవం


నిత్య హోమం వద్ద అధికారులు, పాలకవర్గ సభ్యులు

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే : నెమలి వేణుగోపాల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామి వారికి శేషవాహన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. యాగశాలలో జరిగిన నిత్య హోమం, నవ కుంభారోహణంలో పాలకవర్గ సభ్యులు, ఉభయదాతలు పాల్గొన్నారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక రథంలో శేష వాహనంపై గ్రామోత్సవం చేశారు. ఆలయ ఉప ప్రధానార్చకుడు తిరునఘరి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో గాంధీ బొమ్మ కూడలి వద్ద ఎదురుకోల(వధూవరుల పరిచయం) ఉత్సవం నిర్వహించారు. పాలకవర్గ అధ్యక్షురాలు కె.శశిరేఖ, సహాయ కమిషనర్ ఎన్.సంధ్య పర్యవేక్షించారు.

స్వామి కల్యాణం నేడు : వేణుగోపాల స్వామి తిరు కల్యాణం సోమవారం రాత్రి 9 గంటలకు ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారని భావించి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. దాతల వితరణతో అన్నప్రసాదం పంపిణీ చేస్తారు.

ఎమ్మెల్యేలకు ఆహ్వానం : స్వామి వారి తిరు కల్యాణంలో పాల్గొనేందుకు నెమలి గుడికి రావాలని కోరుతూ జగ్గయ్యపేట, మైలవరం, నందిగామ, ఖమ్మం జిల్లా వైరా ఎమ్మెల్యేలు శ్రీరాం రాజగోపాల్, వసంత కృష్ణప్రసాద్, తంగిరాల సౌమ్య, రాందాస్ నాయక్‌కు తెదేపా నాయకులు వడ్లమూడి రాజశేఖర్, బెల్లం మధుసూదనరావు ఆధ్వర్యంలో ఆదివారం ఆహ్వాన పత్రాలు అందజేశారు.

మహిళలు రాజకీయంగా ఎదగాలి


పురస్కారాలు అందజేస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, గజల్ శ్రీనివాస్, రమావతి

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : మహిళలు రాజకీయాలపై అవగాహన పెంచుకుని ఉన్నత పదవులు అధిరోహించాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవనంలో విశ్వ సాహితీ కళా వేదిక వ్యవస్థాపకురాలు కొల్లి రమావతి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన మహిళలకు 'స్త్రీ శక్తి- 2026' పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథులుగా భాగ్యలక్ష్మి, గజల్ మాస్ట్రో గజల్ శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షుడు జి.వి.పూర్ణచందు హాజరయ్యారు. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. ఇంటికే పరిమితం కాకుండా పలువురు మహిళలు రాజకీయ రంగంలో రాణిస్తున్నారని, అలాగే ప్రతి మహిళా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. వక్తలు మాట్లాడుతూ. . స్త్రీ తన రక్తం ధారపోసి మరొకరికి జీవం పోస్తుందని, అలాంటి ఆమెను ప్రతి ఒక్కరూ దైవంగా కొలవాలని కోరారు. ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో వారు ముందుంటున్నారని పేర్కొన్నారు. అతివల ఆశయాలు, ఆకాంక్షలు, అభిరుచులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ప్రోత్సహిస్తూ.. వారి ఎదుగుదలకు దోహదపడాలని పేర్కొన్నారు. సుమారు వంద మంది మహిళలకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జి.ఆర్.కె.పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్ళ నారాయణరావు, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, విశ్వ సాహితీ కళా వేదిక గౌరవ అధ్యక్షుడు రంగిశెట్టి రమేష్, మల్లెతీగ సంపాదకులు కలిమిశ్రీ, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జి.భవాని తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లంపై పట్టు.. ఉన్నతికి మెట్టు


ప్రభుత్వ ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న రామేశ్వర్‌గౌడ్

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : ఆంగ్లం వస్తే ప్రపంచంలో ఎక్కడికైనా వెళ్లొచ్చు.. అలాంటి భాషపై ముందుగా ప్రభుత్వ ఉపాధ్యాయులు పట్టు సాధించాలని హైదరాబాద్‌లోని విల్ టు కెన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ డైరెక్టర్ రామేశ్వర్ గౌడ్ అన్నారు. గురువులు పూర్తిగా నేర్చుకొని... తర్వాత విద్యార్థులకు నేర్పించి వారి ఉన్నతికి తోడ్పడాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించలేకపోతున్నారు. ఆ విషయాన్ని గుర్తించి.. వారికి పాఠాలు బోధించే ఉపాధ్యాయులకు ఉచితంగా శిక్షణ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు రామేశ్వర్‌గౌడ్ తెలిపారు. ఆదివారం నగరంలోని బిషప్ అజరయ్య బాలికోన్నత పాఠశాలలో గురువులకు ఆయన శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తెలుగులో ఎలాగైతే స్పష్టంగా, అనర్గళంగా మాట్లాడుతున్నారో... ఆంగ్లంలో కూడా అలాగే మాట్లాడాలనేది తన లక్ష్యమని అన్నారు. విద్యాశాఖ సహకారంతో ఇప్పటివరకు రాష్ట్రంలోని 25 వేల మంది ఉపాధ్యాయులకు ఉచితంగా శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు. ప్రస్తుతం రోజూ 2500 మంది గురువులకు ఆన్‌లైన్‌లో కూడా తర్ఫీదునిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థి భాషపై పట్టు సాధించాలంటే పాఠశాల స్థాయిలోనే నేర్చుకోవాలని అన్నారు. ఉపాధ్యాయుల సందేహాలను నివృత్తి చేశారు. సమగ్రశిక్షా జిల్లా ఏఎంఓ ఎస్.అశోక్‌బాబు, ఏఏఎంఓ సీహెచ్ శిరీషరాణి తదితరులు పాల్గొన్నారు. రామేశ్వర్‌గౌడ్‌ను ఉపాధ్యాయులు సత్కరించారు.

నేటి నుంచి అగ్రిగోల్డ్ బాధితుల నిరవధిక నిరాహార దీక్షలు

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : అగ్రిగోల్డ్ బాధితులకు ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి.. సత్వర న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నుంచి ధర్నా చౌక్‌లో తలపెట్టిన రిలే, నిరవధిక నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని ఏపీ అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన దాసరి భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. బాధితుల సమస్యల పరిష్కారంపై మరోసారి అసోసియేషన్ ఉద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ ఏడాది జనవరి నాటికి తమ అసోసియేషన్ చేపట్టిన ఉద్యమం పుష్కరకాలానికి చేరిందని గుర్తుచేశారు. అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వ అలసత్వం, యాజమాన్య మోసపూరిత విధానాలను నిరసిస్తూ ఈ నెల 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు రిలే దీక్షలు, 5వ తేదీ నుంచి నిరవధిక నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో బాధితులకు కంపెనీ ఆస్తులు అమ్మి డబ్బులు చెల్లిస్తామని ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా ఛైర్మన్ అవ్వా వెంకట రామారావు, సీతారామరావులు విజ్ఞత ప్రదర్శించి.. బాధితులకు సొమ్ము చెల్లించడానికి సహకరించాలని డిమాండ్ చేశారు. నిరవధిక నిరాహార దీక్షలో అగ్రిగోల్డ్ బాధితులు భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు అఫ్సర్, కె.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు


ఐక్యత చాటుతున్న సత్యనారాయణరెడ్డి, రమేష్, అనుగ్రహ ప్రసాద్, రామకృష్ణ తదితరులు

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు చేయాలని ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు డి.సత్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం గాంధీనగర్‌లోని ఎన్జీవో భవన్‌లో జిల్లా ఐకాస నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన ఛైర్మన్‌గా సత్యనారాయణరెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ శాఖలు, సంఘాలు, నాయకులతో కార్యవర్గం ఏర్పాటైన నూతన ఐకాస ఉద్యోగుల పక్షాన నిర్విరామంగా పోరాడేందుకు సిద్ధంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వంతో చర్చించి న్యాయమైన డిమాండ్ల సాధనకు కృషి చేస్తామని చెప్పారు. ఐకాస కో ఛైర్మన్‌లుగా పి.రమేష్, జి.అనుగ్రహ ప్రసాద్, రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా జి.నారాయణరావు, ఎస్.కె.నవాబ్‌జానీ, కె.ప్రభాకర్, జి.అజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.డి.ఖాసీం, కార్యదర్శిగా జి.రామకృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా ఎం.అక్కిరాజు, సుందరయ్య, షమాబేగం, రవీంద్ర, పి.నాగరాజు, జి.సుదర్శనరావు, బి.సతీష్ కుమార్ ఎన్నికయ్యారు. పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

విద్యుత్తు టౌన్ డివిజన్ ఈఈ బాధ్యతల స్వీకరణ


కొండలరావు

సూర్యారావుపేట : విద్యుత్తు విజయవాడ టౌన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా కె.వై.కొండలరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఏపీసీపీడీసీఎల్ పరిధిలో శనివారం రాత్రి పలువురు అధికారులకు పదోన్నతులు లభించాయి. బదిలీల్లో భాగంగా విజయవాడ టౌన్ డివిజన్ ఈఈగా కొండలరావును నియమించారు. ఆయన గతంలో కానూరు, గుణదల, ఇబ్రహీంపట్నం సబ్ డివిజన్లలో డిప్యూటీ ఈఈగా పని చేశారు. బాపట్ల సర్కిల్‌లో విజిలెన్స్ ఈఈగా పని చేసి ఎన్టీఆర్ సర్కిల్‌కు బదిలీ అయ్యారు. ఎన్టీఆర్ విద్యుత్తు సర్కిల్‌లో ఎంఆర్‌టీ ఈఈగా పని చేస్తూ.. టౌన్ డివిజన్‌కు బదిలీ అయ్యారు. ఆదివారం సూర్యారావుపేట సర్కిల్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ని పలువురు అధికారులు కలిసి అభినందనలు తెలియజేశారు.

ఈఈ రవీంద్రబాబుకు ఉద్యోగోన్నతి.. విజయవాడ టౌన్ డివిజన్ ఈఈగా పని చేస్తున్న రవీంద్రబాబుకు సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. అనంతరం ఆయన్ని కృష్ణా సర్కిల్ ఎస్ఈగా బదిలీ చేస్తూ సీఎండీ పి.పుల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

కార్యరూపం దాల్చని ఆభరణాలు.. వాహన ప్రదర్శనశాల

న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి


దుర్గమ్మ బంగారు ఆభరణాలు

ఇంద్రకీలాద్రిపై ఆది దంపతుల ఆభరణాలు, వాహనాల ప్రదర్శనశాల ప్రతిపాదన ఏడేళ్లుగా కార్యరూపం దాల్చలేదు. దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులు గణనీయంగా పెరుగుతున్నారు. దసరా, కార్తిక మాసం, మహాశివరాత్రి పర్వదినాలకు గంగా, పార్వతీ సమేత దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల మూలవిరాట్‌లతోపాటు ఉత్సవమూర్తులకు ప్రత్యేక ఆభరణాలతో అలంకరించి చేపట్టే నగరోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. తరువాత ఆభరణాలను లాకర్లలో భద్రపరుస్తారు. దసరా ఉత్సవాల్లో అమ్మవారిని సరస్వతీ దేవి, లక్ష్మీదేవి, రాజరాజేశ్వరి దేవిగా అలంకరిస్తారు. బంగారు వీణ, అష్ట భుజాలు, అభయహస్తాలు, వజ్రకిరీటాలు, కాసుల హారాలు, స్వర్ణ కవచం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఆదిదంపతుల నగరోత్సవానికి సైతం ప్రత్యేక వాహన సేవలు ఉంటాయి. రావణ, నంది, సింహ, పల్లకి, వెండి రథం, హంస వాహన సేవలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటాయి. వాటిని ప్రతి రోజూ వీక్షించేలా ప్రదర్శన శాల ఏర్పాటు చేయాలని దుర్గగుడికి తొలి ఐఏఎస్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన సూర్యకుమారి ప్రతిపాదించారు. రాజధాని నగరంలో కీలకంగా మారిన దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో తిరుమల తరహాలో ఆభరణాలు, సేవల వాహనాలతో ప్రదర్శనశాల ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

కమ్యూనిస్టు పార్టీకి ప్రజలు అండగా నిలవాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ


బ్రహ్మానందరెడ్డి నగర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న రామకృష్ణ, శంకర్, కోటేశ్వరరావు తదితరులు

చుట్టుగుంట(విజయవాడ), న్యూస్‌టుడే: ప్రజా ఉద్యమాల కమ్యూనిస్టు పార్టీకి ప్రజలు అండగా నిలవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఆదివారం విజయవాడ బ్రహ్మానందరెడ్డి నగర్‌లో నిర్వహించిన 'గడప గడపకు సీపీఐ' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రామకృష్ణ మాట్లాడుతూ.. 'కమ్యూనిస్టు పార్టీకి ప్రజలు ఆర్థిక సాయం అందించి సమస్యలపై నిరంతరం పోరాడే శ్రేణులకు ప్రోత్సాహాన్ని అందించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై అందరూ సమష్టిగా పోరాడాల్సిన ఆవశ్యకత ఉంది. పోలవరం వంటి అనేక సాగునీటి ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేయాలి. ఇళ్లు లేని నిరుపేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం.. ఆ దిశగా ఎటువంటి కార్యాచరణ చేపట్టలేదు. అందుకు నిరసనగా అనేక ఉద్యమాలు చేసిన ఘనత సీపీఐకే దక్కుతుంది. అటువంటి పార్టీకి ప్రజలు విరివిగా విరాళాలు ఇచ్చి తోడ్పాటునందించాలి' అని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ... నగర సమగ్రాభివృద్ధిలో కమ్యూనిస్టుల పాత్ర ఎంతో ఉందని అన్నారు. స్థానిక నాయకత్వం ప్రజా సమస్యలను అధ్యయనం చేసి పరిష్కారానికి కృషి చేయాలని, ఫలితంగా పార్టీ బలోపేతం అవుతుందని అన్నారు. నాయకులు నక్కా వీరభద్రరావు, అప్పురబోతు రాము, మూలి సాంబశివరావు, ఇజ్జాడ లక్ష్మి, పడాల కనకారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కెనోయింగ్.. కయాకింగ్ పోటీలు


సీనియర్ సి-1 విజేతలతో త్రిభువన్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక పున్నమి ఘాట్‌లో జరిగిన అస్మిత ఖేలో ఇండియా కెనోయింగ్, కయాకింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. ☛ సీనియర్ మహిళల కె-2 (500 మీ.)లో ఎన్.పూర్ణ, ఎన్.గాయత్రి జోడీ ప్రథమ, ఎం.చైతన్య, పి.శరణ్య జోడీ ద్వితీయ, ఎ.తనూజ, కె.సత్యశ్రీ జోడీ తృతీయ స్థానంలో నిలిచింది. సీనియర్ కె-1లో ఎన్.గాయత్రి, పి.శరణ్య, జె.త్రివేణి, జూనియర్ కె-1లో డి.చేతన భగవతి, ఎండీ సమీన, ఎన్.పూర్ణశ్రీ తొలి మూడు స్థానాలు సాధించారు. ☛ జూనియర్ కె-2లో ఎండీ సమీన, ఎన్.పూర్ణశ్రీ జోడీ ప్రథమ, ఎం.చరితశ్రీ, ఎ.నోవిక జోడీ ద్వితీయ, డి.చేతన భగవతి, ఎస్.తేజేశ్వరి జోడీ, సీనియర్ సి-1లో జె.సౌజన్య, జి.శ్రీకృష్ణమ్మ, ఎస్‌కే షబానా వరుస స్థానాల్లో నిలిచారు. ☛ సి-2లో జె.సౌజన్య, డి.చేతన భగవతి జోడీ, జె.సరస్వతి, జి.కృష్ణమ్మ జోడీ, ఎస్‌కే షబానా, జి.విజయలక్ష్మి జోడీ తొలి మూడు స్థానాలు సాధించారు. ☛ సీనియర్ మహిళల కె-1 (200 మీ)లో ఎన్.గాయత్రి, పి.శరణ్య, ఎ.తనూజ, జూనియర్ కె-1 (200 మీ)లో డి.చేతన, సమీన, ఎం.చరితశ్రీ, బేబీ కె-1లో ఎ.మోక్షిత శ్రీజ, పి.కిషిత, పి.రిషితలకు వరుస స్థానాలు వరించాయి. ☛ ఏపీ హౌసింగ్ బోర్డు ఎండీ త్రిభువన్, డీఎస్పీ కృష్ణరాజు, విజయకృష్ణ సూపర్ బజార్ ఛైర్మన్ వి.సురేష్, కేసీపీ సిద్ధార్థ ఆదర్శ్ రెసిడెన్షియల్ స్కూల్ కన్వీనర్ వీరపనేని శశికళ విజేతలకు పతకాలు అందించారు. ఎన్టీఆర్ జిల్లా కెనోయింగ్, కయాకింగ్ సంఘం అధ్యక్షుడు జగదీష్, కార్యదర్శి పి.కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

చదరంగం విజేతలు సుప్రీత, టాటా కీర్తి రాణా


విజేతలతో డాక్టర్ ఎంజే నాయుడు, కేవీ శ్రీనివాస్, రాజీవ్ తదితరులు

విజయవాడ క్రీడలు: స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో ది విజయవాడ చెస్ సంఘం, రాష్ట్ర చెస్ సంఘం సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్త్రీ, పురుషుల చెస్ టోర్నీలో పొట్లూరి సుప్రీత, టాటా కీర్తి రాణా విజేతలుగా నిలిచారు. మొత్తం 200 మంది క్రీడాకారులు తలపడగా.. మహిళల విభాగంలో సుప్రీత (కృష్ణా), సీహెచ్ రాధికాదేవి (గుంటూరు), పి.సహస్రవర్మ (పశ్చిమ గోదావరి), అల్లూరి నేహశ్రీ (తూర్పు గోదావరి), పి.యశ్వితవర్మ (పశ్చిమ గోదావరి) వరుస స్థానాలు కైవసం చేసుకున్నారు. పురుషుల విభాగంలో గుంటూరుకు చెందిన టాటా కీర్తి రాణా, షేక్ అబ్దుల్ నబీ, ఎ.హరిసూర్యనారాయణ, జి.మేఘ శ్యామ్‌సాయి, పి.జయ సాకేత్ వరుస స్థానాల్లో నిలిచారు. వైద్యుడు ఎంజే నాయుడు, రాష్ట్ర సిటీ కేబుల్ ఆపరేటర్స్ సంక్షేమ సొసైటీ ప్రధాన కార్యదర్శి కేవీ శ్రీనివాస్ విజేతలకు బహుమతులు అందజేశారు. ది విజయవాడ చెస్ సంఘం కార్యదర్శి మందుల రాజీవ్ మాట్లాడుతూ.. తొలి అయిదు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు ఈ నెలలో ఛత్తీస్‌గఢ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రకటించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

ఎన్ఈసీసీ: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -150 రిటైల్ ధర 177 చికెన్ విత్ స్కిన్ - 257 చికెన్ స్కిన్‌లెస్ - 292.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 175, 184, 195 చికెన్ విత్ స్కిన్ - 340 చికెన్ స్కిన్‌లెస్ - 350.

ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పిద్దాం


గోడపత్రిక ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : మంచి, చెడుల జ్ఞానం, జయాపజయాలను ఒకేలాగా చూసే దృఢ సంకల్పం అలవర్చేది ప్రభుత్వ బడి మాత్రమేనని.. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఆదివారం గవర్నర్‌పేటలోని సంఘ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రచార గోడపత్రికలు ఆవిష్కరించారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కె.ఎస్.ఎస్.ప్రసాద్‌లు మాట్లాడారు. గాంధీ, నెహ్రూ, అంబేడ్కర్, అబ్దుల్ కలాం వంటి ప్రపంచం గర్వించే మేధావులంతా ప్రభుత్వ బడిలోనే చదివారని తెలిపారు. నైతిక, రాజ్యాంగ విలువలు నేర్పేది ప్రభుత్వ బడి మాత్రమేనని అన్నారు. బడిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత సమాజం తీసుకోవాలని కోరారు. పిల్లలకు అన్ని రకాల సౌకర్యాలు ఉచితంగా అందించారని తెలిపారు. ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పాటు వ్యాయామం, గ్రంథాలయం, ప్రయోగశాలలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. మీ పిల్లలను తమ బిడ్డలుగా భావించే మంచి ఉపాధ్యాయులు ప్రభుత్వ బడిలో ఉన్నారని.. అవసరమైతే అదనంగా ఒక గంట పని చేసే వారూ ఉన్నారని పేర్కొన్నారు. యూటీఎఫ్ చేస్తున్న ప్రభుత్వ బడి అభివృద్ధి కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ కార్యవర్గ సభ్యులు కొమ్మోజు శ్రీనివాసరావు, కె.సురేష్‌కుమార్, కుసుమకుమారి, రెడ్డి మోహనరావు, బి.లక్ష్మీరాజా, ఎస్.పి.మనోహర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్చర్లకు పతకాలు

విజయవాడ క్రీడలు: పుదుచ్చేరిలో గత నెల 27 నుంచి మూడు రోజుల పాటు జరిగిన ఖేలో ఇండియా ఎన్టీపీఎస్ ఓపెన్ ఆర్చరీ టోర్నీలో రాష్ట్ర కాంపౌండ్ ఆర్చర్లు పతకాలు కైవసం చేసుకున్నారని రాష్ట్ర ఆర్చరీ సంఘం ఛైర్మన్ చెరుకూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బెవర వెంకట రమణ తెలిపారు. ఆదివారం జరిగిన స్త్రీ, పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగాల్లో కేఎస్ లేహ్యారెడ్డి, బి.రవితేజ రజత పతకాలతో పాటు రూ.15 వేల చొప్పున నగదు, కె.భరత్‌కుమార్ నాలుగో స్థానంలో నిలిచి రూ.5 వేల నగదు సొంతం చేసుకున్నారని పేర్కొన్నారు. వారంతా ఓల్గా ఆర్చరీ అకాడమీలో శిక్షణ పొందుతున్నారని వివరించారు. పతకాలు గెలుపొందిన ఆర్చర్లను, కోచ్‌లు నవీన్‌కుమార్, గౌరవపోదార్‌లను రాష్ట్ర ఆర్చరీ సంఘం కోశాధికారి చెరుకూరి కృష్ణకుమారి, జడ్జి కమిటీ ఛైర్మన్ భరద్వాజ అభినందించారు.

కారు కొందామని యత్నించి.. మోసపోయిన బిల్డర్

విజయవాడ (సూర్యారావుపేట), న్యూస్‌టుడే : ఓఎల్ఎక్స్‌లో కారు కొందామని యత్నించిన.. ఓ బిల్డర్ రూ.15 లక్షలు మోసపోయిన ఘటనపై విజయవాడ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. వై.ఎస్.ఆర్. కడప జిల్లా పోరుమామిళ్ల మండలం రెడ్డినగర్‌కు చెందిన ఏరువ గురుపూర్ణ బిల్డర్‌గా పని చేస్తున్నారు. ఫార్చ్యూనర్ కారు కొనేందుకు ఓఎల్ఎక్స్ వెబ్‌సైట్లో చూశారు. గత నెల 13న ఒక ప్రకటన చూసి.. తన చరవాణి నంబరును దానిలో నమోదు చేశారు. వెంటనే గుర్తు తెలియని ఓ వ్యక్తి ఫోన్ చేసి.. తన పేరు అజిత్‌కుమార్ అని పరిచయం చేసుకున్నాడు. తనకు ఇన్నోవా క్రిస్టా కారు ఉందని.. దాన్ని అమ్ముతానని, జగ్గయ్యపేటలోని తన సోదరుడు జలపతిరావు ఇంట్లో కారు ఉందని తెలిపారు. డబ్బులు తనకు పంపించి, ఆ కారు తీసుకువెళ్లవచ్చని చెప్పారు. తనకు కొన్ని అప్పులు ఉన్నాయని.. కారు అమ్మే ముందే వాటిని తీర్చాలని చెప్పడంతో అతని మాటలు నమ్మారు. గురుపూర్ణ.. విడతల వారీగా అతనికి రూ.15లక్షలు పంపించారు. ఆ తర్వాత నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడంతో మోసపోయినట్లు గుర్తించారు. శనివారం రాత్రి విజయవాడ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేశారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందన: ◆ తిరువూరు 7వ వార్డులోని డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకున్నాయని స్థానికుడు కిషోర్ సమస్యను 'ఈనాడు' మేమున్నాం..మీకు తోడుగా ద్వారా మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ శానిటరీ అధికారి స్పందించి పారిశుద్ధ్య సిబ్బందిని పంపి పూడిక తీయించారు.

◆ తిరువూరు 9వ వార్డులో చెత్తను తొలగించడం లేదని స్థానికుడు ప్రభాకర్ సమస్యను 'మేమున్నాం..మీకు తోడుగా' ద్వారా మున్సిపల్ అధికారులకు తెలిపారు. దీనిపై వారు స్పందించి పారిశుద్ధ్య సిబ్బందిని పంపి తీయించి ఆ ప్రాంతంలో బ్లీచింగ్ చల్లించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు**

◆ ఎన్టీటీపీఎస్ క్రికెట్ మైదానం అస్తవ్యస్తంగా ఉందని, నీరు వచ్చి వాకింగ్‌కు ఇబ్బందిగా ఉందని స్థానికులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎన్టీటీపీఎస్ పరిపాలన విభాగం ఆదివారం ఆ గ్రౌండ్‌లో మెరక, చదును పనులు నిర్వహించి వాకింగ్‌కు సిద్ధం చేశారు. సమస్య పరిష్కరించారు. **- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం**

? విస్సన్నపేట- సత్తుపల్లి రోడ్డు తిరుపతమ్మ గుడి ఏరియాలో చెత్త తీయడం లేదు. **- స్థానికులు** ✔ పారిశుద్ధ్య కార్మికులను పంపించి శుభ్రం చేయిస్తాం. **- కేశవ హరి కృష్ణ కుమార్, పంచాయతీ కార్యదర్శి, విస్సన్నపేట - న్యూస్‌టుడే, విస్సన్నపేట** ? మునగపాడులో ఎస్సీ కాలనీ శివారులో రహదారి పక్కనే చెత్తా చెదారం పేరుకుపోయింది. **- కోటేశ్వరరావు, గ్రామస్థుడు** ✔ సమస్య మా దృష్టికి వచ్చింది. సిబ్బందితో పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. **- మనోజ్ పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, జి.కొండూరు**

స్పందించారు.. నీరు అందించారు

జి.కొండూరు, న్యూస్‌టుడే : గుర్రాజుపాలెం గ్రామంలో కృష్ణా జలాల సంపులోని విద్యుత్తు మోటారు మరమ్మతులకు గురై నీటి సరఫరా నిలిచిపోయిందని స్థానికులు ఆవేదన చెందారు. ఈ నేపథ్యంలో 'నిధుల కేటాయింపులే.. పనుల్లేవ్..!' శీర్షికన 'ఈనాడు'లో ఆదివారం ప్రచురితమైన కథనానికి సహాయక ఇంజినీర్ దయానంద్ స్పందించారు. మోటారుకు మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు.

ఇన్‌స్పైర్‌కు ఎస్ఎస్‌కే విద్యార్థిని ఎంపిక


దుర్గాశ్రావణి

మైలవరం, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమానికి స్థానిక ఎస్ఎస్‌కే పాఠశాలలో 8వ తరగతి చదివే విద్యార్థిని జి.దుర్గాశ్రావణి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ జి.శ్రీభావన తెలిపారు. జిల్లా స్థాయిలో వచ్చే విద్యా సంవత్సరంలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొననున్నట్లు చెప్పారు. విద్యార్థినిని కరస్పాండెంట్ గొల్లపూడి మోహనరావు, ఉపాధ్యాయులు ఆదివారం అభినందించారు.

కొండపల్లి పురపాలిక నూతన కమిషనర్‌గా శ్రీనివాసరావు

కొండపల్లి, న్యూస్‌టుడే : కొండపల్లి పురపాలక సంఘం నూతన కమిషనర్‌గా బి.శ్రీనివాసరావును నియమించినట్లు ఆ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈయన నెల్లూరు జిల్లా ఉదయగిరి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్నారు. విజయవాడ జోనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ డిప్యుటేషన్‌పై కొండపల్లి కమిషనర్‌గా ఉన్న రమ్యకీర్తన అయిదు నెలల కిందట తిరిగి జోనల్ పరిధిలోకి వెళ్లారు. అప్పటి నుంచి పురపాలిక మేనేజర్‌గా ఉన్న వెంకటరత్నం ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో నూతన కమిషనర్‌గా నియమితులైన శ్రీనివాసరావు త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

మారనున్న రూపురేఖలు.. తీరనున్న ట్రాఫిక్ వెతలు

ఇబ్రహీంపట్నం, కొండపల్లి, న్యూస్‌టుడే


ప్రస్తుతం ఇబ్రహీంపట్నం రింగు కూడలి ఇలా..

మరికొన్ని నెలల్లో ఇబ్రహీంపట్నం రింగుకూడలి రూపురేఖలు మారనున్నాయి. జాతీయ రహదారి(65) నందిగామ నుంచి విజయవాడ వరకూ ఆరు వరుసలుగా విస్తరించడంతో పాటు ఇబ్రహీంపట్నం వద్ద పైవంతెన ఏర్పాటుకు జాతీయ రహదారుల భాగస్వామ్య(స్టేక్ హోల్డర్స్) సదస్సులో అంగీకారం తెలిపిన సంగతి విదితమే. దీనిపై సదస్సులో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ, ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)లతో మైలవరం ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, జాతీయ రహదారి అధికారులు అంగీకారం తెలిపారు. ఈ క్రమంలో రింగుకూడలిపై వంతెన రావడంతో వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. ఇదిలా ఉంటే రింగు నుంచే ఛత్తీస్‌గఢ్ జాతీయ రహదారి(30) ప్రారంభం కానున్న నేపథ్యంలో పైవంతెన ఏర్పాటు ఎంతో అవసరమని ట్రాఫిక్ పోలీసు అధికారులు సైతం పేర్కొంటున్నారు. పైవంతెన నిర్మించడంతో భద్రాచలం, తిరువూరు వైపుల నుంచి వచ్చే వాహనాలు రింగుకూడలి ట్రాఫిక్ పద్మవ్యూహంలో ఉండిపోకుండా నేరుగా తుమ్మలపాలెం వద్దకు వెళ్తాయి. అదే విధంగా హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలు తుమ్మలపాలెం చేరుకుంటాయి. దీంతో పర్వదినాల సమయాల్లో ప్రయాణికులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా తమ గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం ఉంది.

★ **ఇబ్బంది లేకుండా.. :** ఇప్పటికే నందిగామ పై భాగంలో ఆరు వరుసలతో పాటు సర్వీసు రోడ్డు ఉన్నాయి. దీంతో ఎనిమిది వరుసలుగా రహదారి విస్తరిస్తోంది. అదే సమయంలో గ్రామాల వద్ద పాస్‌వేలు ఉంటాయి. ఇబ్రహీంపట్నం రింగుకూడలి పైవంతెన ఏర్పాటు కాగానే లారీలు, కార్లు పై భాగం నుంచి రాకపోకలు సాగిస్తే ద్విచక్ర వాహనదారులు ఎటువంటి ఇబ్బంది లేకుండా గమ్యస్థానాలకు వెళ్లిపోతారు. దీంతో ప్రమాదాల స్థాయి జీరోగా ఉంటుంది. **- కృష్ణ, లక్ష్మణరావు, ట్రాఫిక్ ఎస్సైలు**

★ **పురపాలికకు ఓ కళ.. :** పైవంతెన ఏర్పాటుతో కొండపల్లి పురపాలికకు నూతన కళ వస్తుంది. ఇప్పటి వరకూ నాలుగు వరుసల రోడ్డులో అనేక ప్రమాదాలు సంభవించాయి. ఆరు వరుసల రహదారి విస్తరణతో పాటు రింగు వద్ద పైవంతెన ఏర్పాటు జరగ్గానే అనేక సమస్యలు తొలగిపోతాయి. **- చిట్టిబాబు, మున్సిపల్ ఛైర్మన్, కొండపల్లి**

సజావుగా గురుకులం ప్రవేశ పరీక్షలు


ప్రశ్నపత్రాలను సరి చూస్తున్న రాజ్యలక్ష్మి

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : మండల పరిధిలోని కృష్ణారావుపాలెం డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం 2026- 27 విద్యా ఏడాదికి సంబంధించి 5వ తరగతి, ఇంటర్‌లో చేరేందుకు ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ప్రిన్సిపల్ కె.సిద్దయ్య తెలిపారు. వీటిని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా అడిషనల్ సెక్రటరీ రాజ్యలక్ష్మి పర్యవేక్షించారు

వృద్ధాశ్రమం పునఃప్రారంభం

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : అభ్యుదయ యువ శక్తి సంఘం ఆధ్వర్యంలో రెడ్డిగూడెం ఎస్సీవాడలో వృద్ధాశ్రమం తిరిగి ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు 150 మందికి చీరలు పంపిణీ చేసినట్లు సంఘం అధ్యక్షుడు సీహెచ్. వెంకటేశ్వరరావు తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ


పుట్రేల: లబ్ధిదారులకు చెక్కులు ఇస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు


తిరువూరు: కూటమి నాయకుల ఆధ్వర్యంలో...

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండలంలోని పుట్రేల, వీరరాఘవాపురం, చంద్రుపట్ల గ్రామాల్లో 5 మంది లబ్ధిదారులకు రూ. 2,30,202ల సీఎంఆర్ఎఫ్ చెక్కులను తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆదివారం పంపిణీ చేశారు. నాయకులు గాదె వెంకటేశ్వరరావు, దార్ల రాజేష్, పిల్లి పాపారావు, కొలికపోగు సర్వేశ్వరరావు, ముత్తయ్య, మురళీ, గరిమెళ్ల లోకేశ్వరరావు, నారాయణ, బాలు, ప్రసాద్ పాల్గొన్నారు.

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు పట్టణంలోని పలు వార్డులు, పరిసర గ్రామాల్లోని లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే శ్రీనివాసరావు పంపిణీ చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి శిక్షణలు దోహదం


బస్సు వద్ద తెదేపా నేతలు, ప్రజాప్రతినిధులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ప్రతి ఇంటి నుంచి ఒక ఎంటర్‌ప్రెన్యూర్ రావాలన్నదే ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) ఉద్దేశమని తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సీతారామయ్య అన్నారు. పొదుపు సంఘ మహిళలు స్వయం ప్రతిపాదికన వృద్ధి సాధించేందుకు పలు శిక్షణా కార్యక్రమాలను కేశినేని ఫౌండేషన్ నిర్వహిస్తోంది. అందులో భాగంగా శిక్షణకు హైదరాబాద్ వెళ్తున్న మహిళా బృందం బస్సుకు వీరు జెండా ఊపి ప్రారంభించారు. సహకార సంఘ కో-ఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షుడు నెహ్రూ, సంజయ్‌వర్మ, ప్రకాష్, శ్రీను, సుభానీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీ అచ్చమ్మ పేరంటాల్లమ్మ జాతర


వినగడప : గ్రామరాశి బోనంతో కమిటీ సభ్యుల ప్రదక్షిణ

వినగడప (గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని వినగడప సమీప గట్టు వద్ద శ్రీలక్ష్మీ అచ్చమ్మ పేరంటాళ్లమ్మ జాతర ఆదివారం ప్రారంభమైంది. ఆలయ కమిటీ అధ్యక్షుడు కోటగిరి శ్రీనివాసరావు, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో డప్పు వాయిద్యాలతో మామిడి తోరణాలు కట్టి, బోనంతో గుడి చుట్టూ ప్రదక్షిణ చేసి అమ్మవారికి సమర్పించారు. శ్రీలక్ష్మీ స్టోన్ క్రషర్స్ యజమాని యలమంచిలి వెంకటరత్నం, త్రిపురసుందరి దంపతులు అమ్మవారికి వస్త్రాలు, పుష్పాలు అందించారు.

పెళ్లి కుమారుడిగా వేణుగోపాల స్వామి

జి.కొండూరు, న్యూస్‌టుడే : వెల్లటూరులో వేణుగోపాల స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా రెండో రోజు ఆదివారం కలకండ వంశస్థుల ఆధ్వర్యంలో స్వామి వారిని పెళ్లి కుమారుడిని చేశారు. తొలుత అర్చకుడు కోమారి వెంకటాచార్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు రాజుపేట అష్టలక్ష్మీ దేవాలయంలో స్వామి వారి కల్యాణ మహోత్సవాలను ఆదివారం ప్రారంభించారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


వెల్లటూరులో ధ్వజారోహణ పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు


తిరువూరు రాజుపేట అష్టలక్ష్మి దేవాలయంలో..

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

గొల్లపూడి, న్యూస్‌టుడే : యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం, ప్రశాంత జీవనశైలిని పొందవచ్చని శ్రీవెంకటేశ్వర యోగ సేవా కేంద్రం వ్యవస్థాపకుడు వెంకటేశ్వర యోగి గురూజీ తెలిపారు. స్థానిక అనిల్ క్యాజిల్స్ అపార్టుమెంటులో ఆదివారం నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలని కోరారు. 25 యోగా శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసిన మంజుల యోగి మాతాజీని అభినందించారు. పాత శివాలయం మాజీ ఛైర్మన్ బొమ్ము మధు, నిర్వాహకులు తిరుమల రమేష్ బాబు, కె.సూరిబాబు, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.


సభలో ప్రసంగిస్తున్న వెంకటేశ్వర యోగి గురూజీ

రైతుల కష్టాలపై అసెంబ్లీలో చర్చించాలి


కొత్త మంగాపురం: మామిడి తోటలో సీపీఎం, రైతు సంఘం నాయకులు

మైలవరం, న్యూస్‌టుడే: నల్లి ప్రభావంతో మామిడి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని, దానిపై మైలవరం, తిరువూరు ఎమ్మెల్యేలు అసెంబ్లీలో చర్చ సాగేలా చొరవ చూపాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.కేశవరావు కోరారు. ఆదివారం పుల్లూరు పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో రైతులతో కలిసి మామిడి తోటలను వారు పరిశీలించి పలు అంశాలను చర్చించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఎం.వెంకటరెడ్డి, పీవీ ఆంజనేయులు, ధనలక్ష్మి, సుబ్బారావు, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని మామిడి తోటలను ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి ఆ సంఘ నాయకులు, రైతులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఆమర్ భవన్ ఎం.మాధవరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పి.వి.ఆంజనేయులు, వీరారెడ్డి, ధనలక్ష్మి, కె.పరమేశ్వరరావు, వి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పట్టాలు కప్పరు.. అక్రమ రవాణా ఆపరు



టిప్పర్లలో తరలిస్తున్న మట్టిపై ఏ విధమైన పట్టాలు కట్టకుండానే తీసుకెళ్తున్నారు. కొత్తూరు తాడేపల్లిలోని క్వారీల నుంచి టిప్పర్లలో మట్టి రవాణా పెద్ద ఎత్తున జరుగుతోంది. నిత్యం వందలాది టిప్పర్లలో మట్టిని తరలిస్తున్నారు. దీంతో గాలికి మట్టి కళ్లలో పడి వాహన చోదకులు, పాదచారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి టిప్పర్లపై పట్టాలు కట్టి తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గొల్లపూడి**

పొదలు.. నిత్యం ప్రమాదాలు




మండల పరిధిలోని జీళ్ల కుంట వెళ్లే మార్గంలో మలుపు వద్ద పిచ్చి మొక్కలు, పొదలు పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు చోదకులకు కన్పించడం లేదు. ఈ క్రమంలో నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సత్వరమే చర్యలు తీసుకుని ప్రమాదాల బారి నుంచి కాపాడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఎ.కొండూరు**

వయ్యారిభామ వదలవా..?



సాగు పొలాలను వయ్యారిభామ మొక్కలు కమ్మేస్తున్నాయి. దీంతో పంటలతో పాటు అందులో తిరిగే మనుషులకు చర్మవ్యాధులు సోకడానికి కారణమవుతున్నాయి. వయ్యారిభామ అంటే కలుపు జాతికి చెందిన ప్రమాదకరమైన మొక్క. దశాబ్ద కాలంగా రైతులను అతలాకుతలం చేస్తున్న ప్రమాదకారి. అయితే దీన్ని అన్నదాతలు ఎప్పటికప్పుడు దుక్కిలో దున్నడం తప్ప నివారించలేక పోతున్నారు. **- న్యూస్‌టుడే, మైలవరం**

సూచిక బోర్డులు లేక.. అవస్థలు తీరక..



మండల పరిధిలోని రేపూడి తండా వద్ద యంఎన్‌కే రహదారిపై ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా మారింది. దీని వద్ద సూచిక బోర్డులు లేవు. ఈ క్రమంలో రాత్రి సమయంలో వృద్ధులు, ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి పడిపోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోర్డులు ఏర్పాటు చేయించి ప్రమాదాల బారి నుంచి కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఎ.కొండూరు**

బైపాస్‌పై వేగ నిరోధకాల నిర్మాణం



ప్రమాదాల నివారణకు అధికారులు గొల్లపూడి బైపాస్‌పై వేగ నిరోధకాలను ఏర్పాటు చేశారు. స్థానిక మహాత్మా గాంధీ టోకు వ్యాపార కేంద్రం తదితర చోట్ల వీటిని నిర్మించారు. టోకు వ్యాపార కేంద్రం వద్ద గతంలో ఇద్దరు ముఠా కార్మికులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ నేపథ్యంలో ప్రమాదాల నివారణలో భాగంగా వీటిని నిర్మాణం చేయించి రంగులు వేశారు. **- న్యూస్‌టుడే, గొల్లపూడి**

ఎస్సీల హక్కులు కాపాడుకోవాలని తీర్మానం

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని తోటమూలలో కేకేఆర్ అతిథి గృహంలో ఆదివారం ఎస్సీ సంక్షేమ సంఘం మండల సమావేశం నిర్వహించారు. మండల సంఘానికి ఇన్‌ఛార్జిగా డి.నారాయణను ఎన్నుకున్నారు. రాజ్యాంగం ద్వారా ఎస్సీలకు కల్పించిన హక్కులను రాజకీయాలకు అతీతంగా కాపాడుకోవాలని తీర్మానించారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. డి.వెంకటేశ్వరరావు, జి.ఆదాం, పి.కోటేశ్వరరావు, ఎం.రంజిత్ కుమార్, ఎం.వేణుబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి వీబీ-జీ రామ్‌జీపై అవగాహన సదస్సులు

నందిగామ గ్రామీణం, రెడ్డిగూడెం : కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వీబీ-జీ రామ్‌జీగా మార్పు చేయడంతో దీనిపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశాలిచ్చారు. పాత పథకంలో లోపాలను సవరించి కొత్త పథకంలో తీసుకువచ్చిన మార్పులపై కూలీలకు, ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులు ఉత్తర్వులిచ్చారు. ఈ నెల 2 నుంచి 6వ తేదీ వరకు పత్రికా, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తారు. ఏడాదికి 125 రోజుల పని దినాలు కల్పించడానికి చట్టబద్ధమైన హామీ, వేతనాలు చెల్లింపుల్లో జాప్యం ఏర్పడితే నిబంధనలు, నిరుద్యోగ భృతి, నూతన చట్టంలో చేపట్టే పనులు గురించి చెప్పాలి. 7 నుంచి 9వ తేదీ వరకు హక్కుల పరిరక్షణ దినం, గ్రామాల్లో సామూహిక ప్రతిజ్ఞలు, బ్యానర్లు, పోస్టర్లు ప్రదర్శన, 10 నుంచి 13 వరకు వికసిత్ భారత్ గ్రామ సంవాద్ కార్యక్రమంలో భాగంగా పనులపై గ్రామాల్లో రచ్చబండ చర్చలు, 16 నుంచి 22 వరకు అహింస నుంచి హక్కుల వరకు అనే అంశంపై పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు, గాంధీ సూక్తుల బ్యానర్లతో ప్రదర్శనలు చేయాలి. 23 నుంచి 25 వరకు పంచాయతీరాజ్ కార్యకర్తలతో సంభాషణ, 26 నుంచి 28 వరకు 100 రోజులు పని పూర్తి చేసిన కూలీలను సన్మానిస్తారు

ప్రతిభావంతులకు అభినందన


పతకాలు అందుకుంటున్న గురుకుల విద్యార్థులు

తిరువూరు, న్యూస్‌టుడే : విజయవాడలో నిర్వహించిన జాతీయ బాలల ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో తిరువూరు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. ఇందులో 20 మంది గోల్డ్ మెడల్స్ సాధించగా, 5 గురు సిల్వర్ మెడల్స్ సాధించినట్లు ప్రిన్సిపల్ ఎస్.రవిబాబు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, చిత్రలేఖన ఉపాధ్యాయుడిని ఆయన ఆదివారం అభినందించారు.

గ్రామీణ ప్రాంతాల్లో అంతర్జాల సమస్య అధికం


మాట్లాడుతున్న డీపీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీను

గంపలగూడెం, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల హాజరు నమోదులో ఇప్పటి వరకు ఉన్న పది నిమిషాల గ్రేస్ పిరియడ్‌ను అలాగే కొనసాగించాలని డీపీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.శ్రీను కోరారు. ఆదివారం మండలంలోని ఊటుకూరు వచ్చిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో అంతర్జాల సమస్యతో చరవాణులు సరిగా పని చేయక ఉపాధ్యాయులు ముఖ హాజరు నమోదులో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. డీపీఆర్టీయూ జిల్లా, మండల నాయకులు కె.సుందరరావు, ఎన్.నరసింహారావు, కె.రాంబాబు, ఎస్.దయాకర్, డాక్టర్ జి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి

మైలవరం, న్యూస్‌టుడే : మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక పాత యూనియన్ బ్యాంకు కూడలిలోని బీఆర్.అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద నివాళులర్పించారు. వీరాస్వామి, బెనర్జీ, రామారావు, యోహాన్, ఏసురత్నం, జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆవుల సంచారం.. రాకపోకలకు అంతరాయం



విస్సన్నపేటలోని రోడ్లపై ఆవుల సంచారంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, ప్రయాణికులు, పాఠశాలల విద్యార్థులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి వీటి కదలికలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, విస్సన్నపేట**

సంక్షేమ పథకాలు అమలు చేయండి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మైలవరం, న్యూస్‌టుడే : రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలన్నింటినీ కార్మికులకు అమలు చేయాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు పిల్లి నరసింహారావు కోరారు. ఆదివారం స్థానిక సంఘ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చించారు. డిమాండ్లకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. నాయకులు సీహెచ్ సుధాకర్, రాజు, ఆంజనేయులు, కోటి, శ్రీనివాసరావు, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముతో పంటలకు నష్టం



గడ్డమణుగలోయ ప్రాంతంలో క్వారీల నిర్వహణతో అవస్థలు పడుతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. క్వారీల నుంచి జిల్లాలోని పలు ప్రాంతాలకు నిత్యం కంకర రవాణాకు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో రహదారిపై దుమ్ము లేస్తూ తమ పంటలపై పడుతోందని అన్నదాతలు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో పంట నాణ్యత, దిగుబడి తగ్గుతోందని చెబుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**

➤ వివాహిత అనుమానాస్పద మృతిపై కేసు

అనుముల్లంక(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని అనుముల్లంకలో మల్లాది జాహ్నవి రెడ్డి(23) అనే వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఆదివారం కేసు నమోదు చేశామని ఎస్సై జి.అనిల్ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మల్లాది సురేంద్ర రెడ్డితో ఏలూరు జిల్లా మండవల్లి మండలం పెరికేగూడెం గ్రామానికి చెందిన జాహ్నవి రెడ్డికి ఏడాది కిందట వివాహమైంది. తదుపరి భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం కలిగి ఉండడంతో ఆమె తరచూ ప్రశ్నిస్తోంది. ఈ విషయమై ఆమె మానసిక ఒత్తిడితో ఆదివారం ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. మృతురాలి తల్లి పేరం చంద్రావతి తన కుమార్తె మృతికి అల్లుడు కారణమని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. సాయంత్రం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరువూరు ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

భద్రత ప్రశ్నార్థకం.. అడిగితే వివాదం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, కొండపల్లి, న్యూస్‌టుడే

ఎన్టీటీపీఎస్ కాలనీ వాసుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఎన్టీటీపీఎస్‌లో విధులు నిర్వహించే ఇంజినీర్లు, కార్మికులు, సిబ్బందికి కేటాయించిన క్వార్టర్స్‌ను వారు ప్రైవేటు వ్యక్తులకు అద్దెకు ఇవ్వడంతో కాలనీలు అసాంఘిక శక్తులకు అడ్డాగా మారాయి. ఇంజినీర్లు, కార్మికులు ఇబ్రహీంపట్నం పరిసర గ్రామాల్లో సొంత గృహాలు నిర్మించుకొని వారికి సంస్థ కేటాయించిన వాటిని ఇతరులకు అద్దెకు ఇవ్వడంతో ఈ పరిస్థితి వచ్చిందని కాలనీలోనే నివాసముంటున్న సంస్థ సిబ్బంది వాపోతున్నారు. ఇటీవల ఓ గుర్తు తెలియని వ్యక్తి మూడో అంతస్తు నుంచి కిందకు దుక్కి ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇక్కడ ఉంటేనే భృతి చెల్లించేలా...

ఏపీ జెన్‌కో ఎన్టీటీపీఎస్‌లో విధులకు హాజరైందుకు ఇబ్రహీంపట్నం, కొండపల్లిలోని అయిదు ప్రదేశాల్లో వివిధ రకాలైన దాదాపు నాలుగు వేల క్వార్టర్లను అయిదు బహుళ అంతస్తుల సముదాయంగా నిర్మించి వారి హోదాకు తగ్గట్టు కేటాయించింది. ఇక్కడ ఉంటేనే ఇంటి అద్దె భృతి చెల్లించేలా నిబంధనలు ఉండటంతో సొంత గృహాలు ఉన్నా వారు అద్దెలకిచ్చుకుంటూ తామే ఉన్నట్లు అద్దెను పొందుతున్నారు. గ్రామాల్లో ఒకటి, రెండు పడక గదుల ఇల్లు సుమారు రూ.3 నుంచి రూ.5 వేలు వరకు పలుకుతోంది. కాలనీలో గ్రామంలో కన్నా తక్కువ అద్దెతో నిరంతర ఉచిత విద్యుత్తు, తాగునీటి సౌకర్యం లభిస్తుండటంతో బయట వ్యక్తులు క్వార్టర్లలో ఉండేందుకు మక్కువ చూపుతున్నారు.

పరస్పరం వివాదం జరగడంతో..

ఇటీవల ఏ- కాలనీలో ఏడీఈ స్థాయి అధికారి నివసించే క్వార్టర్లలో బయటి వ్యక్తులు అద్దెకు ఉన్నారు. వారికి క్వార్టర్లలో నివాసముండే సిబ్బందికి మధ్య వివాదం రావడంతో సమస్య బయటకు వచ్చింది. గత నెలలో ఇక్కడ వరుస చోరీలు జరగడం వెనుక కూడా అద్దెకు ఉండే బయట వ్యక్తులు ఇచ్చిన సమాచారమే కారణమని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి క్వార్టర్స్‌లో నివసిస్తున్న ప్రైవేటు వ్యక్తులను గుర్తించి ఖాళీ చేయించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఇంత వరకు క్వార్టర్స్‌ను అద్దెకు ఇస్తున్న వైనం, కాలనీలో అసాంఘిక కార్యకలాపాలు తమ దృష్టికి రాలేదు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. **- వాసుదేవరావు, ఎన్టీటీపీఎస్ కాలనీల నిర్వహణాధికారి**





మధ్యవర్తిత్వంపై విజయవాడలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సులో జాతీయ గీతాలాపన చేస్తున్న ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి, జస్టిస్ పీఎస్ నరసింహ, ముఖ్యమంత్రి చంద్రబాబు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్ర ★ మధ్యవర్తిత్వంపై విజయవాడలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సుకు హాజరైన న్యాయవాదులు

భారతీయుల డీఎన్‌ఏలోనే మధ్యవర్తిత్వం



వివాదాల పరిష్కారానికి అది గొప్ప సాధనం

'మధ్యవర్తిత్వంపై రాష్ట్రస్థాయి చర్చాగోష్ఠి'లో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

ఈనాడు-అమరావతి: 'వివాదాల పరిష్కారానికి ప్రభావవంతమైన సాధనం మధ్యవర్తిత్వమే.. ఇది భారతీయుల డీఎన్‌ఏలోనే ఉంది. కొన్ని వేల ఏళ్ల కిందటి నుంచే చరిత్ర ఈ విషయం చెబుతోంది' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. 'మధ్యవర్తిత్వం తక్కువ ఖర్చుతో ఎన్నో వివాదాలు పరిష్కరిస్తుంది. సామరస్యంగా, సంతోషంగా జీవించేందుకు దోహదపడుతుంది' అని సూచించారు. ఆదివారం విజయవాడలో జరిగిన 'మధ్యవర్తిత్వంపై రాష్ట్రస్థాయి చర్చాగోష్ఠి'లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. అందులోని ప్రధాన అంశాలు..

■ వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం అనేది ఒక ఆదర్శమైన మార్గం. దిల్లీలో తొలి అంతర్జాతీయ మధ్యవర్తిత్వ సదస్సులో దీనికి సంబంధించిన ప్రతిపాదన తెచ్చాను. ఇప్పుడిది జాతీయవిధానంగా మారినందుకు సంతోషంగా ఉంది.

■ శ్రీకృష్ణుడు మొదటి కోడిఫైడ్ మీడియేటర్ (లిఖితపూర్వక నిబంధనలు పాటించిన మధ్యవర్తి).. రెండు వర్గాల మధ్య శాంతి కోసం ప్రయత్నించారు. ఆయన రాయబారం విఫలమై మహాభారత యుద్ధం జరిగింది.

న్యాయవ్యవస్థలో కేసుల భారం..

■ న్యాయవ్యవస్థలో కేసుల భారం అధికంగా ఉంది. ఎన్నో రకాల కారణాలతో ప్రజలు న్యాయస్థానాలకు వస్తున్నారు. దీంతో నిర్ణీత సమయంలో పరిష్కారం సాధ్యం కాకపోవచ్చు.

* 2023 మీడియేషన్ చట్టం ఆమోదం పొందడం సంతోషించదగిన అంశం. దానికి చట్టబద్ధత ఏర్పడింది. మీడియేషన్ ద్వారా ఏదైనా ఒప్పందం జరిగితే అది కోర్టు డిక్రీగా అమలు చేస్తారు. మధ్యవర్తిత్వాన్ని ప్రోత్సహించడానికి ఇది దోహదపడుతుంది.

ఎక్కువమంది ఆదరణ పొందేలా చేయాలంటే

■ మధ్యవర్తిత్వం ఎక్కువమంది ఆదరణ పొందాలంటే మూడు అంశాలపై ఆధారపడి ఉంటుంది.

నమ్మకం: వివాదంలో ఉన్న పార్టీలు మధ్యవర్తిపై నమ్మకం, విశ్వాసం కలిగి ఉండాలి. ఎవరిని మధ్యవర్తిగా నియమించినా.. ఆయనపై గౌరవం, విశ్వాసం చూపాలి.

వ్యవస్థపై విశ్వాసం: మన దేశంలో సాధారణ ప్రజలు ఇప్పటికీ న్యాయవ్యవస్థను అత్యంత నమ్మకమైన, విశ్వసనీయమైనదిగా భావిస్తారు. అందుకే న్యాయవ్యవస్థ ద్వారా మధ్యవర్తి నియమితుడైతే.. పార్టీలు విశ్వసిస్తాయి.

ఒప్పందం అమలు: ఇదెంతో ముఖ్యమైనది. పార్టీలు ఒప్పందం చేసుకున్నాక అందులోని నిబంధనలు, షరతులు కచ్చితంగా అమలు చేయాలి.

ఇతర దేశాల్లోనూ మధ్యవర్తిత్వానికి ఆదరణ

■ మధ్యవర్తిత్వం ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందుతోంది. కౌలాలంపూర్‌లో అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కేంద్రం ప్రారంభానికి వెళ్లాను. అక్కడి బార్ అసోసియేషన్ ఎంతో చురుగ్గా వ్యవహరించడం చూశాను. అంతర్జాతీయ మీడియేషన్ సెంటర్ ఏర్పాటుతో పాటు.. ప్రపంచవ్యాప్త వివాదాలు, స్టార్టప్‌లు, వాణిజ్య సంస్థల్ని ఆకర్షిస్తూ.. మధ్యవర్తిత్వ వేదిక ద్వారా సామరస్యంగా పరిష్కరించేందుకు కృషిచేస్తున్నారు. పలు దేశాల్లోనూ ఇలాంటి ప్రయత్నాలు చూశాను.

■ మన దేశంలోనూ మధ్యవర్తిత్వాన్ని ప్రజాదరణ పొందేలా చేయాలని జాతీయ న్యాయసేవల సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించినప్పుడే నిర్ణయించుకున్నా. 'మీడియేషన్ ఫర్ నేషన్'పేరుతో పిలుపు ఇచ్చా.

అమరావతి రైతుల్లో ఒప్పించడమే ఉదాహరణ

ఏపీలో మధ్యవర్తులకు గౌరవ వేతన సమస్య పరిష్కారమే దీనికి ఉదాహరణ. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి గౌరవవేతనం చాలడం లేదని, పెంపు విషయాన్ని ముఖ్యమంత్రితో మాట్లాడారు. ఆయన వెంటనే అంగీకరించారు. ఇది మీ (మధ్యవర్తుల) రాష్ట్రంలో మధ్యవర్తిత్వానికి దక్కిన గౌరవం. అమరావతి రాజధాని నిర్మాణానికి భూసమీకరణ పథకం కింద భూములిచ్చేందుకు రైతుల్ని సీఎం చంద్రబాబు ఒప్పించడం, వారు దానికి అంగీకరించడం.. మధ్యవర్తిత్వానికి మరో ఉదాహరణ.

ప్రపంచపటంలోకి అమరావతి

భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి కూడా ప్రపంచపటంలోకి చేరుతోంది. విశాఖపట్నం, ఇతర నగరాలకూ వాణిజ్యసంస్థలు వస్తున్నాయి. దీంతో వివాదాలు సహజంగానే వస్తాయి. ప్రతి వివాదాన్ని పరిష్కరించడానికి సంప్రదాయ కోర్టు తప్పనిసరి కాదు. ఆర్బిట్రేషన్ కూడా మరో వివాద పరిష్కారమార్గం. కానీ ప్రతి వాణిజ్య వివాదాన్ని ఆర్బిట్రేషన్ ద్వారా పరిష్కరించలేరు కదా. మధ్యవర్తిత్వం అయితే తక్కువ సమయం, తక్కువ ఖర్చు, అత్యంత సామరస్యంగా పరిష్కారం లభిస్తుంది. అందుకే వాణిజ్య సంస్థల వారు, పారిశ్రామికవేత్తలు దీన్ని అనుసరిస్తున్నారు.

ముఖ్య శాఖల్లో మధ్యవర్తిత్వ విభాగాలు అవసరం

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి

ఈనాడు, అమరావతి: భారతదేశంలో అతిపెద్ద లిటిగెంట్ ప్రభుత్వమేనని.. ప్రతి ముఖ్యశాఖలో ప్రత్యేకంగా శిక్షణ పొందిన మధ్యవర్తిత్వ విభాగాలు ఏర్పాటుతో కేసుల సంఖ్యను తగ్గించవచ్చని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో దీన్ని అమలు చేయవచ్చని సూచించారు. 'మధ్యవర్తిత్వంపై రాష్ట్రస్థాయి చర్చాగోష్ఠి'లో ఆయన మాట్లాడారు. 'మధ్యవర్తిత్వమనేది ఇప్పుడు ఉద్యమంలా మారుతోంది. న్యాయస్థానాల్లో పోరాడాలని ఎవరూ కోరుకోవట్లేదు. అందరికీ పరిష్కారం కావాలి. న్యాయస్థానాల తీర్పు నిర్ణయం మాత్రమే. అది సంబంధాల్ని నిలబెట్టదు. మధ్యవర్తిత్వాన్ని బాగా చేసుకుంటే ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. భవిష్యత్తులో వాణిజ్య, సైబర్ చట్టాల వంటి క్లిష్టమైన కేసుల విషయంలో విషయనిపుణులు, సైన్యాధికారులతో మధ్యవర్తిత్వం ఎంతో అవసరముంటుంది' అని పేర్కొన్నారు. ప్రధానాంశాలివి..



● మనుస్మృతి ప్రకారం.. సామ, దాన, భేద, దండోపాయాలనే నాలుగు మార్గాలను రాజు సరైన క్రమంలో వినియోగించాలి. మొదట సమన్వయం (సామ), తర్వాత ప్రోత్సాహం (దానం), అనంతరం విభజన (భేదం) చివరి అస్త్రం మాత్రమే శిక్ష (దండన)గా ఉండాలి. ఎంతోకాలంగా వస్తున్న సామ సూత్రాన్ని గౌరవిద్దాం. దాన్ని అమలు చేద్దాం.

● 2023లో చట్టపరంగా మధ్యవర్తిత్వం గుర్తింపు పొందక ముందే భారతీయ న్యాయస్థానాలు చర్చలు, రాజీలను ప్రోత్సహించాయి. 2023లో అమల్లోకి వచ్చిన చట్టం.. మధ్యవర్తిత్వాన్ని సంస్థాగతంగా బలపరిచింది.

● సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వాన్ని ప్రాథమిక సాధనంగా ప్రోత్సహించింది. ముఖ్యంగా కుటుంబ వివాదాల్లాంటి సందర్భాల్లో విచారణకు ముందు మధ్యవర్తిత్వానికి అవకాశమివ్వాలని సూచించింది.

▼ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, పీఎస్ నరసింహ, జస్టిస్ ప్రశాంతకుమార్ మిశ్రా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఏపీ న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్ మానవేంద్రనాథ్‌రాయ్‌లను సీఎం చంద్రబాబు సత్కరించి జ్ఞాపికలు అందించారు.

▼ కార్యక్రమంలో పాల్గొని మధ్యవర్తిత్వంపై మార్గనిర్దేశనం చేసిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌కు, ఇతర న్యాయమూర్తులకు న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హిమబిందు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో న్యాయసేవాధికార సంస్థను బలోపేతం చేయడంతోపాటు.. ప్రత్యామ్నాయ వివాద పరిష్కారాన్ని ప్రోత్సహించే కార్యక్రమానికి సీఎం చంద్రబాబు నిరంతర మద్దతు అందిస్తున్నారని చెప్పారు.



లోక్‌భవన్‌లో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

అమరావతిలో నేషనల్ జ్యుడిషియల్ అకాడమీ ఏర్పాటు చేయండి

- రాజధాని నగరాన్ని జ్యుడిషియల్ హబ్‌గా మారుస్తాం
- అందుకు సహకరించాలని సీజేఐకి సీఎం చంద్రబాబు వినతి

మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కరిస్తే రూ.10వేలు ఇస్తామని వెల్లడి



ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నేషనల్ జ్యుడిషియల్ అకాడమీ ఏర్పాటుచేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు విన్నవించారు. అవకాశమిస్తే నిర్మాణాల బాధ్యత తీసుకొని, అన్నివిధాలా సహకరిస్తామన్నారు. రాజధానిలో నిర్మించే 'జస్టిస్ సిటీ'ని దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దాలనుకుంటున్నామని.. అందుకు అవసరమైన సూచనలు, సలహాలిచ్చి మార్గదర్శకత్వం చేయాలని సీజేఐని కోరారు. జ్యుడిషియల్ అకాడమీ, మధ్యవర్తిత్వ కేంద్రం, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అంతర్జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా భవనం లాంటివన్నీ ఈ 'జస్టిస్ సిటీ'లో ఉంటాయని చెప్పారు. న్యాయవ్యవస్థ, పరిపాలనకు సంబంధించిన ప్రతి విభాగం ఇక్కడ ఉండేలా చూస్తామన్నారు. అమరావతిని జ్యుడిషియల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. విజయవాడలో ఆదివారం 'మధ్యవర్తిత్వంపై రాష్ట్రస్థాయి చర్చ' నిర్వహించారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్యక్రమంలో చంద్రబాబు ప్రసంగించారు. సీజేఐ సూచనల మేరకు ఏపీ జ్యుడిషియల్ అకాడమీ కోసం మరికొంత భూమి కేటాయిస్తామని సీఎం తెలిపారు. సీజేఐ సహా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు రోజంతా అమరావతిలో, తిరుపతిలో గడపటం ఆనందంగా ఉందని, రాష్ట్ర చరిత్రలో ఇదో చారిత్రక సందర్భమన్నారు. సీఎం ప్రసంగంలోని ప్రధానాంశాలు...

మధ్యవర్తిత్వంతో ఏదైనా సాధించొచ్చు..

■ మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కారమైతే ఒక్కో కేసుకు మధ్యవర్తులకు ప్రస్తుతం రూ.3 వేలు చెల్లిస్తున్నాం. దీన్ని రూ.10 వేలకు పెంచుతున్నాం. కేసులు పరిష్కారం కాకపోయినా సరే మధ్యవర్తిత్వం వహించినందుకు రూ.3 వేలు చెల్లిస్తాం.

■ సంప్రదింపుల ద్వారా చేపట్టిన అత్యుత్తమ ప్రాజెక్టు రాజధాని అమరావతి. ప్రపంచంలో ఇలాంటిది ఇంకెక్కడా లేదు. సంప్రదింపులతో 29వేల మంది రైతుల నుంచి 33వేల ఎకరాల భూమిని స్వచ్ఛందంగా సమీకరించి రాజధానిని నిర్మిస్తున్నాం. ఇది ల్యాండ్ మానిటైజేషన్ ప్రాజెక్ట్.

■ ప్రతి ఒక్కరూ అమరావతిలో ఓ ఇంటి స్థలం ఉంచుకోండి. ఇక్కడ అత్యుత్తమ జీవన ప్రమాణాలుంటాయి. కాలుష్యరహిత నగరంగా అమరావతి ఉంటుంది.

జస్టిస్, అభివృద్ధి కలిసి పనిచేయాలి...

● న్యాయం అందటంలో జాప్యం జరిగితే.. అభివృద్ధి పురోగతిలోనూ జాప్యం చోటుచేసుకుంటుంది. జస్టిస్, అభివృద్ధి కలిసి పనిచేయాలి. విధాననిర్ణేతలుగా మేము వేగవంతమైన అభివృద్ధి కోరుకుంటాం. దానికి జ్యుడిషియరీ సహకరిస్తే దేశం అగ్రగామిగా మారుతుంది.

● నా చిన్నతనంలో మా నాన్న మధ్యవర్తిత్వం ద్వారా అనేక వివాదాలు పరిష్కరించారు. ఆయన చదువుకోలేదు. అయినా చుట్టుపక్కలుండే 20-30 గ్రామాల ప్రజలకు ఆయనపై విశ్వాసం ఉండేది.

మధ్యవర్తిత్వ ఉద్యమంలో ఏపీ ముందంజ



- ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

ఈనాడు, అమరావతి: మధ్యవర్తిత్వ ఉద్యమం క్రమంగా బలపడుతోందని.. ఆంధ్రప్రదేశ్ ఇందులో ముందుంటుందని ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ పేర్కొన్నారు. విశాఖపట్నంలో అంతర్జాతీయ మధ్యవర్తిత్వ సదస్సు నిర్వహణకు సీఎం చంద్రబాబు సహకారం అందించారని చెప్పారు. ఆదివారం విజయవాడలో జరిగిన 'మధ్యవర్తిత్వంపై చర్చాగోష్ఠి'లో ఆయన మాట్లాడారు.

సామరస్యంగా పరిష్కరించుకుంటే ఎంతో సంతోషం : 'జమ్మూకశ్మీర్ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్నప్పుడు నాకు తెలిసిన, అమెరికాలో స్థిరపడిన కోటీశ్వరుడు ఒకరు వచ్చారు. ఆయన మూలాలు జమ్మూలో ఉన్నాయి. తండ్రి మరణించారు. ఇల్లు మిగిలింది. ఇద్దరు సోదరులతో గొడవ జరిగింది. దీనిపై కోర్టుకు వెళ్లాలనుకున్నారు. మంచి న్యాయవాదిని సూచించాలని కోరారు. సోదరుడిపై కేసు ఎందుకు, ఏదైనా ఉంటే పిలిచి మాట్లాడాలని చెప్పాను. సోదరుడిని కోల్పోవద్దు, అది నష్టం అని చెప్పాను. ఆరునెలల తర్వాత ఆయన వచ్చి మీరు నా కుటుంబ బంధాలను నిలిపారని చెప్పారు. అదీ మధ్యవర్తిత్వానికి ఉన్న శక్తి' అని వివరించారు.

ప్రోత్సాహకం పెంచాలి: 'విజయవంతమైన మధ్యవర్తిత్వానికి జాతీయ న్యాయసేవాధికార సంస్థ (నల్సా) నుంచి రూ.3,000 మాత్రమే ఇస్తారు. విఫలమైతే అదీ ఉండదు. ఏడాదిన్నరలో 1,800 మంది మధ్యవర్తులకు శిక్షణ ఇచ్చినా సరైన ప్రోత్సాహకం లేదు. వారిని ప్రోత్సహించాల్సిన అంశాన్ని సీఎం చంద్రబాబు వద్ద ప్రస్తావించాం. విజయవంతమైన మధ్యవర్తిత్వానికి రూ.10,000, విఫలమైన మీడియేషన్‌కు రూ.3,000 ఇవ్వాలని కోరాం. ఆయన సానుకూలంగా స్పందించారు. న్యాయవ్యవస్థ అభ్యర్థనల్ని ఆయన ఎప్పుడూ నిరాకరించలేదు' అని జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ చెప్పారు.

ఏపీ న్యాయవ్యవస్థలో మరో చారిత్రక ఘట్టం: "అమరావతిలో నిర్మించిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు భవనాన్ని 2019 ఫిబ్రవరి 3న అప్పటి సీజేఐ జస్టిస్ రంజన్‌గొగోయ్ ప్రారంభించారు. మళ్లీ 2026 మార్చి 1న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ చేతుల మీదుగా ఏపీ జ్యుడిషియల్ అకాడమీ నిర్మాణానికి పునాదిరాయి పడింది. ఏపీ న్యాయవ్యవస్థ చరిత్రలో ఇదో కీలకఘట్టం" అని ఏపీ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్మన్ జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ పేర్కొన్నారు. "మీడియేషన్ చట్టం 2023 అమల్లోకి వచ్చాక.. రెండేళ్లలో 2లక్షల కేసులు పరిష్కారం అయ్యాయి. సుప్రీం సూచనకు అనుగుణంగా రెండునెలల్లో సుమారు 400మంది మధ్యవర్తులకు శిక్షణ ఇచ్చాం. వారు న్యాయస్థానం వెలుపల వివాదాలు పరిష్కరిస్తున్నారు. మధ్యవర్తిత్వాన్ని బలమైన సాధనంగా మార్చే దిశగా ఈ సదస్సు ఒక ముఖ్యమైన అడుగు" అని వివరించారు.



ఏపీ హైకోర్టు అతిథి గృహానికి శంకుస్థాపన చేస్తున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్. చిత్రంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్ర, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి



అమరావతిలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తుల నివాస సముదాయాన్ని ప్రారంభిస్తున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్. చిత్రంలో ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జోయ్ మల్య బాగ్చి, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి

రాజధానికి న్యాయ సొబగులు..!

(మొదటి పేజీ తరువాయి)

జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్ర, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, హైకోర్టు న్యాయమూర్తులు పాల్గొన్నారు.

పూర్ణకుంభంతో స్వాగతం

అంతకుముందు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, ఇతర న్యాయమూర్తులకు వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల మధ్య పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం జస్టిస్ సూర్యకాంత్ జ్యుడిషియల్ అకాడమీకి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యుడిషియల్ అకాడమీ, రాజధాని అమరావతి అభివృద్ధి పనులపై రూపొందించిన వీడియో డాక్యుమెంట్‌ను అతిథులు తిలకించారు.

■ ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) సాయిప్రసాద్, సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు, జీఏడీ ముఖ్యకార్యదర్శి శ్యామలరావు, పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్, ఏపీ జ్యుడిషియల్ అకాడమీ డైరెక్టర్ పురుషోత్తంకుమార్, గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ వకుల్ జిందాల్, అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.లక్ష్మీనారాయణ, అదనపు సొలిసిటర్ జనరల్ కనకమేడల రవీంద్రకుమార్, హైకోర్టు రిజిస్ట్రార్లు, పలువురు న్యాయాధికారులు ఈ పాల్గొన్నారు.

■ జ్యుడిషియల్ అకాడమీ శంకుస్థాపన కార్యక్రమం పూర్తయిన వెంటనే సీజేఐ నేలపాడు గ్రామం దగ్గరున్న ప్రస్తుత హైకోర్టు సమీపంలోని న్యాయమూర్తుల గృహ సముదాయానికి చేరుకున్నారు. ఆ సముదాయానికి పక్కనే ఉన్న స్థలంలో 'ఏపీ హైకోర్టు అతిథి గృహం, క్లబ్ భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు పాల్గొన్నారు. ఆ తర్వాత హైకోర్టు న్యాయమూర్తుల నివాసం కోసం అధునాతన హంగులతో నిర్మించిన గృహ సముదాయాన్ని ప్రారంభించారు



1) అకాడమీ వివరాలివీ..

ఏపీ సీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పిచ్చుకలపాలెం గ్రామ పరిధిలో 4.83 ఎకరాల విస్తీర్ణంలో జ్యుడిషియల్ అకాడమీ నిర్మితం కానుంది. రూ.165 కోట్లతో దీని నిర్మాణానికి పరిపాలనా అనుమతులిస్తూ రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులిచ్చింది. ఆధునిక హంగులతో అకాడమీ భవనాన్ని నిర్మించనున్నారు. అకడమిక్ బ్లాక్ బేస్‌మెంట్‌తో పాటు జీ+3 అంతస్తులతో, హాస్టల్ బ్లాక్ జీ+8 తరహాలో నిర్మితం కానున్నాయి. ఇండోర్ స్పోర్ట్స్, అతిథుల సౌకర్యార్థం నిర్మించే బ్లాక్ జీ+3 తరహాలో రూపుదిద్దుకోనుంది. 2.05 లక్షల చదరపు అడుగుల బిల్టప్ ఏరియాలో, బేస్‌మెంట్‌తో కలిపి మొత్తం బిల్టప్ ఏరియా 2.48 లక్షల చదరపు అడుగులుగా ఉంటుంది. అకాడమీలో ఒకేసారి 120 మంది ట్రైనీ న్యాయమూర్తులకు శిక్షణ ఇవ్వగల సామర్థ్యంతో పాటు 60 మంది ఫ్యాకల్టీ, ఇతర సిబ్బందికి వసతులు కల్పించేలా భవన నిర్మాణం చేస్తున్నారు.

బిల్డింగ్ లేఅవుట్ వివరాలు: అకడమిక్ బ్లాక్‌లో 500 సీట్ల సామర్థ్యంతో ఆడిటోరియం, 120 సీట్లతో సెమినార్ హాల్, 70 సీట్లతో తరగతి గదులు, 70 సీట్లతో నమూనా కోర్ట్ హాల్, 50 సీట్లతో కంప్యూటర్ ల్యాబ్, 60 సీట్లతో ఫోరెన్సిక్ ల్యాబ్, 48 సీట్లతో గ్రంథాలయం, రీడింగ్ రూమ్ నిర్మించనున్నారు.

■ న్యాయాధికారులు, ట్రైనీ న్యాయమూర్తులు, శిక్షణార్థుల నివాసం కోసం జీ+8 అంతస్తులతో అకాడమీ హాస్టల్ బ్లాక్ నిర్మించనున్నారు.

■ ఇండోర్ స్పోర్ట్స్, రిక్రియేషన్ బ్లాక్‌లో 108 సీట్ల డైనింగ్ హాల్, 10 సీట్ల వీఐపీ డైనింగ్ హాల్, పూర్తి సదుపాయాలతో కిచెన్, స్క్వాష్ కోర్ట్, జిమ్, ధ్యానం, యోగా కోసం ప్రత్యేకహాల్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ కోర్ట్‌లు, మల్టీపర్పస్ హాల్ నిర్మిస్తున్నారు. అదనంగా స్విమ్మింగ్ పూల్, డ్రైవర్‌లకు డార్మిటరీ, సిబ్బందికి వసతిగృహాలు నిర్మించనున్నారు.

■ శిక్షణ, నివాసం, క్రీడలు, విశ్రాంతి వంటి అన్ని అవసరాలనూ ఒకే ప్రాంగణంలో కల్పించేలా ఈ అకాడమీ రూపుదిద్దుకోనుంది. న్యాయమూర్తులకు ఉన్నతస్థాయి శిక్షణ అందించడంతో పాటు న్యాయవ్యవస్థ సామర్థ్యాన్ని పెంచే కేంద్రంగా ఏర్పాటుకానుంది.

2) అతిథి గృహం, క్లబ్ ప్రత్యేకతలు

రాజధాని అమరావతిలో న్యాయమూర్తుల కోసం ఆధునిక సౌకర్యాలతో ప్రత్యేక అతిథి గృహం, క్లబ్ నిర్మించనున్నారు. హైకోర్టుకు సమీపంలో, సెంట్రల్ పార్క్ పక్కన సీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ రూపుదిద్దుకోనుంది. సుమారు 6,300 చదరపు గజాల విస్తీర్ణంలో ఈ నిర్మాణం జరగనుంది. రాష్ట్ర ప్రభుత్వం రూ.69 కోట్లకు పరిపాలనా అనుమతి ఇచ్చింది.

■ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు భవనం నుంచి 1.2 కిలోమీటర్ల దూరంలోనే ఈ ప్రాంగణాన్ని నిర్మిస్తున్నారు.

3) నివాస గృహాల సౌకర్యాలివే

హైకోర్టు న్యాయమూర్తుల కోసం మొత్తం 36 నివాస గృహాలను అత్యాధునిక సౌకర్యాలతో నిర్మిస్తున్నారు. ఇప్పటికే కొన్ని పూర్తయ్యాయి. పచ్చదనానికి కేటాయించిన స్థలంతో ఒక్కో బంగ్లా 18వేల చదరపు అడుగులు ఉంటుంది. జీ+1 అంతస్తులతో నిర్మించిన ఈ భవనంలో నాలుగు పడక గదులు, ఒక ఆఫీసు రూమ్, డ్రాయింగ్ హాల్, డైనింగ్ ఏరియా, లాంజ్, అధునాతన కిచెన్, ఆటో సెన్సార్ విద్యుత్ కనెక్షన్, జిమ్ రూమ్, మల్టీ పర్పస్ హాల్, దేవుడి గది ఉన్నాయి. భవనానికి వెలుపల సర్వెంట్ రూమ్, సెక్యూరిటీ గది ఉన్నాయి.

వసుంధర

vasundhara@eenadu.in



మహిళాభ్యున్నతి కోసం నిర్విరామంగా కృషి చేస్తున్న సంస్థ... వాసవ్య మహిళా మండలి. ఐదున్నర దశాబ్దాల క్రితం విజయవాడలో ప్రారంభమైందీ సంస్థ. ఇప్పటివరకూ లక్షల మంది మహిళల జీవితాల్లో వెలుగులు నింపింది. మారుతున్న కాలానికి తగ్గట్టుగా... మహిళలకు ఆధునిక పంథాలో పలు రంగాల్లో శిక్షణ ఇస్తోంది. వాళ్లు ఆర్థికంగా, సామాజికంగా నిలదొక్కుకునేలా తోడ్పాటు అందిస్తోంది.

అతివకు అండ... వాసవ్య

1969లో మాజీ ఎంపీ చెన్నుపాటి విద్య ఆధ్వర్యంలో 'వాసవ్య' ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా ఒంటరి మహిళలు, గృహిణులు, యువతులు, బాలికలకు అండగా నిలుస్తోంది. అవసరం, పరిస్థితిని బట్టి... వాళ్లకు అనువైన అంశాల్లో శిక్షణనిస్తున్నారు. బాల్యవివాహాలను అడ్డుకుని, బాలికా విద్యను ప్రోత్సహిస్తున్నారు సంస్థ సభ్యులు. ఎన్టీఆర్, అల్లూరి సీతారామరాజు, సత్యసాయి జిల్లాల్లో అమ్మాయిలను చదివించడమే కాదు... కొందరిని ఎంపిక చేసి బాల పంచాయతీలను నిర్వహిస్తున్నారు. వాళ్ల ద్వారానే బాలికా విద్య, బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్నారు. ట్రాన్సిషన్ లర్నింగ్ సెంటర్ల ద్వారా చదువు మధ్యలోనే ఆపేసిన వారికి తగిన శిక్షణనిచ్చి తిరిగి బడిబాట పట్టిస్తున్నారు.

మహిళలకు ప్రత్యేకంగా...

వృత్తి, విద్యా కోర్సుల్లో మహిళలకు తర్ఫీదునిస్తూ సర్టిఫికేషన్ కోర్సులను నిర్వహిస్తున్నారు. భవిష్యత్తు అంతా సౌరవిద్యుత్తుదే. అందుకని, ఆ రంగంలో మహిళల్ని నిపుణులుగా తీర్చిదిద్దుతున్నారు. సోలార్ ప్యానెల్స్ బిగించడం, వాటి నిర్వహణ వంటి అంశాల్లోనూ శిక్షణనిస్తున్నారు. అవసరమైన టూల్ కిట్‌లను ఉచితంగా అందించడమే కాదు... ఉద్యోగావకాశాలు చూపిస్తున్నారు. అవసరమైతే రుణాలనీ ఇప్పిస్తున్నారు.



'బాలికల నుంచి మహిళల వరకు ఎవరికి ఏ సమస్య, అవసరం వచ్చినా మేం అండగా ఉంటాం. సామాజిక రుగ్మతలపై అవగాహన కల్పిస్తూనే మహిళలు వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడేలా చేయడం మా ప్రధాన ధ్యేయం. సాయం అవసరమైన ఎవరైనా మా వెబ్‌సైట్ ద్వారా సంప్రదించొచ్చు.

- డాక్టర్ బొల్లినేని కీర్తి, వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు

ఇప్పటివరకూ 500 మందిని సోలార్ పీవీ టెక్నీషియన్లుగా తీర్చిదిద్దారు. ట్యాలీ, జీఎస్టీ, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్... ఇలా ఆధునిక అంశాలన్నింటినీ అందుబాటులోకి తెస్తున్నారు. వ్యాపారాలు చేసుకుంటోన్న స్వయం సహాయక సంఘాల మహిళలకు ఏఐ, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంటుల్లో శిక్షణ ఇస్తున్నారు. వ్యాపారాలు ప్రారంభించాలనుకునేవారికి మార్కెట్ నైపుణ్యాలతోపాటు ఆర్థిక నిర్వహణపైనా అవగాహన కల్పిస్తున్నారు. ఆన్‌లైన్ మోసాల గురించీ చెబుతున్నారు. ప్రతి గ్రామంలో ఇద్దరు టైలరింగ్ వచ్చిన మహిళలను ఎంపిక చేసి టైలరింగ్ మెషీన్ మెకానిజంపై శిక్షణనిస్తున్నారు. మెషీన్లకు మరమ్మతులొస్తే బాగు చేస్తూ ఆదాయం పొందేందుకే ఈ ఏర్పాటు. ఇలా వెయ్యిమందికి శిక్షణని ఇప్పించారు. టైలరింగ్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్... ఇలా వీళ్లు దేనిమీద దృష్టి పెట్టినా మహిళలకు కచ్చితంగా ఆర్థిక ప్రయోజనం లభించేలా చూస్తున్నారు.

అక్కున చేర్చుకుంటూ...

ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడమే కాదు, సమస్యలతో ఆశ్రయించిన వాళ్లకి వాసవ్య అండగా నిలుస్తోంది. భార్యాభర్తల గొడవలు, తల్లిదండ్రులు చనిపోయి ఒంటరిగా మిగిలిన యువతులు, పిల్లలు పట్టించుకోని వృద్ధులు... వంటివాళ్లనీ చేరదీస్తున్నారు. వారికి కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు ఆశ్రయమూ కల్పిస్తున్నారు. పిల్లలకు చదువులు చెప్పిస్తూ యువతులు, మహిళలకు నచ్చిన రంగాల్లో శిక్షణ ఇస్తున్నారు. అనాథలైన వృద్ధుల కోసం ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆత్మరక్షణ విద్యల్లోనూ బాలికలకు తర్ఫీదునిస్తున్నారు.

– మరిశర్ల జగదీష్ కుమార్, విజయవాడ



మనకోసం మనం

ఒక స్త్రీ తన కోసం నిలబడిన ప్రతిసారీ... అందరి మహిళల కోసం నిలబడినట్లే!



- మాయా ఏంజెలో

మిమ్మల్ని మీరు శక్తిమంతం చేసుకోండి... అప్పుడు మీరు సాధించే ప్రతి చిన్న విజయం... గొప్ప సామాజిక మార్పునకి కారణం అవుతుంది.



- కిరణ్ బేడి

వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది మహిళలు జీవనోపాధి పొందుతున్న రంగం చేనేత. సరైన మార్కెటింగ్ సదుపాయాలు లేకపోవడం, విదేశీ వస్త్రాల ధాటికి స్వదేశీ కళాకారులు వెనకబడుతున్నారు. అందుకే, వీళ్లకు అండగా నిలవాలన్న ఉద్దేశంతో ప్రారంభమైంది చిత్రిక (క్రియో) ఫౌండేషన్. మహిళా సాధికారతే లక్ష్యంగా రెండు దశాబ్దాలుగా సేవలందిస్తున్న ఈ సంస్థ గురించి...

చేనేతకి చేయూత... చిత్రిక

2005లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్ ఆనంద్ (ఐఆర్ఎమ్ఏ)లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి క్షేత్ర స్థాయిలో పని చేయడం మొదలుపెట్టారు విజయ స్విత గ్రంధి. కళాకారులకు సరైన ఆదాయ మార్గాలు, గుర్తింపు లేకపోవడం గమనించారామె. కళతోపాటు కళాకారులకూ ప్రాధాన్యం ఇవ్వాలి, అందుకే వాళ్ల అభివృద్ధే లక్ష్యంగా ఒక ఫౌండేషన్ నడిస్తే బాగుంటుందన్న ఆలోచనతో... అవకాశాల కోసం వెతకడం మొదలుపెట్టారీమె. అయితే దీని స్థాపనకు క్షేత్రస్థాయిలో ఎదుర్కొన్న ఇబ్బందులు చాలానే. అది వరకే ఈ ఉద్దేశంతో చాలా సంస్థలు పని చేస్తామని చెప్పి కొన్ని రోజులకే కనుమరుగయ్యాయట. దాంతో కళాకారులు వీళ్లను నమ్మలేదట. అయితే సమావేశాలు పెట్టి వివరించడంతో చిత్రికలో భాగం కావడానికి సిద్ధమయ్యారు కళాకారులు.





చిత్రిక కమ్యూనిటీల ఏర్పాటుకే పరిమితం కాలేదు. కళాకారులకు ఏడాది పొడవునా అవసరమైన వనరులు అందిస్తూ నైపుణ్యాభివృద్ధికీ కృషి చేస్తుంది. వీళ్ల జీవనోపాధిని మెరుగుపరచి, ఆదాయాన్ని రెట్టింపు చేయడమే మా సంకల్పం. మేం ఏం చేసినా కళను నమ్ముకున్న వాళ్లు వెనకపడకూడదనే. దీనిలో భాగంగానే 'హ్యాండ్‌మేడ్ ఎంబీఏ' అనే ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టాం. నైపుణ్యాలు ఉండి, చదువుకు దూరమైన అమ్మాయిలకు మార్కెటింగ్, డిజైనింగ్, వీవింగ్‌ల్లో శిక్షణ ఇస్తున్నాం. ఐఆర్ఎమ్ఏ తరపున పట్టానూ అందిస్తున్నాం. దీనివల్ల మహిళలు, అమ్మాయిలు ఆత్మగౌరవంతో జీవిస్తున్నారు. అంకుర సంస్థల్ని స్థాపించడంలో భాగం అవుతున్నారు.

- విజయ స్విత గ్రంధి, సీఈఓ, వ్యవస్థాపకురాలు

మహిళలకు ప్రాధాన్యమిస్తూ...

నేత, హస్తకళా రంగంలో కనపడని కష్టం చేసేవాళ్లు మహిళలే. రంగులద్దడం, నూలు వడకడం, బిన్నీ చుట్టడం, డిజైన్లను నిర్ణయించడం వంటి కీలక పనుల్లో మహిళలు భాగమైనప్పటికీ... దశాబ్దాలుగా ఇది పురుషాధిక్య రంగంగానే కొనసాగింది. మహిళలు శ్రమకే పరిమితమయ్యారు. అందుకే వాళ్లకు సంస్థాగత మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు విజయ స్విత. పొందూరులో పది మంది కళాకారులతో చిత్రిక ఫౌండేషన్ కార్యకలాపాలు మొదలయ్యాయి. అది మొదలు వెనుదిరగలేదు.



కళాకారుల కళకు రంగులద్దుతూ... వాళ్లని చిన్న చిన్న సమూహాలుగా ఏర్పాటుచేయడం మొదలుపెట్టారు. నైపుణ్యాలు ఉండి వెనకబడిన మహిళలకు, ఆసక్తి ఉన్న వాళ్లకే ప్రాధాన్యం ఇవ్వడం ప్రారంభించారు. అలా ఏడాదిలోపే శ్రీకాకుళంలో నాలుగు బృందాల్ని నెలకొల్పారు. ఆధునికతను అందిపుచ్చుకోవడం, మార్కెటింగ్, ఎగ్జిబిషన్లలో పాల్గొనడం, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా విక్రయించడం వంటి నైపుణ్యాల్ని నేర్పారు. 2006లో వాళ్లందరినీ కలిపి ఒక సహకార సంఘంగా మార్చారు. ఈ సంఘం అమ్మకాలు దేశవ్యాప్తం అవ్వాలని వంశధార వీవర్స్‌ను ఉత్పత్తిదారు కంపెనీగా మలిచారు. చిత్రిక ఫౌండేషన్ సేవల్ని ఆసరాగా చేసుకుని గోదావరి విమెన్ వీవర్స్ సర్వీసెస్ ప్రొడ్యూసర్ కంపెనీ ఏర్పడింది. ఈ తరహా కంపెనీ దేశంలోనే మొట్టమొదటిది.

అందుకే... తాబేళ్ల అమ్మాయి!

పాముని అల్లంత దూరాన చూస్తే చాలు... భయంతో పరుగులు పెట్టేస్తారు ఎవరైనా. లేదంటే చంపేస్తారు. 'అరె... వాటిని చూస్తేనే ఎందుకంత భయం?' ఈ ప్రశ్నే **విజి** ఉరఫ్ జగన్నాథన్ విజయను జంతుశాస్త్రం చదివేలా, తొలి హెర్పటాలజిస్ట్ (సరీసృపాలు, ఉభయచరాల శాస్త్రవేత్త) అయ్యేలా చేసింది. ఈమెది బెంగళూరు. చిన్ననాటి నుంచీ ప్రకృతి, జంతువులంటే ఇష్టం. పాముల మీద ఆసక్తితో జువాలజీ ఎంచుకున్నారు. చదువుతూనే చెన్నైలోని 'మద్రాస్ స్నేక్ పార్క్'లో వాలంటీర్‌గా చేరారు విజి. తొలిరోజుల్లో బోనుల శుభ్రత, పాములను ఎవరూ రాళ్లతో కొట్టకుండా చూడటం వంటి పనులే చేశారు. ఏ పనైనా ఆసక్తిగా చేస్తోన్న ఆమెను స్థానిక అధికారి గుర్తించి, జాతీయస్థాయి తాబేళ్ల సర్వే నిర్వహిస్తోన్న అంతర్జాతీయ బృందంలోకి ఎంపిక చేశారు. అలా 22ఏళ్ల వయసులో తొలి భారతీయ మహిళా హెర్పటాలజిస్ట్ అయ్యారు విజి. 1980ల్లో ఈ రంగంలో మహిళలే అరుదు, పైగా ప్రమాదకరం. అయినా వెళ్లారు. తాబేళ్ల అక్రమరవాణా, వాటిని చంపి ఎగుమతులు చేస్తున్న విధానాల్ని ఫొటోలతో సహా బయటపెట్టారు. అది ఎంత ప్రభావం చూపిందంటే నాటి ప్రధాని ఇందిరా గాంధీ స్పందించడమే కాదు, తాబేళ్ల అక్రమ రవాణాని అడ్డుకునేలా చర్యలూ తీసుకున్నారు. ఫొటోగ్రఫీ, సైన్స్ కలిసి ఒక పాలసీ ఏర్పడటానికి కారణమైన సందర్భాల్లో దీన్నీ ఒకటిగా చెబుతారు. అంతేకాదు, 1900 సంవత్సరం తరవాత కనిపించకుండాపోయిన 'ఫారెస్ట్ కేన్ టర్టిల్'ని కేరళలోని స్థానిక గిరిజనుల సాయంతో కనుక్కొని, వాటి సంఖ్య పెంచడానికి ప్రత్యేక ప్రోగ్రాములు నిర్వహించారు. తాబేళ్లను కాపాడటానికి అవగాహన కార్యక్రమాలు, వాటి ఉనికిని కనుక్కోవడానికీ, కాపాడటానికీ ఎన్నో ప్రోగ్రాములూ నిర్వహించారు. ఇందుకోసం కొన్నేళ్లపాటు అడవుల్లో, గుహల్లోనే గడిపారు. అక్కడే 28ఏళ్ల వయసులో మరణించారు. ఆమె అనుసరించిన విధానాలు తాబేళ్ల ఉనికిని తెలుసుకోవడంలో, మరెన్నో పరిశోధనలకూ సాయపడ్డాయి. కాబట్టే, ఆమె కృషికి గుర్తుగా ఫారెస్ట్ కేన్ టర్టిల్‌కి 'విజయాచెలీస్ సిల్వటికా' అని ఆమె పేరు వచ్చేలా పెట్టారు. ఎవరేమన్నా... ఇప్పటికీ తాబేళ్ల సంరక్షణ కోసం పనిచేసేవాళ్లందరికీ అప్పుడూ ఇప్పుడూ 'తాబేళ్ల అమ్మాయి'గా విజి సుపరిచితమే!

తొలి మహిళ



మహిళాలోకం

ఈ మార్కెట్... 'అమ్మ'లది!

ప్రపంచంలోనే మహిళలు నడిపే అతి పెద్ద మార్కెట్ మనదేశంలోనే ఉందని తెలుసా! పేరు 'ఇమా కైథల్' అంటే అమ్మల మార్కెట్ అని అర్థం. ఇది భారతదేశ ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో ఉంది. ఇది వ్యాపార కేంద్రం మాత్రమే కాదు... ఒక చరిత్ర, సంస్కృతి, మహిళా శక్తికి ప్రతీక కూడా. 16వ శతాబ్దం నుంచి అంటే సుమారు 500 సంవత్సరాలకు పైగా నిర్విరామంగా నడుస్తోంది. అప్పట్లో 'లల్లుప్ కబా' అనే బలవంతపు శ్రమ వ్యవస్థ వల్ల పురుషులంతా యుద్ధాలకో, పనులకో వెళ్లిపోయేవారు. దాంతో మహిళలు తాము పండించిన ఉత్పత్తుల్నీ, నేసిన వస్త్రాలనీ ఇక్కడ అమ్మడం మొదలుపెట్టారు. అలా చిన్న చిన్న స్టాల్స్‌తో ప్రారంభమైన ఇమా కైథల్, నేడు 5,000 నుంచి 6,000 మంది 'ఇమా'లు (అమ్మలు) నడిపే భారీ మార్కెట్‌గా ఎదిగింది. ఇక్కడ కేవలం వివాహిత మహిళలే వ్యాపారం చేస్తారు. ఒక ఇమా రిటైర్ అయితే ఆమె స్థలాన్ని తన కుటుంబంలోని మరొక మహిళకు అప్పగిస్తుంది. ఇది ఒక సంప్రదాయం, వారసత్వం కూడా. కూరగాయలు, పండ్లు, చేపలు, ఇంటి సామగ్రి నుంచి అందమైన మణిపురి హ్యాండ్‌లూమ్ వస్త్రాలు, షాల్స్, బుట్టలు, హస్తకళా వస్తువుల వరకు... అన్నీ దొరుకుతాయిక్కడ. అంతే కాదు, ఇక్కడి మహిళలు తమ హక్కుల పట్ల చైతన్యంతో ఉంటారు. బ్రిటిష్ పాలనా కాలంలో కూడా వీళ్లు తమ హక్కుల కోసం పెద్ద ఎత్తున పోరాడారట. ముఖ్యంగా 1904, 1939 సంవత్సరాల్లో జరిగిన 'నుపీ లాల్' (మహిళల యుద్ధం)లో ఈ ఇమా కైథల్ మహిళలు కీలక పాత్ర పోషించారు. ఆ ధైర్యం, ఐక్యత ఈ రోజు కూడా ఇక్కడ ప్రతి మహిళలోనూ కనిపిస్తుంది. స్త్రీ శక్తికి, స్వావలంబనకు అవసరమైన స్ఫూర్తిని ఇమా కైథల్ శతాబ్దాలుగా అందిస్తూనే ఉంది.







మీకు తెలుసా!

1911, మార్చి 19న మొట్టమొదటిసారిగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ, స్విట్జర్లాండ్ దేశాలు అందులో పాల్గొన్నాయి. కానీ, 1917లో రష్యాలో మహిళలు 'బ్రెడ్ అండ్ పీస్' కోసం చేసిన ఉద్యమానికి గుర్తుగా మార్చి 8ని అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా మార్చారట. దీన్నే 1975లో ఐక్యరాజ్యసమితి అధికారికంగా ప్రకటించింది.

నా వెనక 'ఆమె'

అత్త కాదు... అమ్మే!

ప్రతి మహిళ విజయం వెనక పురుషుడు ఉంటాడో లేదో తెలియదు కానీ... మరో మహిళ మాత్రం కచ్చితంగా ఉంటుంది. నేనొక ప్రభుత్వ ఉపాధ్యాయురాల్ని. నా కెరియర్‌లో ఏ ఇబ్బందీ లేకుండా ముందుకు వెళ్తున్నానంటే మా అత్తే కారణం. పెళ్లయినప్పటి నుంచీ నాకు అమ్మలానే తోడుంది. ఆమె పేరు సరోజ. ఆవిడ మాతృభాష కన్నడ... అయినా నాకోసం తెలుగు నేర్చుకున్నారు. ఏ రోజూ అత్తలా అజమాయిషీ చేయలేదు. కూతురిలానే ప్రేమిస్తూ వచ్చారు. 2005-2009 మధ్య నాళ్లలో నాకు దూర ప్రాంతాలకు బదిలీ అయ్యింది. ఆ సమయంలో నా ఇద్దరు పిల్లల్నీ తనే దగ్గరుండి చూసుకున్నారు. ఇప్పటికీ ఏమైనా కావాలంటే వాళ్లు నన్ను అడగరు వాళ్ల అవ్వ(నానమ్మ)నే అడుగుతుంటారు. తను లేకపోతే నాకు ఇబ్బంది అవుతుందని... ఆమె పుట్టింటికి కూడా తక్కువగా వెళ్తుంటారు. ఇంతలా ఆదరించే అత్త ఎవరికి ఉంటుంది చెప్పండి. నేను నిజంగా అదృష్టవంతురాల్ని.



– మాలతి, హైదరాబాద్

ఆహ్వానం

ప్రతి మగవాడి విజయం వెనకా ఓ మహిళ ఉంటుందంటారు. కానీ ప్రతి ఆడపిల్ల జీవితంలోనూ అమ్మ, స్నేహితురాలు, ఉపాధ్యాయురాలు, రచయిత్రి... ఇలా ఎన్నో రూపాల్లో మరో స్త్రీ తోడుంటుంది. మిమ్మల్ని నడిపించిన అలాంటి వాళ్లెవరైనా ఉన్నారా? ఒక సలహా, హెచ్చరిక, ఓదార్పు... ఇలా ఏదో ఒక తీరులో మీ మార్గం మార్చినా, మీ జీవితాన్ని తీర్చిదిద్దినా వాళ్లనోసారి తలచుకోండి. వాళ్లు మీకు అండగా నిలిచిన విధానాన్ని మాతో పంచుకోండి. 'వసుంధర'లో ప్రచురిస్తాం. మీ పేరు, ఊరు, ఫొటోతోసహా క్లుప్తంగా వాళ్ల గురించి పంపండి.

మెయిల్: vasundhara@eenadu.in, వాట్సప్ నం: 9154091911

సురభి

యాదవ్‌ది మధ్యప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్ ప్రాంతం. ఐఐటీ దిల్లీ నుంచి బీటెక్, కాలిఫోర్నియాలోని బర్కిలీ విశ్వవిద్యాలయం నుంచి మాస్టర్స్ చేశారు. తాను సాధించిన విజయంతో సంతృప్తి చెందకుండా, తనలాంటి ఎందరో గ్రామీణ అమ్మాయిల జీవితాల్లో వెలుగులు నింపేందుకు 'సార్థు సప్నే' అనే సామాజిక సంస్థను 2020లో ప్రారంభించారామె.

గ్రామీణ యువతుల కలల వారధి!



గ్రామీణ ప్రాంతాల్లో 12వ తరగతి పూర్తి చేసిన యువతులను ఈ సంస్థ ఎంపిక చేసి, వారిని 'సప్నేవాలీస్' అని పిలుస్తుంది. ఆర్థికంగా, సామాజికంగా వెనకబడిన కుటుంబాల నుంచి వచ్చిన ఈ అమ్మాయిలకు ఏడాదిపాటు ఉచితంగా శిక్షణ ఇస్తారు. సాధారణ కళాశాలలకు భిన్నంగా కోడింగ్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, గణిత నైపుణ్యాలూ... కార్పొరేట్ ప్రపంచంలో నెగ్గుకురావడానికి అవసరమైన కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు, కెరియర్ గైడెన్స్ వంటివెన్నో నేర్పించి ఆత్మవిశ్వాసాన్ని నింపుతారు.

సప్నా కేంద్రాలు

గ్రామంలో ఉన్న అమ్మాయికి నగరంలో ఉండే యువతితో సమానమైన అవకాశాలు దక్కాలన్నదే ఈ 'సప్నేవాలీస్' ఆశయం. హిమాచల్ ప్రదేశ్‌లోని కంద్బారీ అనే గ్రామంలో తన మొదటి శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన సురభి, ఇప్పుడు ఈ నమూనాను దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నారు. ఇటీవల బిహార్ వంటి ప్రాంతాల్లో కూడా కొత్త కేంద్రాలను ప్రారంభించారు. మొత్తంగా 9 రాష్ట్రాలకు చెందిన అమ్మాయిలకు ఉపాధి మార్గాలను చూపుతున్నారు. ఇప్పటివరకు 150 మందికిపైగా యువతులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించి, నెలకు రూ.15,000కు పైగా సంపాదిస్తూ తమ కుటుంబాలకు ఆర్థిక ఆసరాగా నిలుస్తున్నారు. ఉపాధి చూపడమే కాదు, తక్కువ వయసులోనే పెళ్లిళ్లు చేసుకునే ఆచారం నుంచి ఈ అమ్మాయిలు బయటపడేలా చూస్తున్నారు. సురభి సేవలకు గుర్తింపుగా ఐఐటీ దిల్లీ 'గ్రాడ్యుయేట్ ఆఫ్ ది లాస్ట్ డికేడ్' అవార్డుకు ఎంపికచేసింది.

చిత్రకళ... మహిళా సాధికారత!






అందమైన అమ్మాయి చిత్రం అనగానే చాలామందికి ముందుగా గుర్తొచ్చేవి రాజా రవివర్మ బొమ్మలే. జరీఅంచు చీరకట్టు, రతనాల నగలతో నిండుగా కనిపించే ఆ అద్భుత సౌందర్యం... భారతీయ చిత్రకళలో ఎప్పటికీ అపురూపమే. అందుకే సంపన్నుల గృహాలంకరణలోని పెయింటింగుల్లో ఆ కళా రూపాలకే తొలి ప్రాధాన్యం. అలాగే... మధుబని, పట్టచిత్ర, తంజావూరు, గోండ్, ఫడ్... వంటి సంప్రదాయ కళల్లోని అమ్మాయిల చిత్రాలూ గోడలమీద అందంగా కనువిందు చేస్తుంటాయి. అయితే ఈమధ్య కాస్త ట్రెండ్ మారింది. సంప్రదాయ కళల్లోని అందాన్ని ఆరాధిస్తూనే... మహిళా సాధికారతను చాటే మోడ్రన్ ఆర్ట్‌నీ నేటి తరం ఇష్టపడుతోంది. డిజిటల్, కాన్వాస్... కళారూపం ఏదయినా అందులో కనిపిస్తోన్న నేటి మహిళ... మరింత అందంగా కనిపిస్తోంది. అందుకే ఆమెను ప్రతిబింబించేలా 'ఎంపవర్డ్ ఉమన్' నినాదాలతో ఉన్న కోట్ ఆర్ట్, సిల్హౌట్‌ల్ని పోలిన అబ్‌స్ట్రాక్ట్, సంస్కృతిని ప్రతిబింబించే సింబాలిక్, ప్రకాశవంతమైన రంగులతో నిండిన బోహో లుక్ అమ్మాయిల చిత్రాలూ డ్రాయింగ్‌రూమ్ గోడల్ని అలంకరిస్తున్నాయి, మహిళా శక్తిని చాటుతున్నాయి. ముఖ్యంగా రొమేనియాకు చెందిన రామోనియా పిస్టియా అనే కళాకారిణి చిత్రించిన ఎంపవర్‌మెంట్ చిత్రాలు కళాభిమానుల్ని ప్రత్యేకంగా ఆకర్షిస్తున్నాయి. 'మనలోని అంతర్గత శక్తిని వెలికి తీసే ప్రయత్నమే ఈ సాధికారత కళ. హక్కుల్నీ సమానత్వాన్నీ ప్రశ్నించేలా, ధైర్యంగా జీవించేలా, సాధికారత సాధించేలా మహిళల్ని ప్రేరేపించడమే నా చిత్రాల వెనకున్న ప్రధానోద్దేశం' అంటోన్న రామోనా ఆశయాన్ని హర్షించాల్సిందే కదూ!











అసభ్యంగా తాకారు

పదో తరగతి చదువుతున్నా. పరీక్ష పూర్తయ్యాక బయటికి వస్తొంటే ఎవరో అసభ్యంగా తాకారు. ఆ క్షణం స్తంభించిపోయా, భయంతో ఒకటే ముచ్చెమటలు. పరీక్ష హాలు దగ్గరికెళ్తొంటే అదే భయం ఆవరిస్తోంది. ఆ ప్రభావం పరీక్ష మీదా పడుతోంది. ఇది మర్చిపోయి నేను బాగా పరీక్షలు రాయాలంటే ఏం చేయాలి?

- ఓ సోదరి

నీ భయం నేను అర్థం చేసుకోగలను. అసభ్యమైన ప్రవర్తన జుగుప్సనే కాదు, బాధనీ భయాన్నీ కలిగిస్తుంది. అవతలి వ్యక్తి ఎవరో తెలియనప్పుడు ఎలాంటి చర్య తీసుకోలేం. అలాగని నువ్వు భయపడుతూ పరీక్ష హాలుకి వెళితే... దాన్ని ఆ వ్యక్తి గమనిస్తే మరింత భయపెట్టొచ్చు. నువ్వు ఆ అవకాశం ఇవ్వొద్దు. ముందు ధైర్యంగా ఉండు. ఒక్కదానివే వెళ్లకుండా స్నేహితులతో కలిసి వెళ్లు. ముఖ్యంగా ఒకసారి ఇలా జరిగినంత మాత్రాన ప్రతిసారీ ఇలాగే జరుగుతుందని అనుకోవద్దు. భయపడటం కాదు ఎదుర్కొనేలా తయారవ్వాలి. అయినా ఇప్పుడు నువ్వు నీ జీవితానికి ముఖ్యమైన దశలో ఉన్నావు. కాబట్టి, పరీక్షలపైనే దృష్టిపెట్టు. జరిగిపోయిన దాన్నే పదేపదే గుర్తు చేసుకుంటే ఆందోళన తప్ప ఏమీ ఉండదు. లేదు ఇంకా మర్చిపోలేకపోతున్నాను అనిపిస్తే నిన్ను అర్థం చేసుకునేవాళ్లకి విషయం చెప్పు. నీకు ధైర్యాన్ని ఇస్తారు. పరీక్షల తరవాత మాత్రం దీనిమీద సీరియస్‌గా దృష్టిపెట్టు. బయటపడలేకపోతే ఓసారి నిపుణుల వద్దకి కౌన్సెలింగ్‌కి వెళ్లు. పాజిటివ్‌గా ఆలోచించడం, ధైర్యంగా పరిస్థితులను ఎదుర్కోవడం... తప్పక నేర్చుకోవాల్సిన జీవన నైపుణ్యాలు. ఇప్పుడే కాదు, భవిష్యత్తులోనూ ఇలాంటి పరిస్థితులు ఎదురవ్వొచ్చు. వాటికి కుంగిపోవద్దు. ఎలా ఎదుర్కోవాలో నేర్చుకో. అవసరమైతే సాయం తీసుకో. బేలగా మాత్రం మిగలొద్దు.

డియర్ వసుంధర



డా. స్వాతి పైడిపాటి
మానసిక నిపుణురాలు


ఇజ్రాయెల్ దాడితో టెహ్రాన్‌లోని ఇరాన్ సైనిక ప్రధాన కార్యాలయం వద్ద అలముకున్న పొగ


ఇరాన్ దాడి కారణంగా ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌లో ధ్వంసమైన భవనాలు


ఇరాన్ దాడితో దుబాయ్‌లోని ఓ పారిశ్రామిక ప్రాంతంలో అలముకున్న పొగ, ఓ విలాసవంతమైన హోటల్ వద్ద చెలరేగిన మంటలు

ఉప్పందించింది అమెరికా.. దాడి చేసింది ఇజ్రాయెల్



నెలలుగా ఖమేనీ కదలికలపై కన్నేసిన అగ్రరాజ్యం


దశాబ్దాల పాటు తిరుగులేని రీతిలో ఇరాన్‌ను శాసించిన అగ్రనాయకుడు ఖమేనీ.. ప్రత్యర్థి దాడిలో అంత సులువుగా ప్రాణాలు కోల్పోవడం ఆశ్చర్యపరుస్తోంది. అమెరికా, ఇజ్రాయెల్ దాడులు దాదాపు ఖాయమని కొద్దిరోజులుగా స్పష్టమవుతున్నా ఆయనను సురక్షితంగా ఉంచడంలో అక్కడి అధికార యంత్రాంగం గట్టి చర్యలు తీసుకోలేదు. అమెరికా నుంచి అందుకున్న ఒక రహస్య సమాచారం ఆధారంగా ఇజ్రాయెల్.. శనివారం మెరుపు వేగంతో స్పందించి దాడికి దిగడంతో తప్పించుకోవడానికి ఖమేనీకి అవకాశం దక్కలేదు. తమ అణు కేంద్రాలను తొలుత లక్ష్యంగా చేసుకోవచ్చని ఇరాన్ నిఘా వర్గాలు భావించాయి. కానీ తొలి దాడి నేరుగా ఖమేనీ పైనే జరుగుతుందని ఊహించలేకపోయాయి.


గత ఏడాది నుంచే

గత ఏడాది ఇరాన్‌లోని అణు స్థావరాలపై దాడికి సన్నద్ధమవుతున్న తరుణంలోనే.. ఖమేనీ ఎక్కడ దాగున్నారో తమకు తెలుసని, కావాలనుకుంటే ఆయనను చంపగలిగి ఉండేవారమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. నాటి నుంచి ఈ పటిష్ఠ నిఘా నెట్‌వర్క్‌ను అమెరికా గూఢచర్య సంస్థ సీఐఏ కొనసాగించింది. గత ఏడాది 12 రోజుల యుద్ధం సమయంలోనే ఖమేనీ, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ దళం మధ్య కమ్యూనికేషన్ సాగుతున్న తీరు, అత్యవసర సమయాల్లో వారు చేపడుతున్న చర్యల గురించి మరింత ఎక్కువగా తెలుసుకుంది. ఆ సమాచారం ఆధారంగా తన నిఘా సామర్థ్యానికి సీఐఏ పదును పెట్టింది. తద్వారా.. ఖమేనీ కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలించడం, తదుపరి అడుగుల గురించి మరింత కచ్చితత్వంతో అంచనాలు వేయగలిగే సత్తాను సాధించింది.

సమావేశంపై సమాచారం

ఇరాన్‌లో ప్రతి శుక్రవారం ప్రభుత్వ సెలవుదినం. ఖమేనీ ప్రతీ వారం ప్రారంభం రోజున (శనివారం) తన అధికారిక నివాసంలో కీలక ప్రభుత్వ పెద్దలు, సైనిక ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించేవారు. ఖమేనీ అధికారిక నివాసానికి ఎప్పుడెప్పుడు వస్తారు? బంకర్‌లోకి ఎప్పుడెప్పుడు వెళ్తారు? అనే దానిపై సీఐఏ సమాచారాన్ని సేకరించింది. ఫిబ్రవరి 28న (శనివారం) టెహ్రాన్ నగర నడిబొడ్డులోని ఒక ప్రభుత్వ ప్రాంగణంలో ఇరాన్ అత్యున్నత స్థాయి అధికారులు సమావేశమవుతున్నట్లు గుర్తించింది. దీనికి ఖమేనీ కూడా వస్తున్నట్లు తెలుసుకుంది.




ఇజ్రాయెల్ దాడితో ధ్వంసమైన ఖమేనీ కార్యాలయ సముదాయం

దాడి ఇలా..

ఖమేనీ కదలికలపై అత్యంత విశ్వసనీయ సమాచారాన్ని సీఐఏ.. ఇజ్రాయెల్‌తో పంచుకుంది. ఆ వెంటనే ఇంటెలిజెన్స్, సైనిక ప్రణాళికపై కసరత్తు మొదలైంది. ఖమేనీ భేటీ శనివారం సాయంత్రం ఉండొచ్చని తొలుత అమెరికా, ఇజ్రాయెల్ దళాలు భావించాయి. అయితే ఆ సమావేశం ఉదయమే జరుగుతున్నట్లు చివరి నిమిషంలో ఇజ్రాయెల్ నిఘా అధికారులకు సమాచారం అందింది. దీంతో శనివారం ఉదయమే టెహ్రాన్‌పై విరుచుకుపడాలని నిర్ణయించుకున్నారు. ఖమేనీపై దాడితో యుద్ధాన్ని ప్రారంభించాలని తీర్మానించుకున్నారు. పోరు మొదలయ్యాక ఆయన బంకర్‌లో తలదాచుకోవచ్చన్న భావనకు అమెరికా, ఇజ్రాయెల్‌లు వచ్చాయి.

- ఖమేనీ సమావేశ ప్రాంగణంపై దాడికి శనివారం ఉదయం 6 గంటలకు ఇజ్రాయెల్ యుద్ధవిమానాలు దూసుకెళ్లాయి. వీటిలో అత్యంత కచ్చితత్వంతో కూడిన దీర్ఘశ్రేణి అస్త్రాలు ఉన్నాయి.
- ఉదయం 9.40 గంటలకు ఈ జెట్‌లు టెహ్రాన్‌లోని ప్రభుత్వ ప్రాంగణంపై దాడి చేశాయి. ఆ సమయంలో ఇరాన్ జాతీయ భద్రతా అధికారులు ఒక భవనంలో.. ఖమేనీ మరో భవనంలో ఉన్నారు. అయినా ఇరాన్ సుప్రీం నేత నిర్దిష్ట ప్రదేశాన్ని గుర్తించిన జెట్‌లు అత్యంత కచ్చితత్వంతో దాడులు చేశాయి.
- టెహ్రాన్‌లోని పలు లక్ష్యాలపై కూడా ఇజ్రాయెల్ యుద్ధవిమానాలు విరుచుకుపడ్డాయి. ఇదే సమయంలో తోమహాక్ క్రూజ్ క్షిపణులు, డ్రోన్లతో ఇరాన్‌లోని కీలక స్థావరాలపై అమెరికా దాడి చేసింది. ఉపరితలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించగల ఇరాన్ క్షిపణి ప్రయోగ కేంద్రాలు, ఆదేశిక, నియంత్రణ వ్యవస్థలను నిర్వీర్యం చేసే ఉద్దేశంతో ఈ చర్యకు పూనుకుంది.
- ఖమేనీ ప్రాంగణం ధ్వంసమైనట్లు ఉపగ్రహ చిత్రాలు నిర్ధారించాయి. దానిపై 30 బాంబులను ప్రయోగించినట్లు తెలుస్తోంది. ఖమేనీపై దాడికి శక్తిమంతమైన 'బంకర్ బస్టర్' బాంబులను కూడా వాడినట్లు వార్తలు వస్తున్నాయి.

-ఈనాడు ప్రత్యేక విభాగం

ఇరాన్ భవితవ్యమేంటి..?

- వీలైనంత త్వరలోనే కొత్త సుప్రీం లీడర్ నియామకం
- రేసులో ఖమేనీ కుమారుడు సహా పలువురు సీనియర్లు

ఆయతుల్లా అలీ ఖమేనీ మరణం ఇరాన్‌కు భారీ దెబ్బ! 37 ఏళ్లుగా దేశాన్ని పాలిస్తున్న ఆయన సేవలను కోల్పోవడంతో టెహ్రాన్ ప్రస్తుతం కొంత ఒత్తిడిలోకి వెళ్లనుందనడంలో సందేహం లేదు. అయితే- ఖమేనీ కన్నుమూసినంత మాత్రాన.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశిస్తున్నట్లుగా ఇరాన్‌లో ప్రభుత్వపరంగా అధికార మార్పిడి జరిగే అవకాశాలు మాత్రం లేవు. సుప్రీం లీడర్ లేకపోయినా పాలనా వ్యవహారాలు సజావుగా సాగేందుకు అవసరమైన వ్యవస్థ అందుబాటులో ఉండటం, కొత్త పాలకుడి నియామకానికి స్పష్టమైన మార్గదర్శకాలు ఉండటమే అందుకు కారణం.

ముగ్గురు సభ్యుల నాయకత్వ మండలి

సుప్రీం లీడర్ లేనప్పుడు ఇరాన్ పాలనా వ్యవహారాలను ముగ్గురు సభ్యులతో కూడిన నాయకత్వ మండలి చూసుకుంటుంది. ఇందులో దేశాధ్యక్షుడు, న్యాయ వ్యవస్థ అధిపతితో పాటు మరో సభ్యుడు భాగంగా ఉంటారు. ఖమేనీ మరణంతో ప్రస్తుతం ఈ మండలి చేతుల్లోకే ఇరాన్ పాలనా బాధ్యతలు వెళ్లాయి. ఇందులో దేశాధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్, న్యాయ వ్యవస్థ అధిపతి ఘోలామ్ హొసేన్ మొహసేనీ ఎజెహేయ్ తోడు తృతీయ సభ్యుడిగా ఆయతుల్లా అలీ రెజా అరాఫీ ప్రస్తుతం ఎంపికయ్యారు.

ఖమేనీ కుమారుడికి అవకాశం?

ఇబ్రహీం రైసీ ఇరాన్ అధ్యక్షుడిగా ఉన్నంత కాలం.. తదుపరి సుప్రీం లీడర్ ఆయనే అనే ప్రచారం జరిగింది. అయితే 2024 మేలో హెలికాప్టర్ ప్రమాదంలో ఆయన మరణించారు. దీంతో ఖమేనీ కుమారులలో ఒకరైన 56 ఏళ్ల ముజ్తబా ఖమేనీ ప్రస్తుతం రేసులో ముందున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో ప్రభుత్వ పదవిని నిర్వహించిన అనుభవం ముజ్తబాకు లేదు. ఆయన్ను సుప్రీం లీడర్‌గా నియమిస్తే మతపెద్దల కమిటీ పట్ల ప్రజల ఆగ్రహం పెరగొచ్చనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. వారసత్వ రాజకీయాలను ప్రోత్సహించడం మత సిద్ధాంతాలకు విరుద్ధమని కూడా పలువురు చెబుతున్నారు.



సుప్రీం లీడర్ నియామకానికి కమిటీ

ఇరాన్ తదుపరి సుప్రీం లీడర్ ఎవరన్నది ఇప్పుడు అత్యంత ఆసక్తికర ప్రశ్న. ఈ నియామకాన్ని చేపట్టేందుకు 88 మంది షియా మతపెద్దలతో కూడిన కమిటీ (అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్) ఉంటుంది. సుప్రీం లీడర్ మరణించినా వీలైనంత త్వరగా కొత్త అధినాయకుణ్ని నియమించాల్సిన బాధ్యత ఈ కమిటీదేనని ఇరాన్ చట్టాలు చెబుతున్నాయి. ఇందులోని సభ్యులను ప్రత్యక్ష ప్రజా ఓటింగ్ ద్వారా ఎన్నుకుంటారు. గెలిచినవారు 8 ఏళ్ల పాటు కమిటీలో ఉంటారు. మెజారిటీ ఓటింగ్ ద్వారా సుప్రీం లీడర్‌ను వీరు ఎన్నుకుంటారు. సుప్రీం లీడర్‌ను తొలగించే అధికారం కూడా ఈ కమిటీకి ఉంటుంది. అయితే ఇప్పటివరకూ అలాంటి తొలగింపు ఎన్నడూ చోటుచేసుకోలేదు. 1979లో ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం వచ్చింది. అప్పుడు సుప్రీం లీడర్‌గా ఆయతుల్లా రూహుల్లా ఖొమైనీ నియమితులయ్యారు. 1989లో ఆయన చనిపోయాక.. ఖమేనీకి ఆ పదవి దక్కింది.

రేసులో ఇంకెవరున్నారంటే..

అమెరికాకు చెందిన అంతర్జాతీయ వ్యవహారాల అధ్యయన సంస్థ 'కౌన్సిల్ ఆన్ ఫారిన్ రిలేషన్స్' ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం.. ఖమేనీ సన్నిహిత సలహాదారుడైన హుజ్జతుల్ ఇస్లాం మొహసేన్ కొమి, ఇరాన్ మతపెద్దల వ్యవస్థ నాయకత్వం వహిస్తున్న ఆయతుల్లా అలీ రెజా అరాఫీ, మతపెద్దల కమిటీ సీనియర్ సభ్యుడు ఆయతుల్లా మొహసేన్ అరాకీ, ఇరాన్ న్యాయ వ్యవస్థ అధిపతి ఘోలామ్ హొసేన్ మొహసేనీ ఎజెహేయ్, మతపెద్దల కమిటీ సభ్యుడు హషేమ్ హొసైనీ బుషెహ్రీ కూడా సుప్రీం లీడర్ పదవి రేసులో ఉన్నారు.

అమెరికాను విశ్వసించడం కష్టమే!

తాజా పరిణామాల నేపథ్యంలో ఇరాన్‌ను పూర్తిగా అధీనంలోకి తీసుకుని భవిష్యత్ గతిని మార్చుకోవాలంటూ ఆ దేశ ప్రజలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పిలుపునిచ్చారు. అయితే ఆయన మాటలను ఇరాన్‌వాసులు నమ్మేందుకు అవకాశాలు తక్కువే. ఇరాన్ బలగాల వద్ద ఆయుధాలు భారీగా ఉన్నాయి. నిరాయుధులైన ప్రజలు ప్రభుత్వంపై తిరుగుబాటు చేసి సాయుధ బలగాలను ఎదుర్కోవడం కష్టం. ఇక 1990-91 నాటి గల్ఫ్ యుద్ధం సమయంలో.. ప్రభుత్వంపై తిరుగుబాటు చేయాలంటూ ఇరాక్ ప్రజలను అమెరికా ప్రోత్సహించింది. దాడుల ద్వారా తామూ అండగా ఉంటామని చెప్పింది. కానీ తర్వాత మనసు మార్చుకుని ఇరాక్ ప్రజలకు షాకిచ్చింది. ఇరాక్‌తోపాటు దాని చుట్టుపక్కల దేశాల ప్రజలు కూడా నాటి పరిణామాలను అంత త్వరగా మర్చిపోయే అవకాశాలు లేవు. కాబట్టి ప్రస్తుతం అమెరికాను విశ్వసించి ఇరాన్‌వాసులు తిరుగుబాటు చేసే అవకాశాలు లేనట్టే!

-ఈనాడు ప్రత్యేక విభాగం


ఇరాన్ సుప్రీం నేత ఖమేనీ మృతితో టెహ్రాన్‌లో నిరసన తెలుపుతున్న ప్రజలు


ఖమేనీ హత్యపై జమ్మూ-కశ్మీర్‌లోని శ్రీనగర్‌లో ప్రజల ఆందోళన

ఖమేనీ మరణంతో పలు దేశాల్లో ఉద్రిక్తతలు.. నిరసనలు

పాక్‌లో 10 మంది మృతి

దిల్లీ /కరాచీ: ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా ఖమేనీ మరణించారన్న వార్తతో ప్రపంచంలోని పలు దేశాల్లో నిరసనలు వ్యక్తమయ్యాయి. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేస్తూ భారత్, పాకిస్థాన్, గ్రీస్, ఇరాక్‌లతోపాటు అనేక దేశాల్లో ఆదివారం ఆందోళనలు జరిగాయి. ఆయా దేశాల్లోని అమెరికా రాయబార కార్యాలయాల వైపు నిరసనకారులు దూసుకొచ్చి దాడులకు పాల్పడ్డారు. అమెరికాలోని పలు నగరాల్లోనూ ప్రజలు నిరసనలు వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌లోని కరాచీలో గల అమెరికా కాన్సులేట్ వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు, నిరసనకారుల మధ్య జరిగిన ఘర్షణలో దాదాపు 10 మంది మరణించారు. 30 మందికి పైగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. గ్రీస్ రాజధాని ఏథెన్స్‌లో వేలాదిమంది నిరసనకారులు అమెరికా, ఇజ్రాయెల్ రాయబార కార్యాలయాల ముట్టడికి ప్రయత్నించారు. ఇరాక్‌లోనూ ఆందోళనలు చెలరేగాయి. రాజధాని బాగ్దాద్‌లో ఆందోళనకారులు అమెరికా రాయబార కార్యాలయం వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో భద్రతాదళాలపై రాళ్లు రువ్వారు. వీరిని అడ్డుకునేందుకు భద్రతా దళాలు బాష్పవాయువు ప్రయోగించాయి.


పాకిస్థాన్‌లోని కరాచీలో అమెరికా కాన్సులేట్ కార్యాలయం వద్ద జరిగిన ఆందోళనలో కాలిపోతున్న పోలీసు వాహనం

భారత్‌లోనూ ఆందోళనలు

ఖమేనీ మృతితో భారత్‌లో కశ్మీర్ నుంచి కర్ణాటక వరకు పలు ప్రాంతాల్లో ఇరాన్ మద్దతుదారులు పెద్దఎత్తున నిరసనలు చేపట్టారు. జమ్మూకశ్మీర్, ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, కర్ణాటక రాష్ట్రాల్లోని ముస్లింలు ఖమేనీ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం మరికొన్ని ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహిస్తామని ప్రకటించారు. ముఖ్యంగా కశ్మీర్‌లోని లాల్‌చౌక్, బుడ్గాం, అనంతనాగ్, పుల్వామా తదితర ప్రాంతాల్లో అనేకమంది నిరసనలకు దిగారు. ఇరాన్ పరిణామాలపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు శాంతియుత నిరసనలు చేపట్టాలని సూచించారు. కర్ణాటకలోని చిక్కబల్లాపుర్ జిల్లా అలిపురా గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. భారత పర్యటనలో తమ ఆహ్వానం మేరకు ఖమేనీ అలిపురాను సందర్శించినట్లు ఆ గ్రామస్థులు తెలిపారు. ఈ గ్రామంలో మూడు రోజులపాటు వేడుకలు, ఇతర కార్యక్రమాలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. పంజాబ్‌లోని లుధియానాలోనూ నిరసనలు చేపట్టారు. ఖమేనీ హత్యను ప్రపంచంలోని అన్ని దేశాలు ముక్తకంఠంతో ఖండించాలని భారత్‌లోని ఇరాన్ ఎంబసీ కోరింది.

చట్టాల ఉల్లంఘనే

ఖమేనీ మృతిపట్ల ప్రగాఢ సంతాపం తెలుపుతున్నా. ఆయన హత్య.. మానవ నైతిక విలువలు, అంతర్జాతీయ చట్టాల దారుణ ఉల్లంఘనే.

- పుతిన్, రష్యా అధ్యక్షుడు

సైనిక చర్యలను నిలిపేయాలి

ఖమేనీని చంపడం ద్వారా ఇరాన్ సార్వభౌమత్వం, భద్రతను అమెరికా, ఇజ్రాయెల్ ఉల్లంఘించాయి. ఐక్యరాజ్య సమితి సిద్ధాంతాలను, అంతర్జాతీయ సంబంధాల్లో ప్రాథమిక నియమాలను తుంగలో తొక్కాయి. అమెరికా, ఇజ్రాయెల్ తమ సైనిక చర్యలను వెంటనే నిలిపివేయాలి. - చైనా

ఆ సంప్రదాయానికి కట్టుబడి ఉండాలి

ఈ విషాద సమయంలో ఇరాన్ ప్రజలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. ఖమేనీ హత్య అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనే. దేశాధినేతలు, ప్రభుత్వాధినేతలను లక్ష్యంగా చేసుకోకూడదన్న సంప్రదాయానికి ప్రతిఒక్కరూ కట్టుబడి ఉండాలి.

- షెహబాజ్ షరీఫ్, పాక్ ప్రధాని

మా ప్రమేయం లేదు

అమెరికా, ఇరాన్ మళ్లీ చర్చలు ప్రారంభించాలి. వివాదాలను దౌత్య మార్గాల్లోనే పరిష్కరించుకోవాలి. ఇరాన్‌పై దాడుల్లో మా ప్రమేయం లేదు. ప్రాంతీయంగా పలు దేశాలపై టెహ్రాన్ దాడులను ఖండిస్తున్నాం.

- బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్, జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రీడ్రిక్ మెర్జ్‌ల ఉమ్మడి ప్రకటన


ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌లో ఓ భూగర్భ పార్కింగ్‌లో తలదాచుకున్న పౌరులు

నాగ్‌పుర్ పరిశ్రమలో పేలుడు.. 18 మంది మృతి

నాగ్‌పుర్: ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు జరిగి 21 మంది దుర్మరణం చెందిన మర్నాడే మహారాష్ట్రలోనూ అలాంటి ఘోర విషాదమే చోటుచేసుకుంది. నాగ్‌పుర్ జిల్లాలోని పేలుడు పదార్థాల తయారీ కర్మాగారంలో ఆదివారం ఉదయం భారీ పేలుడు కారణంగా 18 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మరో 24 మంది తీవ్రంగా గాయపడ్డారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని రావుల్‌గావ్ గ్రామంలో ఉన్న ఎస్‌బీఎల్ ఎనర్జీ లిమిటెడ్ పేలుడు పదార్థాల తయారీ యూనిట్‌లో ఉదయం 7.00 గంటల ప్రాంతంలో డిటోనేటర్ ప్యాకింగ్ యూనిట్‌లో ఒక్కసారిగా భారీ పేలుడు జరిగింది. ప్రమాద ధాటికి ఫ్యాక్టరీ భవనం పూర్తిగా ధ్వంసమైంది. నాగ్‌పుర్ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడినవారికి రూ.50 వేల చొప్పున పరిహారం ప్రకటించారు.


పేలుడులో ధ్వంసమైన కర్మాగారం

పశ్చిమాసియాలో పరిస్థితిపై ప్రధాని సమీక్ష



దిల్లీ: ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడుల నేపథ్యంలో పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితిని ప్రధాని మోదీ నేతృత్వంలో భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) ఆదివారం రాత్రి సమీక్షించింది. ఈ సమావేశంలో కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, జైశంకర్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ నహ్యాన్‌తో ప్రధాని ఆదివారం మాట్లాడారు. ఆ దేశంపై ఇరాన్ దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. వీటిని మోదీ ఖండించారు. యూఏఈకి సంఘీభావం ప్రకటించారు.

ఇరాన్ ఉద్రిక్తతల వేళ.. వందలాది విమానాల రద్దు

- దుబాయ్‌లో చిక్కుకొన్న భారతీయులు

దిల్లీ, లండన్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా గల్ఫ్ దేశాలు తమ గగనతలాలను మూసివేయడంతో ఆదివారం దేశవ్యాప్తంగా వందలాది విమానాల రాకపోకలపై తీవ్ర ప్రభావం పడింది. ఆ దేశాల్లోని భౌగోళిక పరిణామాలు, గగనతల పరిమితులు, భద్రత దృష్ట్యా ఆదివారం సాయంత్రం సమయానికి స్వదేశీ సంస్థలకు చెందిన 350 విమానాలు రద్దయినట్లు కేంద్ర విమానయాన మంత్రిత్వశాఖ వెల్లడించింది. పశ్చిమాసియా గగనతలాన్ని ఉపయోగించుకొనే విమాన సర్వీసులను సోమవారం రాత్రి 11.59 గంటల వరకు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు 'ఇండిగో' తెలిపింది. పశ్చిమాసియాకు వెళ్లే దాదాపు 184 అంతర్జాతీయ విమానాలను పాకిస్థాన్ రద్దు చేసింది. అటు పశ్చిమాసియా దేశాల్లోనూ 1,800కు పైగా విమానాల రాకపోకలు నిలిచిపోయాయి.


దుబాయ్ ఎయిర్‌పోర్టులో నిలిచిపోయిన విమానాలు

పి.వి.సింధు సహా పలువురు..

ఒలింపిక్ విజేత పి.వి.సింధు, కర్ణాటకకు చెందిన జేడీ (ఎస్) ఎమ్మెల్సీ ఎస్.ఎల్.భోజేగౌడ, ఆయన కుటుంబం, బెంగాలీ నటి శుభశ్రీ గంగూలీ, ఆమె కుమారుడు, నటి సోనాల్ చౌహాన్ సహా వందలాది భారతీయులు దుబాయ్‌లో చిక్కుకుపోయారు. ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు సహా 700 మంది మధ్యప్రదేశ్ వాసులు యూఏఈలో చిక్కుకుపోయినట్లు అధికారులు తెలిపారు. పుణెలోని ఇందిరా స్కూల్ ఆఫ్ బిజినెస్ స్టడీస్ (ఐఎస్‌బీఎస్)కు చెందిన 84 మంది ఎంబీఏ విద్యార్థులు సైతం దుబాయ్‌లో నిలిచిపోయారు.

అమ్మభాష అమృతం

అందులోనే మాధుర్యం

ఈనాడు, అమలాపురం, న్యూస్‌టుడే, కలెక్టరేట్, గ్రామీణం: ఓ వ్యక్తి తన భావాన్ని మాతృభాషలో వ్యక్తం చేసినట్లు మరే భాషలోనూ చేయలేరు.. అలాంటి భాషను జాతీయ సంపదగా భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది.. అని ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ తెలిపారు. కొన్ని పద్యాలను వల్లెవేస్తూ భాషపై తనకున్న మమకారాన్ని చాటుకున్నారు. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో నిర్వహిస్తున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభలు రెండోరోజైన ఆదివారం వేడుకగా జరిగాయి. గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ఛాన్సలర్, కోనసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్) ఛైర్మన్ కేవీవీ సత్యనారాయణ రాజు (చైతన్య రాజు) అధ్యక్షతన జరుగుతున్న ఈ సభలకు అబ్దుల్ నజీర్, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మొహియుద్దీన్, జస్టిస్ ప్రవీణ్‌కుమార్, జస్టిస్ చలపతిరావు, జస్టిస్ రామకృష్ణారెడ్డి, మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ శైలజాకిరణ్, తెలంగాణ హైకోర్టు అడిషనల్ సొలిసిటర్ జనరల్ నరసింహశర్మ, ఏపీ హైకోర్టు అడిషనల్ సొలిసిటర్ జనరల్ ధనుంజయ్, ఎంపీ అప్పలనాయుడు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ సతీష్‌రెడ్డి, నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ప్రసన్నశ్రీ, సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ పాల్గొన్నారు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తన ప్రసంగాన్ని 'తెలుగు మహాసభలకు దేశ, విదేశాల నుంచి వచ్చిన భాషాభిమానులకు, సాహితీవేత్తలకు తెలుగు ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు' అంటూ తెలుగులో ప్రారంభించి, చివర్లో 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ..' గీత ఆలాపనతో ముగించారు. 'మహత్తర భాష తెలుగును పరిరక్షించడం ప్రతి తెలుగింటి బాధ్యత' అని మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్ అన్నారు.



ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై మాట్లాడుతున్న కిమ్స్ ఛైర్మన్ చైతన్యరాజు. వేదికపై ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ సతీష్‌రెడ్డి, మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, నన్నయ వీసీ ప్రసన్నశ్రీ తదితరులు

సంస్కృతీ సంప్రదాయాల సమ్మేళనం తెలుగు భాష


– అబ్దుల్ నజీర్, ఆంధ్రప్రదేశ్ గవర్నర్



తెలుగు అనేది భాష మాత్రమే కాదు. సంస్కృతీ సంప్రదాయాలు, ఆచారాల సమ్మేళనం. గిడుగు రామ్మూర్తి పంతులు చెప్పినట్లు అమ్మచేతి గోరుముద్ద తెలుగు.. రుచి రాగాల పాలముద్ద తెలుగు. అమ్మరూపం భాష అమృత జలపాతం నా తెలుగు భాష.. తెలుగు అనేది కేవలం ఇద్దరి మధ్య సంభాషణ మాత్రమే కాదు. ఇది ఒక చారిత్రాత్మక గుర్తింపు. ఓ వ్యక్తి తన భావాన్ని మాతృభాషలో వ్యక్తం చేసినట్లు మరే భాషలోనూ చేయలేరు. అలాంటి భాషను జాతీయ సంపదగా భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది. మాతృభాషను రక్షిస్తే సంస్కృతీ సంప్రదాయాలు సురక్షితంగా ఉంటాయి. ✦ వేమన పద్యాలు సులభంగా ఉంటూ, జీవితసత్యాలను తెలియజేస్తాయని వివరిస్తూ.. 'ఉప్పుకప్పురంబు' పద్యాన్ని చెప్పారు. 'ఎందరో మహానుభావులు, అందరికీ వందనాలు' అంటూ త్యాగరాజు కీర్తనను గవర్నర్ ఆలపించారు.

సామాజిక, సాంస్కృతిక వైభవానికి వారధి తెలుగు

– జిష్ణుదేవ్ వర్మ, తెలంగాణ గవర్నర్



నేను తెలుగు మాట్లాడలేకపోయినా, అర్థం చేసుకోగలను. తెలుగు ఒక భాష మాత్రమే కాదు.. సాంస్కృతిక, సామాజిక వైభవానికి వారధి. పరిపాలన సౌలభ్యం కోసం రెండు తెలుగు రాష్ట్రాలూ దీన్ని కొనసాగించాలి. కవిత్రయంగా కీర్తిపొందిన నన్నయ, తిక్కన, ఎర్రనతోపాటు అన్నమయ్య, రామదాసు, త్యాగరాజు కీర్తనలతో.. వేమన పద్యాలు తెలుగు భాషకు మణిమకుటాలు. మాజీ ప్రధాని, తెలుగు వ్యక్తి అయిన పీవీ నరసింహారావు తన హయాంలో అనేక ఆర్థిక సంస్కరణలు చేశారు. సి.నారాయణరెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి భాషాభివృద్ధికి ఎంతో కృషి చేశారు. సాంకేతిక విద్య తెలుగులోనూ ఉండాలి. భావితరాలకు భాషా మాధుర్యాన్ని పంచాలి. భాషాభివృద్ధికి అమలాపురం కిమ్స్, జీజీయూ ఆధ్వర్యంలో తెలుగు మహాసభలు నిర్వహించడం అభినందనీయం.

మాతృభాష సవాళ్లు ఎదుర్కొంటోంది

– మండలి బుద్ధప్రసాద్, అవనిగడ్డ ఎమ్మెల్యే, భాషావేత్త



ప్రస్తుత తరుణంలో తెలుగు అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. వీటిని అధిగమించి ముందుకు వెళ్లకపోతే భాష మనుగడే ప్రశ్నార్థకం. మారిషస్‌లో ఒకటో తరగతి నుంచి పీజీ వరకు తెలుగు భాష ఒక సబ్జెక్టుగా బోధిస్తున్నారు. ఇక్కడా ఆ విధానం అమలవ్వాలి. పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. మాతృభాష పరిరక్షణకు ఇతర రాష్ట్రాల్లాగే ప్రత్యేకచట్టాలు చేయాలి. ప్రతి ఇంట్లో కచ్చితంగా తెలుగులోనే మాట్లాడేందుకు ప్రయత్నం చేయాలి. పిల్లల అభిరుచికి తగ్గట్లుగా పాఠశాలలో బోధన ఉండాలి. తెలుగు మాట్లాడే వారి సంఖ్య పెరగాలి.

చిన్నతనంగా భావించకూడదు..

– సతీష్‌రెడ్డి, డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ గౌరవ సలహాదారు



వేదికలు, సమావేశాలు, సదస్సుల్లో తెలుగులో మాట్లాడటం చిన్నతనంగా భావించకూడదు. తెలుగులో మాట్లాడితే పల్లెటూరి వాళ్ల అనుకుంటారేమోనన్న ఆత్మన్యూనతా భావం వద్దు. అబ్దుల్ కలాం తన మాతృభాష తమిళంలోనే చదువుకుని ప్రముఖ శాస్త్రవేత్తగా, గొప్ప నేతగా దేశానికి విశేష సేవలందించారు. జపాన్, రష్యా తదితర దేశాల్లో మాతృభాషలోనే చదువుకుని శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణిస్తున్నారు.

వేల ఏళ్ల చరిత్ర తెలుగు సొంతం

– ప్రసన్నశ్రీ, నన్నయ విశ్వవిద్యాలయం వీసీ



తెలుగుకు వేల ఏళ్ల చరిత్ర ఉంది. ఎంతోమంది కవులు, సాహితీవేత్తలు భాషాభివృద్ధికి కృషిచేశారు. ఆ మహనీయుల కృషి ఫలితంగా నేటికీ తెలుగు గొప్పగా విరాజిల్లుతోంది. మాతృభాష మన సంస్కృతీ సంప్రదాయాలకు, చరిత్ర, ఆత్మగౌరవానికి ప్రతీక. ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్‌గా తెలుగు మాత్రమే కీర్తి పొందింది. మన భాషకు అంతర్జాతీయ స్థాయిలో ప్రాధాన్యం సాధించేలా కృషిచేయాలి.

తెలుగును కాపాడుకోలేకపోతే.. భవిష్యత్తు క్షమించదు

- భాష పరిరక్షణ బాధ్యత పండితులదే కాదు ప్రతి ఇంటిదీ..
- ప్రపంచ తెలుగు మహాసభల్లో మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్



ఈనాడు, అమలాపురం-న్యూస్‌టుడే, కలెక్టరేట్, అమలాపురం గ్రామీణం: 'తెలుగు నిలిస్తేనే సంస్కృతి నిలుస్తుంది. సంస్కృతి నిలిస్తేనే సమాజం నిలుస్తుంది. తెలుగు మన గౌరవం.. మన భావోద్వేగం. సంస్కృతిని, వారసత్వాన్ని, వేల ఏళ్ల సాహిత్యాన్ని, తత్వజ్ఞానాన్ని, భక్తి పరంపరను, కళాత్మక వైభవాన్ని మోస్తున్న మహాభాష.. తెలుగు. అంతటి మహత్తరమైన భాషను పరిరక్షించడం కేవలం పండితుల బాధ్యతే కాదు.. ప్రతి తెలుగింటి బాధ్యత' అని మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ శైలజాకిరణ్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో జరుగుతున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభల రెండో రోజు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. భాషాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి చెప్పారు. తెలుగువారి ఆత్మగౌరవం కోసం మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు పోరాడారని, 'ఈనాడు' దినపత్రిక ద్వారా తెలుగు భాషకు, తెలుగు ప్రజలకు రామోజీరావు విశేష సేవలు అందించారని వివరించారు.

మనమే... మనతోనే...

'తెలుగును కాపాడకపోతే భవిష్యత్తు మనల్ని క్షమించదు. అమ్మ భాషను మనమే మాట్లాడకపోతే మరెవరు మాట్లాడతారు? మా ఇంట్లో పిల్లలు, పెద్దలు సహా అందరం... తెలుగులోనే మాట్లాడుకుంటాం. తల్లిభాషలో పునాది బలంగా ఉన్న పిల్లలే.. పరిపక్వతతో సంస్కృతిపై గౌరవం పెంచుకుంటారు. ఆత్మవిశ్వాసంతో ఎదిగి నైతిక విలువలతో జీవిస్తారు. తల్లిభాషపై పట్టున్న పిల్లలే ఇతర భాషలను వేగంగా నేర్చుకుంటున్నారని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఆధునిక, సాంకేతిక విద్య అవసరమైనా అది మన మూలాలను కోల్పోయేలా కాకుండా బలపరిచేలా ఉండాలి. పిల్లల చేత కథలు, పద్యాలు చదివించాలి. వారికి నాణ్యమైన తెలుగు మాధ్యమ విద్యను అందించాలి' అని శైలజాకిరణ్ సూచించారు. భాషాభివృద్ధికి ఎందరో మహానుభావులు తమ జీవితాలను త్యాగం చేశారని.. నన్నయ, తిక్కన, ఎర్రన.. మహాభారతాన్ని తెలుగులోకి అనువదించి సాహితీ గగనంలో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని శ్రీకృష్ణదేవరాయలు సగర్వంగా ప్రకటించి భాషాభివృద్ధికి తనవంతు కృషి చేశారని... సామాజిక సంస్కరణలను తేవడంతో పాటు ఆధునిక తెలుగుకు కందుకూరి వీరేశలింగం పంతులు ఎంతో సేవ చేశారని గుర్తుచేసుకున్నారు. ప్రాచీన గ్రంథాలను డిజిటల్ రూపంలో భద్రపరిచి భావి తరాలకు అందించాలని, రచయితలు, కవులు, కళాకారులను ప్రోత్సహించాలన్నారు. 'తెలుగును ప్రేమిద్దాం.. తెలుగును ఆచరిద్దాం.. తెలుగును గర్వంగా ముందుకు తీసుకెళ్దాం' అని అందరితోనూ ప్రతిజ్ఞ చేయించారు. తాము తెలుగువాళ్లమని.. ప్రతి యువకుడూ, యువతీ గర్వంగా చెప్పాలంటూ శైలజాకిరణ్ పిలుపునిచ్చారు. మహాసభల్లో ఏర్పాటుచేసిన రామోజీరావు వేదిక నుంచి విద్యార్థులతో ఆమె మాట్లాడారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. పరిశోధనా రంగంలో నేటితరం కీలక భూమిక పోషించాలని పిలుపునిచ్చారు.


ప్రపంచ తెలుగు మహాసభలకు ఆదివారం హాజరైన ప్రముఖులు, భాషాభిమానులు

ప్రతి ఒక్కరికీ మాతృభాషాభిమానం ఉండాలి

– జస్టిస్ మొహియుద్దీన్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి



ప్రతి ఒక్కరికీ మాతృభాషాభిమానం కచ్చితంగా ఉండాలి. రోజువారీ వాడుక భాషలో వీలైనంతగా ఆంగ్ల పదాలు తగ్గించాలి. చిన్నతనం నుంచే పిల్లలకు అమ్మభాష విధిగా నేర్పించాలి. ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడే అక్కడి భాష మాట్లాడాలి. చిన్నతనం నుంచే పెద్ద బాలశిక్ష చదవడం అలవాటు చేయాలి. తెలుగులోని పదాలకు సందర్భోచితంగా వచ్చే అర్థాలున్న పదాలపై అధ్యయనం చేయాలి. దీనికి నిరంతర కృషి అవసరం.

తెలుగు భాష తల్లిలాంటిది..

– జస్టిస్ ప్రవీణ్ కుమార్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి



తెలుగు మనది, మనందరిదీ అనే ధోరణి ప్రజల్లో ఏర్పడాలి. పల్లె తల్లివంటిది.. పట్నం ప్రియురాలు వంటిది. మన భాష, ప్రాంతంపై అభిమానం ఉండాలి. విధి నిర్వహణలోనూ మేం తెలుగుకు ప్రాధాన్యం ఇస్తున్నాం.

ప్రాథమిక స్థాయి నుంచే మక్కువ పెంచాలి..

– జస్టిస్ చలపతిరావు, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి



ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల చరిత్ర, కవుల రచనలను పిల్లలతో మాతృభాషలో చదివిస్తే తెలుగుపై వారికి మక్కువ పెరుగుతుంది. మాతృభాషలో పరిపక్వత సాధించిన వారికి ఇతర భాషలు నేర్చుకోవడం పెద్ద కష్టమైన విషయం కాదు. చిన్నతనం నుంచీ నేర్చుకుంటేనే తెలుగులో ప్రావీణ్యం వస్తుంది.

తెలుగువారి ఆత్మీయత ఎక్కడున్నా తెలిసిపోతుంది

– జస్టిస్ రామకృష్ణారెడ్డి, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి



అమలాపురంలో నిర్వహిస్తున్న తెలుగు మహాసభలకు ఆహ్వానించడమే గొప్ప అవకాశంగా భావిస్తున్నాం. ఎక్కడున్నా తెలుగువారిని గుర్తించడం చాలా సులభం. వారి ఆత్మీయత చూసి ఇట్టే గుర్తుపట్టవచ్చు. మా ఇంట్లో అంతా తెలుగులోనే మాట్లాడతాం. ఈ తరహా మహాసభలు హైదరాబాద్‌లోనూ నిర్వహించాలి.

కోనసీమ ప్రాంతం విశ్వవ్యాప్తం

– నరసింహశర్మ, అడిషనల్ సొలిసిటర్ జనరల్, తెలంగాణ హైకోర్టు



పూర్వకాలం నుంచి కోనసీమ వేద విజ్ఞానానికి నిలయం. అంతటి గొప్పతనమున్న నేలపై తెలుగు మహాసభలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉంది. తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది. తెలుగు ఔన్నత్యాన్ని భావితరాలకు అందించేందుకు ఇలాంటి వేదికలు ఎంతగానో ఉపయోగపడతాయి.

మాతృభాషను మరచిపోకూడదు

– ధనుంజయ్, అడిషనల్ సొలిసిటర్ జనరల్, ఏపీ హైకోర్టు



తెలుగువారు ఎక్కడున్నా మాతృభాషను విస్మరించకూడదు. మరచిపోతే కన్నవారిని వదిలినట్లే అవుతుంది. విధి నిర్వహణలో భాగంగా బాధితులు తమ బాధలను తెలుగు భాషలో చెబుతుంటే ప్రోత్సహిస్తున్నాం. అమ్మ భాష పోయి.. మమ్మీ భాషలోకి వెళ్లిపోతున్నాం.. తెలుగులో మాట్లాడితే మంచి వ్యాయామంగానూ ఉపకరిస్తుంది.

తెలుగు అంటే గొప్ప సంస్కృతి

– మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి



తెలుగు పదాలను అమ్మ, ఆవుతో ప్రారంభిస్తాం. అంత గొప్ప సంస్కృతి మనది. ఆంగ్ల భాషలో ఈ విధానం ఎక్కడా కనిపించదు. పెద్ద బాలశిక్షలో గణితం, కథలు, విజ్ఞానం, పద్యాలు, వేదాలు.. ఇలా అన్నీ ఉన్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పెద్ద బాలశిక్షపై పోటీలు నిర్వహించాలి. తల్లి భాష కళ్ల లాంటిది. ఇతర భాషలు కళ్లద్దాల లాంటివి. మాతృభాషను విస్మరిస్తే అంధులతో సమానం. అమ్మభాషపై పట్టుసాధిస్తేనే ఇతర భాషల్లో ప్రావీణ్యం వస్తుంది.

కోర్టులూ 'ప్రథమ చికిత్స' అందించాలి

న్యాయం కోసం వచ్చే బాధితులకు భరోసా కల్పించాలి

- ప్రతి వ్యక్తికీ న్యాయం పొందిన ఆనందం కలిగించాలి
- ఈ బాధ్యత న్యాయమూర్తులదే • సీజేఐ జస్టిస్ సూర్యకాంత్
- తిరుపతిలో 16 కోర్టుల భవన సముదాయానికి భూమిపూజ

ఈనాడు డిజిటల్, తిరుపతి-న్యూస్‌టుడే, తిరుపతి (లీగల్, కలెక్టరేట్): తమకు న్యాయం జరుగుతుందనే పూర్తి విశ్వాసాన్ని.. కోర్టు తలుపులు తట్టే ప్రతి వ్యక్తికీ కల్పించాల్సిన బాధ్యత న్యాయమూర్తులపైనే ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. 'కోర్టు సముదాయాలు.. ఆసుపత్రుల్లా పనిచేయాలి. ఆసుపత్రికి వెళ్లిన రోగికి మొదట ప్రథమ చికిత్స అందించి ప్రాణాపాయం తప్పించినట్లే, కోర్టుకు వచ్చే బాధితుడికి తాను సురక్షితమైన చేతుల్లో ఉన్నాననే నమ్మకం కలగాలి. ఇక్కడికి వచ్చే ప్రతివ్యక్తీ న్యాయం పొందిన ఆనందంతో వెళ్లినప్పుడే ఈ భవనం 'న్యాయ దేవాలయం'గా మారుతుంది' అని ఆయన ఆకాంక్షించారు. తిరుపతి రూరల్ మండలం దామినేడు వద్ద 14.49 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకోనున్న 16 కోర్టుల నూతన భవన సముదాయానికి జస్టిస్ సూర్యకాంత్ ఆదివారం భూమిపూజ చేశారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. న్యాయవ్యవస్థలో బార్ అసోసియేషన్ ఒక అవిభాజ్య భాగమని స్పష్టంచేశారు. న్యాయం అందించడం బెంచ్(న్యాయమూర్తుల) బాధ్యతే అనుకోవడం అపోహ అని.. బార్, బెంచ్ ఒకే సంస్థకు చెందిన రెండు చేతుల్లాంటివని అభివర్ణించారు. భవిష్యత్తు వందేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని... ఇక్కడి భవన సముదాయానికి భూమిని కేటాయించిన రాష్ట్రప్రభుత్వాన్ని ఆయన అభినందించారు.

క్లిష్ట పరిస్థితుల్లోనూ ఆగని న్యాయం

కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ... గతంలో మౌలిక సదుపాయాల పరంగా న్యాయవ్యవస్థ వెనుకబడి ఉండేదన్నారు. 2014-15లో కశ్మీర్ వరదల్లో హైకోర్టు మునిగిపోయినా, ఒక న్యాయమూర్తి తన నివాసంలో టెంటు వేసి మరీ న్యాయ ప్రక్రియను కొనసాగించిన స్ఫూర్తిని ఆయన వివరించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, ఈ నూతన భవన సముదాయం జిల్లా న్యాయవ్యవస్థ పనితీరును మరింత మెరుగుపరుస్తుందన్నారు. పరిస్థితులు అత్యంత క్లిష్టంగా ఉన్న సమయంలోనూ జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్ర, జస్టిస్ మహేశ్వరిలు ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులుగా బాధ్యతలు నిర్వహించారని, పరిస్థితులు కఠినంగా మారినప్పుడు ధైర్యవంతులు ముందుకు వస్తారు... అనే నానుడిని వారు నిజం చేశారన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ న్యాయ మౌలిక సదుపాయాల అభివృద్ధికి బలమైన పునాది వేసే బాధ్యతను వారు నిబద్ధతతో నిర్వర్తించారని కొనియాడారు. ఇతర ప్రభుత్వ కార్యాలయాలతో పోలిస్తే న్యాయవ్యవస్థ మౌలిక సదుపాయాలు అత్యంత వెనుకబడి ఉండేవన్నారు. అలాంటి కష్టకాలాన్ని మనం చూశామని, కాలక్రమేణా పరిస్థితులు మెరుగుపడ్డాయన్నారు.


కోర్టుల భవన సముదాయానికి భూమిపూజ అనంతరం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్. చిత్రంలో జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ జోయ్ మల్యా బాగ్చి, జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఎస్.వి.ఎన్.భట్టి తదితరులు

అధునాతన హంగులతో...

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె.కె.మహేశ్వరి మాట్లాడుతూ.. భవన సముదాయ విశిష్టతలను వివరించారు. 14.49 ఎకరాల్లోని 2.40 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణాన్ని కోర్టుల అవసరాలకు వినియోగిస్తున్నట్లు చెప్పారు. దేశంలోనే తొలిసారిగా కోర్టుల సముదాయంలో ఎస్కలేటర్ల ఏర్పాటు, జి+5 అంతస్తులు, 16 కోర్టు హాళ్లు, లైబ్రరీ, ఆడిటోరియం, మహిళా న్యాయవాదులకు ప్రత్యేక వసతులు, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా భవన నిర్మాణాన్ని చేపట్టనుండటం గర్వించదగ్గ సందర్భమన్నారు. అభివృద్ధితోపాటు బలమైన సంస్థాగత వ్యవస్థ అవసరమని, కోర్టు అనేది బలహీనులకు చివరి ఆశ్రయం, హక్కులను రక్షించుకోవాలనుకునే వారికి మొదటి ఆశ్రయం కావాలన్నారు.

■ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జయసూర్య మాట్లాడుతూ.. తిరుపతి బార్ అసోసియేషన్‌కు వందేళ్లకు పైగా చరిత్ర ఉందని, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సమక్షంలో ఈ భూమిపూజ జరగడం చరిత్రాత్మక ఘట్టమన్నారు. తిరుపతి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.గజేంద్ర మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి పాత భవనాల్లో ఇబ్బందులు పడిన న్యాయవాదుల కల నేడు నెరవేరిందన్నారు.

■ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్ర, జస్టిస్ ఎస్.వి.ఎన్.భట్టి, జస్టిస్ జోయ్ మల్యా బాగ్చి, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ దొనాడి రమేశ్, జస్టిస్ మహేశ్వరరావు కుంచం, జస్టిస్ టి.సి.డి.శేఖర్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక, కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న జస్టిస్ సూర్యకాంత్. చిత్రంలో సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తులు



మృతురాలు సత్యవేణి కుటుంబసభ్యులకు రూ.20 లక్షల చెక్కు అందిస్తున్న మంత్రులు అనిత, నారాయణ, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీ సానా సతీష్ ★ ఘటనాస్థలిని పరిశీలిస్తున్న మంత్రులు అనిత, నారాయణ, సుభాష్, భాజపా రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, తదితరులు

పేలుడు ఘటనకు బాధ్యులందరిపైనా చర్యలు

- బాణసంచా వ్యాపారంలో వైకాపా నేత లింకులపైనా విచారణ
- బాధిత కుటుంబాల ఇళ్లకు వెళ్లి చెక్కులు అందజేసిన మంత్రులు

ఈనాడు, కాకినాడ; న్యూస్‌టుడే, సామర్లకోట గ్రామీణం: కాకినాడ జిల్లా వేట్లపాలెం బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడుకు కారణమైన బాధ్యులందరిపైనా చర్యలు తీసుకోవడంతో పాటు.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిశితమైన పర్యవేక్షణ వ్యవస్థలను అమలుచేస్తామని మంత్రులు అనిత, నారాయణ, సుభాష్ అన్నారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌తో కలిసి ఆదివారం ఘటనా ప్రదేశాన్ని వీరు పరిశీలించారు. 'ఈ ఘటనలో యజమాని నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం ఉన్నాయి. భద్రత కోసం పటిష్ఠమైన నిబంధనలు తెచ్చినా ఇలాంటివి జరగడం దురదృష్టకరం. దీనికి బాధ్యులుగా నలుగురు అధికారులను సస్పెండ్ చేసి సమగ్ర విచారణకు ఆదేశించాం' అని హోంమంత్రి అనిత అన్నారు. 'తప్పిదం ఎవరిదైనా కూలీలు బాధితులయ్యారు. వారందరికీ ప్రభుత్వం అండగా నిలుస్తుంది. బాధిత కుటుంబాలకు రూ.20లక్షల సాయం, ఇళ్లు లేనివారికి ఇళ్లు నిర్మించి ఇస్తాం. తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను చదివించే బాధ్యత తీసుకుంటాం' అని కాకినాడ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నారాయణ అన్నారు. పర్యటనలో కలెక్టర్ షాన్ మోహన్, ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ బిందుమాధవ్ తదితరులు పాల్గొన్నారు. 'ఈ బాణసంచా వ్యాపారంలో స్థానిక వైకాపా నేత పెట్టుబడులు ఉన్నట్లు కొంతమంది చెబుతున్నారు. ఇదివరకు వీరిద్దరూ కలిసి వ్యాపారం చేశారు. అప్పుడూ ప్రమాదం జరిగి ఆ నాయకుడు జైలుకు వెళ్లారు. పేలుడు జరిగిన ప్రాంతంలో మాజీ సీఎం జగన్ కరపత్రాలు ఎక్కువ కనిపిస్తుండడం అనుమానాలకు తావిస్తుంది. వైకాపా నేతల లింకులపైనా విచారణ చేయిస్తాం' అని హోంమంత్రి అన్నారు.


ఘటనా స్థలంలో చిందరవందరగా మాజీ సీఎం జగన్ కరపత్రాలు

చెక్కుల పంపిణీ..

పేలుడులో చనిపోయినవారి ఇళ్లకు వెళ్లి పరిహారం చెక్కులను మంత్రులు అందించారు. 20 కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున రూ.4కోట్ల పరిహారాన్ని అందజేసి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, ఎంపీలు సానా సతీశ్ బాబు, ఉదయ్‌శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో వాహన విలాసమే

మారుతీ, టాటా మోటార్స్, మహీంద్రా విక్రయాల్లో వృద్ధి



దేశీయ విపణిలో స్థిరమైన గిరాకీ లభిస్తున్నందున.. ఫిబ్రవరిలో అగ్రగామి వాహన కంపెనీలు మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా తమ టోకు విక్రయాల్లో వృద్ధి నమోదుచేశాయి. దిగ్గజ సంస్థ మారుతీ సుజుకీ ఇండియా దేశీయ విపణిలో 1,61,000 వాహనాలు విక్రయించింది. 2025 ఇదే నెలలో ఇవి 1,60,791గా ఉన్నాయి. మారుతీ చిన్న కార్ల విక్రయాలు స్వల్పంగా పెరిగి 10,238కు చేరాయి. కాంపాక్ట్ కార్ల విక్రయాలు 72,942 నుంచి 66,286కు తగ్గాయి. యుటిలిటీ వాహన విక్రయాలు 65,033 నుంచి 72,756కు పెరిగాయి. నిరీక్షణ సమయాన్ని తగ్గించేందుకు, ఉత్పత్తి పెంచుతున్నామని మారుతీ సుజుకీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి (మార్కెటింగ్, అమ్మకాలు) పార్థో బెనర్జీ తెలిపారు. గత నెలలో రికార్డు స్థాయిలో మొత్తం 2.14 లక్షల విక్రయాలు (ఎగుమతులు కలిపి) నమోదుచేశామని అన్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలను గమనిస్తున్నామని, ఈ ప్రాంతానికి పెద్దగా కంపెనీ ఎగుమతులు లేవని మారుతీ ఎగ్జిక్యూటివ్ (కార్పొరేట్ అఫైర్స్) రాహుల్ భర్తీ తెలిపారు.

✦ టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ దేశీయ విపణికి 62,329 వాహనాలను సరఫరా చేసింది. 2025 ఫిబ్రవరిలో సరఫరా చేసిన 46,435 వాహనాలతో పోలిస్తే ఇవి 34% అధికం. మహీంద్రా అండ్ మహీంద్రా దేశీయ ప్రయాణికుల వాహన సరఫరాలు 50,420 నుంచి 19% పెరిగి 60,018కు చేరాయి. హ్యుందాయ్ మోటార్ టోకు విక్రయాలు 10% పెరిగి 52,407కు చేరాయి. టయోటా దేశీయ సరఫరాలు 16% పెరిగి 30,737గా నమోదయ్యాయి. కియా ఇండియా విక్రయాలు 25,026 నుంచి 27,610కు చేరాయి.

✦ ద్విచక్ర వాహన విభాగంలో హీరో మోటోకార్ప్ విక్రయాలు 3,57,296 నుంచి 45% వృద్ధితో 5,16,968కు పెరిగాయి.

ఫిబ్రవరిలో మొత్తం వాహన విక్రయాలు

కంపెనీ	2026	2025	వృద్ధి/(క్షీణత) (%)
మారుతీ సుజుకీ	2,13,995	1,99,400	7.32
హ్యుందాయ్	66,134	58,727	12.6
టాటా మోటార్స్ పీవీ	63,331	46,811	35
మహీంద్రా అండ్ మహీంద్రా	97,177	83,702	18
టయోటా కిర్లోస్కర్	34,034	28,414	20
కియా ఇండియా	27,610	25,026	10.3
రెనో ఇండియా	3,495	2,676	31
జేఎస్‌డబ్ల్యూ ఎంజీ	4,957	4,002	24
రాయల్ ఎన్‌ఫీల్డ్	1,00,905	90,670	11
హీరో మోటోకార్ప్	5,16,968	3,57,296	45
హోండా కార్స్	7,212	10,320	30.11
టాటా మోటార్స్ కమర్షియల్	42,940	32,533	32

మహీంద్రా ఎక్స్ఈవీ 9ఇ సినీలక్స్



మహీంద్రా అండ్ మహీంద్రా సంస్థ, విద్యుత్తు ఎస్‌యూవీ ఎక్స్ఈవీ 9ఇ సినీలక్స్ ఎడిషన్‌ను ఆదివారం ఆవిష్కరించింది. ఈ కారు ధర రూ.29.35 లక్షలు (ఎక్స్‌షోరూం) అని ప్రకటించింది. సోమవారం (ఈనెల 2) నుంచి బుకింగులు ప్రారంభిస్తున్నామని, కారు డెలివరీలు ఈనెల 10 నుంచి చేపడతామని సంస్థ తెలిపింది. విలాసవంత - అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ, సదుపాయాలతో రూపొందించిన ఈ కారులో ప్రీమియం ఇంటీరియర్స్ అమర్చినట్లు సంస్థ వివరించింది. డాల్బీ అట్మోస్‌తో కూడిన 16 స్పీకర్ల హార్మన్ కార్డన్ ఆడియో సిస్టమ్, హ్యాండ్స్ ఫ్రీ పార్క్ అసిస్టెంట్, సెక్యూర్ 360 సేఫ్టీ సూట్ వంటి సదుపాయాలు ఈ కారులో ఉన్నాయి. 79 కిలోవాట్‌అవర్ బ్యాటరీ వల్ల ఒక ఛార్జింగుతో 500 కిలోమీటర్లు ప్రయాణించొచ్చని కంపెనీ వెల్లడించింది.

ఐఐఎఫ్‌సీఎల్ పబ్లిక్ ఇష్యూ 2026-27లో

ప్రభుత్వరంగ ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ కంపెనీ (ఐఐఎఫ్‌సీఎల్) పబ్లిక్ ఇష్యూకు సన్నాహాలు మొదలయ్యాయి. ఇందుకు ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని దీపమ్ విభాగం తమకు తెలియచేసిందని ఐఐఎఫ్‌సీఎల్‌కు కొత్తగా మేనేజింగ్ డైరెక్టరుగా నియమితులైన రోహిత్ రిషి వెల్లడించారు. తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ప్రతిపాదనలను ప్రభుత్వానికి తెలియచేస్తామని, ఈ ఇష్యూ వచ్చే ఆర్థిక సంవత్సరంలో కార్యరూపం దాల్చే అవకాశం ఉందని తెలిపారు. 2006లో ఏర్పాటైన ఐఐఎఫ్‌సీఎల్‌లో ప్రభుత్వానికి 100% వాటా ఉంది. మౌలిక ప్రాజెక్టులకు దీర్ఘకాలిక ప్రాతిపదికన ఈ సంస్థ రుణాలు అందిస్తుంటుంది. గత మార్చి ఆఖరుకు ఈ కంపెనీ అధీకృత చెల్లింపు మూలధనం రూ.10,000 కోట్లుగా ఉంది.



గెయిల్ ఛైర్మన్‌గా దీపక్ గుప్తా బాధ్యతల స్వీకరణ



దిల్లీ: దేశీయ అతిపెద్ద గ్యాస్ సరఫరా సంస్థ గెయిల్ ఇండియా, ఛైర్మన్-మేనేజింగ్ డైరెక్టరుగా దీపక్ గుప్తా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. 2029 ఫిబ్రవరి 28 వరకు ఈయన ఈ పదవిలో ఉంటారు. సందీప్ కుమార్ గుప్తా పదవీ విరమణతో, దీపక్ బాధ్యతలు చేపట్టారు. మెకానికల్ ఇంజినీర్ అయిన గుప్తా, గెయిల్‌లో పలు కీలక బాధ్యతలు నిర్వర్తించారు.

భారత్‌కు చమురు ముప్పు ఎంత?



- ధరలు భగ్గుమనే ప్రమాదం
- రవాణా, బీమా ఖర్చులూ అధికమవుతాయ్

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ మెరుపు దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ మరణించడంతో, ఈ ప్రాంతంలో యుద్ధం తీవ్రమైంది. వెనెజువెలా అధ్యక్షుణ్ని అమెరికా బందీగా పట్టుకెళ్లినా, పరిస్థితులు విషమించలేదు. అయితే ఇరాన్ పరిస్థితి అందుకు భిన్నమని.. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్, దేశ ప్రజలు కూడా భిన్నంగా స్పందించే అవకాశం ఉందని జీటీఆర్ఐ అంచనా వేస్తోంది. తాజా పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాకు విఘాతం కలిగించి, ధరలు పెరిగితే, మన ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

హార్ముజ్ మూసివేతతో కష్టమే

చమురు, సహజవాయువు రవాణాకు అత్యంత కీలకమైన 33 కిలోమీటర్ల పొడవైన హార్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేస్తోంది. ప్రపంచ చమురు రవాణాలో దాదాపు 20%, మనదేశానికి 35-50% ఈ మార్గంలోనే జరుగుతోంది. ఈ మార్గాన్ని మూసివేస్తే, చమురు రవాణా నౌకలు అధిక దూరం ప్రయాణించాల్సి వస్తుంది. ఫలితంగా రవాణా ఖర్చులు, బీమా వ్యయాలూ భారీగా పెరిగే ప్రమాదం ఉంది. ప్రస్తుతం బ్యారెల్ ముడిచమురు ధర 70-73 డాలర్ల వద్ద ఉండగా, ఈ ఉద్రిక్తతల వల్ల 90- 100 డాలర్ల స్థాయిని మించొచ్చన్న అంచనాలు ఉన్నాయి. ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈ నుంచి వచ్చే చమురు రవాణా నిలిచిపోయే అవకాశం ఉంటుంది. మనదేశ చమురు అవసరాల్లో 85% దిగుమతులే తీరుస్తున్నాయి. ధరలు పెరిగి, డాలర్లలో చెల్లించాల్సి వస్తే.. మన కరెంట్ ఖాతా లోటు అధికమవుతుంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనం కావచ్చు. దేశీయంగా రవాణా వ్యయాలు అధికమై, ధరలు పెరగొచ్చు.

✦ మనదేశం రష్యా, అమెరికా, పశ్చిమ ఆఫ్రికా నుంచి చమురు దిగుమతి పెంచుకోవాల్సి ఉంటుంది. ఇది కూడా ఖర్చు-రవాణా సమయాన్ని పెంచే అంశమే.

✦ స్వల్పకాలంలో ముడిచమురు బ్యారెల్ ధర 90 డాలర్లను మించితే.. చైనా, జపాన్, దక్షిణ కొరియా వంటి ఆసియా దేశాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుంది.

✦ ఇరాన్‌పై పాశ్చాత్య దేశాల ఆంక్షల కారణంగా, ఇప్పటికే ఆ దేశంతో మన ద్వైపాక్షిక వాణిజ్యం పరిమితంగా ఉంది. 2025లో ఇరాన్‌కు మన దేశం నుంచి 1.2 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.10,800 కోట్లు) ఎగుమతులు వెళ్లాయి. ఇందులో ప్రధానంగా బియ్యం (747 మి.డా/రూ.6,700 కోట్లు), అరటిపండ్లు, టీ ఉన్నాయి. అక్కడ నుంచి దిగుమతులు 408.6 మిలియన్ డాలర్లు (సుమారు రూ.3,700 కోట్లు)గా ఉన్నాయి. ఆ దేశం నుంచి పెట్రోలియం కోక్, యాపిల్స్, ఖర్జూరం ఎక్కువగా వస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ వాణిజ్యంలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది.

హైఫా పోర్ట్ సురక్షితం: అదానీ గ్రూప్

ఇజ్రాయెల్‌లోని తమ హైఫా పోర్ట్ పూర్తిగా సురక్షితంగా ఉందని, కార్యకలాపాలు కొనసాగుతున్నాయని అదానీ గ్రూప్ ఆదివారం ప్రకటించింది. ఉద్యోగులందరూ సురక్షితంగా ఉన్నారని, పోర్ట్ ఆస్తులు, మౌలిక సదుపాయాలు భద్రంగా ఉన్నాయని అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ తెలిపింది. అయితే ఇరాన్ డ్రోన్లు, క్షిపణులు ఏవైనా పోర్టును తాకాయా లేదా అనే విషయాన్ని మాత్రం సంస్థ వెల్లడించలేదు. తాజా పరిస్థితిని పోర్ట్ అథారిటీ నిరంతరం పర్యవేక్షిస్తోందని, ఇజ్రాయెల్ రవాణా శాఖతో కలిసి పనిచేస్తున్నామని, వారి ఆదేశాల ప్రకారమే కార్యకలాపాలు సాగుతున్నాయని స్పష్టం చేసింది.

జీసీసీతో ఎఫ్‌టీఏ ఆలస్యం కావచ్చు

ఆరు దేశాల గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ- సౌదీఅరేబియా, యూఏఈ, ఖతార్, కువైట్, ఒమన్, బహ్రెయిన్)తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కూడా ఆలస్యం కావచ్చు. ఈ దేశాల్లో మనదేశీయులు కోటి మంది జీవనం సాగిస్తున్నారు. 2024-25లో జీసీసీకి మన ఎగుమతులు 57 బి.డా. (సుమారు రూ.5.13 లక్షల కోట్లు) ఉండగా, దిగుమతులు 121.7 బి.డా. (రూ.10.95 లక్షల కోట్లు)గా ఉన్నాయి.

సీఐఎఫ్ ఒప్పందాలపై జాగ్రత్త: ఐఆర్ఈఎఫ్

హార్ముజ్ జలసంధి ద్వారా రవాణాపై ఆంక్షలు విధించినందున.. ఇరాన్, గల్ఫ్ దేశాలకు కొత్త 'కాస్ట్, ఇన్సూరెన్స్, ఫ్రైట్ (సీఐఎఫ్) ఒప్పందాలు చేసుకోవద్దని ఇండియన్ రైస్ ఎక్స్‌పోర్టర్స్ ఫెడరేషన్ (ఐఆర్ఈఎఫ్) తమ సభ్యులకు సూచించింది. సీఐఎఫ్ ఒప్పందం ప్రకారం.. సరకును జలమార్గం ద్వారా రవాణా చేసేటపుడు దానికి అయ్యే ఖర్చులు, బీమా, రవాణా రుసుములను విక్రేత భరించాల్సి ఉంటుంది. సాధ్యమైనంత వరకు విక్రయాలను ఫ్రీ ఆన్ బోర్డ్ (ఎఫ్ఓబీ) నిబంధనలపై పూర్తి చేయాలని సభ్యులను ఐఆర్ఈఎఫ్ కోరింది. దీని వల్ల రవాణా, బీమా, ఇతర ముప్పులు అంతర్జాతీయ కొనుగోలుదారుపైనే ఉంటాయి.

మన దగ్గర సరిపడా నిల్వలు ఉన్నాయా?



పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో.. మన దేశానికి సరఫరా అయ్యే చమురులో దాదాపు సగం మేర అంతరాయం కలిగే ప్రమాదం ఉంది. అయితే ఇరాన్- అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం దీర్ఘకాలం కొనసాగినా, మన వద్ద తగినన్ని చమురు నిల్వలు ఉన్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు, వాణిజ్య నిల్వలు, రష్యా దిగుమతుల ద్వారా సరఫరాలో సమతుల్యత నిర్వహించొచ్చని కెప్లర్ విశ్లేషకుడు సుమిత్ రిటోలియా వెల్లడించారు.

✦ కెప్లర్ గణాంకాల ప్రకారం.. మన దేశం దగ్గర వాణిజ్య ముడిచమురు నిల్వలు దాదాపు 100 మిలియన్ బ్యారెళ్లు ఉన్నాయి. ఇందుకు అదనంగా మంగళూరు, పడూర్, విశాఖపట్నం ప్రాంతాల్లోని వ్యూహాత్మక నిల్వ కేంద్రాల్లో దాదాపు 39 మి.బ్యారెళ్లు ఉంది.

✦ హార్ముజ్ జలసంధి ద్వారా రోజుకు సగటున 2.5 మిలియన్ బ్యారెళ్ల చమురు దిగుమతి అవుతోంది. మన దేశ మొత్తం దిగుమతుల్లో ఇది 50 శాతానికి సమానం. ఈ సరఫరా నిలిచినా, మన నిల్వలు దాదాపు 60 రోజుల దిగుమతులకు సరిపోతాయి. అదనంగా చమురు మార్కెటింగ్ కంపెనీల వద్ద ఉన్న రిఫైన్డ్ ప్రోడక్ట్ నిల్వలు, ఈ సామర్థ్యాన్ని మరింత పెంచుతాయి అని కెప్లర్ సీనియర్ రీసెర్చ్ అనలిస్ట్ నిఖిల్ దూబే పేర్కొన్నారు.

✦ భౌగోళిక - రాజకీయ ఒడుదొడుకులు ఎదురైనప్పుడు ఇంధన అవసరాలను తీర్చడానికి దేశంలోని వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు 74 రోజుల పాటు సరిపోతాయని గతంలో కేంద్ర చమురు మంత్రి హర్దీప్ సింగ్ పురి ప్రకటించారు.

స్పామ్ మెసేజ్‌లు అరికట్టేందుకు ఎయిర్‌టెల్, గూగుల్ భాగస్వామ్యం

సంక్షిప్త సందేశాల (ఎస్ఎంఎస్)లో స్పామ్‌ను అరికట్టేందుకు ఏఐ (కృత్రిమమేధ) ఆధారిత స్పామ్ ప్రొటెక్షన్ టూల్‌ను భారతీ ఎయిర్‌టెల్ వినియోగించనుంది. గూగుల్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ ద్వారా వచ్చే వెబ్ లింక్‌లను కూడా పరిశీలించేందుకు ఇది ఉపయోగ పడనుంది. వినియోగదారులు డిజిటల్ మోసాల బారిన పడకుండా చూసేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఇరు సంస్థలూ ప్రకటించాయి. ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ ఇంటెలిజెన్స్‌కు గూగుల్‌కు చెందిన రిచ్ కమ్యూనికేషన్స్ సర్వీసెస్ (ఆర్‌సీఎస్) జత కలవడం వల్ల మోసపూరిత సందేశాలను అడ్డుకోవడమే కాక, అధిక నాణ్యత గల ఫోటోలు/వీడియోలు, ఇంటరాక్టివ్ మెసేజ్‌లను వినియోగదారులు అందుకోగలరని తెలిపాయి. గత ఏడాదిన్నర వ్యవధిలో 7,100 కోట్ల మోసపూరిత కాల్స్, 290 కోట్ల మోసపూరిత సందేశాలను అడ్డుకోగలిగినట్లు ఎయిర్‌టెల్ తెలిపింది.

కోడి గుడ్డు — 2న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	450	తూ/ప గోదావరి	458
వరంగల్	452	విశాఖపట్నం	465
విజయవాడ	500	చిత్తూరు	493

పసిడి, వెండి పెరుగుతాయ్


కమొడిటీస్ ఈ వారం

పసిడి



పసిడి ఏప్రిల్ కాంట్రాక్టు ఈవారం మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం కమాండర్ ఖమేనీ సహా పలువురు ముఖ్యనేతలు హతమవ్వడం, ఇరాన్ ప్రతిదాడుల నేపథ్యంలో.. అంతర్జాతీయ ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్నాయి. రూ.1,61,971 వద్ద ముగిసిన ఈ కాంట్రాక్టు తాజా పరిణామాల్లో మరో 11-14% పెరగొచ్చని అంచనా వేస్తున్నారు. మంగళవారం హోలీ కావడంతో సాయంత్రం నుంచే ట్రేడింగ్ ఉంటుంది.

వెండి



వెండి మార్చి కాంట్రాక్టు రూ.2,73,389 వద్ద ఉంది. పశ్చిమాసియా యుద్ధ పరిస్థితులు కొనసాగితే ఈవారం ధర మరో 10-16% పెరగొచ్చని అంచనా వేస్తున్నారు.

ప్రాథమిక లోహాలు



✦ **రాగి** మార్చి కాంట్రాక్టు రూ.1,171 కంటే కిందకు రాకుంటే సానుకూల ధోరణి కొనసాగొచ్చు. ఈ స్థాయి వద్ద స్టాప్‌లాస్ పెట్టుకుని, లాంగ్ పొజిషన్లు కొనసాగించడం మంచిదే.

✦ **సీసం** మార్చి కాంట్రాక్టు రూ.186.55 కంటే దిగువన ట్రేడయితే రూ.184.50 వరకు దిద్దుబాటు కావచ్చు. ఒకవేళ సానుకూల ధోరణిలో చలిస్తే రూ.190.65 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.191.65; రూ.193.15 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.

✦ **జింక్** మార్చి కాంట్రాక్టు రూ.317 కంటే దిగువన ట్రేడ్‌కాకుంటే, లాంగ్ పొజిషన్ల వైపు మొగ్గు చూపొచ్చు. ధర తగ్గినప్పుడల్లా మరిన్ని లాంగ్ పొజిషన్లను జత చేసుకోవడమూ మంచి వ్యూహమే అవుతుంది.

✦ **అల్యూమినియం** మార్చి కాంట్రాక్టు రూ.303.45 కంటే కిందకు వస్తే, రూ.297.65; రూ.291.25 వరకు దిద్దుబాటు అయ్యే అవకాశం ఉంది. ఒకవేళ రూ.315.65 కంటే పైకి వెళితే రూ.322.05-327.85 వరకు పెరగొచ్చు.


ఇంధన రంగం



✦ **ముడి చమురు** మార్చి కాంట్రాక్టు రూ.5,897 కంటే దిగువన ట్రేడ్ కాకుంటే.. లాంగ్ పొజిషన్లు కొనసాగించొచ్చు. ఇరాన్‌లో యుద్ధం వల్ల, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరుగుతాయి. అంతర్జాతీయ భౌగోళిక - రాజకీయ పరిణామాలను ట్రేడర్లు ఎప్పటికప్పుడు గమనిస్తూ ట్రేడ్ చేయడం మంచిది.

✦ **సహజవాయువు** మార్చి కాంట్రాక్టు ప్రతికూల ధోరణిలోనే కనిపిస్తోంది. రూ.267.85 కంటే పైన ట్రేడ్ కాకుంటే, రూ.231 వరకు పడిపోయే అవకాశం ఉంది.

వ్యవసాయ ఉత్పత్తులు



✦ **పసుపు** ఏప్రిల్ కాంట్రాక్టు రూ.15,050 వరకు దిద్దుబాటు కావచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.14,521; రూ.13,834 వరకు దిగిరావచ్చు.

✦ **జీలకర్ర** మార్చి కాంట్రాక్టు రూ.21,785 వరకు దిగివచ్చే అవకాశం ఉంది.

- ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

గతవారం కదలికలు ఇలా

కమొడిటీ	ప్రారంభం (రూ.లలో)	ముగింపు (రూ.లలో)	వృద్ధి/క్షీణత (శాతంలో)
పసిడి (ఏప్రిల్)	1,58,458	1,62,104	2.30
వెండి (మార్చి)	2,71,378	2,82,644	4.15
రాగి (మార్చి)	1,193.05	1,221.10	2.35
సీసం (మార్చి)	188.80	189.55	0.4
జింక్ (మార్చి)	327.35	326.55	-0.24
అల్యూమినియం (మార్చి)	312.15	312.80	0.21
ముడి చమురు (మార్చి)	6,093	6,100	0.11
సహజ వాయువు (మార్చి)	287.20	260.30	-9.37
పసుపు (ఏప్రిల్)	15,950	15,484	-2.92
జీలకర్ర (మార్చి)	23,050	22,145	-3.93

మార్కెట్‌కు యుద్ధ నష్టాలే

స్టాక్ మార్కెట్ ఈ వారం

- టారిఫ్ అనిశ్చితులతో ఇప్పటికే ప్రతికూలతలు
- ఇరాన్ పరిణామాలతో మరింత బలహీనత
- విశ్లేషకుల అంచనాలు
- హోలీ సందర్భంగా మంగళవారం మార్కెట్‌కు సెలవు



అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఇరాన్ సుప్రీం నాయకుడు సహా ముఖ్యనేతలు హతమవ్వడం, తదనంతర పరిణామాలు స్టాక్‌మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ఇప్పటికే బలహీనంగా ఉన్న మదుపర్ల సెంటిమెంటు మరింత దిగజారనుంది. సోమవారం మార్కెట్లు అలజడికి గురికావొచ్చు. సూచీల్లో అధిక భాగం నష్టాలకు కారణమవుతున్న ఐటీ కంపెనీల షేర్లపై దృష్టి సారించాలి. ఆంత్రోపిక్ ఏఐ టూల్స్ వాడటాన్ని ప్రభుత్వ ఏజెన్సీలు దశలవారీగా నిలిపేయాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆదేశించారు. ఆంత్రోపిక్ ఆందోళనలు క్రమంగా కనుమరుగైతే, మన ఐటీ కంపెనీల షేర్లు తిరిగి పుంజుకోవచ్చని అంచనా వేస్తున్నారు. సాంకేతికంగా చూసినా ప్రామాణిక సూచీలకు ప్రోత్సాహక సంకేతాలేవీ కనిపించడం లేదు. అంతర్జాతీయ మార్కెట్ల కదలికలు, విదేశీ మదుపర్ల ధోరణి ప్రభావితం చేస్తాయి. ముడిచమురు ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం, ఆర్థిక సమతుల్యతపై ప్రతికూల ప్రభావాలు తప్పవు. నిఫ్టీ-50కి 25,350 వద్ద నిరోధం ఎదురుకావొచ్చని అంటున్నారు. హోలీ సందర్భంగా మంగళవారం మార్కెట్లు పనిచేయవు. ఎఫ్‌పీఐలు మన ఈక్విటీల్లో ఫిబ్రవరిలో రూ.22,615 కోట్ల పెట్టుబడులు పెట్టారు. 2014 సెప్టెంబరు (రూ.57,724 కోట్ల) తరవాత ఇది అధికం. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

● **నిఫ్టీ బ్యాంక్** సూచీ ఈ వారం 60,000-61,750 శ్రేణిలో కదలాడొచ్చు. 60,000 దిగువకు వస్తే మరింత పతనం కనిపించొచ్చు. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ పరిణామాలూ కీలకమే.

● అంతర్జాతీయ అనిశ్చితుల మధ్య **లోహ** షేర్లలో పడ్డపుడల్లా కొనుగోలు చేసే విధానాన్ని ట్రేడర్లు అవలంబించొచ్చు. గిరాకీ పెరుగుతున్నందున, ఉక్కు కంపెనీలు రాణించొచ్చు.

● **యంత్రపరికరాల** షేర్లు ఒక శ్రేణికి లోబడి కదలాడొచ్చు. ప్రైవేటు కంపెనీల్లో మూలధన వ్యయాలు పెరిగితే, ఈ షేర్లు రాణిస్తాయి. అయితే భారీగా మూలధన వ్యయాలు చేసే పరిస్థితి లేదు. డేటా సెంటర్ల నుంచి బలమైన గిరాకీ ఉన్నందున, ఈ రంగ కంపెనీలు ప్రయోజనం పొందొచ్చు.

● **వాహన** షేర్లలో సానుకూలతలు కొనసాగొచ్చు. మార్కెట్ సెంటిమెంటు ప్రతికూలంగా ఉన్నందున, ఈ షేర్లలోనూ ఊగిసలాటకు అవకాశం ఉంది. ఫిబ్రవరి వాహన టోకు విక్రయ గణాంకాల ప్రభావమూ కనిపించొచ్చు.

● **సిమెంటు** షేర్లలో ప్రతికూల ధోరణి ఎదురుకావొచ్చు. రాబోయే నెలల్లో సిమెంటు ధరల పెంపు మోస్తరుగా ఉండొచ్చని, మార్చి త్రైమాసికంలో సీజను కారణంగా మెరుగ్గా ఉండొచ్చని అంచనా. అల్ట్రాటెక్ సిమెంట్, రామ్‌కోలను మాత్రం పడ్డపుడల్లా కొనుగోలు చేయొచ్చని బ్రోకరేజీలు అంటున్నాయి.

● **టెలికాం** కంపెనీల షేర్లు స్వల్పకాలంలో ఒక శ్రేణికి లోబడే చలించొచ్చు. టారిఫ్ పెంపు ఆలస్యం కానుంది. వొడాఫోన్ ఐడియా నిధుల సమీకరణ, జియో ప్లాట్‌ఫాం లిస్టింగ్ వార్తలు ఈ రంగానికి కీలకం.

● ఇరాన్ పరిణామాల్లో చమురు, గ్యాస్ షేర్లు ఊగిసలాటకు గురికావొచ్చు. యుద్ధం కారణంగా చమురు బ్యారెల్ ధర 95-110 డాలర్ల వరకు పెరగొచ్చన్న అంచనాలు న్నాయి. అదే జరిగితే అప్‌స్ట్రీమ్ కంపెనీలైన ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియాలకు ప్రయోజనాలు దక్కొచ్చు. మార్కెటింగ్ కంపెనీలు నష్టపోవచ్చు.

● **ఐటీ** షేర్ల దిశపై విశ్లేషకులు మిశ్రమంగా ఉన్నారు. ఇప్పటికే ఎక్కువ అమ్మకాలకు లోనైనందున, కొంత పుల్‌బ్యాక్ రావచ్చని కొంత మంది అంటుండగా, ఏఐ ఒత్తిళ్ల వల్ల ప్రతికూలంగానే కదలాడొచ్చని మరి కొంత మంది చెబుతున్నారు.

● **ఔషధ** షేర్లు ఒక శ్రేణికి లోబడే ట్రేడవవచ్చు. జీఎల్‌పీ-1 ఆవిష్కరణల వల్ల పెద్ద స్థాయి ఫార్మా కంపెనీలపై సానుకూలతలు కనిపించొచ్చు. జనరిక్ రెవ్లిమిడ్ విక్రయాలు తగ్గినందున ఈ షేర్లపై అప్రమత్తత కొనసాగొచ్చు.

● **ఎఫ్ఎంసీజీ** కంపెనీల వృద్ధికి సవాళ్లు ఎదురుకావొచ్చన్న అంచనాల మధ్య, ఈ రంగ షేర్లు ఒక శ్రేణికి లోబడే కదలాడొచ్చు. జీఎస్‌టీ తగ్గింపు వల్ల అమ్మకాల్లో భారీ వృద్ధికి ఏమీ బాటలు పడలేదని చెబుతున్నారు.

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	887.75	904.50	876.60
ఐసీఐసీఐ బ్యాంక్	1378.90	1411.40	1360.40
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	73.48	75.00	71.20
ఇండస్ఇండ్ బ్యాంక్	956.75	975.50	941.90
కొటక్‌మహీంద్రా బ్యాంక్	415.20	425.20	409.40
పీఎన్‌బీ	129.44	131.90	127.40
ఎస్‌బీఐ	1201.70	1217.20	1190.80
లోహ	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
హిందాల్కో	924.70	951.00	909.50
హిందుస్థాన్ కాపర్	566.30	600.20	543.40
ఎన్ఎండీసీ	81.74	84.40	79.40
సెయిల్	165.71	169.90	161.90
టాటా స్టీల్	212.33	217.50	209.10
వేదాంతా	718.40	742.50	702.90
యంత్రపరికరాలు	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
భెల్	264.95	270.30	260.10
సీజీ పవర్	725.20	733.60	715.40
ఎల్ అండ్ టీ	4278.30	4329.40	4228.80
సీమెన్స్	3418.60	3545.00	3208.60
థెర్మాక్స్	3117.80	3187.80	3041.00
వాహన	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
అశోక్ లేలాండ్	211.10	215.60	208.20
బజాజ్ ఆటో	9,972.50	10,152.80	9,849.80
ఐషర్ మోటార్స్	8,010.50	8,318.80	7,832.80
హీరో మోటోకార్ప్	5,710.00	5,844.00	5,622.00
ఎం అండ్ ఎం	3,397.40	3,529.20	3,315.20
మారుతీ	14,857.00	15,339.00	14,563.00
టీఎమ్‌పీవీ	382.65	399.00	372.80
టీవీఎస్ మోటార్	3,869.70	4,010.20	3,785.80
సిమెంటు	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
ఏసీసీ	1592.40	1630.30	1566.10
అంబుజా సిమెంట్స్	500.40	516.90	490.80
ఇండియా సిమెంట్స్	406.00	433.90	388.10
శ్రీ సిమెంట్	26075.00	27201.70	25401.70
అల్ట్రాటెక్ సిమెంట్	12677.00	12995.00	12481.00
టెలికాం	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
భారతీ ఎయిర్‌టెల్	1,879.30	1933.00	1843.20
ఎమ్‌టీఎన్ఎల్	29.74	30.30	29.30
టాటా కమ్యూనికేషన్స్	1597.50	1693.50	1532.50
వొడాఫోన్ ఐడియా	10.59	11.10	10.30

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
రిలయన్స్ ఇండస్ట్రీస్	1393.90	1419.80	1375.20
బీపీసీఎల్	385.40	393.30	378.50
హెచ్‌పీసీఎల్	438.75	447.60	431.70
ఐఓసీఎల్	187.47	190.60	184.20
ఓఎన్‌జీసీ	279.70	285.20	274.20
ఆయిల్ ఇండియా	483.90	501.80	461.70
ఐటీ	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
హెచ్‌సీఎల్ టెక్	1389.10	1414.80	1369.20
ఇన్ఫోసిస్	1300.10	1350.60	1269.00
పర్సిస్టెంట్ సిస్టమ్స్	4733.00	5003.00	4577.00
టీసీఎస్	2637.40	2713.20	2588.20
టెక్ మహీంద్రా	1357.80	1430.50	1317.70
విప్రో	200.96	205.60	197.70
ఔషధ	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
అరబిందో ఫార్మా	1220.40	1250.60	1199.20
బయోకాన్	389.80	398.30	384.50
సిప్లా	1348.20	1366.30	1329.50
డాక్టర్ రెడ్డీస్	1286.30	1332.90	1254.90
గ్లెన్‌మార్క్ ఫార్మా	2136.70	2181.00	2094.20
నాట్కో ఫార్మా	988.50	1021.50	943.50
ఎఫ్ఎంసీజీ	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
బ్రిటానియా ఇండస్ట్రీస్	6002.50	6207.50	5872.50
కోల్గేట్ పామోలివ్	2254.50	2324.60	2208.60
డాబర్ ఇండియా	518.50	532.20	505.20
ఇమామీ	462.60	481.80	451.20
హిందుస్థాన్ యునిలీవర్	2338.10	2397.50	2300.90
ఐటీసీ	313.60	319.80	309.60
మారికో	788.65	815.60	773.30

టీ20 ధమాకా ప్రపంచకప్ ఫిబ్రవరి 7 - మార్చి 8

196 టీ20 ప్రపంచకప్‌లో భారత్‌కు ఇదే అతి పెద్ద ఛేదన. 173 (2014లో బంగ్లాదేశ్‌పై) పరుగులే ఇంతకుముందు అత్యధికం.

ఛాంపియన్

సఫారీలకు అగ్రస్థానం

సెమీస్ షెడ్యూల్

మార్చి 4: తొలి సెమీఫైనల్ న్యూజిలాండ్ × దక్షిణాఫ్రికా వేదిక: కోల్‌కతా

మార్చి 5: రెండో సెమీఫైనల్ భారత్ × ఇంగ్లాండ్ వేదిక: ముంబయి

సూపర్-8, గ్రూప్-1లో దక్షిణాఫ్రికా అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఆఖరి మ్యాచ్‌లో జింబాబ్వేను ఓడించిన ఆ జట్టు.. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి 6 పాయింట్లతో ముందంజలో నిలిచింది. వెస్టిండీస్‌పై గెలిచిన భారత్ 3 మ్యాచ్‌ల్లో 2 విజయాలు, ఒక ఓటమితో 4 పాయింట్లతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. వెస్టిండీస్ (3 మ్యాచ్‌ల్లో 2 పాయింట్లు), జింబాబ్వే (0) తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

ఫామ్ పోయింది. అతడి ఓపెనింగ్ స్థానాన్ని ఇషాన్ కిషన్ కొట్టేశాడు. తుది జట్టులోనే చోటు లేకుండా పోయింది. అసలు ఆటగాడిగా అతణ్ని పట్టించుకునే వారే కరవయ్యారు. శాంసన్ అంటే.. చాలా మంది దృష్టిలో టీమ్‌ఇండియాకు దూరమయ్యే స్థితిలో ఉన్న ఆటగాడు. టీ20 ప్రపంచకప్‌లో ఓ రెండు మ్యాచ్‌లాడినా పెద్దగా ముద్రేమీ వేయలేదు. ఈ నేపథ్యంలో అతడిపై అంచనాలు లేవు. ఆశలు లేవు. అలాంటి శాంసన్.. ఆదివారం టీమ్‌ఇండియా ఆపద్బాంధవుడే అయ్యాడు. ఈడెన్ గార్డెన్స్‌లో అద్భుత బ్యాటింగ్‌తో డిఫెండింగ్ ఛాంపియన్‌ను సెమీఫైనల్‌కు తీసుకెళ్లాడు. చిరస్మరణీయ ఇన్నింగ్స్‌తో కోట్లాది అభిమానుల మనసులు గెలుచుకున్నాడు. శాంసన్ తొలి బంతి నుంచి కడ బంతి వరకు పోరాడిన వేళ.. క్వార్టర్‌ఫైనల్లాంటి పోరులో వెస్టిండీస్‌ను భారత్ ఓడించింది.



సలామ్ సంజు శాంసన్‌కు సూర్య అభివాదం

సెమీఫైనల్లో భారత్

శాంసన్ శాసించెన్

సూపర్-8 పోరులో వెస్టిండీస్‌పై విజయం



సంజు శాంసన్ 97 నాటౌట్ 50 బంతుల్లో 12×4, 4×6

"ఈ ఇన్నింగ్స్ నాకు చాలా ప్రత్యేకం. క్రికెట్ ఆడటం మొదలుపెట్టినప్పటి నుంచి ఈ రోజు కోసమే ఎదురుచూశాను. ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నా. ఒక దశలో నేనేది చేయగలనా అని నా సామర్థ్యాన్ని ప్రశ్నించుకున్నా. ఏళ్లుగా ఈ ఫార్మాట్‌లో ఆడుతున్నా. కోహ్లి, రోహిత్, ధోని లాంటి దిగ్గజ ఆటగాళ్లతో ఆడిన అనుభవం దోహదపడింది. ఇలాంటి ఇన్నింగ్స్ ఆడతానని ఊహించలేదు. నా జీవితంలో అద్భుతమైన రోజు ఇది. మ్యాచ్ పరిస్థితికి అనుగుణంగా ఆడాను అంతే. నన్ను నడిపించిన దేవుడికి కృతజ్ఞతలు"

– సంజు శాంసన్

కోల్‌కతా

టీమ్‌ఇండియా టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. సంజు శాంసన్ (97 నాటౌట్; 50 బంతుల్లో 12×4, 4×6) అద్భుత బ్యాటింగ్‌తో ఆఖరి సూపర్ 8 మ్యాచ్‌లో ఆదివారం 5 వికెట్ల తేడాతో వెస్టిండీస్‌ను ఓడించింది. ఛేజ్ (40; 25 బంతుల్లో 5×4, 1×6), హోల్డర్ (37 నాటౌట్; 22 బంతుల్లో 2×4, 3×6) చెలరేగడంతో మొదట వెస్టిండీస్ 4 వికెట్ల నష్టానికి 195 పరుగులు చేసింది. రోమన్ పావెల్ (34 నాటౌట్; 19 బంతుల్లో 3×4, 2×6), హోప్ (32; 33 బంతుల్లో 3×4, 1×6), హెట్‌మయర్ (27; 12 బంతుల్లో 1×4, 2×6) రాణించారు. బుమ్రా (2/36) బంతితో రాణించాడు. శాంసన్‌తో పాటు తిలక్ వర్మ (27; 15 బంతుల్లో 4×4, 1×6) మెరవడంతో లక్ష్యాన్ని భారత్ 19.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది.

సంజు ఒక్కడు..: టీమ్‌ఇండియా హీరో సంజు శాంసనే. ముఖ్యమైన పట్టుదల, ధృడ సంకల్పంతో క్రీజులో నిలిచిన అతడు.. దాదాపు ఒంటి చేత్తో జట్టును విజయ తీరాలకు చేర్చాడు. కీలక మ్యాచ్‌లో, ఒత్తిడిలో, తనపై అంచనాలేమీ లేని స్థితిలో సంజు ఆడిన ఇన్నింగ్స్ అద్భుతం. ఇంకెవరూ 30 పరుగులు చేయకున్నా.. టీమ్‌ఇండియా విజయానందుకుందంటే కారణం అతడి విధ్వంసకర ఇన్నింగ్సే. చేదనలో 10 ఓవర్లు ముగిసే సరికి టీమ్‌ఇండియా స్కోరు 98/2. హార్దిక్ పాండ్య అభిషేక్, ఇషాన్ కిషన్ చెరో పది పరుగులే చేసి ఔటైనా.. శాంసన్ తన సూపర్ బ్యాటింగ్‌తో జట్టును రేసులో నిలిపాడు. నియంత్రణ కోల్పోకుండా దూకుడుగా అతడు ఇన్నింగ్స్‌ను నడిపించిన తీరు అద్భుతం. కళ్లు చెదిరే షాట్లతో అతడు స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. బౌలర్లకు చిన్న అవకాశమైనా ఇవ్వలేదు. ఇన్నింగ్స్ తొలి రెండు ఓవర్లలో శాంసన్‌కు పెద్దగా ఆడే అవకాశం రాలేదు. మరోవైపు అభిషేక్ ఆత్మవిశ్వాసంతో కనిపించలేదు. తొలి పది బంతుల్లో 10 పరుగులే చేశాడు. మూడో ఓవర్ నుంచి మొదలైంది శాంసన్ జోరు. హోసేన్ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లు, ఓ ఫోర్ కొట్టాడు. అయితే ఓ భారీ షాట్ ఆడబోయి అభిషేక్, ఊపు మీద కనిపించిన ఇషాన్ కిషన్ కొద్ది తేడాలో ఔట్ కావడంతో భారత్ 41/2తో నిలిచింది. కానీ వాళ్ల నిష్క్రమణ శాంసన్‌పై ఎలాంటి ప్రభావం చూపించలేదు. చక్కని స్ట్రోక్‌ప్లేను కొనసాగించాడు. మోటీ బౌలింగ్‌లో బౌండరీతో అర్ధశతకం (26 బంతుల్లో) పూర్తి చేశాడు. మరోవైపు కెప్టెన్ సూర్య కూడా చక్కగా బ్యాటింగ్ చేయడంతో ఛేదన సాఫీగా సాగింది. కానీ సూర్యను షామర్ జోసెఫ్ ఔట్ చేయడంతో 58 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. కానీ క్రీజులోకి వచ్చిన తిలక్.. ఏమాత్రం సమయం వృథా చేయలేదు. జోసెఫ్ తర్వాతి ఓవర్లో వరుసగా మూడు ఫోర్లు దంచేశాడు. ఛేజ్ ఓవర్లో సిక్స్ కొట్టాడు. ఆఖరి ఆరు ఓవర్లలో భారత్ 60 పరుగులు చేయాల్సిన స్థితి. కానీ జోరుమీదున్న తిలక్‌ను హోల్డర్ ఔట్ చేయడంతో ఆట ఆసక్తికరంగా మారింది. మరోవైపు పట్టుదలగా నిలిచిన శాంసన్.. విండీస్ ప్రయత్నాలకు అడ్డుగా నిలిచాడు. భారత్‌పై ఒత్తిడి తేనివ్వలేదు. హార్దిక్‌తో కలిసి అడపాదడపా ఫోర్లు కొట్టేస్తూ జట్టును లక్ష్యం దిశగా నడిపించాడు. ఆఖరి రెండు ఓవర్లలో భారత్‌కు 17 పరుగులు అవసరమయ్యాయి. భారత్ విజయం దాదాపు ఖాయమే అయినా.. 19వ ఓవర్ రెండో బంతికి హార్దిక్ ఔట్ కావడంతో కొంత ఉత్కంఠ తప్పలేదు. కానీ అదే ఓవర్లో దూబె రెండు ఫోర్లు కొట్టి.. విండీస్‌కు ఆశలపై నీళ్లు చల్లాడు. ఫినిషింగ్ టచ్ మాత్రం శాంసనే. ఆఖరి ఓవర్లో భారత్‌కు ఏడు పరుగులు అవసరం కాగా.. కళ్లు చెదిరే షాట్‌తో తొలి బంతిని స్క్వేర్ లెగ్‌లో సిక్స్‌గా మలిచిన అతడు.. తర్వాతి బంతిని మిడాన్‌లో బౌండరీకి తరలించి భారత్‌ను సంబరాల్లో ముంచెత్తాడు.

వెస్టిండీస్ ధనాధన్: అంతకుముందు వెస్టిండీస్ తన ప్రణాళికను పక్కాగా అమలు చేసింది. మొదటి అర్ధభాగంలో చక్కగా ఇన్నింగ్స్‌ను నిర్మించడం, ఆఖర్లో విరుచుకుపడడాన్ని అలవాటుగా మార్చుకున్న ఆ జట్టు.. ఈ కీలక మ్యాచ్‌లో కూడా అదే ఆటను కొనసాగించింది. బ్యాటర్ల సమష్టిగా రాణించడంతో కరీబియన్ జట్టు గట్టి లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్.. ఇన్నింగ్స్‌ను బాగానే ఆరంభించింది అనొచ్చు. ఓపెనింగ్ జంట మరీ విధ్వంసం సృష్టించకున్నా.. తర్వాత వచ్చే బ్యాటర్లు రెచ్చిపోవడానికి అనువుగా మంచి పునాది వేశారు. అయితే హోప్ ఎక్కువ దూకుడుగా ఆడలేకపోయాడు. ఛేజ్ మాత్రం బ్యాట్ ఝుళిపించాడు. చక్కని షాట్లతో బౌండరీలు సాధించాడు. పవర్‌ప్లేలో స్కోరు.. బుమ్రా సహా నలుగురు బౌలర్లతో బౌలింగ్ వేయించిన తొలి వికెట్ దక్కలేదు. 8 ఓవర్లకు 66/0తో నిలిచింది వెస్టిండీస్. అర్ష్‌దీప్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో బౌలింగ్ దాడిని ఆరంభించాడు.. ఆ తర్వాత వరుసగా ఆ జట్టు వికెట్లు తీశాడు. ఆ తర్వాత జట్టు సవరించుకుంది. హార్దిక్ కూడా తన తొలి మూడు ఓవర్లలో 21 పరుగులిచ్చాడు. తన తొలి మూడు ఓవర్లలో 25 పరుగులిచ్చిన అక్షర్.. వికెట్ల వేటలో మాత్రం సఫలం కాలేకపోయాడు. బుమ్రా ఓ చక్కని అవకాశాన్ని సృష్టించాడు. కానీ ఛేజ్ ఇచ్చిన సులభమైన క్యాచ్‌ను అభిషేక్ వదిలేశాడు. ఛేజ్‌ను తిలక్ రనౌట్ చేసే అవకాశాన్ని వరుణ్ చక్రవర్తి వృథా చేశాడు. అయితే జట్టు వెస్టిండీస్ గేర్ మారుస్తుంది అనుకుంటున్న దశలో హోప్‌ను బౌల్డ్ చేయడం ద్వారా.. వరుణ్ ఆ జట్టును తొలి దెబ్బ తీశాడు. అయినా 11 ఓవర్లలో 99/1తో విండీస్ బలంగానే కనిపించింది. హెట్‌మయర్ 10 బంతుల్లో 25 పరుగులతో అప్పటికే జోరందుకున్నాడు. కానీ అద్భుతంగా బౌలింగ్ చేసిన బుమ్రా.. ఒకే ఓవర్లో హెట్‌మయర్‌తో పాటు ఛేజ్‌ను ఔట్ చేయడంతో భారత్ ఊపిరిపీల్చుకుంది. కాసేపటికే రూథర్‌ఫర్డ్‌ను హార్దిక్ వెనక్కి పంపడంతో ఇన్నింగ్స్ భారత్ నియంత్రణలోకి వచ్చినట్లనిపించింది. కానీ అక్కడి నుంచి మ్యాచ్ మారిపోయింది. వెస్టిండీస్ తన గత మ్యాచ్‌ల్లోలాగే ఆఖర్లో విరుచుకుపడింది. చెలరేగి ఆడిన హోల్డర్, రోమన్ పావెల్.. అభేద్యమైన అయిదో వికెట్‌కు 35 బంతుల్లోనే 76 పరుగులు జోడించి, విండీస్‌కు మెరుగైన స్కోరును అందించారు. అర్ష్‌దీప్ పూర్తిగా గతి తప్పాడు. అతడు వేసిన ఇన్నింగ్స్ 16వ ఓవర్లో పావెల్ రెండు సిక్స్‌లు, ఫోర్ దంచేశాడు. ఓ వైడ్ బాల్ బౌండరీకి వెళ్లింది. ఆ ఓవర్లో ఏకంగా 24 పరుగులు వచ్చాయి. ఆఖర్లో బుమ్రా కూడా విండీస్ బ్యాటర్లను నియంత్రించలేకపోయాడు. 18, 20వ ఓవర్లలో కలిపి అతడు 26 పరుగులిచ్చాడు. చివరి అయిదు ఓవర్లలో వెస్టిండీస్ 70 పరుగులు రాబట్టింది. బుమ్రా మినహా భారత బౌలర్లది మరోసారి నిరాశాజనక ప్రదర్శనే. వరుణ్ చక్రవర్తి మళ్లీ విఫలం కాగా.. నియంత్రణలేని బౌలింగ్‌తో అర్ష్‌దీప్ ధారాళంగా పరుగులిచ్చాడు.


బుమ్రా 2/36

పాయింట్ల పట్టిక సూపర్-8 గ్రూప్-1

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	నె.రన్‌రేట్
దక్షిణాఫ్రికా	3	3	0	0	6	2.259
భారత్	3	2	1	0	4	0.106
వెస్టిండీస్	3	1	2	0	2	0.993
జింబాబ్వే	3	0	3	0	0	-3.415

మ్యా: మ్యాచ్‌లు, గె: గెలిచినవి, పా: పాయింట్లు, ఫ.తే: ఫలితం తేలనివి

97* సంజు శాంసన్ చేసిన పరుగులు. టీ20 ప్రపంచకప్‌లో ఛేదనలో భారత తరఫున అత్యధిక పరుగులు అతడివే. గత రికార్డు కోహ్లి (82 నాటౌట్; 2016లో ఆసీస్‌పై, 2022లో పాక్‌పై) పేరిట ఉంది.

వెస్టిండీస్ ఇన్నింగ్స్: హోప్ (బి) వరుణ్ చక్రవర్తి 32; ఛేజ్ (సి) సూర్యకుమార్ (బి) బుమ్రా 40; హెట్‌మయర్ (సి) శాంసన్ (బి) బుమ్రా 27; రూథర్‌ఫర్డ్ (సి) శాంసన్ (బి) హార్దిక్ 14; రోమన్ పావెల్ నాటౌట్ 34; హోల్డర్ నాటౌట్ 37; ఎక్స్‌ట్రాలు 11 **మొత్తం:** (20 ఓవర్లలో 4 వికెట్లకు) **195**; **వికెట్ల పతనం:** 1-68, 2-102, 3-103, 4-119; **బౌలింగ్:** అర్ష్‌దీప్ సింగ్ 4-0-43-0; హార్దిక్ 4-0-40-1; అక్షర్ పటేల్ 4-0-35-0; బుమ్రా 4-0-36-2; వరుణ్ చక్రవర్తి 4-0-40-1

భారత్ ఇన్నింగ్స్: అభిషేక్ (సి) హెట్‌మయర్ (బి) హోసేన్ 10; సంజు శాంసన్ నాటౌట్ 97; ఇషాన్ కిషన్ (సి) హెట్‌మయర్ (బి) హోల్డర్ 10; సూర్యకుమార్ యాదవ్ (సి) రూథర్‌ఫర్డ్ (బి) షామర్ జోసెఫ్ 18; తిలక్ వర్మ (సి) హెట్‌మయర్ (బి) హోల్డర్ 27; హార్దిక్ (సి) హోల్డర్ (బి) షామర్ జోసెఫ్ 17; దూబె నాటౌట్ 8; ఎక్స్‌ట్రాలు 12 **మొత్తం:** (19.2 ఓవర్లలో 5 వికెట్లకు) **199**; **వికెట్ల పతనం:** 1-29, 2-41, 3-99, 4-141, 5-179; **బౌలింగ్:** అకీల్ హోసేన్ 2-0-22-1; ఫోర్డ్ 3-0-22-0; హోల్డర్ 4-0-38-2; మోటీ 2-0-18-0; రొమారియో షెపర్డ్ 2.2-0-34-0; షామర్ జోసెఫ్ 4-0-42-2; ఛేజ్ 2-0-18-0

కోల్‌కథా నాయకుడు

ఈనాడు క్రీడావిభాగం

ఎంతో ప్రతిభావంతుడు.. శాంసన్ గురించి చర్చ జరిగిన ప్రతిసారి వినిపించేది ఇదే. పదకొండేళ్ల క్రితం అరంగేట్రం చేసినా ఇప్పటికీ అతడికి జట్టులో చోటు గ్యారంటీ లేదు. ఈసారి ప్రపంచకప్‌నకు ఎంపికైనా తుది జట్టులో ఆడిస్తారని ఎవరూ అనుకోలేదు. అద్భుత ఫామ్‌లో ఉన్న అభిషేక్ శర్మవైపే అంతా చూశారు. అతడికి తోడు పాకెట్ డైనమైట్ ఇషాన్ కిషన్ తోడైతే ఇక తిరుగేలేదనుకున్నారు. కానీ.. ఆ ఇద్దరు తేలిపోయారు. ఒక మ్యాచ్ మినహా టోర్నీ మొత్తం అభిషేక్ ఘోరంగా విఫలమవగా.. ఇషాన్ కిషన్‌లో నిలకడ లోపించింది. వెస్టిండీస్‌తో 196 పరుగుల ఛేదనలోనూ అభిమానులతో పాటు.. జట్టు వీరిద్దరివైపే చూసింది. కానీ అందరినీ నిరాశపరుస్తూ ఆ ఇద్దరూ త్వరగానే పెవిలియన్ చేరిపోయారు. ఒకవైపు శాంసన్ నిలిచినా అతడిపై ఎవరికీ నమ్మకం ఉంచలేదు. ఎందుకంటే ఇలాంటి పెద్ద మ్యాచ్‌ల్లో అతడు జట్టును గెలిపించిన సందర్భాలే లేవు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ భారీ ఇన్నింగ్స్ ఆడాలని.. తిలక్‌వర్మ నిలకడ ప్రదర్శించాలని అంతా కోరుకున్నారు. కానీ వాళ్లూ జట్టును గెలిపించలేదు. కానీ ఎవరూ ఊహించని విధంగా శాంసన్ జట్టు భారాన్ని భుజాన వేసుకున్నాడు. మళ్లీ అవకాశం రాదన్నట్టు చెలరేగిపోయాడు. ఆడుతోంది శాంసనేనా అని సందేహం కలిగేలా.. తనలో అసలు ఆటను బయటకు తీశాడు. ఒక్క చెత్త షాట్ లేదు.. అంతా క్లీన్ హిట్టింగ్! షమార్ జోసెఫ్ బౌలింగ్‌లో ఆడిన స్ట్రెయిట్ హిట్, హోసేన్‌కు మిడ్ వికెట్ మీదగా వడ్డించిన సిక్స్, ఛేజ్ బౌలింగ్‌లో పాయింట్ మీదగా తరలించిన డ్రైవ్ దేనికవే ప్రత్యేకం. అలా అని అతడు ఎడాపెడా షాట్లు కొట్టలేదు. కళాత్మక విధ్వంసంతో విండీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నాడు. మధ్యలో సింగిల్స్ తీస్తూ స్ట్రెక్ రొటేట్ చేశాడు. సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యలతో కీలక భాగస్వామ్యాలు నెలకొల్పి ఇన్నింగ్స్‌కు ఇరుసులా నిలిచాడు. అసలైన మ్యాచ్‌లో అద్భుతంగా ఆడి హీరో అయ్యాడు. ఫీనిక్స్ పక్షి బూడిద నుంచి లేచినట్లు సంజు కూడా ఈ ఇన్నింగ్స్‌తో లేచాడు. 2015లో టీ20ల్లో అరంగేట్రం చేసిన అతడికి ఎన్నో అవకాశాలు వచ్చినా.. అతడి ఆటకు న్యాయం చేసిన ఇన్నింగ్స్ చాలా తక్కువనే చెప్పాలి. ఈ ఏడాది న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో అతడు 10, 6, 0, 24, 6 స్కోర్లతో విఫలమయ్యాడు. ప్రపంచకప్ జట్టులో సభ్యుడిగా ఉన్నా మరో వికెట్‌కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ ఫామ్‌లో ఉండడంతో సంజుకు తుది జట్టులో చోటు లేకుండాపోయింది. ఓపెనర్ అభిషేక్ శర్మకు అనారోగ్యం కారణంగా నమీబియాతో లీగ్ మ్యాచ్‌లో ఆడే అవకాశం వచ్చింది. అయినా పెద్దగా రాణించలేకపోయాడు. 22 పరుగులే చేశాడు. ఆ తర్వాత మళ్లీ డగౌట్‌కే పరిమితం అయ్యాడు. రింకు సింగ్ వరుసగా విఫలం కావడంతో జింబాబ్వేతో మ్యాచ్‌లో సంజుకు మళ్లీ ఆడే అవకాశం దొరికింది. ఓపెనింగ్‌లో ఎడమ-కుడి మేళవింపు కావాల్సి రావడం కూడా మరో కారణం. అయినా ఆ మ్యాచ్‌లో గొప్పగా రాణించింది లేదు. ఈసారి చేసింది 24 పరుగులే. వెస్టిండీస్‌తో కీలక మ్యాచ్‌కు రింకు అందుబాటులో ఉన్నా.. సంజునే కొనసాగించింది మేనేజ్‌మెంట్. తనపై ఉంచిన నమ్మకాన్ని కీలక సమయంలో నిలబెట్టుకున్నాడు సంజు. కళ్లుచెదిరే ఆటతో చిరస్మరణీయమైన ఇన్నింగ్స్ ఆడి తానేంటో నిరూపించుకున్నాడు. పదకొండేళ్లుగా ఎదురుచూస్తున్న ఇన్నింగ్స్ ఆడిన శాంసన్ టీమ్‌ఇండియాను సెమీస్ చేర్చడమే కాదు.. జట్టులో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. ఇకపై జట్టును గెలిపించే ఆటగాళ్ల కోసం అభిమానులు చూసే జాబితాలో సంజు కూడా ముందుంటాడనడంలో సందేహం లేదు.

- జింబాబ్వేపై గెలుపు
- రాణించిన బ్రెవిస్

దక్షిణాఫ్రికా అజేయంగా..


బ్రెవిస్ 42

దిల్లీ: టీ20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా అదిరే ఫామ్ కొనసాగుతోంది. గ్రూప్-1, సూపర్-8 ఆఖరి మ్యాచ్‌లోనూ ఘన విజయాన్ని అందుకున్న ఆ జట్టు అజేయంగా (3 మ్యాచ్‌ల్లో 3 విజయాలు, 6 పాయింట్లు) సెమీఫైనల్‌కు వెళ్లింది. ఆదివారం నామమాత్రపు మ్యాచ్‌లో సఫారీ జట్టు 5 వికెట్ల తేడాతో జింబాబ్వేను ఓడించింది. మొదట జింబాబ్వే 7 వికెట్లకు 153 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కెప్టెన్ సికందర్ రజా (73; 43 బంతుల్లో 8×4, 4×6) టాప్ స్కోరర్. క్లైవ్ మదాండే (26) కూడా రాణించాడు. మఫాక (2/21), కార్బిన్ బోష్ (2/40) ప్రత్యర్థిని కట్టడి చేశారు. బ్రెవిస్ (42; 18 బంతుల్లో 2×4, 4×6), రికెల్టన్ (31; 22 బంతుల్లో 4×6), జార్జ్ లిండ్ (30 నాటౌట్; 21 బంతుల్లో 2×4, 1×6) మెరుపులతో దక్షిణాఫ్రికా 17.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. సికందర్ రజా (3/29) బంతితోనూ రాణించినా జట్టును గెలిపించలేకపోయాడు. ఇప్పటికే సెమీస్ రేసుకు దూరమైన జింబాబ్వే.. సూపర్-8లో ఆడిన 3 మ్యాచ్‌ల్లోనూ ఓడింది.

సంక్షిప్త స్కోర్లు... జింబాబ్వే: 153/7 (సికందర్ రజా 73, క్లైవ్ మదాండే 26, మఫాక 2/21, బోష్ 2/40); **దక్షిణాఫ్రికా: 17.5 ఓవర్లలో 154/5** (బ్రెవిస్ 42, రికెల్టన్ 31, లిండ్ 30 నాటౌట్, మిల్లర్ 22, స్టబ్స్ 21 నాటౌట్; సికందర్ రజా 3/29)

శతకంతో వీడ్కోలు

అలీసా ఆఖరి పంచ్

చివరి వన్డేలోనూ ఆసీస్ చేతిలో భారత్ ఓటమి


అలీసా హీలీ 158

హోబర్ట్: అలీసా హీలీ (158; 98 బంతుల్లో 27×4, 2×6) సుదీర్ఘ కెరీర్‌కు అదిరే ముగింపు. తన ఆఖరి వన్డే మ్యాచ్‌లో ఈ వికెట్‌కీపర్ బ్యాటర్ చెలరేగిన వేళ.. భారత అమ్మాయిల జట్టుకు మరో ఓటమి తప్పలేదు. ఇప్పటికే మూడు వన్డేల సిరీస్‌ను 0-2తో చేజార్చుకున్న హర్మన్‌ప్రీత్ బృందం.. ఆఖరి మ్యాచ్‌లో ఏకంగా 185 పరుగుల తేడాతో చిత్తుగా ఓడిపోయింది. ఆదివారం మొదట కంగారూ జట్టు కెప్టెన్ అలీసా మెరుపు శతకంతో 7 వికెట్లకు 409 పరుగుల భారీ స్కోరు చేసింది. మైదానంలో నలు మూలలా షాట్లు కొట్టిన అలీసా 49 బంతుల్లో అర్ధసెంచరీ.. మరో 30 బంతుల్లో సెంచరీ మార్కు అందుకుంది. శతకం తర్వాత మరింత చెలరేగిన ఆమె 95 బంతుల్లో 150 పరుగుల మైలురాయిని చేరుకుంది. డబుల్ సెంచరీ చేస్తుందా అనిపించిన అలీసా.. స్నేహ్ రాణా బౌలింగ్‌లో రివర్స్ స్వీప్ ఆడబోయి ఔటైంది. మరోవైపు బెత్ మూనీ (106 నాటౌట్; 84 బంతుల్లో 10×4, 1×6) అజేయ శతకం సాధించగా.. జార్జియా వోల్ (62; 52 బంతుల్లో 7×4, 1×6) కూడా మెరిసింది. ఛేదనలో భారత్ 45.1 ఓవర్లలో 224 పరుగులకే ఆలౌటైంది. స్మృతి మంధాన డకౌట్ కాగా.. హర్మన్‌ప్రీత్ (25), దీప్తి శర్మ (29) మంచి ఆరంభాలను సద్వినియోగం చేసుకోలేకపోయారు. స్నేహ్ రాణా (44; 74 బంతుల్లో 6×4), జెమీమా రోడ్రిగ్స్ (42; 29 బంతుల్లో 9×4) మాత్రమే రాణించారు. అలానా కింగ్ (4/33), జార్జియా వేర్‌హామ్ (2/3) భారత్‌ను కట్టడి చేశారు. భారత్-ఆసీస్ మధ్య ఏకైక టెస్టు (డేనైట్) శుక్రవారం పెర్త్‌లో ఆరంభం కానుంది.

సంక్షిప్త స్కోర్లు... ఆస్ట్రేలియా: 409/7 (అలీసా హీలీ 158, బెత్ మూనీ 106 నాటౌట్, జార్జియా వోల్ 62; శ్రీచరణి 2/106, స్నేహ్ రాణా 2/66); **భారత్:** 45.1 ఓవర్లలో 224 ఆలౌట్ (స్నేహ్ రాణా 44, జెమీమా 42, హర్మన్‌ప్రీత్ 25, దీప్తి 29; అలానా కింగ్ 4/33, జార్జియా వేర్‌హామ్ 2/3)

అలీసాకు గార్డ్ ఆఫ్ ఆనర్

భారత్ సిరీస్‌తో క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు 35 ఏళ్ల అలీసా ముందే ప్రకటించింది. ఈ నేపథ్యంలో అలీసా బ్యాటింగ్‌కు వస్తున్న సమయంలో భారత ఫీల్డర్లు గార్డ్ ఆఫ్ ఆనర్ ఇచ్చారు. కెరీర్‌లో 126 వన్డేలు ఆడిన అలీసా.. 3777 పరుగులు చేసింది. 162 టీ20ల్లో ఒక సెంచరీ, 17 అర్ధసెంచరీలతో 3054 పరుగులు సాధించింది. 10 టెస్టుల్లో 489 పరుగులు చేసింది.

గుకేశ్‌కు మళ్లీ డ్రా

ప్రేగ్: ప్రేగ్ అంతర్జాతీయ చెస్ ఫెస్టివల్ మాస్టర్స్ విభాగంలో విజయం కోసం దొమ్మరాజు గుకేశ్ ఎదురుచూపులు కొనసాగుతున్నాయి. నాలుగో రౌండ్లోనూ అతడు విజయాన్ని అందుకోలేకపోయాడు. నవారా (చెక్)తో గేమ్‌ను గుకేశ్ డ్రాతో సరిపెట్టుకున్నాడు. అరవింద్ చిదంబరం.. విన్సెంట్ (జర్మనీ) చేతిలో పరాజయం చవిచూశాడు. గుకేశ్, అరవింద్ చెరో 1.5 పాయింట్లతో వరుసగా ఏడు, పదో స్థానాల్లో కొనసాగుతున్నారు. ఛాలెంజర్స్ విభాగంలో దివ్య దేశ్‌ముఖ్ గేమ్‌ను డ్రా చేసుకుని. ఫినెక్ (చెక్)తో పాయింట్ పంచుకుంది. దివ్య (1.5 పాయింట్లు) ఏడో స్థానంలో ఉంది.

చాలా భయపడ్డా


సింధు

దిల్లీ: దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో పేలుడు తమను ఎంతో భయాందోళనకు గురి చేసిందని భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు చెప్పింది. ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఆడేందుకు ఇంగ్లాండ్ వెళ్లే క్రమంలో ఆమె దుబాయ్ విమానాశ్రయంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా ఇరాన్.. యూఏఈ సహా గల్ఫ్‌లో వివిధ ప్రాంతాలపై దాడులు చేసింది. ఈ నేపథ్యంలో గగనతలాన్ని మూసివేయడంతో అనేక విమాన సర్వీసులు రద్దయ్యాయి. "దుబాయ్‌లో మా విమానం దిగగానే మా నియంత్రణలో లేని పరిణామాలు మొదలయ్యాయి. మా పైన మిసైల్‌లను అడ్డుకుంటున్న శబ్దాలు వినిపించాయి. కొన్ని గంటల తర్వాత విమానాశ్రయంలో మేం ఉంటున్న ప్రాంతానికి దగ్గర్లో పేలుడు సంభవించింది. అప్పుడు నా కోచ్ ఆ ప్రాంతానికి కేవలం 100 మీటర్ల దూరంలో ఉన్నాడు. మేం వెంటనే ఆ ప్రాంతాన్ని వీడాం. అంత సమీపం నుంచి ఇలాంటి అనుభవం ఎదుర్కోవడం భయాన్ని కలిగించింది" అని సింధు చెప్పింది. ప్రస్తుతం తాము హోటల్లో ఉన్నామని, సురక్షితంగానే ఉన్నా.. కాస్త ఆందోళనగానూ ఉందని సింధు కోచ్ ప్రతమ అన్నాడు.

సలీమా సారథ్యంలో..

ప్రపంచకప్ హాకీ క్వాలిఫయర్స్‌కు భారత జట్టు


సలీమా

ఈనాడు, హైదరాబాద్: 2026 ఎఫ్ఐహెచ్ హాకీ మహిళల ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలో సలీమా టెటె నేతృత్వంలో భారత్ బరిలో దిగనుంది. అందుకు 20 మంది సభ్యులతో కూడిన భారత జట్టును ఆదివారం ప్రకటించారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి హాకీ స్టేడియం వేదికగా మార్చి 8 నుంచి 14 ఈ టోర్నీ జరగనుంది. ఆగస్టులో జరగబోయే హాకీ ప్రపంచకప్‌లో మూడు స్థానాల కోసం మొత్తం 8 జట్లు తలపడనున్నాయి. ఇప్పటికే భారత్, ఇంగ్లాండ్, స్కాట్లాండ్, ఉరుగ్వే జట్లు హైదరాబాద్ చేరుకున్నాయి. **భారత జట్టు:** సలీమా టెటె (కెప్టెన్), బన్సారి, బిచు దేవి, సుశీలా చాను, నిక్కీ ప్రధాన్, మనీషా, ఉదిత, ఇషికా, నేహా, సునేలితా టోప్పో, సాక్షి, వైష్ణవి, రుతుజా దాదాసో, దీపికా సోరెంగ్, నవ్‌నీత్ కౌర్, ఇషికా, లాల్‌రెమ్సియామీ, బ్యూటీ డుంగ్‌డుంగ్, బల్జీత్ కౌర్, అన్ను.



శ్రీవారి పుష్కరిణిలో తెప్పోత్సవం

తెప్పపై మలయప్ప అభయం



తెప్పపై కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాల్లో నాలుగో రోజు ఆదివారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత మలయప్పస్వామి భక్తులకు అభయమిచ్చారు. ముందుగా స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను ఆలయ మాడ వీధుల్లో ఊరేగించి శ్రీవారి పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన తెప్పపై ఆసీనులైన స్వామివారు రాత్రి 7 నుంచి 8 గంటల వరకు పుష్కరిణిలో విహరించి భక్తులను అనుగ్రహించారు. మంగళ వాయిద్యాలు, వేదపండితుల వేదపారాయణం, కళాకారుల సంకీర్తనల మధ్య కార్యక్రమం నేత్రపర్వంగా జరిగింది. వేడుకలో చినజీయర్, తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈవో లోకనాథం, పేష్కార్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుంభకోణాలకు పెట్టింది పేరు డీఎంకే

- తమిళనాడులో వచ్చేది ఎన్డీయే ప్రభుత్వమే
- రాజ్యాంగ విలువలు కాపాడేందుకు తపిస్తున్నాం
- మదురై సభలో ప్రధాని నరేంద్ర మోదీ

ఈనాడు, చెన్నై: తమిళనాడులో ఎన్నికలు సమీపిస్తున్నవేళ అధికార డీఎంకేపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. డీఎంకే ప్రభుత్వం కుంభకోణాలకు పెట్టింది పేరని, అందులోని మంత్రులు అవినీతిలో పోటీ పడుతున్నారని ధ్వజమెత్తారు. తిరిగి అధికారంలోకి వస్తామని చెబుతున్న డీఎంకేకు అది పీడకలగానే మిగిలిపోతుందని, వచ్చే ఎన్నికల్లో ఎన్డీయే విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పుదుచ్చేరి, తమిళనాడులోని మదురైలో ఆదివారం నిర్వహించిన పలు అధికారిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. పుదుచ్చేరిలో రూ.2,700 కోట్లు, తమిళనాడులో రూ.4,400 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు కొత్తవాటికి శంకుస్థాపన చేశారు. మదురైలో నిర్వహించిన బహిరంగసభలో ప్రసంగించారు. "ఇక్కడి డీఎంకే మంత్రులు ఉద్యోగుల బదిలీల్లో రూ.365 కోట్లు, ఉద్యోగ నియామకాల్లో రూ.900 కోట్లు, కాంట్రాక్టుల్లో రూ.1000 కోట్లు, ఇసుక అక్రమ రవాణాలో రూ.4,700 కోట్లు, మద్యంలో రూ.40వేల కోట్ల కుంభకోణాలకు పాల్పడ్డారు. ఇకపై డీఎంకే ప్రభుత్వం కొనసాగేందుకు అర్హత లేదు. ఆరు దశాబ్దాలుగా కాంగ్రెస్‌ను అధికారానికి దూరంగా ఉంచిన ఏకైక రాష్ట్రం తమిళనాడే. కచ్చతీవును శ్రీలంకకు ఇచ్చిందే కాంగ్రెస్ అయితే, డీఎంకే వారికి మద్దతిచ్చింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వీరిని ఓటుతో సాగనంపాలి" అని పేర్కొన్నారు.




తిరుప్పరకుండ్రం ఆలయంలో ప్రధాని నరేంద్ర మోదీ

మాది ప్రజాపక్ష పాలన

అంబేడ్కర్ అద్భుతమైన రాజ్యాంగాన్ని ఇచ్చారని గుర్తుచేసిన ప్రధాని మోదీ.. తాను ప్రతిక్షణం ఆ రాజ్యాంగ విలువల్ని కాపాడటానికే పనిచేస్తున్నానన్నారు. తమిళనాడులోని డీఎంకేకు చెందిన ఓ వ్యక్తి మాత్రం 'మీరంటే నాకు, నా తండ్రికి భయం లేదు' అంటున్నారని గుర్తుచేశారు. ఆ వ్యాఖ్యలతో వారు తనను కించపరిచినట్లు భావించలేదని, తన విలువలకు గుర్తింపు ఇచ్చినట్లు, గౌరవించినట్లు భావిస్తున్నానని అభిప్రాయపడ్డారు. తాజాగా యూరప్ దేశాలతో మన దేశం ఒప్పందం కుదుర్చుకుందని, ఇది తమిళనాడుకు పెద్ద అవకాశమని వివరించారు. ఇక్కడి ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెట్ దక్కుతుందని, లక్షల ఉద్యోగాలు దొరుకుతాయని చెప్పారు. ఎన్డీయే ప్రభుత్వం మాత్రమే ప్రజాపక్ష పాలన అందిస్తోందని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమాల్లో తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి, పుదుచ్చేరి ఎల్జీ కె.కైలాషనాథన్, పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగసామి, అక్కడి స్పీకర్ ఆర్.సెల్వం, హోంమంత్రి నమశ్శివాయం, కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, ఎల్.మురుగన్, తమిళనాడు మంత్రి ఈవీ వేలు, ఎన్డీయే నేతలు పాల్గొన్నారు. తరువాత మదురై సమీపంలోని తిరుప్పరకుండ్రం ఆరుల్మిగు సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ప్రధాని మోదీ పూజలు చేశారు.



ప్రధాని మోదీకి వేల్ అందిస్తున్న పుదుచ్చేరి సీఎం రంగసామి



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ దంపతులకు శ్రీవారి చిత్రపటాన్ని అందిస్తున్న తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్యచౌదరి. చిత్రంలో సీవీఎస్వో మురళీకృష్ణ, బోర్డు సభ్యుడు నరేష్‌కుమార్

శ్రీవారి సేవలో సీజేఐ

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ సైతం..

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ఆదివారం ఉదయం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ దర్శించుకున్నారు. ముందుగా మహాద్వారం వద్దకు చేరుకున్న సీజేఐ దంపతులకు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. ఆలయ ధ్వజస్తంభానికి నమస్కరించిన సీజేఐ దంపతులు అనంతరం శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం అందించి శేషవస్త్రంతో సత్కరించారు. తితిదే ఛైర్మన్, ఈవో.. స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. ఆలయ సంప్రదాయాన్ని పాటిస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీభూవరాహస్వామి ఆలయాన్ని సందర్శించి స్వామిని దర్శించుకున్నారు.



ఆలయం ఎదుట హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ దంపతులు



కర్టెన్ రైజర్ కార్యక్రమంలో బాలీవుడ్ నటులు రణ్‌బీర్ కపూర్, అభిషేక్ బచ్చన్‌లతో కలిసి పాల్గొన్న మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

విశాఖలో ఇండియన్ సూపర్ గేమింగ్ లీగ్ ఫైనల్స్

- ముంబయిలో కర్టెన్ రైజర్ కార్యక్రమంలో పాల్గొన్న మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: యువతను గేమింగ్, ఈ-స్పోర్ట్స్, డిజిటల్ ప్రపంచంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ఇండియన్ సూపర్ గేమింగ్ లీగ్ ఫైనల్స్‌ను విశాఖపట్నంలో నిర్వహించనున్నట్లు సర్కారు తెలిపారు. ఆదివారం ముంబయిలో నిర్వహించిన లీగ్ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. యువతలో ప్రతిభ వెలికితీసేందుకు, క్రీడారంగాన్ని డిజిటల్ దిశగా విస్తరించేందుకు వేదికవుతుందని, ఇలాంటి లీగ్స్ దోహదం చేస్తాయని తెలిపారు. కార్యక్రమానికి హాజరైన బాలీవుడ్ నటులు అభిషేక్ బచ్చన్, రణ్‌బీర్ కపూర్ తదితరుల్ని ఫైనల్స్‌కు ఆహ్వానించారు.

అంగన్‌వాడీల వేతనాల పెంపు అమలు దిశగా ప్రభుత్వం కృషి

మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

సాలూరు, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి వేతనాల పెంపును అమలుచేసే దిశగా కృషిచేస్తోందని మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. అంగన్‌వాడీలు ప్రతిపాదించిన డిమాండ్లలో తొమ్మిదింటిని ప్రభుత్వం ఇప్పటికే పరిష్కరించిందని, మిగతావాటి పట్ల సానుకూలంగా ఉందని పేర్కొన్నారు. ఆదివారం ఆమె తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. 'గతంలోనూ అంగన్‌వాడీల వేతనాల్ని తెదేపా ప్రభుత్వం రెండుసార్లు పెంచింది. వైకాపా ప్రభుత్వం 40 రోజులపాటు ధర్నా చేసినా పట్టించుకోలేదు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా జీతాల పెంపులో జాప్యం జరిగింది. ఆందోళన చెందవద్దు. మీకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని వివరించారు.

వారి బాగోతం బయటపెడుతున్నాననే.. నాపై 'డీప్ ఫేక్' వీడియో కుట్రలు

- తప్పుడు ప్రచారం చేస్తే తీవ్రంగా స్పందిస్తా
- 'ఏకసభ్య కమిషన్' నుంచి దృష్టి మరల్చేందుకు కుయుక్తులు
- కరుణాకరరెడ్డి, వైవీ అక్రమాల చిట్టా నా దగ్గరుంది
- తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడి మండిపాటు



మాట్లాడుతున్న తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, పక్కన బోర్డు సభ్యుడు నరేష్, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, ఉప మేయర్ ఆర్‌సీ మునికృష్ణ

ఈనాడు డిజిటల్, తిరుపతి: ఐదేళ్లలో తిరుమల తిరుపతి దేవస్థానంలో (తితిదే) జరిగిన అవినీతి, అక్రమాలను ఒక్కొక్కటిగా బయటపెడుతున్నాననే అక్కసుతోనే తనపై సోషల్ మీడియాలో నీచమైన మార్ఫింగ్ వీడియోలతో దుష్ప్రచారం చేస్తున్నారని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇకపై తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తిరుపతిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'సోషల్ మీడియాలో నాపై వైరలవుతున్న వీడియో పూర్తిగా మార్ఫింగ్ చేసింది. అది 'డీప్ ఫేక్' వీడియో అని గూగుల్ కూడా నిర్ధారించింది. అందులో ఉన్న మనుషులు ఎవరో నాకు తెలియదు. మా ఇంటికి వాళ్లు వస్తారు. వాళ్ల ఇంటికి మేం వెళ్తాం. 20-25 ఏళ్ల క్రితం నాటి ఫొటోలు తీసుకొచ్చి, వాటికి మ్యాజిక్ యాడ్ చేసి వల్గర్‌గా చిత్రీకరించి ప్రచారం చేశారు. ఇంతకంటే అత్యంత తక్కువ స్థాయి కంటెంట్ లేదు. నేను నిజాయతీగా, నిస్వార్థంగా స్వామివారికి సేవచేయడానికి వచ్చా. ఇలాంటి చీప్ పాలిటిక్స్‌కు భయపడే ప్రసక్తే లేదు' అని స్పష్టం చేశారు.

'ఏకసభ్య కమిషన్' విచారణ నేపథ్యంలో..

'తితిదేలో జరిగిన కల్తీ, బ్లాక్‌టికెట్ల దందా తదితర స్కామ్‌లన్నింటిపై 'ఏకసభ్య కమిషన్' విచారణ చేయబోతోంది. ఉదాహరణకు.. గత ప్రభుత్వంలో ఐదు భాషల్లో కోటి భగవద్గీత పుస్తకాలు ముద్రించామని రూ.50 కోట్లు ఖర్చు పెట్టారు. అందులో 32 లక్షల పుస్తకాలు ఇంకా గోదాముల్లోనే పడి ఉన్నాయి. ఈ స్కామ్‌లో గత ఛైర్మన్, ఆయన కుమారుడి పాత్ర ఉంది. ఇలాంటివన్నీ బయటకు వస్తున్నాయనే భయంతో, ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్లాన్ ప్రకారం నాపై ఈ వీడియోను వదిలారు. సీఎం చంద్రబాబు నిలువరించడం వల్లే నేను ఆగాను. లేకపోతే ఈ పాటికి దొంగల బాగోతాలు మరో పది బయటపెట్టేవాడిని' అని ధ్వజమెత్తారు. 'కరుణాకరరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి ఏం చేశారో మొత్తం నా దగ్గర చిట్టా ఉంది. జనం మిమ్మల్ని తరిమి తరిమి కొడతారు' అని హెచ్చరించారు. తనపై దుష్ప్రచారం చేస్తూ.. వీడియోను సృష్టించినవారిపై, దాన్ని ఫార్వర్డ్ చేసినవారిపై మదనపల్లె, పుంగనూరుతో పాటు హైదరాబాద్‌లోనూ కేసులు నమోదైనట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో తితిదే బోర్డు సభ్యుడు నరేష్, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, ఉప మేయర్ మునికృష్ణనాయుడు తదితరులు పాల్గొన్నారు.



బాలమేళాను ప్రారంభించిన జస్టిస్ బట్టు దేవానంద్, ఎమ్మెల్యే సుజనా చౌదరి తదితరులు

సేవా భావంతో మెరుగైన సమాజం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్

విజయవాడ (కరెన్సీనగర్), న్యూస్‌టుడే: స్వార్థాన్ని పక్కనపెట్టి సేవాభావంతో ముందుకొస్తేనే మెరుగైన సమాజం సాకారమవుతుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ అన్నారు. సేవాభారతి ఆధ్వర్యంలో విజయవాడలోని వెన్యూ ఫంక్షన్‌హాల్లో ఆదివారం 'బాల మేళా' నిర్వహించారు. విశిష్ట అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. 'పాఠశాల విద్య ఎంతో కీలకం. అది భవిష్యత్తును నిర్ణయిస్తుంది. తల్లిదండ్రులను గౌరవించాలి. గురువుల పట్ల భక్తి, గౌరవం పెంచుకోవాలి. స్నేహితులతో నిజాయతీగా ఉంటూ.. జీవితాంతం స్నేహం కొనసాగేలా ప్రవర్తించాలి. సామాజిక మాధ్యమాలు, సెల్‌ఫోన్లు, టీవీలను విద్యార్థులు మంచి పనులకే వినియోగించాలి. విద్య ద్వారా పేదరికాన్ని జయించవచ్చని ఏపీజే అబ్దుల్ కలాం నిరూపించి రాష్ట్రపతి అయ్యారు. టీ అమ్ముకునే వ్యక్తి మోదీ దేశప్రధాని స్థాయికి ఎదగడం పట్టుదలకు ఉదాహరణ. గిరిజన మహిళ ద్రౌపదీముర్ము చిత్తశుద్ధితో కష్టపడి రాష్ట్రపతి అయ్యారు' అని వివరించారు. అసంఘటిత కార్మికుల పిల్లలకు విద్య, ఆరోగ్య సహాయం అందిస్తున్న సేవా భారతి కార్యక్రమాలను విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి కొనియాడారు. సేవాభారతికి సుజనా ఫౌండేషన్ ద్వారా సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ఆర్‌ఎస్‌ఎస్ ఆంధ్రప్రదేశ్ ప్రాంత ప్రచార ప్రముఖ్ బీ.వాసు మాట్లాడారు.

వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న న్యాయమూర్తులు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారిని ఆదివారం ఉదయం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్ర, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్ దర్శించుకున్నారు. వీరితోపాటు ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ డి.రమేష్, జస్టిస్ ఎన్.జయసూర్య, జస్టిస్ మహేశ్వరరావు కుంచం, జస్టిస్ టీసీడీ శేఖర్ కూడా దర్శించుకున్నారు. న్యాయమూర్తులకు తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం, తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.



శ్రీవారి ఆలయం ఎదుట సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి కుటుంబం



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి కుటుంబం



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్ర దంపతులు



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్ బిష్ణోయ్ కుటుంబం



ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.జయసూర్య, జస్టిస్ టీసీడీ శేఖర్, జస్టిస్ డి.రమేష్, జస్టిస్ మహేశ్వరరావు కుంచం తదితరులు

నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో చిరునవ్వులు పూయించటమే లక్ష్యం

- ఎటపాక సీఆర్‌పీఎఫ్ 212 బెటాలియన్ సెకండ్ ఇన్ కమాండ్ దినేష్‌కుమార్

ఎటపాక, న్యూస్‌టుడే: నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజల ముఖాల్లో చిరునవ్వులు పూయించటమే సివిక్ యాక్షన్ ప్రోగ్రామ్ లక్ష్యమని ఎటపాక సీఆర్‌పీఎఫ్ 212 బెటాలియన్ సెకండ్ ఇన్ కమాండ్ దినేష్‌కుమార్ అన్నారు. పోలవరం జిల్లా ఎటపాక మండల సరిహద్దు ప్రాంతం మారాయిగూడ గ్రామ సమీపంలోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా వీరగాంగ్లర్ గ్రామంలో సివిక్ యాక్షన్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రామ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, బ్యాగులు, యువకులకు క్రీడా సామగ్రి అందజేశారు. గ్రామంలోని అన్ని కుటుంబాలకూ నిత్యావసరాలు, గృహోపకరణాలు అందించారు. అనంతరం దినేష్‌కుమార్ మాట్లాడుతూ సైనిక దళం, సమాజం మధ్య బంధాన్ని మరింత పెంచుకోవడానికి ఈ కార్యక్రమం మార్గం సుగమం చేస్తుందన్నారు.



యువతకు క్రీడాసామగ్రి అందజేస్తున్న బెటాలియన్ అధికారులు

రొయ్యల హేచరీల సంఘం కార్యవర్గం ఎన్నిక

బాపట్ల, న్యూస్‌టుడే: రొయ్యల హేచరీల సంఘం(ఏఐఎస్‌హెచ్‌ఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఉపాధ్యక్షుడిగా బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, ఇతర కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలోని ఓ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎమ్మెల్యే వేగేశన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఆక్వా సాగుకు రైతులను ప్రోత్సహించడం లక్ష్యంగా సంఘం ఆవిర్భవించిందని వెల్లడించారు. ఏఎస్‌ఎస్‌హెచ్‌ఏ రాష్ట్ర కార్యాలయాన్ని విజయవాడలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏఐఎస్‌హెచ్‌ఏ ఉపాధ్యక్షుడు వెలగ సత్యారెడ్డి, సంయుక్త కార్యదర్శి సాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రాక్టీస్, ప్రజంటేషన్‌తో మార్కులు 'పది'లం!

- 'ఈనాడు ప్రతిభ – శ్రీ చైతన్య విద్యాసంస్థలు' వెబినార్‌లో నిపుణులు

ఈనాడు, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో త్వరలో పదోతరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థుల్లో భయాన్ని తొలగించి, సందేహాలను నివృత్తి చేసేందుకు 'ఈనాడు ప్రతిభ - శ్రీ చైతన్య విద్యాసంస్థలు' వెబినార్ నిర్వహించాయి. శ్రీ చైతన్య విద్యాసంస్థల ఆల్ ఇండియా ఐఐటీ కోఆర్డినేటర్ ఉమాశంకర్ సమన్వయం చేసిన ఈ వెబినార్‌లో నిపుణులు పాల్గొని విద్యార్థులు ఉత్తమ స్కోరు సాధించేలా మార్గనిర్దేశం చేశారు.

ఈనాడు ప్రతిభ | శ్రీచైతన్య విద్యాసంస్థలు

నిపుణుల పూర్తి సలహాలు సూచనలకు స్కాన్ చేయండి

అన్ని అంశాలూ ముఖ్యమే - ఉమాశంకర్



గణితం పేపర్‌లో 14 టాపిక్స్ ముఖ్యమైనవే. ఫార్ములాలు, స్టెప్‌లు, ఫార్ములా నోట్స్ మీ వద్ద ఉండాలి. ఫార్ములాలు వచ్చేలా సాధన చేయాలి. ఎన్ని రాశామన్నది కాదు.. ఎంత సరిగ్గా రాశామన్నదే ముఖ్యం. టాపిక్ తీసుకోవడం, ప్రశ్నలను సబ్జెక్టుల వారీగా సాధన చేయడమే విజయ సూత్రం. ఈనాడు ప్రతిభలో నిపుణుల మాదిరి ప్రశ్నపత్రాలతో పాటు, ప్రాక్టీసు పేపర్లు ఇస్తున్నారు. నిపుణులు చెప్పిన సూచనలను అనుసరిస్తూ టైం మేనేజ్‌మెంట్‌తో రాయగలిగేలా సాధన చేస్తే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

సీక్వెన్స్ ఫాలో అవ్వాలి - గాంధీ



గణితం తర్వాత నూటికి నూరు మార్కులు వచ్చే అవకాశం ఉన్న సబ్జెక్టు సైన్స్. విద్యార్థికి ఉన్న పరిజ్ఞానంతో పాటు పాఠ్యపుస్తకాలు, మెటీరియల్స్ నోట్స్ సాయంతో సాధన చేసి మంచి మార్కులు తెచ్చుకోవచ్చు. ఈనాడు ప్రతిభ, ఎస్‌ఎస్‌సీ బోర్డు వెబ్‌సైట్‌లో మాదిరి ప్రశ్నపత్రాలు చూసి బ్లూ ప్రింట్ సరిచూసుకోండి. ఎస్సేలు రాసేటప్పుడు డయాగ్రమ్‌లు వేయాలి. ఎవాల్యుయేటర్ దీన్ని చూసి విద్యార్థి అవగాహనను అంచనా వేసి మార్కులు వేసే అవకాశం ఉంటుంది. ప్రశ్నలను ర్యాండమ్‌గా కాకుండా సీక్వెన్స్‌ని ఫాలో అవుతూ రాయాలి.

మంచి మార్కులకు సాధనే మంత్రం - మధుతేజ



పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు రావాలంటే సాధనే ఏకైక మంత్రం. నిశిత దృష్టి సారించి.. మాదిరి ప్రశ్నపత్రాలను సాధన చేయడం ద్వారా ఎక్కువ మార్కులు సాధించవచ్చు. ఇంగ్లిష్‌లో క్రియేటివ్ ఎక్స్‌ప్రెషన్‌పై దృష్టి పెడితే మార్కులొస్తాయి. గ్రామర్, ఎస్సే రైటింగ్‌లోనూ మంచి మార్కులు సాధించవచ్చు. ప్రజంటేషన్ బాగుండాలి. బ్లూ, బ్లాక్ పెన్నులు వాడటం ఉత్తమం. ఫార్మాట్ లెటర్ రైటింగ్, సెంటెన్స్ కన్‌స్ట్రక్షన్ ముఖ్యం. మైండ్ మ్యాప్‌ని క్రియేట్ చేసుకొని థీమ్, క్యారెక్టర్ వంటివి తెలుసుకోగలిగితే చాలు.

చేతిరాతే ప్రధానం - బొల్లు రామమోహన్, హిందీ అధ్యాపకులు



ప్రత్యేక సాధనతోనే హిందీ సబ్జెక్టులో మంచి మార్కులొస్తాయి. కవి పరిచయాలు, పద్య, గద్య భాగాల పేరాగ్రాఫ్‌లు, లెటర్ రైటింగ్‌లో అత్యధిక మార్కులు సాధించేందుకు అవకాశాలు ఉంటాయి. అలాగే, చక్కగా తెలిసిన ప్రశ్నకు ముందు ప్రాధాన్యమివ్వండి. అక్షరాలు స్పష్టంగా రాస్తే మంచి మార్కులు సాధించవచ్చు. అన్ని సబ్జెక్టుల్లా దీనికీ ప్రాధాన్యం ఇవ్వండి. హిందీ భాషలో చేతి రాత ప్రధానం. అందమైన చేతిరాతకు మంచి మార్కులు వస్తాయి.

పాయింట్ల వారీ జవాబులతో ప్రయోజనం - కృష్ణారెడ్డి



సోషల్ స్టడీస్‌లో పాయింట్ల వారీగా జవాబు రాస్తే ప్రయోజనం ఉంటుంది. సమకాలీన అంశాలు, సామాజిక సమస్యలకు సంబంధించిన ప్రశ్నలకు విద్యార్థులు నేర్చుకున్న అంశాలతోపాటు, తెలిసిన విషయాలను జోడించి రాస్తే అదనంగా మార్కులు వస్తాయి. మ్యాప్ పాయింటింగ్ పెన్‌తో చేస్తే మంచిది. కొన్ని రోజుల తర్వాత ఎవాల్యుయేషన్ చేసేటప్పుడు పెన్సిల్ గుర్తులు చెరిగిపోయే అవకాశం ఉంది. పరీక్ష రాసేటప్పుడు ప్రశ్న నంబర్ వేయడం మరచిపోవద్దు. రెండు ఆప్షన్ల గురించి రాసేటప్పుడు వేర్వేరు పెన్నులను ఉపయోగించడం ఉత్తమం.

ఆందోళన వద్దు..- కనకదుర్గ, సైకాలజిస్టు



పరీక్షలు జీవితంలో ఎదుగుదలకు ఉపయోగపడేవే. భయంతో కాకుండా.. జీవితంలో ఓ భాగం అనుకుంటే ముందుకెళ్లగలరు. అవసరం లేనప్పుడు ఫోన్‌ను దూరం పెట్టాలి. చదివేటప్పుడు చిన్న చిన్న విరామాలు తీసుకోండి. కాసేపు నడిచి, ఓ గ్లాసు నీళ్లు తాగండి. పౌష్టికాహారం తీసుకోండి. ఎక్కువ నూనెతో వండిన ఆహార పదార్థాలకు దూరంగా ఉండండి. రోజుకు కనీసం ఆరేడు గంటలు నిద్ర ఉండేలా చూసుకోండి. పరీక్ష రోజు 'బాక్స్ బ్రీతింగ్' వంటి టిప్స్‌తో ఒత్తిడిని తగ్గించుకోవచ్చు.



ఆలోచనకు, ఆచరణకు మధ్య జాప్యం వద్దు

మీరు గొప్ప ఆలోచన చేసినంత మాత్రాన సరిపోదు. దాన్ని వీలైనంత త్వరగా అమలు చేయడానికి రంగంలోకి దిగడం కూడా ముఖ్యం. ఎందుకంటే ఆలస్యం చేసేకొద్దీ మీకు దాని మీద ఆసక్తి తగ్గిపోవచ్చు లేదా ఇంకెవరికో అలాంటి ఆలోచనే తట్టొచ్చు. ఆలోచనకు, ఆచరణకు మధ్య వ్యవధిని సాధ్యమైనంత తగ్గించగలగడం కూడా మీ విజయానికి దోహదపడే అంశమే.

– డాన్ కో, రచయిత

EENADU Vol: 52, Issue: 201 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

ఈనాడు సినిమా

ఉగాదికి ప్రత్యేక గ్లింప్స్‌తో!


చిరంజీవి

ఈ సంక్రాంతికి 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్నారు కథానాయకుడు చిరంజీవి. ఇప్పుడు 'విశ్వంభర'తో మరోమారు ప్రేక్షకుల్ని పలకరించేందుకు సమాయత్తమవుతున్నారు. వశిష్ఠ దర్శకత్వం వహించిన ఈ సినిమాని యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలు. వీఎఫ్ఎక్స్ పనుల వల్ల ఆలస్యమవుతూ వచ్చిన ఈ చిత్రం.. ఇప్పుడు అన్నీ ఓ కొలిక్కి వస్తుండటంతో విడుదల తేదీ ప్రకటించేందుకు సిద్ధమవుతోంది. దీని కోసం చిత్ర బృందం ఓ ప్రత్యేక గ్లింప్స్‌ను సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. దీన్ని మార్చిలో ఉగాది సందర్భంగా విడుదల చేయనున్నట్లు సమాచారం. ఇది ఆధ్యాత్మిక అంశాలతో నిండిన ఫాంటసీ అడ్వెంచర్ థ్రిల్లర్. 14 లోకాలతో ముడిపడిన కథగా ఉంటుంది. ఈ చిత్రానికి ఎం.ఎం కీరవాణి సంగీతమందిస్తుండగా.. ఛోటా కె నాయుడు ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

ఇదే చివరి రైడ్

"అది స్వర్గానికి ఆవల ఉన్న తెలియని రాజ్యం నుంచి ఉద్భవించింది. మన పూర్వీకులు మనకు ప్రసాదించిన పురాణం లాంటిది" అంటూ 'ఆడు 3' హంగామాను మొదలు పెట్టింది చిత్ర బృందం. జయసూర్య ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రమిది. ఫాంటసీ, యాక్షన్, కామెడీ లాంటి అంశాలతో రూపొంది సినీప్రియుల్ని విశేషంగా ఆకట్టుకున్న 'ఆడు' ఫ్రాంఛైజీలో రాబోతున్న మూడో భాగమిది. దీనికి మిధున్ మాన్యుయేల్ థామస్ దర్శకత్వం వహిస్తున్నారు. వినాయకన్, అజు వర్గీస్, సైజు కురుప్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను 'వన్ లాస్ట్ రైడ్' అనే వ్యాఖ్యతో సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. "నా మాటలు గుర్తుపెట్టుకో.. ఈ వంతెన మన అదృష్టాన్ని మార్చబోతుంది" లాంటి సంభాషణలతో ఆసక్తికరంగా సాగుతోంది ట్రైలర్. విజయ్ బాబు, వేణు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 19న థియేటర్లలోకి రానుంది.

నరకం నుంచి సందేశం


సంగీత్ శోభన్. నయన్ సారిక

"ప్రేక్షకులు పెట్టే టికెట్ డబ్బులకు సరిపడా వినోదాన్ని అందించే సినిమా 'రాకాస'" అన్నారు సంగీత్ శోభన్. ఆయన హీరోగా నటించిన ఈ చిత్రాన్ని మానస శర్మ తెరకెక్కించారు. నిహారిక కొణిదెల, ఉమేశ్ కుమార్ బన్సల్ నిర్మించారు. నయన్ సారిక కథానాయిక. ఈ సినిమా ఏప్రిల్ 3న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం హైదరాబాద్‌లో టీజర్‌ను విడుదల చేశారు. "నరకం నుంచి సందేశం వస్తోంది. ఇక సమయం లేదు" అనే డైలాగ్‌తో మొదలైన ఈ ప్రచార చిత్రం హారర్, ఫన్ అంశాల మేళవింపుగా ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ఈ సందర్భంగా హీరో సంగీత్ శోభన్ మాట్లాడుతూ.. "దర్శకురాలు మానస, నిర్మాత నిహారిక వల్లే ఈ చిత్రం ఇంత బాగా వచ్చింది. థియేటర్‌కి వచ్చిన ప్రేక్షకులు ఏదో వచ్చి నవ్వుకుని.. వెళ్లిపోయామనుకోకుండా వాళ్లకి ఓ కొత్త అనుభూతిని అందించాలన్న ఉద్దేశంతో దీన్ని ఎంతో కష్టపడి రూపొందించాం" అన్నారు. "టీజర్ గట్టిగా సౌండ్ చేసిందని నమ్ముతున్నా. ఈ సినిమా కోసం మేము చాలా కష్టపడ్డాం. కచ్చితంగా అందరికీ నచ్చుతుంది" అన్నారు దర్శకురాలు మానస శర్మ. నిర్మాత నిహారిక కొణిదెల మాట్లాడుతూ.. "మా సంస్థ నుంచి ఏ సినిమా వచ్చినా అది అందరికీ వినోదం పంచేలాగే ఉండాలనుకుంటా. ఈ 'రాకాస' కూడా అలాగే ఉంటుంది. థియేటర్‌కి వచ్చిన ప్రేక్షకుల్ని అసలు నిరుత్సాహపరచదు. మంచి వినోదాన్ని పంచిస్తుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో దివ్య విజయ్, అనుదీప్ దేవ్, రాజు, రామాంజనేయులు, గెటప్ శ్రీను, రోహిణి తదితరులు పాల్గొన్నారు.


స్వప్నదత్, ప్రియమణి, సిమ్రన్, రాధిక, వరలక్ష్మి, పూజ

మౌనంగా ఉన్న అమ్మాయిలకు ఓ ధైర్యం... సరస్వతి

"అరుదైన కథతో రూపొందిన చిత్రం 'సరస్వతి'. ఇలాంటి కథని వరలక్ష్మి చెప్పడం ఎంతో గర్వంగా ఉంది. మౌనంగా ఉన్న చాలామంది అమ్మాయిలకు ధైర్యాన్నిచ్చే సినిమా ఇది" అన్నారు రాధికా శరత్‌కుమార్. ఆమె, శరత్‌కుమార్, సిమ్రన్ ముఖ్య అతిథులుగా ఆదివారం హైదరాబాద్‌లో 'సరస్వతి' విడుదలకు ముందస్తు వేడుక జరిగింది. వరలక్ష్మీ శరత్‌కుమార్ ప్రధాన పాత్రధారిగా నటిస్తూ, దర్శకత్వం వహించిన చిత్రమిది. తన సోదరి పూజా శరత్‌కుమార్‌తో కలిసి దోస డైరీస్ పతాకంపై నిర్మించారు. ఈటీవీ విన్ సంస్థ సమర్పిస్తోంది. ఈ నెల 6న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా వేడుకని ఉద్దేశించి రాధికా శరత్‌కుమార్ మాట్లాడుతూ "వరలక్ష్మి నటి కావడం నా భర్త శరత్‌కుమార్ మొదట వ్యతిరేకించారు. అప్పుడు తన తల్లితో కలిసి వరలక్ష్మి ఈ విషయాన్ని ఓ రోజు నాతో పంచుకుంది. అప్పుడు వారిద్దరినీ శరత్ దగ్గరికి తీసుకెళ్లి ఒప్పించా. వరలక్ష్మి తొలి సినిమాని చూడగానే తను గొప్ప నటి అవుతుందని చెప్పడంతోపాటు, తెలుగు సినిమాలపై దృష్టిపెట్టమని సలహా ఇచ్చా. తెలుగు ప్రేక్షకులకు నచ్చితే నటుల్ని, సినిమాని ఎంతగా ఆరాధిస్తారో నాకు తెలుసు. నా అత్యుత్తమమైన సినిమాలన్నీ తెలుగులోనే చేశా. వరలక్ష్మి 'సరస్వతి' సినిమాతో దర్శకురాలిగా మారడం ఎంతో ఆనందాన్నిచ్చింది" అన్నారు. వరలక్ష్మీ శరత్‌కుమార్ మాట్లాడుతూ "కొన్నిసార్లు మనం కుటుంబాన్ని ఎంచుకోలేం. కుటుంబమే మనకోసం వస్తుంది. రాధిక ఆంటీ, మా అమ్మ అలా నాకు అండగా నిలిచారు. ఈ సినిమాతో మా నాన్న గర్వపడేలా చేస్తా. నా భర్త నిక్ సహకారంతోనే ఈ సినిమా ప్రయాణం మొదలైంది. బలమైన సందేశంతోపాటు, ఆద్యంతం అలరించే వినోదం ఇందులో ఉంది. ఈ కథలోని మలుపుల్ని సినిమా చూసిన ఎవ్వరూ బయట పెట్టకూడదని నా మనవి. ప్రతి ఒక్కరూ థియేటర్లలో చూసి ఆస్వాదించాల్సిన చిత్రమిది" అన్నారు. ముఖ్యమైన కథతో రూపొందిన 'సరస్వతి' ఓ మంచి చిత్రంగా నిలిచిపోతుందన్నారు నిర్మాత స్వప్నదత్. "వరలక్ష్మి ధైర్యానికి, ప్రేమకి ప్రతీకలా కనిపిస్తుంటుంది. తను ఫోన్ చేసి చెప్పగానే ఈ సినిమా ట్రైలర్‌ను చూశా. చాలా థ్రిల్లింగ్‌గా అనిపించింది" అన్నారు సిమ్రన్. ఈ కార్యక్రమంలో నందినిరెడ్డి, ప్రియమణి, శరత్‌కుమార్, సప్తగిరి, వరలక్ష్మి భర్త నికోలాయ్ సచ్‌దేవ్, ఈటీవీ విన్ కంటెంట్ హెడ్ నితిన్ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.


అల్లు అర్జున్ దంపతులు, శిరీష్, విజయ్ దేవరకొండ, రష్మిక, ఆనంద్

అల్లు శిరీష్ పెళ్లి సందడిలో విరోష్ జోడీ

తెలుగు చిత్రసీమలో మరో పెళ్లి సందడి మొదలైంది. కథానాయకుడు అల్లు శిరీష్ వివాహం ఈ నెల 6న జరగనుంది. ఆదివారం అల్లు అరవింద్ నివాసంలో పెళ్లి కొడుకు వేడుకని నిర్వహించగా, ఇటీవలే వివాహం చేసుకున్న విజయ్ దేవరకొండ, రష్మిక జోడీ హాజరైంది. కొత్త జంటకు కథానాయకుడు అల్లు అర్జున్, ఇతర కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు చెప్పారు. విరోష్ జోడీ అల్లు శిరీష్‌కు శుభాకాంక్షలు చెప్పింది. ఈ వేడుకలో చిరంజీవి కుటుంబ సభ్యులతోపాటు, బాలకృష్ణ సతీమణి వసుంధర దేవి తదితరులు పాల్గొన్నారు.


తాప్సీ


నా పనితోనే సమాధానం చెప్తా!

ఇండస్ట్రీలో నాతో కలిసి పనిచేయడం కొంచెం.. కష్టమనే మాటలు వింటూంటానంటోంది కథానాయిక తాప్సీ. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న తాప్సీ తన కెరీర్‌లో ఎదురైన ఓ చేదు అనుభవాన్ని పంచుకుంది. "కెరీర్‌లో కొన్నిసార్లు అవకాశాలు వచ్చి పోతుంటాయి. ఆ సమయంలో వారి నుంచి మీరు ఈ సినిమాలో ఉండకూడదనుకోవడం లాంటి విషయాలు మాత్రమే తెలుస్తాయి. కానీ, కొన్నిసార్లు సినిమాల్లో హీరోలే.. హీరోయిన్లను నిర్ణయిస్తారు. మరికొన్నిసార్లు దర్శకులు కూడా తమకు ఈ కథానాయికే కావాలని ఎంపిక చేసుకుంటారు. అలా వారు అనుకున్న వాళ్లతో సినిమా చేస్తారు. ఉదాహరణకు నేను అగ్ర హీరో షారుక్ ఖాన్ సరసన నటించిన 'డంకీ' సినిమానే తీసుకుందాం. దర్శకుడు రాజ్ కుమార్ హిరాణి ఆ సినిమా కోసం నన్నే తీసుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు చాలా మంది ఆశ్చర్యానికి గురయ్యారు. ఎందుకంటే వారి దృష్టిలో నేను షారుక్‌కి జోడీగా నటించే తారల జాబితాలో లేకపోవచ్చు. అప్పుడు నేను హీరోయిన్‌గా ఎంపికవ్వడం చాలా మందికి షాక్ అనే భావిస్తున్నాను. ఆ సందర్భంలో దర్శకుడు నన్ను కోరుకున్నారని మాత్రం కచ్చితంగా చెప్పగలను. కొన్నిసార్లు నాతో కలిసి పనిచేయడం కొంచెం కష్టమనే మాట వింటూంటాను. ప్రత్యక్షంగా కాదు గానీ, పరోక్షంగానే విన్నాను. కానీ అదెలా అనేదే అర్థం కావట్లేదు. ఎందుకంటే ఇండస్ట్రీలో నా కెరీర్‌ని చూసుకుంటే నాతో పనిచేసిన దర్శకులే మళ్లీ మళ్లీ నాతో కలిసి ప్రాజెక్ట్‌లు చేశారు. ఒకవేళ కష్టంగా అనిపిస్తే ఇలా జరగదు కదా! ఎందుకంటే.. రెండోసారి ఇబ్బంది పడాలని ఎవరూ అనుకోరు. బహుశా నాతో పనిచేయని వ్యక్తులకు నేను తెలియకపోవచ్చు. వాళ్లే ఇలా ప్రచారం చేసి ఉండొచ్చు. దాని గురించి ఆలోచించి బయటికి వచ్చి నేనేంటో అందరికీ నిరూపించాలని అనుకోను. అలా చెప్పాల్సిన అవసరం నాకు లేదు. నా పనితోనే సమాధానం చెప్తాన"ని చెప్పింది.


కల్యాణ్ రామ్


నిఖిల్


వరుణ్ తేజ్


విజయ్

ఈసారి హిట్ కొట్టాల్సిందే!

విజయం కోసం శ్రమిస్తున్న యువతరం హీరోలు

ప్రస్తుతం తెలుగులో చిరంజీవి, వెంకటేశ్, బాలకృష్ణ లాంటి అగ్ర తారలంతా విజయాల బాటలోనే ఉన్నారు. ప్రభాస్, అల్లు అర్జున్, రామ్‌చరణ్, ఎన్టీఆర్ లాంటి స్టార్లంతా జయాపజయాలతో సంబంధం లేకుండా పాన్ ఇండియా స్థాయిలో తమ ప్రభావాన్ని చూపిస్తున్నారు. కానీ, ఇప్పటికీ తెలుగులో కొందరు హీరోలు మునుపటి ఫామ్‌ను అందిపుచ్చుకునేందుకు ఎదురు చూపులు చూస్తూనే ఉన్నారు. ఈసారి ఎలాగైనా హిట్టు బాకీని తీర్చేసి.. బాక్సాఫీస్‌ను వసూళ్లతో మోత మోగించాలనే లక్ష్యంతో సెట్స్‌లో నిర్విరామంగా శ్రమిస్తున్నారు.

అగ్రతారలు ఫామ్‌లోకి వస్తే.. బాక్సాఫీస్ బరిలో వసూళ్ల రీసౌండ్ ఎలా ఉంటుందో 'మన శంకరవరప్రసాద్‌గారు' చిత్రంతో రుచి చూపించారు కథానాయకుడు చిరంజీవి. కుర్ర స్టార్లు హిట్టు మాట వినిపిస్తే మార్కెట్ వర్గాల్లో కనిపించే జోష్ ఎలా ఉంటుందో శర్వానంద్ 'నారీ నారీ నడుమ మురారి', నవీన్ పొలిశెట్టి 'అనగనగా ఒక రాజు' విజయాలు చూపించాయి. ఇప్పుడిలాంటి విజయాల కోసమే పలువురు హీరోలు ఆశగా ఎదురు చూస్తున్నారు. తనదైన రోజు బాక్సాఫీస్‌ను వసూళ్లతో మోత మోగించగల సత్తా ఉన్న హీరోల్లో విజయ్ దేవరకొండ ఒకరు. 'అర్జున్ రెడ్డి', 'గీత గోవిందం', 'టాక్సీవాలా' లాంటి విజయాలతో యువతరంలో మంచి క్రేజ్ సంపాదించుకున్నారు. కానీ, కొన్నేళ్లుగా మళ్లీ ఆ స్థాయి విజయాలేవి దక్కలేదు. గతేడాది 'కింగ్‌డమ్'తో తిరిగి ఫామ్‌లోకి వస్తాడని అంతా భావించినప్పటికీ చేదు ఫలితమే ఎదురైంది. ఇప్పుడాయన చేతిలో 'రణబాలి', 'రౌడీ జనార్ధన' చిత్రాలున్నాయి. విభిన్నమైన కథలతో ముస్తాబవుతున్న ఈ రెండు సినిమాలు భారీ బడ్జెట్లతో నిర్మితమవుతున్నవే. వీటితో తన ఫ్లాప్‌ల పరంపరకు ఎలాగైనా చెక్ పెట్టాలని ఇటు విజయ్‌తో పాటు అటు సినీప్రియులు బలంగా కోరుకుంటున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ రెండు సినిమాలు ఈ ఏడాది ద్వితీయార్ధంలోనే తెరపైకి రానున్నాయి. జయాపజయాలతో సంబంధం లేకుండా ప్రయోగాలకు సిద్ధపడే హీరోల్లో కల్యాణ్ రామ్ ఒకరు. 'బింబిసార' తర్వాత ఆయనకి మరో హిట్టు పడలేదు. గతేడాది 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'తో మరో ఎదురు దెబ్బ తగిలింది. దీంతో ఇప్పుడు కథల ఎంపికలో ఆచితూచి అడుగులేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవలే వెంకటేశ్‌తో కలిసి ఓ మల్టీస్టారర్ చేయనున్నట్లు ప్రకటించారు. వరుస విజయాలతో జోరు మీదున్న అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న చిత్రమిది. ప్రస్తుతం క్రేజీ కాంబోని చూస్తుంటే హిట్ పక్కా అనే భరోసా కనిపిస్తోంది. మరి ఆ అంచనాలు ఫలిస్తాయా లేదా అన్నది తెలియాలంటే వచ్చే సంక్రాంతి వరకు వేచి చూడక తప్పదు.

జాగ్రత్తగా అడుగులు..

మంచి ప్రేమకథలకు.. చక్కటి వినోదం నిండిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌లకు చిరునామా రామ్ పోతినేని. ఈ మధ్య తనేం చేసినా కలిసి రావడం లేదు. 'ది వారియర్', 'స్కంద', 'డబుల్ ఇస్మార్ట్'.. ఇలా ఇటీవల తన నుంచి వచ్చిన ప్రతిదీ ఆశించినంతగా ఆకట్టుకోలేకపోయింది. గతేడాది 'ఆంధ్ర కింగ్ తాలూకా'తో పాస్ మార్కులు వేయించుకున్నప్పటికీ.. ప్రేక్షకుల ఆకలిని పూర్తిగా తీర్చలేకపోయారు. దీంతో ఇప్పుడు తదుపరి సినిమా కోసం చాలా జాగ్రత్తగా అడుగులేస్తున్నారు. ప్రస్తుతం ఆయన చేతిలో రెండు కథలున్నాయి. అందులో ఒకటి స్వయంగా తానే సిద్ధం చేసుకున్నట్లు ప్రచారం వినిపిస్తోంది. వీటిని తెరకెక్కించే దర్శకులెవరన్నది ఇంకా తేలకున్నా.. త్వరలోనే పట్టాలెక్కడం ఖాయంగా కనిపిస్తోంది. రామ్ కెరీర్ తిరిగి గాడిన పడాలంటే ఈసారి హిట్టు మాట వినిపించడం తప్పని సరి. వైవిధ్యభరితమైన కథలతో ప్రేక్షకుల్ని మెప్పించే హీరో నిఖిల్ సిద్ధార్థ్. 'కార్తికేయ 2'తో జాతీయ స్థాయిలో సత్తా చాటారు. కానీ, ఆ తర్వాత 'స్పై', 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' చిత్రాలు చేదు ఫలితాల్ని అందించాయి. అందుకే ఇప్పుడాయన 'స్వయంభూ'తో తన మార్క్ బలంగా చూపించాలని ఉవ్విళ్లూరుతున్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ హిస్టారికల్ యాక్షన్ డ్రామాపై ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలే నెలకొని ఉన్నాయి. ఇది ఈ వేసవిలోనే థియేటర్లలోకి రానుంది. ఇది గనుక విజయం సాధిస్తే నిఖిల్ తదుపరి సినిమా 'ది ఇండియా హౌస్'పై అంచనాలు రెట్టింపవ్వడం ఖాయం. రామ్‌చరణ్ సమర్పణలో ముస్తాబవుతున్న ఈ చిత్రం కూడా ఈ ఏడాదే తెరపైకి వచ్చే అవకాశముంది. ప్రస్తుతం కథానాయకుడు నితిన్ సినీ ప్రయాణం తీవ్ర ఒడిదొడుకులు ఎదుర్కొంటోంది. విభిన్నమైన కథలతో అలరించే ప్రయత్నం చేస్తున్నా ఏదీ కలిసి రావడం లేదు. గతేడాది 'రాబిన్‌హుడ్', 'తమ్ముడు' చిత్రాలతో మరో రెండు ఎదురు దెబ్బలు తగిలాయి. దీంతో తన లైనప్‌లోని సినిమాలు పోగొట్టుకోవాల్సి వచ్చింది. ఇప్పుడాయన చేతిలో వీఐ ఆనంద్ చిత్రం ఒకటి ఉంది. తను తిరిగి నిలబడాలన్నా.. నిలదొక్కుకోవాలన్నా దీనితో హిట్టు కొట్టడం తప్పని సరి.


దర్శక నిర్మాతలకు భరోసా

వరుణ్ తేజ్ హిట్టు మాట వినిపించి ఐదేళ్లు దాటిపోయింది. 'గద్దలకొండ గణేశ్' తర్వాత మళ్లీ ఆ స్థాయి విజయమేదీ దక్కలేదు. ఇప్పుడాయన ఆశలన్నీ 'కొరియన్ కనకరాజు'పైనే ఉన్నాయి. మేర్లపాక గాంధీ తెరకెక్కిస్తున్న ఈ హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ ఈ వేసవిలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. మరి దీనితోనైనా విజయాల బాటలోకి వస్తాడా? లేదా? చూడాలి. చిత్రసీమలోకి వచ్చినప్పటి నుంచి ఓ నిఖార్సైన హిట్టు కోసం ఎదురు చూస్తూనే వస్తున్నారు అక్కినేని అఖిల్. భారీ అంచనాలు పెట్టుకున్న 'ఏజెంట్' తీవ్రంగా నిరుత్సాహపరచడంతో.. కథల ఎంపికలో పునరాలోచనలో పడ్డారు. అందుకే కాస్త గ్యాప్ తీసుకుని 'లెనిన్'ని పట్టాలెక్కించారు. ఈ సినిమాతో తను కచ్చితంగా హిట్టు కొట్టాలని అటు అక్కినేని అభిమానులతో పాటు ఇటు సినీప్రియులు బలంగా ఆకాంక్షిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ చిత్రం ఈ వేసవిలోనే తెరపైకి రానుంది. వినోదాత్మక ప్రేమకథలకు చిరునామాగా నిలిచిన నాగశౌర్య కొన్నాళ్లుగా వరుస పరాజయాలతోనే సతమతమవుతున్నారు. ఇప్పుడాయనకీ ఓ హిట్టు తప్పని సరే. ప్రస్తుతం ఆయన చేతిలో 'బ్యాడ్ బాయ్ కార్తీక్' అనే ఓ సినిమా ఉంది. దానితో ఎలాగైనా హిట్ ట్రాక్ ఎక్కాలన్నది అందరి కోరిక. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా త్వరలోనే తెరపైకి వచ్చే అవకాశముంది. వీళ్లలో కొందరైనా మళ్లీ విజయాల బాట పట్టారంటే దర్శక, నిర్మాతలకు కొండంత భరోసా దక్కినట్లవుతుంది. ప్రస్తుతం అగ్రతారలంతా వరుస సినిమాలతో బిజీగా ఉన్న నేపథ్యంలో ఈ హీరోలు దర్శకులకు మంచి ఆప్షన్‌గా మారే అవకాశముంది.


రామ్


నితిన్


అఖిల్


నాగ శౌర్య


ధనుష్ యాక్షన్ వేసవిలో


ధనుష్

వైవిధ్యమైన కథలతో దర్శకుడిగా, కథానాయకుడిగా సినీప్రియుల్ని అలరిస్తుంటారు ధనుష్. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'కర'. "ఈ ఆటలో అందరూ దోషులే.. కానీ కారణాలే వేర్వేరు' అంటూ ఇటీవలే ఈ చిత్రాన్ని ప్రకటించారాయన. విఘ్నేశ్ రాజా దర్శకత్వం వహిస్తున్నారు. మమితా బైజు కథానాయిక. ఐషారి కె. గణేశ్ నిర్మిస్తున్నారు. ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఈ చిత్రాన్ని వేసవి సందర్భంగా ఏప్రిల్ 30న థియేటర్లలోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. "గ్రామీణ నేపథ్యంలో యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇందులో ధనుష్ రైతు పాత్రలో సరికొత్తగా కనిపించనున్నారు. ఇందులోని ప్రతి పాత్ర ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరిచేలా ఉంటుంద"ని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ చిత్రంలో జయరామ్, కేఎస్ రవికుమార్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

'హైవాన్' రాక అప్పుడేనా?

జయాపజయాలతో సంబంధం లేకుండా సినిమాలు చేస్తుంటారు బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్. త్వరలో ఆయన.. సైఫ్ అలీఖాన్‌తో కలిసి 'హైవాన్' సినిమాతో అలరించడానికి సన్నద్ధమవుతున్నారు.



అక్షయ్ కుమార్

దీనికి ప్రియదర్శన్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమాను ఈ ఏడాది ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలో ఈ విషయంపై పూర్తి వివరాల్ని అధికారికంగా ప్రకటించే అవకాశాలున్నాయని అక్షయ్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. 'ఒప్పం' రీమేక్‌గా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో మలయాళ అగ్రహీరో మోహన్‌లాల్ కూడా అతిథి పాత్రలో మెరవనున్నట్లు తెలుస్తోంది. సయామీ ఖేర్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటుంది. ఇందులో అక్షయ్ ప్రతినాయక ఛాయలున్న పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం.

మన దేశంలో వైద్య విద్యలో ప్రవేశానికి తప్పనిసరిగా రాయాల్సిన పరీక్ష నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్టు(నీట్). తక్కువ సీట్లు, తీవ్ర పోటీ కారణంగా కొద్ది మందికే ఎంబీబీఎస్‌లో చేరే అవకాశం లభిస్తుంది. ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తయిన తర్వాత నీట్ కోసం దాదాపు 45 రోజుల వ్యవధి ఉంటుంది. ఈ సమయాన్ని సరైన ప్రణాళికతో సద్వినియోగం చేసుకుంటే ఆశించిన ఫలితం నెరవేరుతుంది.



నీట్ విజయానికి ప్రణాళిక ఇదీ..

దేశ వ్యాప్తంగా సుమారు 1.30 లక్షల ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. గత ఏడాది నీట్ కోసం 21 లక్షల మంది పోటీ పడ్డారు. ఈ సారి ఆ సంఖ్య ఎక్కువే ఉండొచ్చు. సీట్లు, పోటీ తీవ్రతను పరిగణనలోకి తీసుకోకుండా ఉన్న వ్యవధిని సద్వినియోగం చేసుకోవడంపై విద్యార్థులు దృష్టి సారించాలి. ఇంటర్మీడియట్ పరీక్షల తర్వాత 45 రోజులూ అత్యంత కీలకం. ఈ వ్యవధిని పూర్తిగా నీట్ సన్నద్ధత కోసమే కేటాయించాలి.

సిలబస్‌పై సమగ్ర అవగాహన: నీట్ ప్రశ్నలన్నీ దాదాపు నిర్దేశించిన సిలబస్ నుంచే అడుగుతారు. అందువల్ల ఏ విషయాన్నీ వదలకుండా చదివితే అన్ని ప్రశ్నలకూ సరైన జవాబులు గుర్తించగలరు. సబ్జెక్టుల వారీ ముఖ్యాంశాల మీద ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

చదవాల్సినవి: విద్యార్థులకు స్టడీ మెటీరియల్, పుస్తకాలు విస్తృతంగా అందుబాటులో ఉన్నాయి. అయితే వీటిలో ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్య పుస్తకాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. పరీక్షలో సుమారు 90 శాతం కంటే ఎక్కువ ప్రశ్నలు వీటి నుంచే వస్తాయి.

✦ డయాగ్రమ్స్, పట్టికలు(టేబుల్స్) వదలకుండా నేర్చుకోవాలి. ఎందుకంటే వీటిలోని సమాచారం ఆధారంగా ప్రశ్నలుండవచ్చు. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో సాల్వ్‌డ్ ప్రాబ్లమ్స్, అదనపు నోట్సుతో కూడిన ఉదాహరణలు ఎక్కువగా ఉంటాయి. వీటిని బాగా చదివితే పరీక్షలో ఎంతో ప్రయోజనం ఉంటుంది.

సబ్జెక్టుల వారీ

✦ బయాలజీలో గరిష్ఠ మార్కుల కోసం స్మార్ట్ స్టడీ టెక్నిక్‌లను అమలు చేయాలి. ఏదైనా అంశం/విషయంలో లోతైన పరిజ్ఞానం కోసం రేఖా చిత్రాలు, ఫ్లో చార్టులు.. మొదలైనవి ఉపయోగించాలి.

✦ రసాయన శాస్త్రంలో ఫిజికల్ కెమిస్ట్రీ విభాగంలోని ప్రశ్నలు సూత్రాల మీద ఆధారపడి ఉంటాయి. కాబట్టి విద్యార్థులు వాటి అనువర్తనంపై దృష్టి సారించాలి. ఇన్ ఆర్గానిక్ కెమిస్ట్రీ విభాగంలో ప్రతి విషయాన్నీ క్షుణ్నంగా అర్థం చేసుకుని, అధ్యయనం కొనసాగిస్తే గరిష్ఠ మార్కులు పొందవచ్చు. ఈ విభాగంలో రాణించడానికి ఆవర్తన పట్టిక నేర్చుకోవడం చాలా ముఖ్యం. ఆర్గానిక్ కెమిస్ట్రీ కొంచెం కష్టంగా అనిపిస్తుంది. అయితే కాన్సెప్టుల వారీ బాగా చదివి, ఎక్కువ ప్రశ్నలు సాధన చేస్తే ఈ విభాగంలోనూ రాణించగలరు. అన్ని కెమికల్ రియాక్షన్లు, నేమ్‌డ్ రియాక్షన్లపై దృష్టి సారించాలి.

✦ భౌతికశాస్త్రం ప్రశ్నలు సాధారణంగా కాన్సెప్టులు అర్థం చేసుకోవడం, సూత్రాలను అనువర్తించడం మీద ఆధారపడి ఉంటాయి. అందువల్ల ఈ రెండు అంశాల మీద ఎక్కువ దృష్టి సారించాలి. వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేయాలి.

వెయిటేజీ

సబ్జెక్టుల వారీ, అందులోని అధ్యాయాలకు పరీక్షలో దక్కుతోన్న ప్రాధాన్యం గమనించాలి. దీన్ని అనుసరించి సన్నద్ధతలో సమయం కేటాయించుకోవాలి. పరీక్షలో ఎక్కువ ప్రాధాన్యం ఉండి, సులువుగా నేర్చుకోగలిగే అంశాల కోసం అధిక సమయం వెచ్చించాలి.

భౌతికశాస్త్రం: మెకానిక్స్ -13, ఎలక్ట్రోస్టాటిక్స్, డైనమిక్స్ - 10 నుంచి 12, మోడరన్ ఫిజిక్స్ - 7 నుంచి 8, హీట్ - 4, వేవ్స్ అండ్ ఆసిలేషన్స్ - 2, మెకానికల్ ప్రాపర్టీస్ ఆఫ్ ఫ్లూయిడ్స్ - 2 ప్రశ్నలు రావొచ్చు.

రసాయన శాస్త్రం: ఫిజికల్ కెమిస్ట్రీ - 14, ఇన్ ఆర్గానిక్ కెమిస్ట్రీ - 15, ఆర్గానిక్ కెమిస్ట్రీ - 16 ప్రశ్నలు ఉంటాయి.

వృక్షశాస్త్రం: డైవర్సిటీ ఇన్ ది లివింగ్ వరల్డ్ - 7, స్ట్రక్చరల్ ఆర్గనైజేషన్ ఇన్ ప్లాంట్స్ - 4, స్ట్రక్చర్ అండ్ ఫంక్షన్స్ - 8, ప్లాంట్ ఫిజియాలజీ - 8, ప్లాంట్ గ్రోత్ అండ్ డెవలప్‌మెంట్ - 6, సెక్సువల్ రీ ప్రొడక్షన్ ఇన్ ఫ్లవరింగ్ ప్లాంట్స్ - 5, జెనెటిక్స్ - 6, మైక్రోబ్స్ ఇన్ హ్యూమన్ వెల్ఫేర్ - 1, బయోటెక్నాలజీ - 1 ప్రశ్న అడగొచ్చు.

జంతుశాస్త్రం: హ్యూమన్ ఫిజియాలజీ - 13, ఎకాలజి అండ్ ఎన్విరాన్‌మెంట్- 10, హ్యూమన్ రీ ప్రొడక్షన్ అండ్ ప్రొడక్టివ్ హెల్త్ - 5, హ్యూమన్ జెనెటిక్స్ అండ్ ఎవల్యూషన్ - 5, హ్యూమన్ హెల్త్ అండ్ డిసీజెస్ - 3, యానిమల్ కింగ్‌డమ్ - 2, స్ట్రక్చరల్ ఆర్గనైజేషన్ - 3, బయోటెక్నాలజీ అండ్ అప్లికేషన్స్ - 1 ప్రశ్న వస్తాయి.

సన్నద్ధత

✦ ఒక అంశాన్ని పూర్తిగా చదివిన తర్వాత ముఖ్యమైన విషయాలు నోట్సు రాసుకోవాలి. ఫ్లాష్ కార్డులు తయారుచేసుకోవాలి. ఫ్లోచార్ట్స్, డయాగ్రమ్స్, బులెట్ పాయింట్స్ ద్వారా అవగాహన, జ్ఞాపకశక్తి పెంచుకోవాలి.

✦ పునశ్చరణ ఎంతో ముఖ్యం. కొత్తవి నేర్చుకున్నప్పుడు ఒక రోజు తర్వాత మళ్లీ ఒకసారి చదవాలి. మూడు రోజుల తర్వాత మరోసారి, వారం తర్వాత ఇంకో సారి.. ఇలా పునశ్చరణ కొనసాగిస్తే మర్చిపోయే ఇబ్బంది దాదాపు ఉండదు.

✦ రోజూ 8 నుంచి 10 గంటలు పూర్తి ఏకాగ్రతతో చదవాలి. ఒకేసారి కాకుండా విరామాలు తీసుకుంటూ అధ్యయనం కొనసాగించాలి. మొబైల్ పూర్తిగా పక్కన పెట్టాలి. కేవలం సందేహ నివృత్తికే ఇంటర్నెట్ ఉపయోగించాలి. అది కూడా ఎక్కువ సమయం వద్దు.


✦ బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ఒక్కో సబ్జెక్టుకూ రోజుకు 2-3 గంటలు కేటాయించి చదవాలి. ఇలా 30 రోజులు కొనసాగించాలి.

✦ చివరి 15 రోజులూ పాత ప్రశ్నాపత్రాలు బాగా సాధన చేయాలి. అలాగే ప్రతి రోజూ పూర్తి సిలబస్ కవరయ్యేలా మాక్ టెస్టులు రాయాలి. తప్పులు సమీక్షించుకోవడం ఎంతో ముఖ్యం. బాగా ఇబ్బంది పడుతోన్న అంశాలు మరోసారి చదివి, అందులో వీలైనన్ని మాదిరి ప్రశ్నలు మళ్లీ సాధన చేయాలి.

✦ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తప్పనిసరి. కనీసం 6-7 గంటలు నిద్రకు కేటాయించాలి. తగినంత నీరు తాగుతూ, తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. శక్తికోసం అరటిపండ్లు, పల్లీలు.. లాంటివి తినాలి. రోజూ కనీసం అర గంటకు తక్కువ కాకుండా నడక, పరుగు, తేలికైన వ్యాయామం చేయాలి. పూర్తి సానుకూల ధోరణితో ఉండాలి. నిరాశ చెందకుండా, ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం మీదే దృష్టి సారించాలి.

పట్టుదల, ఆత్మవిశ్వాసంతో 45 రోజులు కృషిచేస్తే ఎంబీబీఎస్ సీటు మీకు ఖాయమైనట్లే.

నీట్ యూజీ 2026 కోసం https://neet.nta.nic.in ద్వారా మార్చి 8 లోపు దరఖాస్తు చేసుకోవాలి. పరీక్ష తేదీ: మే 3.



ఎం.వెంకట స్వామి, సీనియర్ లెక్చరర్, శ్రీ చైతన్య నీట్ అకాడమీ, హైదరాబాద్.

ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ ఎలాంటి అవకాశాలు?

మా ఇద్దరు పిల్లల్లో ఒకరు బీఎస్సీ (కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ), మరొకరు బీఎస్సీ (కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథ్స్) చదువుతున్నారు. ఇద్దరూ ఎమ్మెస్సీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ కోర్సు చదవడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇందులో ఉపాధి, ఉన్నత విద్య అవకాశాలు ఎలా ఉంటాయి? ఈ కోర్సు ఏపీలో ఏ విశ్వవిద్యాలయాల్లో అందుబాటులో ఉంది? - రామారావు

■ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ సమస్యలు ఎక్కువవుతున్నాయి. కలుషిత గాలి, నీరు, నేల, వాతావరణ మార్పులు, జీవ వైవిధ్య నష్టం లాంటి అంశాలు మానవ జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం పెరుగుతోంది. ఐక్యరాజ్య సమితి లక్ష్యాల్లోనూ పర్యావరణ రక్షణకు కీలక స్థానం కల్పించారు.



● బీఎస్సీ (కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ), బీఎస్సీ (కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథ్స్) రెండు కోర్సులూ ఎన్విరాన్‌మెంటల్ కెమిస్ట్రీ రంగానికి చాలా అనుకూలమైనవి. బయాలజీ నేపథ్యం ఉన్న విద్యార్థులు జీవ వైవిధ్యం, పర్యావరణ వ్యవస్థలు లాంటి అంశాలను సులభంగా అర్థం చేసుకోగలరు. మ్యాథ్స్, ఫిజిక్స్ విద్యార్థులు డేటా విశ్లేషణ, మోడలింగ్, జీఐఎస్ లాంటి ఆధునిక సాంకేతిక అంశాల్లో నైపుణ్యం పొందగలరు.

● ఏపీలో ఎమ్మెస్సీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌ను ఆంధ్ర, ఆచార్య నాగార్జున, శ్రీ వెంకటేశ్వర, యోగి వేమన విశ్వవిద్యాలయాలు అందిస్తున్నాయి. ప్రవేశాలు సాధారణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నిర్వహించే ఏపీపీజీసెట్‌తో ఉంటాయి. మంచి ర్యాంకుతో విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లో చదువుకోవచ్చు.

● కోర్సు పూర్తిచేసుకున్నవారికి ప్రభుత్వ రంగంలో కాలుష్య నియంత్రణ మండళ్లు, అటవీ శాఖ, మున్సిపల్ సంస్థలు లాంటి విభాగాల్లో ఉద్యోగాలు లభిస్తాయి. అలాగే, మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్ అండ్ క్లైమేట్ ఛేంజ్ మొదలైన కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో కూడా ఉద్యోగాలు అందుబాటులో ఉంటాయి. ప్రైవేటు రంగంలో ఫార్మా, సిమెంట్, పవర్ ప్లాంట్స్, ఎన్విరాన్‌మెంటల్ కన్సల్టెన్సీ సంస్థల్లో ఎన్విరాన్‌మెంటల్ అనలిస్ట్, ఎన్విరాన్‌మెంటల్ ఆఫీసర్, సేఫ్టీ ఆఫీసర్ లాంటి ఉద్యోగాలు లభిస్తాయి. ముఖ్యంగా ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ సంస్థల్లో వీరికి డిమాండ్ ఉంది.

● ఉన్నత విద్యలో భాగంగా ఎమ్మెస్సీ తర్వాత పీహెచ్‌డీ చేసి, పరిశోధనా రంగంలోకి ప్రవేశించవచ్చు. దేశంలో ప్రముఖ సంస్థలైన నీరీ, ఐఐటీ, ఐఐఎస్సీ, ఐఐఎస్ఈఆర్ లాంటి సంస్థల్లో పరిశోధన కొనసాగించవచ్చు. అలాగే యూజీసీ నెట్ / ఏపీసెట్ అర్హత సాధిస్తే కళాశాలల్లో అధ్యాపక ఉద్యోగాలు కూడా పొందవచ్చు.

ఎమ్మెస్సీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ భవిష్యత్తుకు అనుకూలమైన కోర్సు. పర్యావరణ పరిరక్షణకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతోన్న ప్రాధాన్యం దృష్ట్యా ఈ రంగంలో ఉద్యోగాలు, పరిశోధన అవకాశాలు మరింత విస్తృతమవుతాయి. ఈ కోర్సులో చేరిన వారు సరైన నైపుణ్యాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం (జీఐఎస్, డేటా అనాలిసిస్)ను అభివృద్ధి చేసుకుంటే మంచి కెరియర్ నిర్మించుకోవచ్చు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

కేంద్రీయ ఆసుపత్రుల్లో నర్సింగ్ ఆఫీసర్లు

కేంద్రం ఆధ్వర్యంలో నడుస్తోన్న అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్)లతోపాటు పలు జాతీయ వైద్య సంస్థల్లో సేవలందించే అవకాశం వచ్చింది. నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ప్రకటన వెలువడింది. దేశవ్యాప్తంగా 2551 ఖాళీలు ఉన్నాయి. నర్సింగ్ ఆఫీసర్ రిక్రూట్‌మెంట్ కామన్ ఎలిజిబిలిటీ టెస్టు(నార్‌సెట్)తో నియామకాలుంటాయి. బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం కోర్సులు పూర్తిచేసుకున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ఉద్యోగానికి ఎంపికైనవారు మొదటి నెల నుంచే రూ.85,000కు పైగా వేతనం అందుకోవచ్చు.

బీఎస్సీ నర్సింగ్ నాలుగేళ్ల సిలబస్ ఆపోశన పట్టినవారు నర్సింగ్ ఆఫీసర్ ఉద్యోగాన్ని పొందడం సులువే. ఈ పోస్టుల్లో 80 శాతం మహిళలకే దక్కుతాయి. మిగిలిన 20 శాతం పురుషులతో నింపుతారు. పరీక్షలో ప్రిలిమ్స్, మెయిన్స్ ఉంటాయి. ఈ రెండు దశల్లోనూ విజయవంతమైనవారి సర్టిఫికెట్లు పరిశీలించి, అభ్యర్థుల ప్రాధాన్యం ప్రకారం పోస్టులు కేటాయిస్తారు.



ప్రిలిమ్స్

వంద మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు వస్తాయి. ఇందులో 80 సబ్జెక్టుకు సంబంధించినవే ఉంటాయి. మిగిలిన 20 జనరల్ నాలెడ్జ్, ఆప్టిట్యూడ్ విభాగాల నుంచి అడుగుతారు. ప్రతి ప్రశ్నకూ 4 ఆప్షన్లు ఇస్తారు. వాటిలో సరైనదాన్ని గుర్తించాలి. ప్రతి సరైన జవాబుకూ ఒక మార్కు. తప్పు సమాధానానికి మార్కులో మూడో వంతు తగ్గిస్తారు. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు. దీన్ని 5 సెక్షన్లుగా విభజించారు. ఒక్కో సెక్షన్‌లో 20 చొప్పున ప్రశ్నలు వస్తాయి. ప్రతి సెక్షనూ 18 నిమిషాల్లో పూర్తి చేయాలి. ఇందులో అర్హతకు.. జనరల్, ఈడబ్ల్యూఎస్‌లు 50 శాతం, ఓబీసీలు 45, ఎస్సీ, ఎస్టీలు 40 శాతం మార్కులు పొందాలి. దివ్యాంగులైతే కేటగిరీ అనుసరించి అదనంగా మరో 5 శాతం సడలింపు వర్తిస్తుంది. సబ్జెక్టు విభాగంలో అడిగే ప్రశ్నలు బీఎస్సీ నర్సింగ్ నాలుగేళ్ల సిలబస్ నుంచే ఉంటాయి. అందువల్ల ఆ పాఠ్యపుస్తకాలు బాగా చదివితే ఎక్కువ మార్కులు పొందవచ్చు. అలాగే గతంలో నిర్వహించిన పరీక్షల ప్రశ్నాపత్రాలు, ఎమ్మెస్సీ నర్సింగ్ ప్రవేశ పరీక్షల్లోని ప్రశ్నలు బాగా సాధన చేసినవారు ఎక్కువ మార్కులు పొందవచ్చు. ప్రిలిమినరీ అర్హత కోసమే. తుది ఎంపికలో ఈ మార్కులు పరిగణనలోకి తీసుకోరు.

మెయిన్స్

ప్రిలిమ్స్‌లో అర్హత సాధించినవారి జాబితా నుంచి కేటగిరీల వారీ ఉన్న ఖాళీలకు 5 రెట్ల మందికి మెయిన్స్‌కు అవకాశం కల్పిస్తారు. 160 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు వస్తాయి. ఇవన్నీ నర్సింగ్ సిలబస్ నుంచే ఉంటాయి. ప్రతి ప్రశ్నకూ ఒక మార్కు. తప్పు సమాధానానికి 1/3 మార్కు తగ్గిస్తారు. ఈ పరీక్ష వ్యవధి 3 గంటలు. దీన్ని 4 సెక్షన్లుగా విభజించారు. ఒక్కో సెక్షన్‌లోనూ 40 ప్రశ్నలు వస్తాయి. సెక్షన్ల వారీ వ్యవధి 45 నిమిషాలు. ఇందులో అర్హతకు.. జనరల్, ఈడబ్ల్యూఎస్‌లు 50 శాతం, ఓబీసీలు 45, ఎస్సీ, ఎస్టీలు 40 శాతం మార్కులు పొందాలి. దివ్యాంగులైతే వారి కేటగిరీ అనుసరించి అదనంగా మరో 5 శాతం సడలింపు వర్తిస్తుంది.

నియామకాలు

పరీక్షల్లో అర్హత సాధించినవారి సర్టిఫికెట్లు పరిశీలిస్తారు. అనంతరం మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం ఖాళీలకు అనుగుణంగా అభ్యర్థుల ప్రాధాన్యం ప్రకారం పోస్టులు కేటాయిస్తారు. ఇలా అవకాశం వచ్చినవారిని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తారు. వీరికి పే స్కేల్ లెవెల్ 7 ప్రకారం రూ.44,900 మూలవేతనం అందిస్తారు. దీనికి డీఏ, హెచ్‌ఆర్‌ఏ అదనం. అన్నీ కలిపి మొదటి నెల నుంచే సుమారు రూ.85,000 వేతనం అందుకోవచ్చు. నోటిఫికేషన్‌లో 2551 పోస్టులు ప్రకటించినప్పటికీ కొన్ని ఎయిమ్స్‌ల్లో ఖాళీల వివరాలు పేర్కొనలేదు. అందువల్ల నియామకాల సమయానికి పోస్టుల సంఖ్య పెరగొచ్చు.

ఎయిమ్స్ కేంద్రాలు: బఠిండా, భోపాల్, భువనేశ్వర్, బీబీనగర్, బిలాస్‌పుర్, దియోఘర్, గోరఖ్‌పుర్, జోధ్‌పుర్, కల్యాణి, మంగళగిరి, నాగ్‌పుర్, న్యూదిల్లీ, పట్నా, రాయ్ బరేలీ, రాయ్‌పుర్, రాజ్‌కోట్, రిషికేష్, విజయ్‌పుర్ (జమ్మూ), అవంతిపుర. ఈ స్కోరుతో ఎయిమ్స్‌లతోపాటు జిప్మర్-పుదుచ్చేరి, ఈఎస్ఐసీ, ఇతర ముఖ్య సంస్థల్లోని ఖాళీలనూ నింపుతారు.

వివరాలు

అర్హత: బీఎస్సీ నర్సింగ్ / పోస్టు బేసిక్ బీఎస్సీ నర్సింగ్ లేదా జీఎన్ఎంతో పాటు కనీసం 50 పడకల ఆసుపత్రిలో రెండేళ్ల పని అనుభవం.

వయసు: 30 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు కేటగిరీ ప్రకారం పది నుంచి పదిహేనేళ్లు సడలింపులు వర్తిస్తాయి.

ఆన్‌లైన్ దరఖాస్తులు: మార్చి 16 సాయంత్రం 5 వరకు స్వీకరిస్తారు.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీలకు రూ.3000. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ రూ.2400. దివ్యాంగులకు ఉండదు.

ఆన్‌లైన్ పరీక్ష తేదీలు: స్టేజ్-1: 11.04.2026, స్టేజ్-2: 30.04.2026

వెబ్‌సైట్: https://aiimsexams.ac.in/

సీఐటీడీలో డిప్లొమా కోర్సులు

సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సీఐటీడీ), హైదరాబాద్.. డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

◆ డిప్లొమా ఇన్ టూల్, డై అండ్ మౌల్డ్ మేకింగ్ (డీటీడీఎం): 60 సీట్లు

◆ డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (డీఈసీఈ): 60 సీట్లు

◆ డిప్లొమా ఇన్ ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్ ఇంజినీరింగ్ (డీఏఆర్ఈ): 60 సీట్లు

◆ డిప్లొమా ఇన్ ప్రొడక్షన్ ఇంజినీరింగ్ (డీపీఈ): 60 సీట్లు

వ్యవధి: మూడేళ్లు. **అర్హత:** పదో తరగతి.

వయసు: 22-05-2026 నాటికి 19 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్ల సడలింపు వర్తిస్తుంది.

ఎంపిక: ప్రవేశ పరీక్షలో ప్రతిభతో.

పరీక్ష: ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. పదో తరగతి మ్యాథమెటిక్స్, సైన్స్, ఇంగ్లిష్‌లతో పాటు ఆప్టిట్యూడ్, జనరల్ నాలెడ్జ్ నుంచి ప్రశ్నలు ఉంటాయి.

పరీక్ష వ్యవధి: 90 నిమిషాలు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 22-05-2026.

ప్రవేశ పరీక్ష తేదీ: 25-05-2026.

పరీక్ష కేంద్రం: హైదరాబాద్.

వెబ్‌సైట్: https://www.citd.in/index.php

గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు

హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్.. ఇంజినీరింగ్ విభాగాలలో గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ట్రెయినీ నియామకాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

◆ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ (ఇంజినీరింగ్ స్ట్రీమ్): 250 ఖాళీలు (ముంబయి రిఫైనరీ-మహారాష్ట్ర: 120; విశాఖ రిఫైనరీ-ఆంధ్రప్రదేశ్: 130)

అప్రెంటిస్‌షిప్ వ్యవధి: ఏడాది.

అర్హత: కనీసం 60 (ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూబీడీ 50) శాతం మార్కులతో సంబంధిత విభాగాలలో (సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, కంప్యూటర్ సైన్స్/ఐటీ) ఇంజినీరింగ్ డిగ్రీ ఉండాలి.

వయసు: 10-03-2026 నాటికి 18 నుంచి 25 సంవత్సరాలు ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్లు గరిష్ఠ వయసులో సడలింపు వర్తిస్తుంది.

స్టైపెండ్: నెలకు రూ.25,000. **ఎంపిక:** అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూలతో. **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 10.03.2026.

వెబ్‌సైట్: https://www.hindustanpetroleum.com/job-openings

కొంకణ్ రైల్వేలో

కొంకణ్ రైల్వే కార్పొరేషన్ లిమిటెడ్.. వివిధ విభాగాల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ◆ అప్రెంటిస్: 190 ఖాళీలు

విభాగాలు: సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, జనరల్ స్ట్రీమ్ గ్రాడ్యుయేట్స్.

అర్హత: 2021 నుంచి 2025 మధ్య సంబంధిత విభాగాల్లో డిగ్రీ లేదా డిప్లొమా పూర్తి చేయాలి. నాట్స్ పోర్టల్‌లో వివరాలు నమోదై ఉండాలి.

వయసు: 01.01.2026 నాటికి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ-ఎన్‌సీఎల్‌కు మూడేళ్లు గరిష్ఠ వయసులో సడలింపు వర్తిస్తుంది.

స్టైపెండ్: గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు నెలకు రూ.9000. డిప్లొమా అప్రెంటిస్‌లకు నెలకు రూ.8000. **ఎంపిక:** అకడమిక్ మార్కుల మెరిట్‌తో.

దరఖాస్తు రుసుము: జనరల్/ఓబీసీలకు రూ.100. ఎస్సీ, ఎస్టీ, మహిళలు, మైనారిటీలు, ఈడబ్ల్యూఎస్‌లకు ఫీజు ఉండదు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 21.

వెబ్‌సైట్: https://konkanrailway.com/en/current_notification

ప్రాజెక్ట్ ఇంజినీర్లు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఘజియాబాద్.. తాత్కాలిక ప్రాతిపదికన ప్రాజెక్ట్ ఇంజినీర్-I పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

◆ ప్రాజెక్ట్ ఇంజినీర్-I (ఎలక్ట్రానిక్స్): 07 పోస్టులు

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ ఉండాలి. అలాగే 01.03.2026 నాటికి కనీసం రెండేళ్ల పారిశ్రామిక పని అనుభవం తప్పనిసరి.

వయసు: 01.03.2026 నాటికి 32 ఏళ్లు మించరాదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు గరిష్ఠ వయసులో సడలింపు వర్తిస్తుంది.

వేతనం: ఎంపికైన వారిని ప్రారంభంలో మూడేళ్ల వ్యవధికి నియమిస్తారు. ఆ తర్వాత మరో ఏడాది పొడిగించడానికి అవకాశం ఉంది. మొదటి సంవత్సరానికి నెలకు రూ.40,000 వేతనంతో ప్రారంభమై, నాలుగో ఏడాది రూ.55,000 వరకు చెల్లిస్తారు. అదనంగా ఇతర ప్రయోజనాలు, నాలుగేళ్లు పూర్తి చేసిన వారికి రూ.లక్ష రిటెన్షన్ బోనస్ లభిస్తుంది. **ఎంపిక:** రాత పరీక్ష (85 శాతం వెయిటేజీ), ఇంటర్వ్యూ (15 శాతం వెయిటేజీ)లతో. **దరఖాస్తు రుసుము:** రూ.400 + 18 శాతం జీఎస్టీ చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ పీడబ్ల్యూబీడీలకు ఫీజు నుంచి మినహాయింపు ఉంది.

పోస్టు ద్వారా దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: మార్చి 15.

చిరునామా: డిప్యూటీ మేనేజర్(హెచ్ఆర్), భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, సాహిబాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, ఘజియాబాద్, ఉత్తరప్రదేశ్ - 201010. **వెబ్‌సైట్:** https://bel-india.in/job-notifications/

యంగ్ ప్రొఫెషనల్స్

ఎడ్‌సిల్, న్యూదిల్లీ.. ఒప్పంద ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

◆ యంగ్ ప్రొఫెషనల్స్: 07 పోస్టులు

విభాగాలు: జనరల్, స్టాటిస్టిక్స్, ఎకనామిక్స్, లీగల్.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గ్రాడ్యుయేషన్ లేదా పీజీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.

వేతనం: నెలకు రూ.80,000- రూ.1,00,000.

వయసు: 32 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: షార్ట్‌లిస్టింగ్, రాత పరీక్ష/ఇంటర్వ్యూలతో.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 17.03.2026. **వెబ్‌సైట్:** https://edcilindia.co.in/TCareers

క్లినికల్ రిసెర్చ్ కోఆర్డినేటర్లు

టాటా మెమోరియల్ సెంటర్ ఒప్పంద ప్రాతిపదికన క్లినికల్ రిసెర్చ్ కోఆర్డినేటర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

◆ క్లినికల్ రిసెర్చ్ కోఆర్డినేటర్ - 03 పోస్టులు

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో బీ ఫార్మసీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.

వయసు: 35 ఏళ్లు మించకూడదు.

వేతనం: నెలకు రూ.27,000.

ఎంపిక: ఇంటర్వ్యూతో.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 6.

వెబ్‌సైట్: https://tmc.gov.in/

అసిస్టెంట్ మేనేజర్లు

బొకారో పవర్ సప్లయ్ కంపెనీ లిమిటెడ్ శాశ్వత ప్రాతిపదికన అసిస్టెంట్ మేనేజర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.

◆ అసిస్టెంట్ మేనేజర్ (బాయిలర్ ఆపరేషన్ ఇంజినీర్) - 15 పోస్టులు

అర్హత: సంబంధిత విభాగంలో కనీసం 65 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉండాలి

వయసు: 30 ఏళ్లు మించకూడదు ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు సడలింపు వర్తిస్తుంది.

వేతన శ్రేణి: నెలకు రూ.50,000-1,60,000

ఎంపిక: కంప్యూటర్ ఆధారిత పరీక్ష, ఇంటర్వ్యూలతో.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 5.


వెబ్‌సైట్: https://bpscl.com/our_people/careers/

చర్చలతోనే వివాదాలను పరిష్కరించుకోవాలి

- పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై ప్రపంచ నేతల పిలుపు

బ్రస్సెల్స్: ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల కారణంగా పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొనడంతో ప్రపంచవ్యాప్తంగా పలువురు నేతలు స్పందించారు. చర్చల ద్వారానే వివాదాలను పరిష్కరించుకోవాలని.. ప్రాంతీయంగా శాంతిని నెలకొల్పేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. బ్రిటన్, సౌదీ అరేబియా తదితర దేశాలు ఇరాన్ దాడులను ఖండించాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌ల సైనిక చర్య మొదలైన కొన్ని గంటల్లోనే ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి (యూఎన్ఎస్‌సీ) అత్యవసరంగా సమావేశమై.. ఉద్రిక్తతల తగ్గింపునకు పిలుపునిచ్చింది.

పరిస్థితులు చేజారిపోయే ముప్పు



ఇరాన్‌పై సైనిక చర్య వల్ల పరిస్థితులు చేజారిపోయే ప్రమాదముంది. అంతర్జాతీయ శాంతిభద్రతలకు ప్రస్తుత పరిణామాలు తీవ్ర ముప్పు తెస్తాయి. ప్రపంచానికి ఇప్పుడు యుద్ధ విరమణ అవసరం. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు వెంటనే తగ్గాలి. **- ఆంటోనియో గుటెరస్, ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్**

(భద్రతామండలి అత్యవసర సమావేశంలో మాట్లాడుతూ..)

నాయకులమని చెప్పుకొంటూ దారుణాలు



ప్రజాస్వామ్య ప్రపంచానికి నాయకులమని చెప్పుకొనేవారు.. సార్వభౌమ దేశమైన ఇరాన్ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకొని హత్యలకు తెగబడటం దారుణం. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ల ముందు మోకరిల్లే ప్రధాని మోదీ.. తాజా ఉద్రిక్తతల ప్రభావిత దేశాల్లోని భారత పౌరులను సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తారని ఆకాంక్షిస్తున్నా.

- ప్రియాంకాగాంధీ వాద్రా, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి

✦ ప్రస్తుత పరిణామాలతో పశ్చిమాసియా గందరగోళంలోకి జారిపోయే ముప్పుందని ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతా ఎల్‌సిసి ఆందోళన వ్యక్తం చేశారు.

✦ గల్ఫ్ దేశాలపై దాడులతో ఇరాన్ తప్పుడు లక్ష్యాలను ఎంచుకుందని యూఏఈ అధ్యక్షుడి సలహాదారుడు అన్వర్ వ్యాఖ్యానించారు.

పశ్చిమాసియాలో సీబీఎస్ఈ పరీక్షలు వాయిదా

దిల్లీ: యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియాలో సోమవారం జరగాల్సిన 10, 12వ తరగతి పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు సీబీఎస్ఈ ప్రకటించింది. 'ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా బహ్రెయిన్, ఇరాన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈల్లో సోమవారం జరగాల్సిన పరీక్షలను వాయిదా వేస్తున్నాం' అని సీబీఎస్ఈ పరీక్షల కంట్రోలర్ సాన్యం భరద్వాజ్ తెలిపారు. పరీక్షల తదుపరి తేదీలను త్వరలోనే తెలియజేస్తామని వెల్లడించారు. మంగళవారం బోర్డు పరిస్థితిని సమీక్షించి తదుపరి నిర్ణయం తీసుకుంటుందని వివరించారు.



ఒమన్‌లోని ముసాండం ద్వీపకల్పంలో ఇరాన్ దాడి చేయడంతో పలావు జెండాతో వెళ్తున్న ఆయిల్ నౌకలో అలముకున్న పొగ

దిల్లీలో యూత్ కాంగ్రెస్ సత్యాగ్రహం

దిల్లీ: ఏఐ సమిట్‌లో చొక్కాలు విప్పి నిరసన చేపట్టిన వ్యవహారంలో అరెస్టయిన తమ అధ్యక్షుడు ఉదయ్‌భాను చిబ్, ఇతర కార్యకర్తలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ యూత్ కాంగ్రెస్ దిల్లీలో ఆదివారం సత్యాగ్రహం చేసింది. జీవించే హక్కు, స్వేచ్ఛ అనేవి భారత రాజ్యాంగంలో ముఖ్యమైనవని పేర్కొంటూ చిబ్ విడుదలకు మెజిస్ట్రేట్ కోర్టు శనివారం ఆదేశించిన కొన్ని గంటల్లోనే ఆయనకు మంజూరు చేసిన బెయిల్‌పై దిల్లీ కోర్టు స్టే విధించింది. పరిపాలనా ఒత్తిడికి లోనైనప్పుడు న్యాయం కూడా తడబడుతుందని యూత్ కాంగ్రెస్ ఆరోపించింది. న్యాయపరంగా గెలుస్తున్నప్పటికీ పరిపాలనా పరంగా ఓడిపోతున్నామని, అందుకే సత్యాగ్రహం చేస్తున్నామని ఐవైసీ సభ్యులు తెలిపారు. నిరసన తెలిపేందుకు పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలను ఆహ్వానించినట్లు వెల్లడించారు.


అమెరికాలో కాల్పులు.. ముగ్గురి మృతి

- 14 మందికి గాయాలు

ఆస్టిన్: అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో కాల్పులు కలకలం రేపాయి. ఆస్టిన్‌లోని ఓ ప్రఖ్యాత బార్‌లో దుండగుడు జరిపిన కాల్పుల్లో ముగ్గురు మృతిచెందారు. మరో 14 మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకునే క్రమంలో ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో నిందితుడు మరణించాడు. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది.

మత బోధకుడి నుంచి... ప్రబల శక్తిగా..

- ఖమేనీ ప్రస్థానం ఇదీ...



ఆయతుల్లా అలీ ఖమేనీ.. ఇరాన్ సుప్రీం నేతగా 1989లో పగ్గాలు చేపట్టి మూడున్నర దశాబ్దాల పాలనలో తిరుగులేని నేతగా ఎదిగారు. పశ్చిమాసియాలో ఇరాన్‌ను ఓ ప్రాంతీయ శక్తిగా నిలిపారు. అదే సమయంలో దేశాన్ని ఉక్కు పిడికిలితో పాలించారు. తన పాలనకు వ్యతిరేకంగా తలెత్తిన ఉద్యమాలను క్రూరంగా అణచివేశారు. హెజ్‌బొల్లా, హమాస్ లాంటి సంస్థలకు అండగా నిలిచి ప్రాంతీయ అస్థిరతకు దారి తీశారన్న ఆరోపణలూ ఎదుర్కొన్నారు. అలాంటి నేత.. ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడుల్లో ప్రాణాలు కోల్పోవడంతో ఇరాన్ చరిత్రలో ఒక అధ్యాయం ముగిసిందనే చెప్పాలి.

ఇస్లామిక్ ఉద్యమం నుంచి..

ఖమేనీ.. 1939లో ఇరాన్‌లోని మషాద్‌లో జన్మించారు. చిన్న వయసులోనే షియా మత బోధకుడిగా మారారు. ఇరాన్ రాజు మహమ్మద్ రెజా పహ్లవీకి వ్యతిరేకంగా జరిగిన 1979 ఇస్లామిక్ విప్లవంలో పాల్గొన్నారు. ఆ సమయంలో చాలా సార్లు ఖమేనీని పోలీసులు అరెస్టు చేశారు. జైలులో నిర్బంధించారు. విప్లవం విజయవంతమై రూహుల్లా ఖమేనీ ఇరాన్ సుప్రీం నేతగా పగ్గాలు స్వీకరించిన అనంతరం ఖమేనీ రాజకీయ ప్రస్థానం వేగం పుంజుకుంది. 1980లో టెహ్రాన్‌లో శుక్రవారం ప్రార్థనలకు మత ప్రబోధకుడిగా ఆయన నియమితులయ్యారు. మతపరమైన పాండిత్యం అంతగా లేకపోయినా మంచి వక్తగా పేరొందారు. 1981లో ఖమేనీపై హత్యాయత్నం జరిగింది. టేప్ రికార్డర్‌లో బాంబు పెట్టి చంపాలని ఇస్లాం విప్లవ వ్యతిరేక గ్రూపులు ప్రయత్నించారు. ఈ ఘటనలో ఖమేనీ కుడి చేయి శాశ్వతంగా పనిచేయకుండా పోయింది. "నాకు మెదడు, నాలుక సక్రమంగా పనిచేస్తే చాలు.. చేతితో పని లేదు" అని ఒకసారి ఆ దాడి గురించి మాట్లాడుతూ ఖమేనీ అన్నారు. ఈ దాడి జరిగిన కొన్ని నెలలకే అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఇందుకు పరిస్థితులు కూడా కలిసొచ్చాయనే చెప్పాలి. 1981లో అప్పటి అధ్యక్షుడు మహమ్మద్ అలీ రెజాయ్ ట్రీఫ్‌కేస్ బాంబు దాడిలో చనిపోయారు. దీంతో ఖమేనీ అధ్యక్ష బరిలోకి దిగారు. సుప్రీం నేత రూహుల్లా ఖొమైనీ అండ కూడా ఉండటంతో ఆయన విజయం నల్లేరుపై నడకైంది. అధ్యక్షుడిగా ఇరాన్-ఇరాక్ యుద్ధంలోనూ ఖమేనీ కీలక పాత్ర పోషించారు. యుద్ధ క్షేత్రంలో పర్యటిస్తూ సైన్యంలోని కీలక అధికారులతో సంబంధాలను పెంచుకున్నారు. తదనంతర కాలంలో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ)ను బలోపేతం చేయడానికి ఈ అనుభవం ఆయనకు ఉపకరించింది.

అధ్యక్షుడిగా ఎన్నికైన వేళ..

1989.. ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ చరిత్రలో కీలక ఘట్టం. ఇస్లామిక్ విప్లవాన్ని విజయవంతంగా నడిపిన సుప్రీంనేత ఖొమైనీ మృతి చెందారు. ఆ సమయంలో వారసుడిగా ఖమేనీని మతపెద్దల కమిటీ ఎంపిక చేసింది. బాధ్యతలు చేపట్టగానే ఇరాన్‌ను అభివృద్ధి పథంలో నడుపుతానని ఇరాన్ ప్రజలకు ఖమేనీ హామీ ఇచ్చారు. అయితే ఎన్నడూ ఆ దిశగా ప్రయత్నాలు చేయలేదు. రాజ్యాంగ సవరణలు చేసి అధికారాన్ని పూర్తిగా తన గుప్పిట్లోకి తీసుకున్నారు. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ)ను బలోపేతం చేశారు. దీన్ని తన వ్యక్తిగత అస్త్రంగా మలచుకున్నారు. తనకు ఎదురైన ప్రతి అసమ్మతిని ఐఆర్‌జీసీ సాయంతో అణచివేశారు. అంతటితో ఆగలేదు. లెబనాన్, గాజా, ఇరాక్, యెమెన్, సిరియాలకు ఐఆర్‌జీసీ నెట్‌వర్క్‌ను విస్తరించారు. ఆ సంస్థ ద్వారా అక్కడి షియా మిలిటెంట్లకు ఆయుధాలు, డబ్బును చేరవేశారు. లెబనాన్‌లో హెజ్‌బొల్లా.. ఇరాక్‌లో ఖతాయిబ్ హెజ్‌బొల్లా, గాజాలో హమాస్, యెమెన్‌లో హూతీలు పురుడు పోసుకోవడానికి కారణమయ్యారు.

అంతా తానై...

అధ్యక్షుడు ఎవరు ఉన్నా.. అధికారం మాత్రం ఖమేనీయే చెలాయించారు. 1997లో ఇరాన్ అధ్యక్షుడిగా మహమ్మద్ ఖతామీ ఎన్నికయ్యారు. ఆయన సంస్కరణ వాది. ఖమేనీ వ్యతిరేకించినా, పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఆ క్రమంలో మరిన్ని సంస్కరణలను కోరుతూ ఇరాన్ ప్రజలు ఉద్యమాలు మొదలుపెట్టారు. దీంతో ప్రజలపై ఐఆర్‌జీసీ దళాలను ఉపయోగించి ఆ నిరసనలపై ఖమేనీ ఉక్కుపాదం మోపారు. 2009లో మహమ్మద్ అహ్మదీనెజాద్ తిరిగి ఎన్నికవ్వడంపై వివాదం రేగింది. దీంతో ఆందోళనలు ప్రారంభమయ్యాయి. వాటిని కూడా ఐఆర్‌జీసీ సాయంతో ఖమేనీ అణచివేశారు. అయితే రాజకీయ ఉద్రిక్తతలు పెరిగిన ప్రతిసారీ ఇరాన్ ఆర్థికంగా నష్టపోతూ వచ్చింది. సహజ వనరులు పుష్కలంగా ఉన్నా.. అమెరికా ఆంక్షల కారణంగా పరిస్థితి దిగజారుతూ వచ్చింది. ప్రజలకు ఆర్థికంగా అవకాశాలు కల్పించకపోతే మరో విప్లవం వస్తుందని ఖమేనీ అంచనా వేశారు. అందుకే 2015లో అమెరికాతో అణుచర్చలకు పచ్చజెండా ఊపారు. ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో మళ్లీ ఇరాన్ ప్రధాన స్రవంతిలోకి వస్తుందని అందరూ భావించారు. కానీ 2018లో అధికారంలోకి వచ్చిన ట్రంప్.. అణు ఒప్పందాన్ని రద్దు చేయడంతో ఇరాన్ మళ్లీ ఆంక్షల చట్రంలోకి వచ్చింది. అప్పటి నుంచి ఆర్థికంగానూ, రాజకీయంగా ఆ దేశం తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయింది.

పతనం ప్రారంభమైందిలా..

2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ నిర్వహించిన దాడులే ఖమేనీ పతనానికి దారి తీశాయని చెప్పాలి. ఆ దాడుల తర్వాతే పశ్చిమాసియాలో సమీకరణాలు ఇరాన్‌కు వ్యతిరేకంగా మారడం ప్రారంభించాయి. ఇజ్రాయెల్ కేవలం గాజాలోని హమాస్‌ను మాత్రమే లక్ష్యంగా చేసుకోకుండా ఇరాన్ నిర్మించిన మొత్తం నెట్‌వర్క్‌పై విరుచుకుపడింది. లెబనాన్‌లో హెజ్‌బొల్లాలపై యెమెన్‌లో హూతీలపై తీవ్రస్థాయిలో దాడులు చేసింది. హెజ్‌బొల్లా నేత నస్రల్లాను హత్యచేసి.. ఆ సంస్థను దాదాపు నిర్వీర్యం చేసింది. ఇది ఖమేనీని ఉలికిపాటుకు గురిచేసింది. దీనికి తోడు ఇరాన్‌కు మద్దతిచ్చే సిరియాలోని అసద్ ప్రభుత్వం 2025 డిసెంబరులో కుప్పకూలడం మరో భారీ దెబ్బ. ఇవన్నీ ఇరాన్‌ను బలహీన పరిచాయి. దీనికి తోడు గతేడాది జూన్‌లో 12 రోజుల యుద్ధంలో ఇజ్రాయెల్ దూకుడు..దానికి అమెరికా తోడవ్వడంతో ఇరాన్ బలహీనతలు బయటపడ్డాయి. వాటిని ఆసరాగా చేసుకొని ఇప్పుడు మళ్లీ ఆ రెండు దేశాలు సంయుక్త దాడులు ప్రారంభించి తొలి రోజునే ఖమేనీని హత్య చేశాయి. ఇది రానున్న రోజుల్లో ఇరాన్‌పై, పశ్చిమాసియాపై ఎలాంటి ప్రభావం చూపనుందో చూడాలి.

- నేషనల్ డెస్క్



ఫ్లోరిడాలోని పామ్‌బీచ్‌లో విదేశాంగమంత్రి మార్కో రూబియో, సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్, శ్వేతసౌధం చీఫ్ ఆఫ్ స్టాఫ్ సూసీ వైల్స్‌తో కలిసి ఇరాన్‌పై దాడులను పర్యవేక్షిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

దాడుల్లో బి-2 బాంబర్లు

వాషింగ్టన్: ఇరాన్ నేలమాళిగల్లోని బాలిస్టిక్ క్షిపణి స్థావరాలపై దాడులు చేయడానికి బి-2 స్టెల్త్ బాంబర్లను ఉపయోగించినట్లు అమెరికా మిలటరీ అధికారికంగా ప్రకటించింది. 2వేల పౌండ్ల బరువున్న బాంబులతో ఈ లోహవిహంగాలు పటిష్ఠమైన ఈ కేంద్రాలపై విరుచుకుపడినట్లు పేర్కొంది. గత ఏడాది జూన్‌లోనూ ఇరాన్ అణు కేంద్రాలపై దాడికి బి-2 బాంబర్లను అమెరికా వాడింది.

ప్రతీకారేచ్ఛతో ఐఆర్‌జీసీ!

- ట్రంప్ హెచ్చరికలకు లొంగే అవకాశాల్లేవ్..

'ఆయుధాలు వదిలిపెట్టి లొంగిపోండి. లేకపోతే మీకు మరణం తప్పదు'.. ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) సభ్యులను ఉద్దేశించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరిక ఇది! అయితే ఆయన హెచ్చరికను వారు ఖాతరు చేస్తున్నట్లు కనిపించడం లేదు. ఇజ్రాయెల్‌తో పాటు పలు అరబ్ దేశాల్లో అమెరికా స్థావరాలపై ఇప్పటికే దాడులు చేసిన ఐఆర్‌జీసీ.. ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హత్యకు ప్రతీకారం తీర్చుకోవాలన్న పట్టుదలతో ఉన్నట్లు కనిపిస్తోంది.

ఏంటీ ఐఆర్‌జీసీ?

ఐఆర్‌జీసీ అనేది ఇరాన్‌లోని విశిష్ట సాయుధ దళం. దీనికి రాజ్యాంగపరమైన గుర్తింపు ఉంది. ఇస్లామిక్ విప్లవం అనంతరం 1979లో ఈ దళం ఏర్పాటైంది. ఇరాన్ సైన్యంతో పాటే ఇది పనిచేస్తుంది. అయితే ఐఆర్‌జీసీ ఇరాన్ సుప్రీం లీడర్‌కు నేరుగా జవాబుదారీగా ఉంటుంది. అంతర్గత, బాహ్య శక్తుల నుంచి దేశాన్ని రక్షించడం దీని ప్రధాన బాధ్యత. ఖమేనీ కంటే ముందు ఇరాన్ సుప్రీం లీడర్‌గా పనిచేసిన అయతొల్లా రూహుల్లా ఖొమైనీ ఐఆర్‌జీసీ సభ్యులను 'ఇస్లామ్ సైనికులు'గా అభివర్ణించారు.

బలగం 6 లక్షలు



ఇరాన్ సాయుధ బలగాల్లో అత్యంత బలమైనది, అత్యుత్తమ ఆయుధ సంపత్తిని కలిగి ఉన్నది ఐఆర్‌జీసీయే. ఇందులో భూతల బలగంతో పాటు నౌకాదళం, వాయుసేన, బాసిజ్, కుద్స్ ఫోర్స్ అనే విభాగాలు ఉంటాయి. బాసిజ్ అంటే అంతర్గత భద్రత వ్యవహారాలను చూసుకునే పౌర సైన్యం. ఇరాన్ ఆవల ప్రత్యేక ఆపరేషన్లపై కుద్స్ ఫోర్స్ దృష్టిసారిస్తుంది. ఐఆర్‌జీసీలో దాదాపు 1.9 లక్షల మంది క్రియాశీలక సభ్యులు ఉంటారు. రిజర్వు సభ్యులను కలుపుకొంటే ఈ బలం 6 లక్షల వరకు ఉంటుంది. ఇరాన్ బాలిస్టిక్ క్షిపణుల కార్యక్రమం ఐఆర్‌జీసీ నియంత్రణలోనే జరుగుతుంది.

బాసిజ్.. స్వచ్ఛంద పారామిలిటరీ బలగం

ఐఆర్‌జీసీలో భాగంగా ఉండే బాసిజ్‌ను 1979లోనే స్థాపించారు. ఇది స్వచ్ఛంద పారామిలిటరీ బలగం. ఎక్కువగా దేశభక్తితో యువత ఇందులో చేరుతుంటారు. ప్రధానంగా ప్రభుత్వ వ్యతిరేక అల్లర్లను అణచివేసేందుకు బాసిజ్ సభ్యులను ఉపయోగిస్తుంటారు. ఇరాన్-ఇరాక్ యుద్ధ సమయంలో సరిహద్దుల్లో కూడా వీరిని మోహరించారు.

ఆర్థికంగా బలపడి..

ఇరాన్ రాజకీయ వ్యవహారాల్లో ఐఆర్‌జీసీ ప్రభావం ఎక్కువే. ఇరాన్ చమురు, సహజవాయు రంగాల్లో వేలకోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను ఐఆర్‌జీసీ కాంట్రాక్టింగ్ కంపెనీ అయిన ఖాతమ్ అల్-అన్బియా దక్కించుకుంది. దీంతో ఈ దళం ఆర్థికంగానూ బాగా బలపడింది. 1980-88 మధ్య ఇరాన్-ఇరాక్ యుద్ధం సమయంలో దేశ ఇంజినీరింగ్, లాజిస్టిక్స్ అవసరాలను ఐఆర్‌జీసీయే చూసుకుంది. ఐఆర్‌జీసీపై పలు దేశాలు ఇప్పటికే ఆంక్షలు విధించాయి. 2019లో అమెరికా దీన్ని విదేశీ ఉగ్రవాద సంస్థ (ఎఫ్‌టీవో)గా గుర్తించింది. ఇటీవలే ఐరోపా యూనియన్ కూడా అదే ముద్ర వేసింది.


స్వామిభక్తి ఎక్కువ

సుప్రీం లీడర్ ఖమేనీ మరణించినప్పటికీ.. ఇరాన్‌లో ప్రభుత్వ, సైనిక, మతపరమైన అధికార కేంద్రాలు ఉన్నాయి. ఐఆర్‌జీసీలోనూ పలువురు కీలక వ్యక్తులు ఉన్నారు. ఈ దళం సభ్యులకు స్వామిభక్తి చాలా ఎక్కువ. కాబట్టి ట్రంప్ హెచ్చరికలకు లొంగడానికి బదులు.. ఖమేనీ హత్యకు ప్రతీకారం తీర్చుకోవడానికే ఐఆర్‌జీసీ మొగ్గుచూపుతుందనడంలో సందేహం లేదు. ఇజ్రాయెల్‌పై, పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలపై చేస్తున్న దాడులే అందుకు నిదర్శనం. ఇంకా చెప్పాలంటే.. తాజా పరిణామాలతో ఇరాన్‌లో ఐఆర్‌జీసీ ప్రాభవం పెరిగే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయన్నది విశ్లేషకుల వాదన.

- ఈనాడు ప్రత్యేక విభాగం

భాజపాకు కౌంట్‌డౌన్ మొదలైంది

- జంతర్ మంతర్‌లో కేజ్రీవాల్ ప్రసంగం



దిల్లీ: అధికార భాజపా గద్దె దిగేందుకు 'కౌంట్ డౌన్' మొదలైందంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలపై ఆప్ కన్వీనర్, దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దిల్లీలోని జంతర్ మంతర్‌లో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ఆదివారం ప్రసంగించారు. "మోదీ, అమిత్ షాలు మద్యం కేసులో నన్ను అన్యాయంగా ఇరికించారు. ఆ కేసులో నన్ను నిర్దోషిగా ప్రకటిస్తూ ఇటీవల కోర్టు చరిత్రాత్మక తీర్పునిచ్చింది. నేను నీతిపరుడనని ఈ తీర్పుతో రుజువైంది. ఎవరిని చూసినా మోదీ భయపడిపోతున్నారు. శాస్త్రవేత్త, బాలల విద్య కోసం పనిచేసిన వాంగ్‌చుక్‌కు భయపడి ఆయనను జైలుకు పంపారు. మహిళా ఎంపీలు దాడి చేస్తారేమోనని బెదిరి పార్లమెంటుకు వెళ్లలేదు. ట్రంప్‌నకు కూడా మోదీ భయపడతారు. ఓ నియంత భయపడ్డాడంటే అది అతని పాలనకు ముగింపని అర్థం. మోదీకి దేశమంటే లెక్కలేదు. ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడుతూ అధికారంలో ఉంటున్నారు. 12 ఏళ్ల భాజపా పాలనలో మౌలిక వసతులతో సహా దేశంలో నాశనం కాని రంగమే లేదు. 2011లో జరిగిన జంతర్ మంతర్ సభ.. కాంగ్రెస్‌ను గద్దె దించింది. ఇప్పుడు జరుగుతున్న సభతో తొందర్లోనే భాజపాకూ అదే గతి పట్టేందుకు కౌంట్ డౌన్ మొదలైంది" అని కేజ్రీవాల్ ధీమా వ్యక్తంచేశారు. పంజాబ్ సీఎం భగవంత్ మాన్, దిల్లీ మాజీ మంత్రి మనీశ్ సిసోదియా, ఆతిశీ, సంజయ్ సింగ్, సౌరభ్ భరద్వాజ్ తదితరులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

సరిహద్దులో పాక్ డ్రోను.. భారత సైన్యం కాల్పులు

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) వద్ద ఆదివారం తెల్లవారుజామున పాకిస్థాన్ డ్రోన్ ఒకటి భారత భూభాగంలోకి ప్రవేశించింది. వెంటనే అప్రమత్తమైన భద్రతా దళాలు డ్రోన్‌ను కూల్చేందుకు కాల్పులు జరిపినట్లు అధికారులు తెలిపారు. దిగ్వార్ ప్రాంతంలో డ్రోన్ కదలికలు గుర్తించిన భద్రతా దళాలు డజను రౌండ్లకు పైగా కాల్పులు జరిపాయి. దీంతో ఆ డ్రోన్ పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) వైపు మళ్లింది. డ్రోను ద్వారా ఆయుధాలు, మాదకద్రవ్యాలు జారవిడిచి ఉంటారా? అనే అనుమానంతో తనిఖీలు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు.

జమ్మూలో స్వల్ప భూకంపం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని డోడా జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున స్వల్పంగా భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 4.2గా నమోదైంది. భూకంప కేంద్రం భూమి ఉపరితలం నుంచి సుమారు అయిదు కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటనలో ఎలాంటి నష్టం జరగలేదన్నారు.



ఇరాన్ సుప్రీం నేత ఖమేనీ హత్యకు నిరసనగా ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలో ఆందోళన

ఇరాన్ సుప్రీం నేత ఖమేనీ మృతితో యూపీ గ్రామంలో విషాదఛాయలు

- ఆయన గురువు పూర్వీకులు కింతూర్ వాసులు!

బారాబంకీ: అమెరికా - ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఇరాన్ సుప్రీం నేత ఆయతుల్లా ఖమేనీ ప్రాణాలు కోల్పోయారన్న వార్తలతో ఉత్తర్‌ప్రదేశ్‌లోని బారాబంకీ జిల్లా కింతూర్ గ్రామంలో విషాదం అలుముకుంది. ఖమేనీ గురువు అయిన ఆయతుల్లా రుహోల్లా ఖొమేనీ పూర్వీకులు ఈ గ్రామానికి చెందినవారే అని స్థానికులు అంటున్నారు. 1979 నాటి ఇరాన్ ఇస్లామిక్ విప్లవానికి సారథ్యం వహించిన ఖొమేనీ పూర్వీకులు 150 ఏళ్ల క్రితం ఇక్కడి నుంచి వలస వెళ్లారని వీరు చెబుతున్నారు. ఖొమేనీ తాత సయ్యద్ అహ్మద్ ముసావీ కింతూర్‌లో జన్మించారని ఆయన వంశస్థుడిగా చెప్పుకొంటున్న సయ్యద్ నిహాల్ అహ్మద్ కాజ్మీ అనే వ్యక్తి తెలిపారు. ముసావీ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారని, 1834లో మతపరమైన యాత్ర కోసం ఇరాన్‌కు వెళ్లారని చెప్పారు. ఆయనను స్వాతంత్ర్య సమరయోధుడిగా గుర్తించిన అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం తిరిగి భారత్‌కు రానీయకపోవడంతో ముసావీ ఇరాన్‌లోనే స్థిరపడినట్లు వివరించారు. అక్కడే ఆయన మనవడు ఖొమేనీ జన్మించారని తెలిపారు. 1989లో ఖొమేనీ మృతిచెందాక.. వారసత్వంగా పగ్గాలు చేపట్టిన ఆయతుల్లా ఖమేనీని అమెరికా - ఇజ్రాయెల్ తాజా దాడుల్లో చంపడం మానవత్వం మీద దాడిగా కాజ్మీ విచారం వ్యక్తం చేశారు. కింతూరుతోపాటు చుట్టుపక్కల మరికొన్ని ప్రాంతాల్లో స్థానికులు గుమికూడి ఖమేనీ మృతి సందర్భంగా సంతాప ప్రార్థనలు చేశారు.

ఇరాన్‌ను ఏమీ చేయలేరు

- అమెరికా పతనం వైపు వెళ్తోంది * ఖమేనీ చివరి ప్రసంగం

ఇంటర్నెట్ డెస్క్: అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో మృతి చెందిన ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ చేసిన చివరి ప్రసంగం వైరల్‌గా మారింది. ఫిబ్రవరి 17న ఆయన ఓ కార్యక్రమంలో ప్రసంగిస్తూ అమెరికాపై విరుచుకుపడ్డారు. ఇరాన్‌ను ఏమీ చేయలేరని అన్నారు. "అమెరికా ఆర్థిక వ్యవస్థ క్షీణిస్తోంది. సమస్యలతో సతమతమవుతోంది. పతనం వైపు వెళ్తోంది. 50శాతానికి పైగా అమెరికా పౌరులు ప్రస్తుత అధ్యక్షుడిని ఆమోదించడం లేదు. ఇరాన్‌ను నాశనం చేయాలనుకునేవారి ప్రయత్నాలను అడ్డుకుంటూనే ఉన్నాం. 47 ఏళ్లుగా ఇస్లామిక్ రిపబ్లిక్‌ను ఏమీ చేయలేకపోయామని స్వయంగా అమెరికా అధ్యక్షుడే అక్కడి ప్రజలకు చెబుతున్నారు. అది నిజమే! ఇప్పుడు కూడా వారు ఏమీ చేయలేరు" అని ఖమేనీ పేర్కొన్నారు.

415 మంది తాలిబన్లు హతం: పాకిస్థాన్

ఇస్లామాబాద్: సైనిక ఆపరేషన్‌ద్వారా ఇప్పటిదాకా 415 మంది అఫ్గాన్ తాలిబన్లను అంతమొందించామని పాకిస్థాన్ వెల్లడించింది. మరో 580 మందికి గాయపడ్డారని ఆదివారం సమాచార, ప్రసారశాఖల మంత్రి అతావుల్లా తరార్ తెలిపారు. గత వారంలో తాలిబన్లు తమ సైనిక స్థావరాలపై దాడులు చేయడంతో గురువారం రాత్రి నుంచి పాకిస్థాన్ ఆపరేషన్ 'ఘజాబ్ లిల్‌హక్' చేపట్టింది. 182 అఫ్గాన్ చెక్‌పోస్టులను ధ్వంసం చేశామని, 31 మందిని అదుపులోకి తీసుకున్నామని మంత్రి తెలిపారు.

బెంగాల్ 'సర్'లో తొలగించిన ఓట్లలో 50 లక్షలకు పైగా చొరబాటుదారులవే

- భాజపా జాతీయ అధ్యక్షుడు నబీన్ ఆరోపణ

కూచ్‌బిహార్: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియలో భాగంగా పశ్చిమ బెంగాల్‌లో తొలగించిన 63.66 లక్షల ఓట్లలో 50 లక్షలకు పైగా చొరబాటుదారులవేనని భారతీయ జనతా పార్టీ(భాజపా) అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆరోపించారు. భాజపా చేపట్టిన పొరిబోర్తన్(పరివర్తన) యాత్రను కూచ్‌బిహార్‌లో ఆదివారం ప్రారంభించిన ఆయన ఈ మేరకు ప్రసంగించారు. "50 లక్షలకు పైగా చొరబాటుదారులను ఓటరు జాబితా నుంచి తొలగించారు. వీరంతా చట్టబద్ధమైన పౌరుల హక్కులను ఉల్లంఘించడంతో పాటు దేశ భద్రతను ప్రమాదంలోకి నెట్టారు. దేశ ప్రజలకు ఉద్దేశించిన ప్రభుత్వ ఉద్యోగాలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలను వీరు పొందుతున్నారు. నకిలీ ధ్రువపత్రాలను జారీచేసి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వారందరికీ రక్షణ కల్పించారు. పార్టీ ఓటరు బ్యాంకు అయిన చొరబాటుదారులను జాబితా నుంచి తొలగించకుండా ఉండేందుకు ఆమె కోర్టును ఆశ్రయించారు. అక్రమ వలసదారులంతా రాష్ట్రాన్ని వీడే సమయం వచ్చింది. చొరబాటుదారుల కోసమే పని చేసే అవినీతి ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి విముక్తి కలిగించాలి. రాష్ట్ర ప్రజలు నిజమైన మార్పు కోరుకుంటున్నారు" అని నబీన్ వ్యాఖ్యానించారు.

రాజ్యసభ ఎన్నికల్లో ఆర్జేడీ పోటీపై ఊహాగానాలు

- పార్టీ ముఖ్య నేతలతో లాలూ భేటీ

పట్నా: బిహార్‌లో జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ పోటీ చేయనున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్న నేపథ్యంలో అధినేత లాలూ ప్రసాద్ పార్టీ ముఖ్య నేతలతో పట్నాలో ఆదివారం సమావేశం నిర్వహించారు. నామినేషన్ల గడువు ముగియడానికి నాలుగు రోజుల ముందు ఈ సమావేశం జరగడం గమనార్హం. తేజస్వీని ప్రజలు ఎగువ సభలో చూడాలనుకుంటున్నారని ఆర్జేడీ రాష్ట్ర అధికార ప్రతినిధి మృత్యుంజయ్ తివారీ తెలిపారు. బిహార్‌లోని మొత్తం 16 రాజ్యసభ స్థానాల్లోని ఐదు స్థానాలు వచ్చేనెల ఖాళీ అవుతాయి. వీటికి ఈ నెల 16న ఎన్నికలు జరగనున్నాయి. జేడీ(యూ) నుంచి హరివంశ్ నారాయణ్, రామ్‌నాథ్ ఠాకూర్, ఆర్జేడీ నుంచి ప్రేమ్‌చంద్ గుప్తా, అమరేంద్ర ధారి, ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్న ఆర్ఎల్ఎం నుంచి ఉపేంద్ర కుశ్వాహాల రాజ్యసభ పదవీ కాలం వచ్చే నెల ముగియనుంది. 243 మంది ఎమ్మెల్యేలు ఉన్న బిహార్ అసెంబ్లీలో రాజ్యసభ సీటు గెలిచేందుకు కనీసం 41 మంది మద్దతు అవసరం. ఆర్జేడీ నేతృత్వంలోని మహాగఠ్‌బంధన్‌కు తగినంత మద్దతు లేకపోవడంతో ఈ ఎన్నికలపై ఉత్కంఠ నెలకొంది.

75వ వసంతంలోకి నీతీశ్.. ప్రధానమంత్రి శుభాకాంక్షలు

దిల్లీ/పట్నా: బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్ ఆదివారం 75వ వసంతంలోకి అడుగు పెట్టారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'ముఖ్యమంత్రి నీతీశ్‌జీకి పుట్టినరోజు శుభాకాంక్షలు. బిహార్ పురోగతికి ఆయన నిర్విరామంగా కృషి చేస్తున్నారు'' అని మోదీ 'ఎక్స్' వేదికగా కొనియాడారు. నీతీశ్ సంపూర్ణ ఆరోగ్యం, విజయాలతో నిండు జీవితం గడపాలని బిహార్ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ ఆకాంక్షించారు. ఇంకా పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులతోపాటు ఉత్తర్‌ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు యోగి ఆదిత్యనాథ్, చంద్రబాబు నాయుడు తదితరులు జేడీయూ నేతకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

✦ మణిపుర్ ముఖ్యమంత్రి యుమ్నామ్ ఖేమ్‌చంద్ సింగ్ ఆదివారం 63వ పుట్టినరోజు జరుపుకొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ఎక్స్' ద్వారా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఖేమ్‌చంద్ నెల రోజుల కిందట మణిపుర్ సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన సంగతి తెలిసిందే.

కరెంట్ అఫైర్స్ | **మాదిరి ప్రశ్నలు**



❖ అజంతా-ఎల్లోరా అంతర్జాతీయ చలన చిత్రోత్సవం-2026లో ఏ ప్రముఖ సంగీత దర్శకుడికి ప్రతిష్ఠాత్మక పద్మపాణి అవార్డును ప్రదానం చేశారు?
(2026, జనవరి 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు ఛత్రపతి శంభాజీ నగర్‌లో 11వ అజంతా-ఎల్లోరా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌ను నిర్వహించారు.)
జ: ఇళయరాజా

❖ ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ వాలెంటీనో గరవాని (93) ఇటీవల మరణించారు. ఈయన ఏ దేశానికి చెందినవారు?
జ: ఇటలీ (ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన వాలెంటీనో ఫ్యాషన్ హౌస్ వ్యవస్థాపకులైన ఈయన 1932లో ఇటలీలోని వోగెరాలో జన్మించారు.)

❖ 2032 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని ఎంత మొత్తానికి చేర్చాలని భారత్ - యూఏఈ ఇటీవల నిర్ణయించాయి?
జ: 200 బిలియన్ డాలర్లు

❖ 'చాలీస్ ఆఫ్ అంబ్రోసియా: రామ్ జన్మభూమి-ఛాలెంజ్ అండ్ రెస్పాన్స్' అనే పుస్తకాన్ని ఎవరు రచించారు?
జ: సురేంద్ర కుమార్ పచౌరీ (ఈయన భారత ప్రభుత్వ మాజీ కార్యదర్శిగా పని చేశారు. రామ జన్మభూమి ప్రయాణం, దాని చారిత్రక పోరాటం, చట్టపరమైన ప్రక్రియ, పురావస్తు ఆధారాలు, సాంస్కృతిక ప్రాముఖ్యత, శ్రీరామ మందిర నిర్మాణానికి దారితీసిన దేశవ్యాప్త ప్రయత్నాలను ఈ పుస్తకంలో రచయిత వివరించారు. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఈ పుస్తకాన్ని దిల్లీలో విడుదల చేశారు.)

మరింత సమాచారం

TENTH English | **Madam Rides The Bus**



1-5. Read the following passage:

Valli devoured everything with her eyes. But when she started to look outside, she found her view cut off by a canvas blind that covered the lower part of her window. So she stood up on the seat and peered over the blind. The bus was now going along the bank of a canal. The road was very narrow. On one side there was the canal and, beyond it, palm trees, grassland, distant mountains, and the blue, blue sky. On the other side was a deep ditch and then acres and acres of green fields - green, green, green, as far as the eye could see. Oh, it was all so wonderful! Suddenly she was startled by a voice. 'Listen, child,' said the voice, 'you shouldn't stand like that. Sit down.'

(Madam Rides the Bus)

Final Exams-2026 IMPORTANT Q & A

Now, answer the following questions **5 x 2 = 10**

1. Why did Valli stand up on the seat?
2. What did the voice suddenly tell Valli to do?
3. How did Valli manage to see the outside view despite the obstruction?
A) She shouted for the conductor's help B) She stood up on the seat C) She looked through a small hole
4. The bus was travelling along the bank of a geographic feature, what was it?
A) A large river B) Adeep ditch C) A canal
5. What was visible on the side opposite the canal?
A) Distant mountains and the blue sky B) Palm trees and grassland C) Adeep ditch and extensive green fields

Answers

1.She stood up on the seat because her view was cut off by a canvas blind covering the lower part of the window, and she wanted to see outside.
2.The voice told Valli, 'You shouldn't stand like that. Sit down.' 3. B) She stood up on the seat. 4. C) A canal
5. C) A deep ditch and extensive green fields.

28. Read the following paragraph and write the antonyms to the underlined words **(4 Marks)**

During her first ride, Valli was fearless (a) and looked outside with shining eyes. The scenery was beautiful (b), especially the green fields. But when she later saw the cow lying alive (c) on the roadside, she suddenly grew cheerful (d) no more.

Answers
a) brave b) ugly
c) dead d) sorrowful

More Imp Q & A



Writer: A.Madhubabu

సామాజిక బంధాలకు వారసత్వ వారధి!

కులం


భారతీయ సమాజం

భారతదేశం అనేక మతాల, తెగల సంగమం. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, పార్శీలు, సిక్కులు, బౌద్ధులు, గిరిజనులతో కూడుకున్న అనేక సముదాయాల కూటమి. కులవ్యవస్థ, తెగల సంస్కృతి భారతదేశానికి ఉన్న ముఖ్య ప్రత్యేకతలు. ఇవి దేశానికి సామాజికంగా ఒక విశిష్టతను తెచ్చాయి. సమాజ శాస్త్రం, సామాజిక మానవ శాస్త్రాల్లో కుల వ్యవస్థ ఈ నాటికీ ఒక క్లిష్టమైన పరిశోధనాంశం. తెగలకు కూడా అత్యంత ప్రాధాన్యం ఉంది. వాటి ప్రత్యేక సంస్కృతి ప్రపంచం మొత్తం ఆసక్తి కలిగించింది. పూర్తిగా పరిణామం చెందని కులాలు ప్రపంచంలో అనేకచోట్ల ఉన్నప్పటికీ హిందూ సమాజంలో కులవ్యవస్థ, కుల సిద్ధాంతం అత్యంత పటిష్ఠంగా, అనేక అంశాల ఆధారంగా గట్టిగా కుదురుకున్న వ్యవస్థగా రూపొందింది.

ప్రాచీన భారతదేశంలో ప్రధానంగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనే నాలుగు వర్ణాలు ఉండేవి. వీటిని చాతుర్వర్ణాలు అంటారు. ఇవే కాకుండా పంచములు లేదా అస్పృశ్యులు అనే వర్ణం కూడా ఉండేది. చరిత్ర ప్రకారం కాలక్రమేణా కులాలు, ఉపకులాలు ఆవిర్భవించాయి. ఒక్కో కులానికి ప్రత్యేకమైన విధులు, ధర్మాలు, వృత్తులు, సంస్కారాలు ఉన్నాయి. కుల కట్టుబాట్లను చాలా నియమనిష్ఠలతో పాటిస్తారు. భౌగోళిక, ఆర్థిక, సాంఘిక పరిస్థితుల దృష్ట్యా కుల వ్యవస్థ పుట్టుకొచ్చిందని కొందరు అభిప్రాయపడితే ఇది ముఖ్యంగా వర్గాల విభజన అని, దోపిడీ వ్యవస్థ అని ఇంకొందరు పేర్కొంటారు.

గతంతో పోలిస్తే ప్రస్తుతం భారతీయ సమాజంలో ఊహించలేనన్ని మార్పులు వచ్చాయి. నగర సమాజాలు ఎక్కువ కావడం, పారిశ్రామికీకరణ, ఆధునికీకరణ, పాశ్చాత్యీకరణ తదితర పరివర్తనలు చోటు చేసుకుంటున్నాయి. కొత్తగా వృత్తులు, సంబంధాలు, వ్యూహాలు, రాజకీయ విలీనాలు, కులరాజకీయాలు, రాజకీయపూరిత కులనినాదాలు, సిద్ధాంతాలు కనిపిస్తున్నాయి.

కులం: దీనికి ఆంగ్లంలో సమానార్థకం 'క్యాస్ట్'. 1563లో గార్సియా డిఓర్టా అనే శాస్త్రవేత్త తొలిసారిగా 'క్యాస్ట్' పదాన్ని ప్రయోగించాడు. ఈ పదాన్ని పోర్చుగీసు వర్తకులు పశ్చిమతీర భారతీయులను వర్ణించడానికి వాడారు. ఇది కాస్టస్ అనే స్పానిష్ భాషా పదం నుంచి పుట్టింది. దీని అర్థం 'శుద్ధమైంది' అని భావిస్తారు. కొన్ని సందర్భాల్లో 'వేరు చేసిన' అనే అర్థం కూడా వస్తుంది. లుండ్బర్గ్ అనే సామాజిక శాస్త్రవేత్త 'కులం అనేది బంధిత సామాజిక వర్గం' అని పేర్కొన్నాడు.




గార్సియా డిఓర్టా

కులం అనే పదం సర్వసామాన్యమైంది. హిందూ మతంలో జన్మించిన వ్యక్తి ఏదో ఒక కులానికి చెందుతాడు. కులానికి చెందడం అంటే కులంలో పుట్టడం అని అర్థం. కులాన్ని సామాజిక స్తరీకరణలో ఒక వ్యక్తి హోదా, వృత్తి మొదలైనవి నిర్ణయించే అంతర్వివాహ వారసత్వ సమూహంగా నిర్వచించవచ్చు. కులాన్ని అనేకమంది శాస్త్రవేత్తలు నిర్వచించారు.

> ఒకే మూల పురుషుడిని కలిగి ఉండి, ఒకే అనువంశిక వృత్తిని పాటిస్తూ, అంతర్వివాహ నిబంధనలను అనుసరిస్తూ, ఒకే పేరుతో చెలామణీ అయ్యే కుటుంబాలు లేదా బంధుత్వ సమూహాల సాధర్మ్య (సామ్య) సమూహమే కులం.
> - సర్ హెర్బర్ట్ రిస్లీ



భారతీయ సమాజం అనే మహావృక్షానికి కులం అనేది వేల ఏళ్ల కిందటే పాతుకుపోయిన లోతైన వేరు లాంటిది. ఇది కేవలం ఒక వర్గీకరణ మాత్రమే కాదు. పుట్టుక నుంచి మరణం వరకు ఒక వ్యక్తి సామాజిక హోదాను, వృత్తిని, సంబంధాలను శాసించే అదృశ్యశక్తి. తరాలు మారుతున్నా, సాంకేతికత పెరుగుతున్నా భారతీయ మనస్తత్వాల్లోనూ, సామాజిక నిర్మాణంలోనూ కులం తన రూపాన్ని మార్చుకుంటూ సజీవంగా సాగుతోంది. ఒకవైపు అసమానతలకు వేదికగా, మరోవైపు సామాజిక అస్తిత్వానికి ప్రతీకగా నిలుస్తూ ఆధునిక ప్రజాస్వామ్యంలో పోషిస్తున్న పాత్రను అర్థం చేసుకోవాలంటే పోటీ పరీక్షార్థులు కులంపై సమగ్ర అవగాహన పెంపొందించుకోవాలి. కులవ్యవస్థ మూలాలు, లక్షణాలు, దాని ప్రభావాలను తెలుసుకోవాలి.



కుల వ్యవస్థ లక్షణాలు కుల వ్యవస్థ ఒక విలక్షణమైన సామాజిక అంశం. సెలెస్టేన్ బౌలే కుల వ్యవస్థకు మూడు ముఖ్య సూత్రాలను ఆపాదించాడు. 1) క్రమానుగతి 2) వేరు పరచి ఉండటం (ఎడబాటు) 3) పరస్పర ఆధారం.. ఇవే కాకుండా అంతర్వివాహం, సంప్రదాయ వృత్తి, వంశపారంపర్య కులవ్యవస్థ తదితర ఇతర లక్షణాలు ఉంటాయి.

1) క్రమానుగతి: కుల వ్యవస్థలో అనేక కులాలు ఉంటాయి. ఒక్కో కులానికి నిర్దిష్టమైన హోదా, అంతస్తు ఉంటుంది. కొన్ని కులాలు ఉన్నత శ్రేణికి చెందినవిగా ఉంటాయి. శుద్ధి, అశుద్ధి కులాల అంతస్తును నిర్ణయిస్తాయి. ఇది కేవలం కుల వృత్తి మీదే ఆధారపడకుండా మతపరమైన ఆచార వ్యవహారాల పాటింపులు మొదలైన ఇతర అంశాలతో ప్రభావితమై ఉంటాయి.

2) ఎడబాటు: కులాలు ఒకదాంతో మరొకటి విలీనం చెందవు. ఒకే రకమైన సంబంధాలను కలిగి ఉండవు. అయితే ప్రత్యేకించి గమనించాల్సిన విషయం ఏమిటంటే ఈ గుర్తింపు ఏ కులానికదే ఆపాదించుకోదు. ఇతర కులాలవారు గుర్తించి, ఆపాదిస్తారు. ఈ ప్రక్రియల్లో ఎక్కువ కులం, తక్కువ కులం అనే వ్యతిరేక వర్గీకరణ వల్ల ఒక్కో కులం ఇతర కులాల నుంచి వేరు పరచి ఉండటం (ఎడబాటు) అనే భావన స్థిరపడుతుంది.

3) పరస్పర ఆధారం: కులాలు ఒకదాంతో మరొకటి వేరు పడి ఉన్నప్పటికీ అవి పరస్పరం ఆధారపడి ఉంటాయి. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, మత పరంగా కూడా కులాల మధ్య పరస్పరం ఆధారపడటం కనిపిస్తుంది.

> కులం అంటే వారసత్వమైన, స్వకుల వివాహం. సంప్రదాయసిద్ధమైన వృత్తి సంబంధాలను కలిగి, స్థానిక సముదాయ స్తరీకరణ శ్రేణిలో ఒక ప్రత్యేకమైన అంతస్తును కలిగి ఉండే సమూహం.
> - ఎం.ఎన్. శ్రీనివాస్



అంతర్వివాహం: వివాహాది కార్యాలు తప్పనిసరిగా కుల సభ్యుల మధ్య జరగాలి. కులం అంతర్వివాహ నియమాన్ని పాటించాలి. కులాంతర వివాహాలు నిషేధం అనే ఈ నియమం కూడా కులాన్ని విడిగా, ఎడబాటుగా ఉంచడానికి అనుకూలిస్తుంది. ఆధునిక సమాజంలో నగర సమాజంలో కులాంతర వివాహాలు జరుగుతున్నాయి.

ఆహార పానీయాల ప్రదానం, స్వీకరణ: కుల వ్యవస్థలో ఆహార పానీయాలు ఒకరికి ఇవ్వడం, స్వీకరించడం, సహపంక్తిలోకి ప్రవేశించడం, ఆహార పదార్థాల ఇచ్చి పుచ్చుకోవడాలు, ఏయే ఆహార పదార్థాలు, పానీయాలను ఇచ్చి పుచ్చుకోవాలి మొదలైన విషయాలపై అనేక నియంత్రిత ప్రమాణాలు ఉన్నాయి.



సంప్రదాయ వృత్తి: నేడు ఈ నియమం అంతగా కనిపించడం లేదు. అయితే కులాల వృత్తి కులానికి ముఖ్య లక్షణం. సంప్రదాయాన్ని అనుసరించి ఒక్కో వ్యక్తి తన కులవృత్తిని చేపట్టాలి. ఉదాహరణకు అర్చకత్వాన్ని బ్రాహ్మణులే చేపట్టాలి. క్షురకర్మ నాయీ బ్రాహ్మణులు మాత్రమే చేయాలి. కొన్ని అపరిశుభ్రమైన పనులు ముఖ్యంగా జంతు కళేబరాలను తొలగించడం లాంటివి అస్పృశ్యులు మాత్రమే చేయాలనే నిబంధనలు కఠినంగా ఉండేవి. అయితే కొన్ని వృత్తులను అనేక కులాలవారు చేస్తుంటారు. ఉదాహరణకు వ్యవసాయాన్ని అన్ని వర్ణాల వారు, కులాల వ్యక్తులు చేపడతారు.



వంశపారంపర్య సభ్యత్వం: ఒక హిందువు జీవించినంత కాలం తాను జన్మించిన కులానికే చెందుతాడు. మరణానంతరం కూడా ఆ కులానికి చెందిన సభ్యుడిగానే పరిగణనలో ఉంటాడు. వ్యక్తిత్వపరంగా తన హోదా, అంతస్తు, వృత్తి, చదువు, ఐశ్వర్యంలో మార్పులు వచ్చినప్పటికీ కుల సభ్యత్వం శాశ్వతమై నిలిచిపోతుంది. అయితే మతమార్పిడి రూపంలో ఒక వ్యక్తి తన కుల సభ్యత్వాన్ని వదులుకోవచ్చు.



రచయిత: బద్దం పురుషోత్తం రెడ్డి

గాలి నాణ్యత మెరుగుకు కఠిన చట్టాలు!

పర్యావరణంతో పాటు మానవ ఆరోగ్యానికి పొంచి ఉన్న అతిపెద్ద ముప్పు కాలుష్యం. ఆధునిక వ్యవసాయ విధానాల నుంచి శిలాజ ఇంధనాల అపరిమిత వాడకం వరకు మానవ చర్యలన్నీ భూతాపాన్ని పెంచేస్తున్నాయి. ఈ పరిస్థితి నివారణకు దేశంతో పాటు, అంతర్జాతీయ సమాజం కూడా నేడు కాలుష్య నియంత్రణ చర్యలపై దృష్టి సారించింది. అడవుల పెంపకం, వ్యర్థాల తగ్గింపు, పునర్వినియోగం, హరిత ఇంధనాల వాడకం మొదలైన పురోగామి చర్యలతో నష్ట నివారణ ప్రయత్నాలను చురుగ్గా సాగిస్తోంది. గాలి, నీటి నాణ్యతను మెరుగుపరిచేలా, వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని జరుగుతున్న ఇలాంటి వ్యవస్థాగత కృషిపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. కాలుష్య కట్టడికి రూపొందించిన అంతర్జాతీయ ఒప్పందాలు, భారతీయ చట్టాలతో పాటు దేశంలో ఈ దిశగా అమలు చేస్తున్న పథకాలు, ప్రవేశపెట్టిన కార్యక్రమాలు, వాటి లక్ష్యాలను వివరంగా తెలుసుకోవాలి.



జనరల్ స్టడీస్ - పర్యావరణ అంశాలు

కాలుష్య నియంత్రణ చర్యలు

1. జీవవైవిధ్యం కోల్పోవడానికి ప్రధాన కారణం ఏమిటి?
   1) సుస్థిర వ్యవసాయ పద్ధతులు
   2) ఆవాసాల విధ్వంసం
   3) పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం
   4) అంతర్జాతీయ సహకారం
2. గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడానికి ఉద్దేశించిన అంతర్జాతీయ ఒప్పందం?



   1) మాంట్రియల్ ప్రోటోకాల్ 2) ప్యారిస్ ఒప్పందం
   3) బేసెల్ కన్వెన్షన్ 4) స్టాక్‌హోమ్ కన్వెన్షన్
3. క్యోటో ప్రోటోకాల్ (1997)ను దేని కోసం తీసుకొచ్చారు?
   1) సీఎఫ్‌సీ ఉద్గారాలు తగ్గించడం.
   2) ప్రపంచ వాణిజ్య విధానాలను నియంత్రించడం.
   3) గ్రీన్‌హౌస్ వాయువులను తగ్గించడానికి చట్టబద్ధమైన లక్ష్యాలను నిర్దేశించడం.
   4) అణుశక్తి వినియోగాన్ని ప్రోత్సహించడం.
4. ఓజోన్‌ను క్షీణింపజేసే పదార్థాలను నిషేధించడంపై ఏ ఒప్పందం దృష్టి సారిస్తుంది?
   1) క్యోటో ప్రోటోకాల్ 2) ప్యారిస్ ఒప్పందం
   3) మాంట్రియల్ ప్రోటోకాల్ 4) నగోయా ప్రోటోకాల్
5. వాతావరణ మార్పులపై భారతదేశ జాతీయ కార్యాచరణ ప్రణాళిక ప్రధాన లక్ష్యం?
   1) శిలాజ ఇంధన ఉత్పత్తి పెంచడం.
   2) సుస్థిరాభివృద్ధి, వాతావరణ అనుకూలతను ప్రోత్సహించడం.
   3) పరిశ్రమలపై ప్రభుత్వ నిబంధనలు తగ్గించడం.
   4) పర్యావరణ ఆందోళనలు లేకుండా పట్టణీకరణను విస్తరించడం.
6. పర్యావరణ పరిరక్షణ చట్టం (1986) ఏ అతిపెద్ద పర్యావరణ విపత్తు తర్వాత రూపొందింది?
   1) ఫుకుషిమా అణు విపత్తు
   2) భోపాల్ గ్యాస్ విషాదం
   3) చెర్నోబిల్ విపత్తు 4) ఉత్తరాఖండ్ వరదలు
7. ఎన్‌ఏపీసీసీలో భాగమైన నేషనల్ సోలార్ మిషన్ దేనిపై దృష్టి సారిస్తుంది?



   1) బొగ్గుపై ఆధారపడటాన్ని తగ్గించడం.
   2) అణు విద్యుత్తు వినియోగాన్ని పెంచడం.
   3) పెద్దఎత్తున సౌరశక్తి ఉత్పత్తిని ప్రోత్సహించడం.
   4) పెట్రోలియం అన్వేషణను విస్తరించడం.
8. అడవులు, జీవవైవిధ్య పరిరక్షణను ఏ భారతీయ చట్టం నియంత్రిస్తుంది?
   1) వన్యప్రాణుల రక్షణ చట్టం, 1972
   2) అటవీ చట్టం, 1980
   3) జీవ వైవిధ్య చట్టం, 2002 4) పైవన్నీ
9. వాయు చట్టం (1981) దేని కోసం రూపొందించారు?
   1) వాహన ఉద్గారాలను నియంత్రించడం.
   2) పారిశ్రామిక కాలుష్యాన్ని నియంత్రించడం.
   3) వాయు కాలుష్యాన్ని తగ్గించడం. 4) పైవన్నీ
10. భారతదేశం ఏ అంతర్జాతీయ వాతావరణ ఒప్పందంపై సంతకం చేసింది?
    1) ప్యారిస్ ఒప్పందం 2) క్యోటో ప్రోటోకాల్
    3) 1, 2 4) ఏదీకాదు
11. ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్‌ని భారత్, ఏ దేశంతో కలిసి ప్రారంభించింది?
    1) యునైటెడ్ స్టేట్స్
    2) బ్రెజిల్
    3) ఫ్రాన్స్ 4) చైనా
12. ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్ ప్రధాన కార్యాలయం ఉన్న నగరం?
    1) ముంబయి 2) గురుగ్రామ్
    3) న్యూదిల్లీ 4) హైదరాబాద్
13. నికర సున్నా కార్బన్ ఉద్గారాలను సాధించడానికి భారతదేశ లక్ష్య సంవత్సరం?
    1) 2030 2) 2040 3) 2050 4) 2070
14. భారతదేశంలో వాతావరణ మార్పులపై రాష్ట్ర కార్యాచరణ ప్రణాళికలు దేని కోసం అభివృద్ధి చేశారు?
    1) రాష్ట్ర స్థాయిలో పునరుత్పాదక శక్తిని ప్రోత్సహించడం.
    2) రాష్ట్ర స్థాయిలో ఎన్‌ఏపీసీసీ లక్ష్యాలను అమలు చేయడం.
    3) రాష్ట్ర స్థాయిలో పర్యావరణ చట్టాలను నియంత్రించడం.
    4) అటవీ నిర్మూలనను నిషేధించడం.
15. ఇంధన సమర్థ ఎల్ఈడీ బల్బుల పంపిణీ కోసం భారత ప్రభుత్వం ఏ కార్యక్రమాన్ని ప్రారంభించింది?
    1) ఉజాలా పథకం 2) సోలార్ ఇండియా మిషన్
    3) బయో-ఎనర్జీ మిషన్
    4) గ్రీన్ హైడ్రోజన్ మిషన్
16. 'నమామి గంగే' కార్యక్రమం దృష్టి సారించిన అంశం?
    1) భూగర్భ జల సంరక్షణ
    2) గంగా నది పునరుజ్జీవనం, కాలుష్య నియంత్రణ
    3) సుస్థిర వ్యవసాయం
    4) వాతావరణ మార్పు తగ్గింపు
17. జీవవైవిధ్యాన్ని కాపాడటానికి భారతదేశం చేపట్టిన చొరవ ఏది?
    1) ప్రాజెక్ట్ టైగర్ 2) ప్రాజెక్ట్ ఎలిఫెంట్
    3) 1, 2 4) ఏదీకాదు
18. వాతావరణ మార్పు కోసం భారతదేశ జాతీయ అనుసరణ నిధి లక్ష్యం?
    1) దుర్బల కమ్యూనిటీల కోసం అనుసరణ ప్రాజెక్టులకు నిధులు సమకూర్చడం.
    2) బొగ్గు ఉత్పత్తిని పెంచడం.
    3) శిలాజ ఇంధనంపై ఆధారపడటాన్ని విస్తరించడం.
    4) పర్యావరణ చట్టాలను తగ్గించడం.
19. అడవులకు సంబంధించి 'సస్టైనబుల్ యూజ్' అనే పదాన్ని మొదట ఎవరు ప్రవేశపెట్టారు?




    1) గ్రో హర్లెం బట్లాండ్
    2) హన్స్ కార్ల్ వాన్ కార్లోవిట్జ్
    3) అమర్త్యసేన్
    4) రాచెల్ కార్సన్
20. గ్లోబల్ క్లైమేట్ ఛేంజ్‌తో ముడిపడి ఉన్న అంతర్జాతీయ ఒప్పందం?
    1) ప్యారిస్ ఒప్పందం
    2) వాణిజ్యం, సేవలపై సాధారణ ఒప్పందం
    3) బ్రెట్టన్ వుడ్స్ ఒప్పందం 4) క్యోటో ప్రోటోకాల్
21. వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం తీవ్రమైన వాయు కాలుష్యాన్ని ఎదుర్కొంటోంది. స్థిరత్వానికి మద్దతునిస్తూ గాలి నాణ్యతను మెరుగుపరచడంలో ఏ పాలసీ అత్యంత ప్రభావవంతంగా ఉంటుంది?
    1) ప్రజా రవాణా, ఎలక్ట్రిక్ వాహనాలు, కఠినమైన కాలుష్య నియంత్రణ చట్టాల వినియోగాన్ని ప్రోత్సహించడం.
    2) గాలి నాణ్యత నిబంధనలు లేకుండా పారిశ్రామిక విస్తరణను ప్రోత్సహించడం.
    3) ట్రాఫిక్ విస్తరణ కోసం మరిన్ని రోడ్లను నిర్మించేందుకు పచ్చని ప్రదేశాలను తొలగించడం.
    4) ప్రజా విస్తరణ కోసం మరిన్ని రోడ్లను నిర్మించేందుకు పచ్చని ప్రదేశాలను తొలగించడం.
22. భారతదేశంలో నీరు, దాని సవాళ్లను నియంత్రించడానికి ఏ మంత్రిత్వ శాఖ ఏర్పాటైంది?
    1) జల శక్తి మంత్రిత్వశాఖ 2) జల మంత్రిత్వ శాఖ
    3) పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ
    4) గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ
23. భారతదేశంలో గృహ, కమ్యూనిటీ మరుగుదొడ్లు నిర్మించడం లక్ష్యంగా పెట్టుకున్న అత్యుత్తమ చొరవ ఏమిటి?
    1) జల్ శక్తి అభియాన్ 2) స్వచ్ఛ భారత్ మిషన్
    3) మేక్ ఇన్ ఇండియా 4) సౌభాగ్య పథకం
24. భారతదేశంలోని అన్ని గృహాలను విద్యుదీకరించడానికి ఉద్దేశించిన పథకం?
    1) ఎంఎన్ఆర్ఈజీఏ
    2) సౌభాగ్య
    3) జల్ శక్తి అభియాన్ 4) స్కిల్ ఇండియా
25. గృహాలకు 10 కోట్ల ఎల్‌పీజీ కనెక్షన్లను అందించిన చొరవ ఏది?
    1) పీఎం ఉజ్వల యోజన 2) సౌభాగ్య పథకం
    3) జల్ జీవన్ మిషన్
    4) దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామ జ్యోతి యోజన
26. పర్యావరణం, అభివృద్ధిపై 1992 ఐక్యరాజ్య సమితి సమావేశం ప్రాథమిక దృష్టి ఏమిటి?
    1) శిలాజ ఇంధన ఆధారిత ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడం.
    2) ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను స్థాపించడం.
    3) సుస్థిర సామాజిక - ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించడానికి ఎజెండా 21ని స్వీకరించడం.
    4) ప్రపంచ వాణిజ్య అడ్డంకులను తగ్గించడం.
27. కిందివాటిలో అటవీ నిర్మూలన పరిణామాలు ఏవి?
    ఎ) నేల కోత పెరగడం
    బి) జీవవైవిధ్యం కోల్పోవడం
    సి) మెరుగైన కార్బన్ సీక్వెస్ట్రేషన్
    డి) జల చక్రంలో అంతరాయం
    కింది కోడ్‌ని ఉపయోగించి సరైన సమాధానాన్ని ఎంచుకోండి.
    1) ఎ, బి 2) ఎ, బి, డి
    3) బి, సి, డి 4) ఎ, బి, సి, డి
28. గాలి నాణ్యత నిర్వహణను మెరుగుపరచడానికి పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ విధానంలో కింది వాటిలో ఏది భాగం?
    1) ప్రజా రవాణా కోసం ఎలక్ట్రిక్ వాహనాలను పరిచయం చేస్తోంది.
    2) అన్ని పారిశ్రామిక కార్యకలాపాలపై నిషేధం.
    3) పెద్దఎత్తున అటవీ నిర్మూలన ప్రచారాలు ప్రారంభించడం.
    4) మరిన్ని బొగ్గు ఆధారిత విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణం.
29. లఖ్‌నవూ లాంటి నగరాల్లో గాలి నాణ్యత క్షీణించడం గురించి సకాలంలో హెచ్చరికలను అందించడానికి ప్రభుత్వ ఏ చొరవను ఉపయోగిస్తుంది?
    1) స్వచ్ఛ వాయు సర్వేక్షణ్
    2) గాలి నాణ్యత ముందస్తు హెచ్చరిక వ్యవస్థ
    3) ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్ ప్రోగ్రామ్
    4) ప్రాణ పోర్టల్
30. కింది వాటిలో ఏది స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ అవార్డుల ముఖ్య లక్షణం?
    1) నగరాలు, వాటి వ్యర్థ పదార్థాల నిర్వహణ ప్రయత్నాల ఆధారంగా ర్యాంకింగ్ చేశారు.
    2) అత్యుత్తమ పనితీరు కనబరిచిన నగరాలకు నగదు బహుమతి, ట్రోఫీ, సర్టిఫికెట్ బహుమానంగా అందజేస్తారు.
    3) పీఎం10 తగ్గింపు లక్ష్యాలను చేరుకునే నగరాలను మాత్రమే పరిగణిస్తారు.
    4) ఉత్తమ ప్రజా రవాణా వ్యవస్థలున్న నగరాలకు అవార్డులు ఇస్తారు.
31. వాయు కాలుష్యానికి సంబంధించిన ప్రజా ఫిర్యాదులను పరిష్కరించడానికి ప్రభుత్వం 'సమీర్ యాప్'ని ఏ చొరవ కింద ప్రారంభించింది?
    1) నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్
    2) స్వచ్ఛ భారత్ మిషన్
    3) నేషనల్ యాంబియంట్ ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ ప్రోగ్రామ్
    4) గాలి నాణ్యత ముందస్తు హెచ్చరిక వ్యవస్థ

సమాధానాలు

1-2, 2-2, 3-3, 4-3, 5-2, 6-2, 7-3, 8-4, 9-4, 10-3, 11-3, 12-2, 13-4, 14-2, 15-1, 16-2, 17-3, 18-1, 19-2, 20-1, 21-1, 22-2, 23-2, 24-2, 25-1, 26-3, 27-2, 28-1, 29-2, 30-2, 31-1.

ప్రస్తారాలు - II



పక్కపక్కనే కూర్చుంటే.. సాధ్యమయ్యే అమరికలు?

ముఖ్యాంశాలు

వృత్తాకార ప్రస్తారం: వస్తువులను ఒక సరళరేఖలో (వరుసలో) కాకుండా, ఒక వృత్తాకార మార్గంలో (ఉదాహరణకు రౌండ్ టేబుల్ చుట్టూ) అమర్చడాన్ని వృత్తాకార ప్రస్తారం అంటారు.

- సరళరేఖ ప్రస్తారాలకు, వృత్తాకార ప్రస్తారాలకు ఉన్న ప్రధాన తేడా - వృత్తంలో ప్రారంభ, ముగింపు స్థానాలు ఉండవు.
- n విభిన్న వస్తువులను ఒక వృత్తాకారంలో అమర్చగలిగే మార్గాల సంఖ్య $p = (n-1)!$
- కంఠహారాలు, దండల అమరిక: పూసలు లేదా పూల దండల విషయంలో వాటిని కుడి నుంచి ఎడమకు లేదా ఎడమ నుంచి కుడికి చూసినా అమరిక ఒకేలా కనిపిస్తుంది.

$$p = \frac{(n-1)!}{2}$$

మాదిరి ప్రశ్నలు

1. ${}^{n}p_5 = 21{}^{(n-1)}p_3$ అయితే n విలువ ఎంత?

1) 12 2) 7 3) 10 4) 8

సాధన: ${}^{n}p_5 = 21{}^{(n-1)}p_3 \Rightarrow \frac{n!}{(n-5)!} = 21\frac{(n-1)!}{(n-1-3)!}$

$\Rightarrow \frac{n(n-1)!}{(n-5)!} = 21\frac{(n-1)!}{(n-4)(n-5)!} \Rightarrow n(n-4) = 21$

$\Rightarrow n^2 - 4n - 21 = 0 \Rightarrow (n-7)(n+3) = 0$

$\Rightarrow n = 7$ లేదా -3

n రుణాత్మకం కాదు కాబట్టి $n = 7$

సమాధానం: 2

2. ఏడు ఎర్రపూసలు, ఆరు ఆకుపచ్చ పూసలతో ఎన్ని రకాలైన విభిన్న కంఠ హారాలను తయారు చేయవచ్చు?

1) 66 2) 42 3) 132 4) $7! \times 6!$

సాధన: మొత్తం పూసల సంఖ్య = 7 + 6 = 13

కంఠహారం వృత్తాకారంలో ఉంటుంది. కాబట్టి clockwise, Anti clockwiseలలో ఒకేలా కనిపిస్తుంది. కాబట్టి ప్రస్తారాల సంఖ్యను '2'తో భాగించాలి.

వృత్తాకార అమరికలో ఒక స్థానాన్ని స్థిరంగా ఉంచాలి.

లెక్కలో కోరిన అమరికల సంఖ్య $= \frac{1}{2}\frac{(n-1)!}{p!\,q!}$

$= \frac{1}{2}\left[\frac{(13-1)!}{7!\,6!}\right] = \frac{1}{2} \times \frac{12 \times 11 \times 10 \times 9 \times 8 \times 7!}{7! \times 6 \times 5 \times 4 \times 3 \times 2 \times 1}$

$= 66$

సమాధానం: 1

3. 15 మంది విద్యార్థులు ఒక ఆటలో పాల్గొంటున్నారు. అయితే మొదట మూడు బహుమతులను ఎన్ని రకాలుగా గెలుచుకోవచ్చు?

1) 2600 2) 15! 3) 2730 4) 210

సాధన: లెక్కలో కోరిన రకాలు $= 15p_3 = 15 \times 14 \times 13 = 2730$

సమాధానం: 3

4. ఏడుగురు వ్యక్తులను ఒక గుండ్రటి బల్ల చుట్టూ ఎన్ని రకాలుగా కూర్చోబెట్టవచ్చు?

1) 360 2) $\frac{1}{2} \times 7!$ 3) 7! 4) 720

సాధన: వ్యక్తుల సంఖ్య = 7

వృత్తాకార అమరిక సూత్రం ప్రకారం, లెక్కలో కోరిన అమరిక సంఖ్య $= (7-1)! = 6! = 720$

సమాధానం: 4

5. 8 మంది వ్యక్తులు ఒక వృత్తాకార బల్ల చుట్టూ కూర్చున్నపుడు, ఇద్దరు నిర్దిష్ట వ్యక్తులు ఎల్లప్పుడు పక్కపక్కనే కూర్చునేలా ఎన్ని రకాలైన అమరికలు సాధ్యం?

1) 1440 2) 1400 3) 1500 4) $\frac{1}{2} \times 8!$

సాధన: మొత్తం వ్యక్తుల సంఖ్య = 8

ఇద్దరు నిర్దిష్ట వ్యక్తులను ఒక యూనిట్‌గా భావిస్తే, మిగిలిన వ్యక్తుల సంఖ్య = 6

మొత్తం యూనిట్ల సంఖ్య = 6 + 1 = 7

వృత్తాకారంలో ఈ యూనిట్ల అమరికల సంఖ్య $= (7-1)! = 6! = 720$

ఇద్దరు వ్యక్తులను అంతర్గతంగా అమర్చే అమరికల సంఖ్య $= 2! = 2$

∴ లెక్కలో కోరిన మొత్తం అమరికల సంఖ్య $= 720 \times 2 = 1440$

సమాధానం: 1

6. అయిదుగురు పురుషులు, అయిదుగురు స్త్రీలు ఒక వృత్తాకార బల్ల చుట్టూ కూర్చున్నప్పుడు ఏ ఇద్దరు స్త్రీలు పక్కపక్కన కూర్చోకుండా ఎన్ని రకాలుగా అమర్చవచ్చు?

1) 3000 2) 6!5! 3) 2880 4) $(5!)^2$

సాధన: అయిదుగురు పురుషులను వృత్తాకారంలో కూర్చోబెట్టే అమరికల సంఖ్య $= (5-1)! = 4! = 24$

అయిదుగురు పురుషుల మధ్య ఉన్న 5 ఖాళీలలో అయిదుగురు స్త్రీలను కూర్చోబెట్టే అమరికల సంఖ్య $= 5! = 120$

∴ లెక్కలో అమరికల సంఖ్య $= 120 \times 24 = 2880$

సమాధానం: 3

7. 9 రకాల వేర్వేరు రంగుల పూసలతో ఎన్ని విభిన్న రకాలైన దండలను తయారు చేయవచ్చు?

1) $\frac{1}{2} \times 9!$ 2) 20320 3) 9! 4) 20160

సాధన: దండల అమరికలో clockwise, Anti clockwiseలు ఒకటే అవుతాయి.

కాబట్టి లెక్కలో కోరిన అమరికల సంఖ్య $= \frac{(9-1)!}{2} = \frac{8!}{2}$

$= \frac{40320}{2} = 20160$

సమాధానం: 4

8. ఆరుగురు వ్యక్తులు వృత్తాకార బల్ల చుట్టూ కూర్చోవాలి. అందులో నిర్దిష్టమైన ఇద్దరు వ్యక్తులు పక్కపక్కనే కూర్చోకుండా ఎన్ని విధాలుగా కూర్చోవచ్చు?

1) 90 2) 72 3) 120 4) 82

సాధన: ఆరుగురు వృత్తాకార బల్ల చుట్టూ కూర్చునే అమరికల మొత్తం సంఖ్య $= (6-1)! = 5! = 120$

ఇద్దరు నిర్దిష్ట వ్యక్తులను 1 యూనిట్‌గా భావిస్తే, మిగిలిన వ్యక్తుల సంఖ్య = 4

మొత్తం 5 యూనిట్ల అమరికల సంఖ్య $= (5-1)! = 4! = 24$

ఇద్దరు వ్యక్తులను అంతర్గతంగా అమర్చే అమరికల సంఖ్య $= 2! = 2$

నిర్దిష్టమైన ఇద్దరు వ్యక్తులు పక్కపక్కనే ఉండే అమరికల సంఖ్య $= 24 \times 2 = 48$

∴ లెక్కలో కోరిన అమరికల సంఖ్య $= 120 - 48 = 72$

సమాధానం: 2

9. తొమ్మిది మంది వ్యక్తులు వృత్తాకార బల్ల చుట్టూ కూర్చోవాలి. అందులో ఇద్దరు నిర్దిష్ట వ్యక్తులు ఎల్లప్పుడూ పక్కపక్కనే ఉండేటట్లు, మరో నిర్దిష్టమైన ఇద్దరు వ్యక్తులు ఎల్లప్పుడూ పక్కపక్కనే ఉండకుండా ఎన్ని విధాలుగా అమర్చవచ్చు?

1) 8500 2) 9600 3) 7000 4) 7200

సాధన: A, Bలు ఎల్లప్పుడూ కలిసి ఉండేటట్లు ఉండే అమరికల సంఖ్య

$= (9-2)! \times 2! \Rightarrow 7! \times 2 = 5040 \times 2 = 10080$

ఇందులో C, Dలు ఎల్లప్పుడూ కలిసి ఉండే అమరికల సంఖ్య

$= (9-3)! \times 2! \times 2! \Rightarrow 6! \times 4 = 720 \times 4 = 2880$

లెక్కలో కోరిన అమరికల సంఖ్య $= 10080 - 2880 = 7200$

సమాధానం: 4

10. ${}^{40}p_{r+4} : {}^{38}p_{r+1} = 15600 : 1$ అయితే r విలువ ఎంత?

1) 38 2) 27 3) 35 4) 29

సాధన: ${}^{40}p_{r+4} : {}^{38}p_{r+1} = 15600 : 1$

$\Rightarrow \frac{40!}{(40-r-4)!} : \frac{38!}{(38-r-1)!} = 15600 : 1$

$\frac{40 \times 39 \times 38!}{(36-r)!} : \frac{38!}{(37-r)!} = 15600 : 1$

$\frac{40 \times 39}{(36-r)!} : \frac{1}{(37-r)(36-r)!} = 15600 : 1$

$(40 \times 39)(37-r) = \frac{15600}{1}$

$37 - r = 10 \Rightarrow r = 27$

సమాధానం: 2



రచయిత
డా. వంగల శ్రీనివాస్
విషయ నిపుణులు

937 Word of the Day

Ponderous

Telugu meaning: సమస్యాత్మకమైన, కష్టతరమైన

English meaning: The word ponderous (పాండరస్) is an adjective that describes something that is very heavy, slow, or dull because of excessive seriousness or complexity.

Synonyms: Laborious, Tedious

Antonyms: Light, Effortless

Usage: **1.** The professor's ponderous lecture, filled with complex terminology and lengthy explanations, made it difficult for students to stay attentive.

2. He carried the ponderous box up the stairs with great difficulty, pausing several times to catch his breath.

కరెంట్ అఫైర్స్



భారత నౌకాదళం అవసరాల నిమిత్తం డాల్ఫిన్ హంటర్ ఇంజినీరింగ్ సాంకేతికతతో రూపొందించిన యుద్ధనౌక 'ఐఎన్ఎస్ అంజదీప్'ను 2026, ఫిబ్రవరి 27న చెన్నైలో ప్రారంభించారు. నౌకాదళ ప్రధాన అధికారి అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి నౌకను జాతికి అంకితం చేశారు. ఇందులో తేలికపాటి టార్పెడోలు తదితరాలు ఉన్నాయి. కోల్‌కతాకు చెందిన జీఆర్ఎస్ఈ సంస్థ నిర్మించిన ఈ నౌక పొడవు 77 మీటర్లు. 25 నాటికల్ మైళ్ల వేగంతో ప్రయాణించగలదు.



స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తేలికపాటి పోరాట హెలికాప్టర్ 'ప్రచండ్'లో భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 2026, ఫిబ్రవరి 27న గగనవిహారం చేశారు. ఫ్లయింగ్ సూట్ ధరించిన ఆమె.. 25 నిమిషాలపాటు కో పైలట్‌గా వ్యవహరించారు. దీంతో పోరాట హెలికాప్టర్‌లో ఆకాశయానం చేసిన తొలి రాష్ట్రపతిగా ఆమె చరిత్ర సృష్టించారు.

అత్యంత స్వల్పశ్రేణి గగనతల రక్షణ క్షిపణి వ్యవస్థను (వీఎస్‌హెచ్ఓఆర్ఏడీఎస్) భారత్ విజయవంతంగా పరీక్షించినట్లు రక్షణ శాఖ 2026, ఫిబ్రవరి 27న ప్రకటించింది. ఒడిశా తీరానికి చేరువలోని చాందీపుర్‌లో ఈ పరీక్షలు జరిగాయి. వరుసగా మూడుసార్లు ఈ ప్రయోగాలను నిర్వహించారు. భిన్న వేగాలు, పరిధి, ఎత్తుల్లో లక్ష్యాలను నేలకూల్చడంలో క్షిపణి సత్తాను ఈ సందర్భంగా పరీక్షించారు.

భారత్-పాకిస్థాన్ సరిహద్దుకు చేరువలోని పోఖ్రాన్ రేంజ్‌లో 2026, ఫిబ్రవరి 27న భారత వైమానిక దళం 'వాయుశక్తి' విన్యాసాలను నిర్వహించింది. ఇందులో వాయుసేనకు చెందిన ఫైటర్ జెట్‌లు, రవాణా విమానాలు, హెలికాప్టర్లు పాలుపంచుకున్నాయి. ఈ సందర్భంగా.. 2025లో 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా నిర్వహించిన దాడులను వాయుసేన అనుకరించింది. శత్రు రన్‌వేలు, పెట్రోలియం నిల్వ కేంద్రాలు, బంకర్లు, రాడార్ శిబిరాలు, యుద్ధ ట్యాంకులు, కమ్యూనికేషన్ కేంద్రాలు, ఉగ్రవాద శిబిరాలు, మందుగుండు నిల్వ కేంద్రాల నమూనాలను యుద్ధవిమానాలు ధ్వంసం చేశాయి.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.


అలెగ్జాండర్ గ్రహంబెల్

శాస్త్రవేత్తలు విశేషాలు

ఈయన ప్రపంచ ప్రఖ్యాత ఆవిష్కర్త, శాస్త్రవేత్త. టెలిఫోన్ సృష్టికర్తగా సుపరిచితులు. అంతేకాక ధ్వనిశాస్త్రం, స్పీచ్ సైన్స్, ఆప్టిక్స్, మెరైన్ ఇంజినీరింగ్, ఏరోనాటిక్స్ రంగంలో విశేష పరిశోధనలు చేశారు. ముఖ్యంగా కమ్యూనికేషన్స్ రంగంలో చేసిన ప్రయోగాలు విశేష ఆదరణ పొందాయి. వినికిడి లోపం ఉన్నవారి కోసం సమాచార పరికరాలను తయారు చేశారు. శబ్దాలపై అనేక పరిశోధనలు చేశారు. 'ఫాదర్ ఆఫ్ ది టెలిఫోన్'గా కీర్తిగడించిన అలెగ్జాండర్ గ్రహంబెల్ జయంతి రేపు (మార్చి 3). ఈ సందర్భంగా ఆయన జీవితంలోని ముఖ్య విషయాలు తెలుసుకుందాం..!

బాల్యం – వృత్తి జీవితం

- అలెగ్జాండర్ గ్రహంబెల్ 1847, మార్చి 3న స్కాట్లాండ్‌లోని ఎడిన్‌బర్గ్‌లో జన్మించారు. 1857లో రాయల్ హైస్కూల్ ఆఫ్ ఎడిన్‌బర్గ్‌లో చేరారు. అక్కడే ఆయనకు సైన్స్ పట్ల ఆసక్తి కలిగింది.
- 1862లో పాఠశాల విద్య ముగించుకుని లండన్‌లో తన తాత వద్దకు వెళ్లారు. ఆయన వద్ద నుంచి ధ్వనిశాస్త్రం, ప్రసంగం/ వాక్చాతుర్యం (elocution) గురించి అనేక విషయాలు నేర్చుకున్నారు.
- 1863లో స్కాట్లాండ్‌లోని ఎల్గిన్‌లో ఉన్న వెస్టన్ హౌస్ అకాడమీలో సంగీతం, వాక్చాతుర్యంలో ఉపాధ్యాయుడిగా నియమితులయ్యారు. అక్కడే ధ్వనిశాస్త్రంపై అనేక పరిశోధనలు చేశారు. 1868లో యూనివర్సిటీ కాలేజ్ లండన్ నిర్వహించే ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులై, మెట్రిక్యులేషన్‌లో చేరారు. అయితే అది పూర్తి కాకుండానే 1870లో కుటుంబంతో కలిసి కెనడాకు వలస వెళ్లారు.



- 1871లో బోస్టన్ వెళ్లిన బెల్ అక్కడ 'బోస్టన్ స్కూల్ ఫర్ డెఫ్ మ్యూట్స్'లో అధ్యాపకుడిగా చేరారు. 1873లో బోస్టన్ యూనివర్సిటీలో వోకల్ ఫిజియాలజీ, ఎలోక్యూషన్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు.

అలెగ్జాండర్ గ్రహంబెల్ అందుకున్న పురస్కారాలు - గౌరవాలు, గతంలో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ ఎకానమీ

సుస్థిరాభివృద్ధి - పర్యావరణం


మానవ సంక్షేమానికి సుస్థిరాభివృద్ధి చాలా ముఖ్యం. పర్యావరణంలో లభించే సహజ వనరులను పరిమితంగా ఉపయోగించుకుని.. వాటిని భవిష్యత్తు తరాలకు అందించడమే సుస్థిరాభివృద్ధి. పర్యావరణం, ఆర్థిక వ్యవస్థ ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. అందుకే పర్యావరణాన్ని కాపాడుకుంటూనే సుస్థిరాభివృద్ధి కోసం కృషి చేయాలి. ఆర్థికాభివృద్ధిపై పర్యావరణం ఏ విధంగా ప్రభావాన్ని చూపుతుంది, పర్యావరణ పరిరక్షణలో అంతర్జాతీయంగా భారత్ స్థానం లాంటి విషయాలపై పోటీపరీక్షార్థికి అవగాహన ఉండాలి.

పర్యావరణం – విధులు

పర్యావరణం అనే భావనలో జీవ, నిర్జీవ అంశాలు ఉంటాయి. జీవ అంశాల్లో మొక్కలు, పక్షులు, జంతువులు మొదలైనవి ఉంటే; నిర్జీవ అంశాల్లో గాలి, నీరు, భూమి తదితరాలు ఉంటాయి. వీటి పరస్పర సంబంధాల అధ్యయనమే పర్యావరణశాస్త్ర ముఖ్య ఉద్దేశం.

ఆర్థికాభివృద్ధిపై పర్యావరణ ప్రభావం

ఆర్థికాభివృద్ధి అంటే వాస్తవ ఉత్పత్తిలో పెరుగుదల. పెరిగిన ఉత్పత్తి, వినియోగంతో పర్యావరణంపై చేసిన వ్యయాన్ని అంచనా వేయొచ్చు. ఆర్థికాభివృద్ధి వల్ల పర్యావరణంపై పడే ప్రభావాన్ని పునరుత్పాదకం కాని వనరుల వినియోగం, అధిక స్థాయి కాలుష్యం, భూమి ఉష్ణోగ్రతలు పెరగడం, పర్యావరణ ఆవాసాల నష్టం మొదలైన వాటి ద్వారా తెలుసుకోవచ్చు. ▸ ఎన్విరాన్‌మెంట్ పెర్ఫార్మెన్స్ సూచిక అనేది దేశాల పర్యావరణ స్థితిగతులను అంచనా వేసే గ్లోబల్ ర్యాంకింగ్ సిస్టం.



నిపుణుల అభిప్రాయాలు, పర్యావరణాన్ని ప్రభావితం చేసే అంశాలు, సుస్థిరాభివృద్ధి - ప్రపంచ దేశాల కృషి, సహస్రాభివృద్ధి లక్ష్యాలు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Court Assistant Jobs

The Supreme Court of India, Delhi, is inviting applications for filling up the posts in various departments on a regular basis. The total no. of posts is 22. The application fee is Rs.1500. Eligible candidates can apply online before 8 March 2026.

Apprenticeship Trainee Posts

National Aerospace Laboratories (NAL), Bangalore, a subsidiary of the Council of Scientific and Industrial Research (CSIR), is inviting applications for the recruitment of Apprenticeship Trainee posts. The total number of posts is 28. Eligible candidates can appear for the interview on 11, 12 March 2026.

Professor Jobs

Employees' State Insurance Corporation, Faridabad (ESIC) is conducting interviews for the Professor, Associate Professor and Assistant Professor posts on a contract basis. The total number of posts is 62. The interview is scheduled for March 11, 2026..

Did You Apply..?

Today (March 2) is the last date for the following Jobs

- RRB - 22,195 Group-D posts. ***Eligibility:*** 10th class and ITI.
- 84 Professor Jobs in SSJU. ***Eligibility:*** PhD.
- 101 Professor Jobs in ESIC Indore. ***Qualification:*** MBBS/MD/MS.

For more information and other notifications - scan QR code

SSC Exams
English

Synonyms

Directions (Qs: 1 - 15): *In each of the questions given below, a sentence is given with one word printed in bold letters, along with four options. Choose the appropriate synonym.*

1. The magician's performance managed to **fascinate** the audience, leaving them completely absorbed in his tricks.
   A) Bore B) Confuse C) Attract D) Ignore
2. Each region has its own **distinct** cultural traditions that differentiate it from others.
   A) Similar B) Clear C) Unique D) Common
3. The surgeon was extremely **dexterous**, performing the complex operation with remarkable precision.
   A) Skilled B) Weak C) Careless D) Slow
4. The company adopted a **progressive** approach by introducing flexible work policies for employees.
   A) Modern B) Conservative C) Ancient D) Rigid
5. He developed an intense **aversion** to junk food after falling seriously ill.
   A) Liking B) Hatred C) Interest D) Desire
6. Constant criticism will only **aggravate** the situation instead of resolving it.
   A) Improve B) Worsen C) Calm D) Solve
7. His **indolent** attitude prevented him from achieving success despite his talent.
   A) Energetic B) Active C) Alert D) Lazy
8. The corrupt officer's actions were considered **despicable** by the entire community.
   A) Noble B) Admirable C) Shameful D) Pleasant
9. The police arrested a gang involved in selling **counterfeit** currency notes.
   A) Fake B) Genuine C) Legal D) Valid
10. The thief's **accomplice** was caught while trying to escape from the crime scene.
    A) Enemy B) Partner C) Victim D) Witness
11. The government decided to **augment** resources for healthcare services during the crisis.
    A) Reduce B) Waste C) Ignore D) Increase
12. The lawyer successfully **exculpated** his client by proving his innocence.
    A) Freed B) Accused C) Blamed D) Punished
13. Public **apathy** towards environmental issues is a major concern for activists.
    A) Interest B) Concern C) Indifference D) Passion
14. Her **promptness** in responding to emails impressed the management.
    A) Delay B) Speed C) Laziness D) Carelessness
15. The constant noise began to **exasperate** him after several hours.
    A) Comfort B) Please C) Relax D) Annoy

Directions (Qs: 16 - 25): *In each of the questions given below, a word is printed in bold letters, along with four options. Choose the appropriate synonym.*

16. **Proximity**
    A) Nearness B) Distance C) Separation D) Length
17. **Reprieve**
    A) Delay B) Execution C) Punishment D) Relief
18. **Courtesy**
    A) Pride B) Rudeness C) Ignorance D) Politeness
19. **Discord**
    A) Harmony B) Agreement C) Conflict D) Friendship
20. **Obdurate**
    A) Flexible B) Stubborn C) Gentle D) Weak
21. **Appendage**
    A) Addition B) Core C) Center D) Origin
22. **Bustle**
    A) Activity B) Silence C) Stillness D) Calm
23. **Blemish**
    A) Perfection B) Strength C) Beauty D) Flaw
24. **Reprove**
    A) Approve B) Criticize C) Support D) Praise
25. **Contradict**
    A) Agree B) Confirm C) Oppose D) Support

Scan the QR code for Key

Writer: *P. Manoj Kumar, Subject Expert*



కుటుంబ సభ్యులతో వేణుగోపాల్, ఆయన భార్య తార

45 ఏళ్లకు కుటుంబం చెంతకు మల్లోజుల

పెద్దపల్లి, న్యూస్‌టుడే: మహారాష్ట్రలో నాలుగు నెలల కిందట లొంగిపోయిన మావోయిస్టు నాయకుడు మల్లోజుల వేణుగోపాల్ 45 ఏళ్ల అజ్ఞాతం తర్వాత తన స్వగ్రామానికి చేరుకుని కుటుంబీకులను కలిశారు. ఆయన, భార్య తార ప్రస్తుతం గడ్చిరోలిలో మహారాష్ట్ర ప్రభుత్వ ఆశ్రయంలో ఉన్నారు. ఆ దంపతులు ఆదివారం మహారాష్ట్ర పోలీసుల భద్రత మధ్య పెద్దపల్లికి వచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన సోదరుడు ఆంజనేయులును చూసేందుకు వచ్చిన మల్లోజుల భావోద్వేగానికి గురయ్యారు. ఇన్నేళ్ల తర్వాత సోదరుడిని చూడడంతో చలించిపోయారు. కుటుంబ సభ్యులందరినీ ఆప్యాయంగా పలకరించి.. వారితో ఫొటోలు దిగారు. అనంతరం అల్పాహారం చేశారు. ఒకప్పటి ఆయన స్నేహితులు, కాలనీవాసులు వచ్చి కలిశారు. మధ్యాహ్న భోజనం చేసి వెళ్తారని కుటుంబ సభ్యులు భావించారు. కానీ తమకు నిర్దేశించిన సమయం ముగిసిందంటూ పోలీసులు ఒంటి గంట ప్రాంతంలో మల్లోజుల దంపతులను వెంటబెట్టుకుని తిరుగు ప్రయాణమయ్యారు. 1978 నుంచి రాడికల్ విద్యార్థి యూనియన్ సీహెచ్‌గా పనిచేసిన వేణుగోపాల్ 1980 నుంచి పూర్తిస్థాయిలో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. గత ఏడాది అక్టోబరు 14న మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ సమక్షంలో లొంగిపోయారు.

నిమిషం ఆలస్యమైనా గైర్హాజరుగా పరిగణిస్తామనడం సరికాదు

- తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయుల హాజరు విషయంలో నిమిషం ఆలస్యమైనా గైర్హాజరుగా పరిగణిస్తామంటూ విద్యాశాఖ చేస్తున్న ప్రకటన సమంజసం కాదని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం పేర్కొంది. గతంలో అమలులో ఉన్న 10 నిమిషాల గ్రేస్ పీరియడ్‌ను యథాతథంగా అమలుచేయాలని డిమాండ్‌చేసింది. హాజరు నమోదు యాప్ సక్రమంగా పనిచేయని సందర్భాల్లో ఉపాధ్యాయుల్ని బాధ్యులుగా చేయడం తగదని, 'ఎంప్లాయిస్ ఫ్రెండ్లీ గవర్నమెంట్' భావనకు ఇలాంటి నిర్ణయాలు విరుద్ధమని చెప్పింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

37 కరవు మండలాల్లో 50 అదనపు పనిదినాలు

ఈనాడు, అమరావతి: శ్రీసత్యసాయి, అన్నమయ్య, ప్రకాశం జిల్లాల్లోని 37 కరవు ప్రభావిత మండలాల్లో ఉపాధిహామీ పథకం శ్రామికులకు అదనంగా 50 రోజుల పనిదినాలు కల్పించనున్నారు. ప్రస్తుతం అందిస్తున్న 100 పనిదినాలకు ఇవి అదనం. మార్చి 31 లోపు మొత్తం 150 పనిదినాలను శ్రామికులు వినియోగించుకోవాలి. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

రేపు యాదగిరిగుట్టలో దైవ దర్శనాల నిలిపివేత

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: చంద్రగ్రహణం సందర్భంగా మంగళవారం యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలో దైవ దర్శనాలు, ఆర్జిత ఆరాధనలు నిలిపివేసినట్లు దేవస్థానం తెలిపింది. పంచనారసింహుల ప్రధానాలయంతో పాటు అనుబంధ శివాలయం, పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిత్య పూజలు ఆ రోజు ఉదయం 7గంటల్లోపు నిర్వహించి మూసివేస్తామని ఈవో భవానీ శంకర్ వెల్లడించారు. బుధవారం వేకువ జామున ఆలయాల మహా ద్వారాలను తెరిచి సంప్రోక్షణ జరిపి, నిత్యారాధనలు నిర్వహించి, దైవ దర్శనాలు కల్పించనున్నట్లు ఈవో తెలిపారు.

బీసీ రిజర్వేషన్ ప్రైవేటు బిల్లు పెట్టాలి: రాహుల్‌కు జాజుల లేఖ

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో విద్య, ఉద్యోగ రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ రాష్ట్ర శాసనసభ చేసిన చట్టాన్ని పార్లమెంటులో ఆమోదించేలా కాంగ్రెస్ పార్టీ.. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి రానున్న బడ్జెట్ సమావేశాల్లో పార్లమెంట్‌లో ప్రైవేటు బిల్లు ప్రవేశపెట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. సోమవారం రాష్ట్ర పర్యటనకు వస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి జాజుల ఆదివారం బహిరంగ లేఖ రాశారు. ''బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. కామారెడ్డి డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలి. నామినేటెడ్ పోస్టుల్లో, కాంట్రాక్టుల్లో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి. రెండు రాజ్యసభ స్థానాల్లో ఒకటి బీసీలకు కేటాయించాలి. కులగణన ఆధారంగా బీసీలకు జనాబా దామాషా ప్రకారం అవకాశాలు కల్పించాలి. ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో బీసీ, ఎస్సీ దంపతులపై దాడి చేసి రెండు నెలల పసికందు మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలి'' అని జాజుల కోరారు.



క్రమశిక్షణను కష్టంగా భావిస్తే పశ్చాత్తాపం తప్పదు

క్రమశిక్షణతో పనిచేయడమనేది ఇప్పుడు కష్టంగానే ఉంటుంది. కానీ దాన్ని పాటించకపోతే భవిష్యత్తులో కలిగే పశ్చాత్తాపం జీవితాంతం ఉంటుంది. క్రమశిక్షణ, పశ్చాత్తాపం.. ఈ రెండింటిలో దేన్ని ఎంచుకోవాలన్నది మీ చేతుల్లోనే ఉంది. మీరు కోరుకున్న జీవితాన్ని పొందాలంటే క్రమశిక్షణను అలవర్చుకోవడం తప్ప మరో మార్గం లేదు.

– లెవిస్ హోవెస్, రచయిత

ఫిబ్రవరిలో నికర జీఎస్టీ ఆదాయం రూ.3,061 కోట్లు

- గతేడాది ఇదే నెలతో పోలిస్తే రూ.159 కోట్ల పెరుగుదల
- ఐజీఎస్టీ.. పెట్రోలియం వ్యాట్.. ప్రొఫెషనల్ ట్యాక్స్‌లోనూ పెరుగుదల
- ఫలితాలిచ్చిన వాణిజ్య పన్నుల శాఖ చర్యలు

ఈనాడు, అమరావతి: నికర జీఎస్టీ వసూళ్లలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫిబ్రవరిలో వృద్ధి నమోదు చేసింది. జీఎస్టీ అమలైనప్పటి నుంచి ఫిబ్రవరి నెలల్లో వసూళ్లను పరిగణనలోకి తీసుకుంటే.. ఈ ఏడాది ఫిబ్రవరి వసూళ్లే అధికం. ఈ ఏడాది ఫిబ్రవరి నికర జీఎస్టీ రూ.3,061 కోట్లు కాగా.. గతేడాది ఇదే నెలలో రూ.2,902 కోట్లే వసూళ్లు కావడం గమనార్హం. ఈ లెక్కన జీఎస్టీ కింద రూ.159 కోట్లు అదనంగా వసూలైంది. ప్రధాన సరకులు, వినియోగ వస్తువులు, ఔషధాలు, సిమెంట్‌పై పన్ను రేట్లు తగ్గినా, జీఎస్టీ 2.0 సంస్కరణ వల్ల జీవిత బీమా, ఆరోగ్య బీమాపై జీఎస్టీ ఉపసంహరణ జరిగినా నికర వసూళ్లలో వృద్ధినే నమోదు చేసింది. పన్ను రేటు తగ్గింపులు, వ్యూహాత్మక చర్యలు, మెరుగైన విధానాల వల్ల వినియోగం పెరగటం రాష్ట్ర ఆదాయ వృద్ధికి దోహదపడిందని రాష్ట్ర పన్నుల ప్రధాన కమిషనర్ బాబు.ఎ తెలిపారు.

2026 ఫిబ్రవరిలో నికర జీఎస్టీ

- గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే.. వరుసగా 11 నెలల పాటు జీఎస్టీ నికర వసూళ్లు అధికంగా నమోదయ్యాయి.
- వివిధ వస్తువులపై పన్ను రేట్లు తగ్గినా.. 2025 ఫిబ్రవరిలో జీఎస్టీ వసూళ్లతో పోలిస్తే.. నెట్ జీఎస్టీ వసూళ్లలో 5.45% మేర వృద్ధి నమోదైంది.
- ప్రతినెలా (5.86%) క్యుమిలేటివ్ జీఎస్టీ వసూళ్లతో దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే ఏపీ 2025-26లో మొదటి స్థానంలో ఉంది.

స్వల్పంగా తగ్గిన స్థూల జీఎస్టీ

- పన్ను రేట్ల తగ్గింపు, పొగాకు, మద్యం, విలాస వస్తువులు మినహా.. మిగిలిన వస్తువులపై సెస్సు మినహాయించాక 2026 ఫిబ్రవరిలో గ్రాస్ జీఎస్టీ కింద రూ.3,562 కోట్లు వసూలైంది. అది 2025 ఫిబ్రవరిలో రూ.3.569 కోట్లుగా ఉంది. పన్ను రేట్ల తగ్గింపు, అన్ని ఉత్పత్తులపై సెస్ ఉపసంహరణ ప్రభావంతో స్వల్పంగా 0.22% తగ్గింది.
- పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే స్థిరమైన, సగటు కంటే జీఎస్టీ వసూళ్లలో అధిక వృద్ధిని నమోదు చేస్తోంది.

గతేడాది ఫిబ్రవరితో పోలిస్తే..

- ఎస్‌జీఎస్టీ వసూళ్లలో పెరుగుదల 2.96%. (మొత్తం రూ.1,251 కోట్లు) ● కేంద్రం ఐజీఎస్టీ సెటిల్‌మెంట్‌లో పెరుగుదల 7.27% (రూ.122.21 కోట్లు).. సెటిల్‌మెంట్ మొత్తం రూ.1,809.85 కోట్లు.
- పెట్రోలియం వ్యాట్ ఆదాయం రూ.1,442 కోట్లకు చేరింది. ● ప్రొఫెషనల్ ట్యాక్స్ ఆదాయంలో 31.97% పెరిగింది. ● వాణిజ్య పన్నుల శాఖ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను గుర్తించడంలో చేసిన కృషి కారణంగా ఐజీఎస్టీ సెటిల్‌మెంట్ కింద కేంద్రం నుంచి వచ్చే మొత్తం పెరిగింది.
- గతంలో పడిపోతున్న జీఎస్టీ వసూళ్లను ఆపడమే కాకుండా.. 2026 ఫిబ్రవరిలో 4.63% వృద్ధిని సాధించింది. 2025 ఏప్రిల్ నుంచి 2026 ఫిబ్రవరి వరకు క్యుమిలేటివ్ పెరుగుదల 4.77 శాతంగా నమోదైంది.
- ఫిబ్రవరిలో అన్ని సెక్టార్ల నుంచి వసూళ్లు రూ.4,634 కోట్లు. గతేడాది ఇదే కాలానికి వసూలైన మొత్తం రూ.4,428 కోట్లు. గతేడాదితో పోలిస్తే.. అన్ని సెక్టార్లలో కలిపి ఆదాయ వృద్ధి రేటు 4.63%గా ఉంది.

వసూళ్లు పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలు

- పన్ను ఎగవేత, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ క్లెయిమ్‌లలో నిబంధనలు కఠినతరం చేయడం.. అంతర్ రాష్ట్ర లావాదేవీలకు సంబంధించి రిటర్న్‌లు ఫైలింగ్‌ల వ్యత్యాసాన్ని గుర్తించేందుకు డేటా విశ్లేషణ, ఏఐ వినియోగించడం.
- ఆడిట్‌లు, దర్యాప్తులు వేగంగా పూర్తి చేయడం.
- అంతర్ రాష్ట్ర లావాదేవీలను గుర్తించి ఐజీఎస్టీ చెల్లించేలా చూడటం.
- నిర్దేశిత వ్యవధిలోగా రిటర్న్‌లు.. కచ్చితమైన వివరాలతో ఫైల్ చేసేలా వ్యాపారులను ప్రోత్సహించడం.
- పన్ను ఎగవేతదారులను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్‌ల నిర్వహణ.
- దీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించడంలో చురుకైన విధానాలు అమలు చేయడం.

46,113 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు

- రెండు నెలల్లో అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళిక

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం నిరీక్షిస్తున్న రైతులకు ఊరట లభించనుంది. పెండింగ్‌లో ఉన్న ఈ దరఖాస్తులకు నెలాఖరులోగా అనుమతులివ్వాలని విద్యుత్ సంస్థలు నిర్ణయించాయి. రాష్ట్రంలోని మూడు డిస్కంల పరిధిలో 46,113 మంది రైతులు కొత్త కనెక్షన్ల కోసం దరఖాస్తు చేశారు. వీటికి అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, ఇతర సామగ్రి అందుబాటులో లేక డిస్కంలు దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టాయి. ఆయా సామగ్రి కోసం సుమారు రూ.250 కోట్లు ఖర్చవుతుందని అంచనా. వైకాపా హయాంలో ఎప్పటికప్పుడు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టింది. కూటమి అధికారంలోకి వచ్చేనాటికి సుమారు 50వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటితో కలిపి డిస్కంలు సుమారు 1.12 లక్షల కొత్త కనెక్షన్లు ఇచ్చాయి. దీంతో రాష్ట్రంలో ప్రస్తుతం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల సంఖ్య 22.30 లక్షలకు చేరింది. ఇంకా డిస్కంల పరిధిలో 2025 జనవరి నుంచి అందిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. సాధారణంగా దరఖాస్తు అందిన నాటి నుంచి రెండు నెలల్లో కనెక్షన్ ఇవ్వాలి. ఏఈల కొరతతో కొంత జాప్యమవుతోంది. ప్రస్తుతం డిస్కంల వద్ద 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు ఈపీడీసీఎల్‌లో 7,382, సీపీడీసీఎల్‌లో 266, ఎస్‌పీడీసీఎల్‌లో 88 ఉన్నాయి. పెండింగ్ కనెక్షన్లకు 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు కనీసం మరో 10వేల వరకు అవసరం.

ఫిబ్రవరి నాటికి పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ దరఖాస్తులు

డిస్కం	పెండింగ్ దరఖాస్తులు
ఈపీడీసీఎల్	6,593
సీపీడీసీఎల్	11,926
ఎస్‌పీడీసీఎల్	27,594
మొత్తం	46,113

రెండు నెలల్లో పూర్తికి ఆదేశం

– గొట్టిపాటి రవికుమార్, మంత్రి

పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను రెండు నెలల్లో అందుబాటులోకి తేవాలని డిస్కంలను ఆదేశించాం. అందుకు అవసరమైన సామగ్రిని విద్యుత్ సంస్థలు సమకూర్చుకుంటున్నాయి. ముందుగా వాటికి అంచనాలు తయారుచేసి, మంజూరుకు సిద్ధం చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.



గింగిరాల టమాటా..

సాధారణంగా టమాటాలు అరచేతిలో ఇమిడిపోయే పరిమాణంలో ఉంటాయి. కానీ, కుమురంభీం జిల్లా పెంచికల్‌పేట మండలం బొంబాయిగూడకు చెందిన రైతు గణపతి ఇంటి పెరటిలో కాసిన టమాటా మాత్రం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. వింత ఆకృతిలో ఉన్న ఒక టమాటా పావు కిలో కంటే ఎక్కువ బరువుతో కాసింది. ఎటువంటి రసాయన ఎరువులు వాడకుండా సహజసిద్ధంగా సాగుచేస్తున్నాని సదరు రైతు తెలిపారు.

– న్యూస్‌టుడే, పెంచికల్‌పేట



విజయవాడలోని లోక్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



గవర్నర్ ఇచ్చిన తేనీటి విందులో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఏపీ హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకుర్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి, జస్టిస్ పీఎస్ నరసింహల మాటామంతి

సీజేఐకి గవర్నర్ తేనేటి విందు


ఈనాడు, అమరావతి: రాష్ట్ర పర్యటనకు వచ్చిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌కి గవర్నర్ అబ్దుల్ నజీర్ విజయవాడలోని లోక్‌భవన్‌లో ఆదివారం తేనేటి విందు ఇచ్చారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ పీకే మిశ్ర, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి, జస్టిస్ జోయ్ మల్య బాగ్చి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ హాజరయ్యారు.

త్వరగా ముగియకపోతే.. మూడో ప్రపంచ యుద్ధమే!

- అమెరికా నిర్ణయాలు ప్రశ్నించే స్థితిలో ఏ దేశమూ లేదు
- ఇరాన్-ఇజ్రాయెల్ పోరుతో భారత్ లాంటి దేశాలకు ఇబ్బందులే
- భవిష్యత్తులో సైబర్ దాడులు, డ్రోన్లతోనే సమరం
- 'ఈనాడు-ఈటీవీ'తో రక్షణ, దౌత్య రంగ నిపుణులు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: మధ్యప్రాచ్యంలో దశాబ్దాలుగా రగులుతున్న నిప్పు కాస్తా.. ఇప్పుడు దావానలంలా వ్యాపించింది. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య సాగుతున్న అంతర్గత యుద్ధం ప్రస్తుతం బహిరంగ సమరంగా మారింది. ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ మృతితో ఈ ప్రాంతంలో సమీకరణాలు వేగంగా మారిపోయాయి. అమెరికా సాంకేతికతకు, ఇజ్రాయెల్ వ్యూహాలు తోడవడంతో ఇరాన్ రాజధాని టెహ్రాన్ నగరం అంధకారంలో మునిగిపోయింది. ఈ పరిణామాలు మూడో ప్రపంచ యుద్ధానికి దారితీస్తాయా? భారత్‌పై యుద్ధ ప్రభావమెంత..? తదితర అంశాలపై అంతర్జాతీయ రక్షణ, దౌత్యరంగ నిపుణులు 'ఈనాడు-ఈటీవీ'తో ఆదివారం ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..

పాలకుడిని మార్చే లక్ష్యంతో..



మధ్యప్రాచ్యంలో ఇరాన్ దగ్గరున్న అణు సామర్థ్యం తమ మనుగడకే ముప్పు అని ఇజ్రాయెల్ భావిస్తోంది. ఇరాన్‌లోని ప్రస్తుత పాలనను మార్చి, తమకు అనుకూలమైన ప్రభుత్వాన్ని తీసుకురావడమే అమెరికా వ్యూహం. ఇప్పటికే ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ కీలక అధికారులు, సైనిక నాయకులను హతమారుస్తున్నారు. తద్వారా కొత్తగా వచ్చే నాయకత్వం.. అమెరికా నిబంధనలకు తలొగ్గేలా చేయనుంది. ఇరాన్ దగ్గర క్షిపణులు, డ్రోన్లు ఉన్నప్పటికీ.. శత్రువుల అధునాతన దాడులను అడ్డుకోగల ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ లేకపోవడం పెద్ద బలహీనత. ఈ యుద్ధం వల్ల భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఇబ్బందులు తప్పవు.

– లెఫ్టినెంట్ జనరల్ కేఆర్ రావు

అణ్వాయుధాల తయారీ నెపంతో..

అమెరికాకు ఇజ్రాయెల్ అత్యంత సన్నిహిత మిత్రదేశం కావడం.. ఇరాన్ అణ్వాయుధాల తయారీకి ప్రయత్నిస్తోందన్న అనుమానాలు ప్రస్తుత దాడులకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. ఇరాన్‌తో అణు ఒప్పందంపై చర్చలు విఫలమవడంతో, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యూహాత్మకంగా ఇజ్రాయెల్‌ను ముందుంచారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇరాన్‌కు రష్యా, చైనా, ఉత్తర కొరియా వంటి దేశాల మద్దతు ఉండే అవకాశం ఉంది. అయితే అమెరికాతో ఉన్న వాణిజ్య సంబంధాల దృష్ట్యా చైనా ఎంతవరకు ముందుకు వస్తుందనేది సందేహం. ఈ యుద్ధం త్వరగా ముగియకపోతే ఇది మూడో ప్రపంచ యుద్ధానికి దారితీసినా ఆశ్చర్యపోనవసరం లేదు.



– కన్నెగంటి రమేశ్, భద్రతా వ్యవహారాల నిపుణుడు

మారుతున్న యుద్ధ గతి



ఇరాన్ తన అణు సామర్థ్యాన్ని శాంతియుత అవసరాల కోసం కాకుండా.. అణ్వాయుధాల తయారీకి ఉపయోగిస్తోందని ఆరోపిస్తూ అమెరికా దాడులకు దిగుతోంది. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీని లక్ష్యంగా చేసుకోవడం వెనక అమెరికా 'డీకాపిటేషన్ స్ట్రాటజీ' ఉంది. ఒక వ్యవస్థలో అగ్ర నాయకత్వాన్ని తుడిచిపెట్టడం ద్వారా కింద ఉన్న యంత్రాంగాన్ని మానసికంగా, వ్యూహాత్మకంగా దెబ్బతీయడమే డీకాపిటేషన్. బంకర్లలో దాక్కున్న నేతలను సైతం అత్యంత కచ్చితత్వంతో మట్టుపెట్టడానికి ఇజ్రాయెల్ గూఢచార సంస్థ 'మొస్సాద్' నెట్‌వర్క్, అమెరికా అత్యాధునిక ఆయుధాల కలయికే కారణం. రాబోయే రోజుల్లో యుద్ధం తుపాకులతోనే కాకుండా.. సైబర్ దాడులు, డ్రోన్ల ద్వారా జరుగుతుంది.

– శివకిరణ్‌కుమార్, ఆర్మీ విశ్రాంత మేజర్

నామమాత్రంగా 'ఐరాస' పాత్ర

ఇజ్రాయెల్‌తో భారత్‌కు వ్యూహాత్మక భాగస్వామ్యం ఉన్నప్పటికీ, ఇరాన్‌తో చారిత్రక, ఆర్థిక సంబంధాలు కాపాడుకోవడమూ మనకు ముఖ్యమే. అఫ్గానిస్థాన్, సెంట్రల్ ఆసియా దేశాలకు సరకు రవాణా చేయడానికి ఇరాన్‌లోని చాబహార్ ఓడరేవు భారత్‌కు ఎంతో కీలకం. ముంబయి నుంచి రష్యా వరకు సాగే నార్త్-సౌత్ ట్రాన్స్‌పోర్ట్ కారిడార్‌లో భారత్, ఇరాన్, రష్యా మూడు దేశాలు భాగస్వాములుగా ఉన్నాయి. వ్యూహాత్మకంగా ఇరాన్‌తో సంబంధాలు తెంచుకోవడం భారత్‌కి శ్రేయస్కరం కాదు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల్లో ఐక్యరాజ్యసమితి పాత్ర నామమాత్రంగా మారింది. అమెరికా నిర్ణయాలను ప్రశ్నించే స్థితిలో ప్రస్తుతం ఏ దేశం లేదు. ఈ యుద్ధంలో భారత్ తన దౌత్య నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ అన్ని దేశాలతో సత్సంబంధాలు కొనసాగించడమే ఉత్తమం.



– డా.నాగేంద్రప్రసాద్, విశ్రాంత దౌత్యవేత్త

ఇరాన్‌లో రాజకీయ అస్థిరత



ఖమేనీని అంతం చేయడానికి అమెరికా-ఇజ్రాయెల్ దళాలు భారీ ఆపరేషన్ నిర్వహించాయి. భూగర్భంలోని అత్యంత లోతైన బంకర్లను కూడా ఛేదించే 'బంకర్ పెనెట్రేటింగ్ మిసైల్స్' ఉపయోగించి ఈ దాడి నిర్వహించాయి. ఖమేనీ మరణంతో ఇరాన్‌లో రాజకీయ అస్థిరత ఏర్పడింది. కొత్త సుప్రీం లీడర్ ఎన్నికయ్యే వరకు దేశ పరిపాలన కోసం తాత్కాలిక కౌన్సిల్ ఏర్పడనుంది. తర్వాతి నేతగా ఖమేనీ కుమారుడి పేరు బలంగా వినిపిస్తోంది. ట్రంప్ అనుసరిస్తున్న తీరు వివాదాస్పదంగా ఉంది. ఇటీవల వెనెజువెలా అధ్యక్షుడిని కిడ్నాప్ చేసిన తరహాలోనే.. ఇప్పుడు ఇరాన్ నాయకత్వాన్ని మార్చడానికి రక్తపాతం సృష్టిస్తున్నారు.

– మేజర్ శ్రీనివాస్, అంతర్జాతీయ వ్యవహారాల నిపుణుడు



ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎస్ సాయిప్రసాద్ ★ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎం ఎక్స్‌అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్

చంద్రబాబును కలిసిన సాయిప్రసాద్, విజయానంద్

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబును నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సాయిప్రసాద్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎస్‌గా బాధ్యతలు తీసుకున్న అనంతరం తొలిసారి ఉండవల్లి నివాసంలో సీఎంను ఆయన కలిశారు. ఈ సందర్భంగా సీఎస్‌కు చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. సీఎంకు ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కె.విజయానంద్ కూడా చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

బహ్రెయిన్‌లో తెలుగువారు అప్రమత్తంగా ఉండాలి

- ప్రవాసాంధ్రులతో ఫోన్‌లో మాట్లాడిన అయ్యన్నపాత్రుడు

ఈనాడు, అమరావతి: గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో బహ్రెయిన్‌లో ఉన్న తెలుగువారు అప్రమత్తంగా ఉండాలని, స్థానిక ప్రభుత్వ సూచనలు పాటించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచించారు. ఎలాంటి ఆపద వచ్చినా ఏపీఎన్‌ఆర్‌టీ ద్వారా సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. నాతవరానికి చెందిన ఎన్నారై శెట్టి సతీష్‌తో ఫోన్‌లో మాట్లాడి అక్కడి పరిస్థితులు, తెలుగువారి యోగక్షేమాలను ఆయన తెలుసుకున్నారు. అవసరమైతే వారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడానికి అన్ని చర్యలు తీసుకుంటామని, ఈ మేరకు కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుతో మాట్లాడతానని అయ్యన్నపాత్రుడు హామీ ఇచ్చారు. బహ్రెయిన్‌లో సుమారు 50 వేల మంది వరకూ తెలుగువారు ఉద్యోగాలు చేస్తున్నారు. ముఖ్యంగా నర్సీపట్నానికి చెందిన వారు అక్కడ స్థిరపడ్డారు.

ప్రజావేదిక షెడ్యూల్ ఖరారు..

ఈనాడు, అమరావతి: మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ప్రజల నుంచి వినతుల స్వీకరణ కోసం రోజూ నిర్వహించే ప్రజావేదిక కార్యక్రమానికి సంబంధించి సోమవారం నుంచి ఈ నెల పదో తేదీ వరకూ షెడ్యూల్‌ను ఆ పార్టీ విడుదల చేసింది. వినతుల స్వీకరణ కార్యక్రమంలో ఏ రోజు ఎవరెవరు పాల్గొంటారో తెలిపింది. ఆ వివరాలివి.

2వ తేదీ: మంత్రి కొల్లు రవీంద్ర, లిడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యాలరావు

4న: మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, ఏపీటీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు

5న: మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, గిరిజన కార్పొరేషన్ ఛైర్మన్ కిడారి శ్రావణ్, కొప్పుల వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పీవీజీ కుమార్

7న: మంత్రి అచ్చెన్నాయుడు, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు. మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు

9న: మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ సలగాల రాజశేఖర్‌బాబు

10వ తేదీ: మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, ఏపీ హౌసింగ్ బోర్డు ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు.

మరింత సురక్షితంగా ఈవీ బ్యాటరీలు!

- పాలిమర్ ఎలక్ట్రోలైట్స్ అభివృద్ధి చేసిన ఐఐసీటీ శాస్త్రవేత్తలు

ఈనాడు, హైదరాబాద్: విద్యుత్తు వాహనాల (ఈవీ) బ్యాటరీలను మరింత సురక్షితంగా ఉంచే సాంకేతికతను అభివృద్ధి చేసినట్లు హైదరాబాద్‌లోని భారతీయ రసాయన సాంకేతిక పరిశోధన సంస్థ (ఐఐసీటీ) శాస్త్రవేత్తలు వెల్లడించారు. లిథియం బ్యాటరీల్లో ద్రవ ఎలక్ట్రోలైట్ల స్థానంలో.. ఘన రూపంలో ఉండే కాంపోజిట్ సాలిడ్ పాలిమర్ ఎలక్ట్రోలైట్ మ్యాట్రిక్స్‌లను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. దీంతో బ్యాటరీలు మరింత భద్రంగా ఉంటాయని పరిశోధనకు నేతృత్వం వహించిన డాక్టర్ ప్రత్యయ్ బాసక్ తెలిపారు. ''ఈ ఎలక్ట్రోలైట్‌ల తయారీకి సెమీ-ఇంటర్‌పెనెట్రేటింగ్ పాలిమర్ నెట్‌వర్క్ (ఐపీఎన్) విధానాన్ని అవలంబించాం. ఇది బ్యాటరీ షార్ట్ సర్క్యూట్ కాకుండా చూస్తుంది. సాధారణంగా సాలిడ్ స్టేట్ బ్యాటరీలు తక్కువ ఉష్ణోగ్రత వద్ద పనిచేయవు. కానీ, కొత్త సాంకేతికతతో 25 డిగ్రీల ఉష్ణోగ్రతల వద్ద కూడా అద్భుత సామర్థ్యంతో పనిచేస్తున్నట్లు తేలింది. వాణిజ్యపరంగా అందుబాటులో ఉన్న లిథియం ఫెర్రో ఫాస్ఫేట్(ఎల్ఎఫ్‌పీ) ఎలక్ట్రోడ్లతో కొత్త ఎలక్ట్రోలైట్‌లను అనుసంధానించి పరీక్షించగా... మెరుగైన ఫలితాలు వచ్చాయి. ఈ ఆవిష్కరణతో బ్యాటరీ తయారీ ఖర్చు తగ్గడంతో పాటు వాటి మన్నిక పెరుగుతుంది'' అని వివరించారు. దీంతో విద్యుత్ వాహనాలను మరింత సురక్షితంగా, ఎక్కువ మైలేజీ ఇచ్చేలా తయారు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. వీరి పరిశోధన పత్రం ఇటీవల 'జర్నల్ ఆఫ్ పవర్ సోర్సెస్' అనే అంతర్జాతీయ పత్రికలో ప్రచురితమైంది.

బాణసంచా తయారీకి ముందే సమాచారమివ్వాలి

- చెప్పకుండా మొదలుపెడితే లైసెన్సు రద్దుచేయాలి
- ప్రభుత్వానికి అగ్నిమాపక శాఖ నివేదిక

ఈనాడు, అమరావతి: బాణసంచా తయారీ ప్రారంభించేముందు లైసెన్సుదారు స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులకు లిఖితపూర్వక సమాచారమివ్వకుండా కార్యకలాపాలు మొదలుపెడితే ఆ కేంద్రాన్ని అక్రమమైనదిగా పరిగణించి వెంటనే లైసెన్సు రద్దుచేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి అగ్నిమాపకశాఖ నివేదించింది. రసాయనాలు, ముడి పదార్థాలు ఎంతెంత పరిమాణంలో వినియోగిస్తారు? లైసెన్సు ప్రకారం ఎంత మేరకు ముడిపదార్థాలను నిల్వ చేసుకునేందుకు అనుమతి ఉంది? నైపుణ్యం గల, నైపుణ్యం లేని కార్మికులను ఎంతమందిని నియమిస్తారు? తయారీ ఎప్పుడు ప్రారంభించి..ఎప్పుడు ముగిస్తారు? ఏయే బాణసంచా తయారు చేస్తారు? సేఫ్టీ అధికారి వివరాలు, అత్యవసర సమయంలో సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు వంటి సమాచారమంతా ముందస్తుగా రెవెన్యూ, పోలీసు అధికారులకు అందజేసేలా నిబంధన తీసుకురావాలని కోరింది. వేట్లపాలెం ఘటన నేపథ్యంలో... బాణసంచా తయారీ కేంద్రాల్లో ప్రమాదాలు, భారీ ప్రాణనష్టం నియంత్రణ కోసం పలు సూచనలు చేస్తూ ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ప్రధానాంశాలివి.

- బాణసంచా తయారీ జరుగుతున్నంత కాలం.... రెవెన్యూ, పోలీసు శాఖల సిబ్బంది ఈ కేంద్రాలను పర్యవేక్షించాలి. అనుమతి పొందిన మేరకే ముడిపదార్థాలు వాడుతున్నారా? కార్మికులు ఉన్నారా అనేది వీరు ఎప్పటికప్పుడు పరిశీలించాలి. ● బాణసంచా తయారీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయించి.. రెవెన్యూ, పోలీసు కంట్రోల్ రూమ్‌లతో అనుసంధానించాలి. ● పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, గ్రామ సచివాలయ సిబ్బంది ఈ బాణసంచా తయారీ కేంద్రాలను రోజూ తనిఖీచేసేలా చూడాలి. ఏవైనా ఉల్లంఘనలు జరుగుతున్నా, లోపాలు గుర్తించినా వారు ఆ సమాచారాన్ని వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. దీనివల్ల ప్రమాదాలకు ఆస్కారం లేకుండా తయారీని నిలిపివేయడానికి అవకాశముంటుంది. ఏదైనా ప్రమాదం జరిగి, పర్యవేక్షణ సిబ్బంది నిర్లక్ష్యం ఉందని తేలితే వారిపైనా చర్యలు తీసుకోవాలి. ● ఏ రోజు ఎంతమేర బాణసంచా తయారీ చేస్తున్నారన్న వివరాలతో రికార్డులు నిర్వహించాలి.